
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 39

బుధవారం 1-5-2024



ప్రపంచకప్ వేటకు సిద్ధం

టీ20 మెగా టోర్నీకి భారత జట్టు ప్రకటన.. పంత్ పునరాగమనం - 14లో



ఆఖరి గంటలో అమ్మకాలు

సెన్సెక్స్ 188 పాయింట్లు నష్టం.. నిఫ్టీ 38 పాయింట్లు పతనం - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కాంగ్రెస్ దుకాణాల్లో ఫేక్ వీడియోలు

బీజేపీకి వ్యతిరేకంగా ఫేక్ వీడియోలను సృష్టించి కాంగ్రెస్ ప్రేమ దుకాణంలో అమ్మకానికి పెట్టారని ప్రధాని మోదీ ఆరోపించారు.


వివరాలు 6లో ▸



ఫేక్ వీడియోల వెనుక రాహుల్!

ఫేక్ వీడియోల వెనుక కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ హస్తం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు.

వివరాలు 6లో ▸



ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతిచెందారు.

వివరాలు 6లో ▸



పార్టీ నుంచి ప్రజ్వల్ సస్పెండ్

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంగా ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను జేడీఎస్ తమ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

వివరాలు 6లో ▸



సాయంత్రం 4 గంటలకు చిత్తూరు జిల్లా కలికిరిలో జరిగిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

2014లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలిచ్చిన మోసపూరిత హామీల గురించి వివరిస్తున్న సీఎం జగన్

నాయకుడంటే ఓ నమ్మకం

టంగుటూరు, మైదుకూరు, కలికిరి ఎన్నికల సభల్లో సీఎం వైఎస్ జగన్

మీ మేనిఫెస్టోలో ప్రధాని మోదీ ఫొటో ఎక్కడ చంద్రబాబూ?

- నిన్నెవ్వరూ నమ్మరు.. నీ హామీలు బూటకమని తేలిపోయింది..
- నీ విశ్వసనీయత ఎలాంటిదో ఇదే రుజువు
- బాబుది బోగస్ రిపోర్ట్.. జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్
- కూటమి పాతదే.. మోసాలు కొత్తవి
- చంద్రబాబు జీవితమంతా మోసాలు, కుట్రలు, వెన్నుపోట్లే
- 75 ఏళ్లు దాటినా పశ్చాత్తాపం ఏ కోశానా లేదు
- జగన్‌ను ఎందుకు చంపకూడదు? పాతేస్తా..! అని అంటున్నాడు

11లో

- 58 నెలలుగా మన స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే బాబుకు పిచ్చి కోపం వస్తోంది
- ఆయన్ను ప్రశ్నిస్తే ఎల్లో మీడియా, దత్తపుత్రుడు, వదినమ్మ, చంద్రన్న కాంగ్రెస్‌కూ కోపమే
- నాపై తిట్లు, శాపనార్థాలు, బెదిరింపులు, బూతులు, అబద్ధాల లిస్టులు చదువుతున్నారు
- పేదలకు ఏం చేశావని అడుగుతుంటే జవాబు చెప్పకుండా జగన్‌ను తిడతావా బాబూ?
- పెన్షన్లను అడ్డుకున్న బాబును అవ్వాతాతలంతా తిట్టడంతో జగన్‌పై నెపం వేస్తున్నాడు

“ఈ పెద్దమనిషి చంద్రబాబు.. ఇవాళ మేనిఫెస్టో అంటూ ప్రకటించాడు. చంద్రబాబు విశ్వసనీయత, సాధ్యం కాని హామీలు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. పైనుంచి బీజేపీ వాళ్లు ఫోన్ చేసి నీ ఫొటో మాత్రమే పెట్టుకో! ప్రధాని మోదీ ఫొటోను నీ మేనిఫెస్టోలో పెట్టొద్దు అని తేల్చి చెప్పారు. అంటే ఈయన సాధ్యం కాని హామీలిచ్చినట్లే కదా! అదంతా మోసమే అని రుజువు అవుతోంది కదా? కూటమిలో ఉంటూ ముగ్గురి ఫొటోలు కూడా పెట్టుకునే పరిస్థితిలో చంద్రబాబు లేడంటే ఒక్కసారి గమనించండి. ప్రజల్ని మోసం చేయడం కోసం ఆయన ఏ స్థాయిలో బరి తెగించాడో చూడండి.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మేనిఫెస్టోను పట్టుకోవడానికి నిరాకరిస్తున్న బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్ సింగ్



మేం టచ్ చెయ్యం బాబూ

పేరుకే కూటమి.. మేనిఫెస్టో పట్టుకోవడానికి కూడా బీజేపీ ససేమిరా

మోదీ ఫొటో పెట్టేందుకు కూడా 'నో'

- బాబుకు విశ్వసనీయత లేదని సంకేతాలు
- 2014లో మోదీ ఫొటోతో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల.. అధికారంలోకి వచ్చి, హామీలకు తూట్లు పొడిచిన బాబు
- అడుగడుగునా ప్రజలను మోసం చేసిన టీడీపీ అధినేత.. బీజేపీకీ అంటిన మరక.. బాబును నమ్మలేమని బీజేపీ నిర్ధారణ
- మేనిఫెస్టోపై పార్టీ ముద్ర లేకుండా జాగ్రత్తలు.. ప్రధాని మోదీ, ఇతర నేతల చిత్రాలు ఉండకూడదని స్పష్టీకరణ
- పట్టుబట్టి చివర్లో మేనిఫెస్టోపై కమలం గుర్తుని తీయించిన బీజేపీ
- అప్పటికప్పుడు మార్పించిన చంద్రబాబు.. 3 గంటలు ఆలస్యంగా విడుదల
- మేనిఫెస్టో పట్టుకోవడానికి కూడా ఇష్టపడని బీజేపీ నేతలు

2లో

బాబు కిచిడీ మేనిఫెస్టో

సూపర్ సిక్స్‌లో నగం వైఎస్సార్‌సీపీ నుంచి, నగం పక్క రాష్ట్రాల నుంచి కాపీ

12లో

కూటమిది అసత్యాల మేనిఫెస్టో

హామీలన్నీ సీఎం జగన్ అమలు పరిచినవే



అరచేతిలో వైకుంఠం చూపే చంద్రబాబు

ఓట్లకోసం ముస్లింలు, క్రిస్టియన్లు కావాలి

మేనిఫెస్టోపై మూడో వ్యక్తి ఏది?

డబ్బులు ఎక్కడినుంచి తెస్తావో వివరించాలి

మీడియాతో మాజీ మంత్రి పేర్ని నాని

- వివరాలు 12లో

ఆ నోటిని శాశ్వతంగా మూసేయాలి

సీఎం జగన్‌పై మరోసారి చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు

16లో

అప్పుడలా.. ఇప్పుడిలా..

అవ్వాతాతల పింఛన్ల పంపిణీపై చంద్రబాబుది రోజుకో తీరు

- అవ్వాతాతల ఓట్లు దక్కవేమోనన్న దుగ్ధతో మొదట్లో ఇంటింటి పంపిణీని అడ్డుకునేందుకు ఈసీకి ఫిర్యాదులు
- దీంతో సచివాలయాల్లో పంపిణీ చేయాలని ఈసీ ఆదేశాలు.. దీనికనుగుణంగా ఏప్రిల్ పింఛన్లు సచివాలయాల్లో అందజేత
- అవ్వాతాతల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో బాబు బృందం యూటర్న్
- ఇప్పుడు బ్యాంకుల్లోనే పింఛను జమచేయాలని 20 రోజులుగా నిమ్మగడ్డ.. వచ్చుముతా ఫిర్యాదులు



- దీంతో పింఛన్ల పంపిణీలో మళ్లీ మార్పు
- ఫలితంగా బ్యాంకు ఖాతాలున్న వారికి బ్యాంకుల్లో జమచేయాలని..
- ప్రత్యేక పరిస్థితులున్న వారికి సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలని ఆదేశాలు
- ఎప్పటికప్పుడు బాబు మాట మారుస్తూ అధికారులు, ప్రభుత్వంపై నిందలు
- మే 1న సెలవు రోజైనా పింఛను మొత్తాన్ని జమచేయనున్న బ్యాంకులు

3లో

పవన్‌ను ఓడించి, తరిమేయడం ఖాయం

అయన్ని ఓడించకపోతే పేరు మార్చుకుంటా

తుని ఘటనకు చంద్రబాబే కారణం


పవన్, చంద్రబాబుపై ముద్రగడ ఫైర్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను పిఠాపురంలో ఓడించి, తన్ని తరిమేసేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాపు ఉద్యమనేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం చెప్పారు. ముఖానికి రంగులు వేసుకొని వచ్చేస్తే ప్రజలు ఓట్లు వేసేస్తారా అని ప్రశ్నించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన పవన్, చంద్రబాబు తీరును

మిగతా 16వ పేజీలో ▶



మీడియా సమావేశంలో కాపు ఉద్యమ నేత ముద్రగడ తదితరులు



ఫేక్ స్పీచ్‌లు, ఫేక్ హామీలని మన మీద కూడా ఫిర్యాదు చేయరుగా సార్!

కదిరి టీడీపీ అభ్యర్థి కారులో రూ.2 కోట్ల నగదు

అనంతపురం నుంచి కదిరికి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

కారు సీజ్.. డ్రైవర్ ఆనంద్ కుమార్ అరెస్ట్

అనంతపురం: శ్రీసత్యసాయి జిల్లా కదిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు చెందిన ఫార్చునర్ కారులో సుమారు రూ.2 కోట్ల నగదు పట్టుబడింది. ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు మంగళవారం అనంతపురం నుంచి కదిరికి తరలిస్తుండగా.. స్థానిక విద్యుత్ నగర్ సర్కిల్‌లో పోలీసులు పట్టుకున్నారు. కారు డ్రైవర్ ఆనంద్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. కారును సీజ్ చేశారు. అనంతపురం టూటౌన్ సీఐ క్రాంతికుమార్ తెలిపిన

మిగతా 5వ పేజీలో ▶





నగదుతో పట్టుబడిన కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు చెందిన కారు.. పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ల్యాండ్ టైట్లింగ్ కేంద్రం అమలుచేసే చట్టం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత సజ్జల. చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ తదితరులు

- దీనిపై ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రతిపక్షాల కుట్ర
- రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధంలేని ఈ చట్టంపై దిగజారుడు రాజకీయం చేయడం దుర్మార్గం
- 14 ఏళ్ల సీఎంగా చేశానని చెప్పుకునే చంద్రబాబు ఇంత అసహ్యంగా మాట్లాడటానికి నోరెలా వచ్చిందో
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

3లో

క్లుప్తంగా...

నేడు సీఎం జగన్ ప్రచార సభలు ఇలా..

- ఉదయం 10 గంటలకు బొబ్బిలిలో సీఎం జగన్ సభ
- మధ్యాహ్నం 12.30 గంటలకు పాయకరావుపేటలో..
- 3 గంటలకు ఏలూరులో..



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఆ వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 10 గంటలకు విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలోని బొబ్బిలిలో ఉన్న మెయిన్ రోడ్ సెంటర్‌లో జరిగే ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని పాయకరావుపేటలోని సూర్య మహల్ సెంటర్‌లో జరిగే సభలో.. మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లో జరిగే ప్రచార సభలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

2 నుంచి మత్స్యకార భృతి అర్హుల గుర్తింపు

సాక్షి, అమరావతి: వేట నిషేధ కాలంలో అందించే మత్స్యకార భృతి కోసం అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 2 నుంచి ఎన్యూమరేషన్ ప్రారంభిస్తున్నట్టు మత్స్యశాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి మంగళవారం తెలిపారు. సముద్రజలాల్లో 61 రోజుల పాటు చేపలవేట నిషేధించి నందున, జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు ఏటా చెల్లిస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా వేట నిషేధ భృతి అందించబోతున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఎన్నికల సంఘం అనుమతిని తీసుకున్నట్లు చెప్పారు. మే 2 నుంచి గ్రామ స్థాయిలో చేపట్టే ఎన్యూమరేషన్‌లో నిబంధనల మేరకు అర్హులను గుర్తిస్తామన్నారు. గతంలో మాదిరిగానే ప్రతీ కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక చేయూతనందిస్తామన్నారు.

తిరుపతి ఐఐటీకి జర్మన్ పరిశోధకులు



జర్మనీ పరిశోధకులు, విద్యార్థులతో డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు (తిరుపతి జిల్లా): జర్మన్, ఇండియా పరిశోధకులు, విద్యార్థులు అవసరాలను పరిష్కరించే క్లిష్టమైన, అభివృద్ధి చెందుతోన్న సాంకేతికతలో పనిచేయాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో సినర్జీని జరుపుకునేందుకు వచ్చిన జర్మన్ పరిశోధకులు, విద్యార్థుల బృందానికి స్వాగతం, సమావేశం జరిగింది. డైరెక్టర్ మాట్లాడుతూ భారత్, జర్మనీల మధ్య సహకార చరిత్రను గుర్తు చేస్తూ ఐఐటీ మద్రాస్‌ను స్థాపించడంలో జర్మనీ ఎంతో సహకారం అందించిందని పేర్కొన్నారు. జర్మనీ ప్రతినిధుల బృందం, ఐఐటీ తిరుపతి విద్యావేత్తల మధ్య వివిధ సహకార కార్యక్రమాలపై చర్చలు జరిగినట్లు వెల్లడించారు. పొజిషనింగ్ అండ్ ప్రెసిషన్ టెక్నాలజీ, టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, ఈవీ టెక్నాలజీ విప్రో-సీమెన్స్-ఐఐటీ తిరుపతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల విస్తృత పర్యటనతో ఈ ప్రయాణం ప్రారంభమైనట్లు చెప్పారు.

మరింత పెరగనున్న ఎండలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పులు బుధవారం నుంచి తీవ్రతరం కానున్నాయి. మూడోతేదీ నుంచి మరింత ఉధృతం కానున్నాయి. కొన్నిచోట్ల 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెండు, మూడురోజుల్లో ఇవి 47 డిగ్రీలకు చేరుకునే అవకాశాలున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	46.2	29.6
కర్నూలు	44.9	29.6
కడప	44.5	27.6
మార్కాపురం	43.0	28.0
విజయనగరం	42.0	36.0
ఏలూరు	42.0	26.0
రాజమహేంద్రవరం	42.0	25.0
విజయవాడ	41.0	29.0
గుంటూరు	41.0	29.0
నెల్లూరు	40.8	27.8
విశాఖపట్నం	38.0	28.0

బూటకపు హామీలకు కేరాఫ్ బాబు

- రాష్ట్రంలో ఇప్పటికే రూ.25 లక్షల పరిమితితో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
- ఇప్పటికే 4.7 కోట్ల మందికి పైగా డిజిటల్ హెల్త్ కార్డులు జారీ
- ఈ పథకాలను యథాతథంగా మేనిఫెస్టోలో తెచ్చిపెట్టుకున్న టీడీపీ
- చంద్రబాబు తీరుపై ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు



కాపీ క్యాట్ బాబు..

సాక్షి, అమరావతి: బూటకపు హామీలు ఇవ్వడం.. వాటిని గాలికొదిలేయడంలో కేరాఫ్ అడ్రస్ ఎవరిదంటే అందరూ చెప్పేమాట చంద్రబాబు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అలవికాని హామీలను ఇవ్వడం, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపడం, ఆ తర్వాత వాటిని మర్చిపోవడం ఆయనకు వెన్నుపోటుతో పెట్టిన విద్య. ఈసారి కూడా ఇదే రీతిలో చంద్రబాబు, తన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌తో కలిసి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇందులో కొత్తగా ఒక్కటంటే ఒక్క పథకం చంద్రబాబు ఆలోచనల నుంచిలో అమలవుతున్న పథకాలను యథాతథంగా కాపీ కొట్టి మక్కీకి మక్కీ దించేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలను నిస్సిగ్గుగా కాపీ కొట్టి తన మేనిఫెస్టోలో పెట్టుకోవడం చంద్రబాబుకే చెల్లిందని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

రాష్ట్రంలో ప్రజలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా అందిస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో పేర్కొన్నారు. వాస్తవానికి ఇప్పటికే వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తోంది. ఈ స్థాయిలో ఉచిత వైద్యాన్ని అందిస్తున్న రాష్ట్రం దేశంలోనే ఏపీ ఒక్కటే కావడం గమనార్హం. చంద్రబాబు పాలనలో కేవలం తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఆరోగ్యశ్రీ పథకం అందేది. అలాంటిది అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ ఈ పథకాన్ని వర్తింపజేశారు. దీంతో రాష్ట్రంలో 90 శాతానికిపైగా కుటుంబాలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయి. వీరందరికీ రూ.25 లక్షల వరకూ వైద్య సేవలు పూర్తిగా ఉచితమే. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఇదే హామీ ఇవ్వడం వల్ల కొత్తగా ప్రజలకు వచ్చే ప్రయోజనమేముందని చర్చ జరుగుతోంది.

డిజిటల్ హెల్త్ కార్డులూ కాపీయేనా బాబు?

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపునే కాకుండా మరో దాన్ని కూడా చంద్రబాబు నిస్సిగ్గుగా కాపీ కొట్టి మేనిఫెస్టోలో పెట్టుకున్నారు. ఇప్పటికే వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో 4.7 కోట్ల మందికిపైగా డిజిటల్ హెల్త్ కార్డులు అందజేసింది. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రతి కుటుంబానికి స్మార్ట్ హెల్త్ కార్డులు పంపిణీ చేసింది. అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే డిజిటల్ వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ అంశంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇప్పుడు చంద్రబాబు సైతం తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ కార్డులు ఇస్తామని హామీ ఇవ్వడం పట్ల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

మందులూ మక్కీకి మక్కీ కాపీ..

తాము అధికారంలోకి వస్తే బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందులు పంపిణీ చేస్తామంటూ చంద్రబాబు మరో హామీ ఇచ్చారు. వాస్తవానికి రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను ఇప్పటికే పూర్తి స్థాయిలో అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాల్లో భాగంగా బీపీ, షుగర్, ఇతర జబ్బులున్న వారిని గుర్తించారు. బాధితులందరికీ సొంత గ్రామాలు, వార్డుల్లోనే ప్రభుత్వ వైద్యులు క్రమం తప్పకుండా ఫాలోఅప్ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక మంచానికి పరిమితం అయిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి సేవలు అందజేస్తున్నారు. ఉచితంగా మందులూ అందిస్తున్నారు. ఒక వైపు ప్రభుత్వ వైద్యులే ప్రజల ఇంటి ముంగిటకే వెళ్లి సేవలు వైద్య సేవలు అందిస్తుంటే.. తాము అధికారంలోకి వస్తే మందులు ఉచితంగా ఇస్తామంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అంటున్నారు.

బాబు దగా మరువని ప్రజలు

2014 ఎన్నికల్లో మేనిఫెస్టోలో వైద్య ఆరోగ్య విధానం పేరిట చంద్రబాబు మొత్తం 14 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపానపోలేదు. జిల్లాకు ఒక నిమ్స్ ఆస్పత్రి నిర్మాణం అంటూ దాన్ని కూడా గాలికొదిలేశారు. ఆరోగ్యశ్రీలో కొత్త వ్యాధులను చేర్చి ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు, చికిత్సలు, ఆపరేషన్‌ల సౌకర్యం కల్పిస్తాం అని మేనిఫెస్టోలో ప్రకటించిన బాబు కల్లబొల్లి మాటలతో ప్రజలను వంచించారు. 2007లో వైఎస్సార్ హయాంలో 942 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెస్తే.. చంద్రబాబు ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవగా దానిపేరు మార్చి కేవలం 117 వ్యాధులను మాత్రమే పెంచింది. అయినా వాటికి ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స సరిగా అందని దుస్థితి ఉండేది. ఇలా అనేక బూటకపు హామీలతో 2014లో అధికారంలో వచ్చి చంద్రబాబు చేసిన దగాను ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు.

మాయలు, మోసాలే బాబు నైజం

- 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు
- 600కి పైగా హామీలిచ్చి అమలు చేయకుండా మోసం
- ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్లు చెప్పుకుని 2019 ఎన్నికల్లో బొక్కబోర్లా పడిన వైనం

సాక్షి, అమరావతి: మాట ఇస్తే నిలబెట్టుకోవడం సీఎం జగన్ నైజం. ఇచ్చిన మాటను తుంగలో తొక్కడం చంద్రబాబు లక్షణం. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో, నిజాయితీతో, రూపాయి అవినీతి లేకుండా వంద శాతం ప్రజలకు మేలు చేకూరేలా అమలు చేయడం సీఎం జగన్ లక్షణం. ప్రజలకు ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చేసి, మళ్ళపెట్టి కుర్చీ ఎక్కిన తర్వాత ఓట్లేసి గెలిపించిన ప్రజలను పట్టించుకోకపోవడం, వారికిచ్చిన హామీలకు తూట్లు పొడిచేయడం, అడుగడుగునా మోసం చేస్తూ ప్రజలను నిలువునా ముంచేయడం చంద్రబాబుకు మాత్రమే తెలిసిన విద్య. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వసనీయతకు, విలువలకు మారు పేరు సీఎం వైఎస్ జగన్ అయితే చంద్రబాబు వంచనకు, అవినీతి, అక్రమాలకు పెట్టింది పేరు. 2014లో చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టో.. దాన్ని అమలు చేసిన తీరు, 2019లో వైఎస్ జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో.. దాన్ని అమలు చేసిన విధానాన్ని పరిశీలించి చూస్తే ఈ తేడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆ తేడాయే జగన్‌ను ప్రజల్లో విశ్వసనీయమైన నేతగా నిలబెడితే,బాబును మోసకారిగా, నయవంచకుడిగా మిగిల్చింది. ప్రజలను మాయ చేసి నమ్మించడం కోసం చంద్రబాబు హామీలు ఇస్తారనేది రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలిసిన సత్యం. పొరపాటున అధికారంలోకి వస్తే ఆ హామీలకు తూట్లు పొడిచేసి, ఆ తర్వాత హామీలన్నింటినీ అమలు చేశానని ఘనంగా బుకాయించడం చంద్రబాబుకి తెలిసినంతగా ఏ రాజకీయ నాయకుడికీ తెలియదు. 2014 ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ప్రజలను నమ్మించేందుకు ఆయన ఏకంగా 600కి పైగా హామీలు ఇచ్చారు. జనసేనతో కలిసి 52 పేజీలతో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. వాటిని నమ్మి ప్రజలు అధికారమిస్తే వారి నడ్డి విరిచేసి, నిలువునా ముంచేసి, ఆ హామీలకు మంగళం పాడేశారు.

రైతు రుణమాఫీ అమలు చేయకుండా మోసం

చంద్రబాబు 2014 ఎన్నికల్లో వ్యవసాయ రుణాలన్నింటినీ బేషరతుగా మాఫీ చేస్తానని చెప్పి రైతు కుటుంబాలను నమ్మించారు. అప్పటికి ఉన్న రూ.87,612 కోట్ల రుణాలను చంద్రబాబు మాఫీ చేయాల్సి ఉంది. అయితే, 2014లో ఆయన అధికారంలోకి రాగానే దాన్ని నీరుగార్చే పని మొదలుపెట్టారు. కోటయ్య కమిటీని నియమించి రూ.24,500 కోట్లు మాఫీ చేస్తే సరిపోతుందని తేల్చారు. ఆ సొమ్మును కూడా ఐదేళ్ల ఐదు విడతలుగా ఇస్తానని మరో మడత పేచీ పెట్టారు. పోనీ అదైనా చేశారా అంటే అదీ లేదు. మూడు విడతలు మాత్రమే.. అది కూడా కొందరికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నారు. ఈ అరకొర మాఫీ డబ్బు వడ్డీలకే సరిపోక రైతులు రుణ ఊబిలో చిక్కుకుని విలవిల్లాడిపోయారు. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి ఇస్తానని నమ్మించి మోసం చేయడంతో ఆ వడ్డీలూ కట్టలేక రైతులు నిండా మునిగిపోయారు.

అడుగుతున్నారని మేనిఫెస్టోనే మాయం చేశారు

2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడంతో, వాటి గురించి ప్రజలు అడుగుతుండటంతో సమాధానం చెప్పలేక దాన్ని తెలుగుదేశం పార్టీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన చరిత్ర చంద్రబాబుది. 2014లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించి, 2019 ఎన్నికల్లో మళ్లీ కొత్త హామీలతో ప్రజలను నమ్మించాలని ప్రయత్నించారు. కానీ ప్రజలు చంద్రబాబు నైజాన్ని గమనించి చరిత్రలో ఎన్నడూ లేనంత చిత్తుగా ఆయన్ని ఓడించి ఇంటికి సాగనంపారు.

గత చరిత్రను మరిచి సూపర్ సిక్స్ పేరుతో మళ్లీ కొత్త హామీలు

ఇంతటి ఘనమైన తన హామీల చరిత్రను మరచిపోయిన చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ కొత్త హామీలతో ప్రజలను నమ్మించేందుకు చేస్తున్న ప్రయత్నాలను చూసి అందరూ నవ్వుకుంటున్నారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న హామీలను కాపీ కొట్టి 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ పేర్లు మార్చి ప్రజల్లోకి వదిలారు. ముందస్తు మేనిఫెస్టో పేరుతో 11 నెలల క్రితమే దాన్ని విడుదల చేశారు. దానికి కొనసాగింపుగా ఇప్పుడు తుది మేనిఫెస్టో వదిలారు. కానీ 2014 ఎన్నికల్లోనూ ఇదే కూటమి పేరుతో ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్, తన ఫొటోలు కలిపి, తాను సంతకం చేసి మరీ చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. అధికారంలోకి వచ్చాక ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్లు చెప్పుకొన్నారు. ఈ హామీలపై ప్రజలు నిలదీయడంతో మేనిఫెస్టోనే చెత్తబుట్టలో పడేశారు. దీంతో ప్రజలు కూడా 2019లో ఆయన్ని చెత్తలోకి నెట్టేశారు. ఇప్పుడు మళ్లీ అదే కూటమి పేరుతో ప్రజలను వంచించేందుకు రెడీ అయ్యారు. ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ప్రజలు తిరస్కరించినా మళ్లీ సిగ్గు లేకుండా మేనిఫెస్టో పేరుతో వారి వద్దకు వెళ్లడానికి బరితెగించిన వచ్చి మోసకారి చంద్రబాబు.

డ్వాక్రా రుణ మాఫీకి శఠగోపం

2014 ఎన్నికల్లోనే డ్వాక్రా రుణాలనుమ మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. సీఎం అవగానే ఎగనామం పెట్టారు. చంద్రబాబు వచ్చి తమ రుణాలు చెల్లిస్తాడని నమ్మిన అక్కచెల్లెమ్మలు మోసపోయారు. రుణ వాయిదాలు, వడ్డీలు తడిసి మోపెడై అప్పుల పాలయ్యారు. బ్యాంకులకు రుణాలు చెల్లించలేక డిఫాల్టర్లుగా మారిపోయారు. వారికి తిరిగి రుణాలివ్వడానికి బ్యాంకులు నిరాకరించాయి. బెల్టు షాపులు రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వీధివీధినా బెల్టు షాపులు పెట్టేలా ప్రోత్సహించారు. మహాలక్ష్మి పథకం కింద పుట్టిన ప్రతి ఆడబిడ్డకి రూ.30 వేలు డిపాజిట్ చేసి, యుక్త వయసు వచ్చాక రూ.2 లక్షలు వచ్చేలా చేస్తానని ఇచ్చిన హామీనీ గాలిలో కలిపేశారు.

ఇంటికో ఉద్యోగం లేదు.. నిరుద్యోగ భృతీ లేదు

బాబు వస్తేనే జాబు అని 2014 ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు.. సీఎం అయ్యాక పట్టించుకోలేదు. ఇంటికో ఉద్యోగం హామీని తుంగలో తొక్కేయడమే కాకుండా, ఉన్న ఉద్యోగాలనూ ఊడగొట్టారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పినా, ఒక్కరికీ ఇవ్వలేదు. దీనిపై యువత నిలదీస్తుండటంతో ఎన్నికలకు 3 నెలల ముందు కొందరికి వెయ్యి చొప్పున విదిల్చి, మమ అనిపించారు. రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, పేద మహిళలకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు, పేదలకు 3 సెంట్లలో ఇళ్ల స్థలం, పండంటి బిడ్డకు రూ.10 వేలు ఇస్తాననే హామీలనూ బుట్టదాఖలు చేశారు. బీసీలకు వంద అసెంబ్లీ స్థానాలు, రూ.10 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పి మోసం చేశారు. ఇలా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారు.

మేం టచ్ చెయ్యం బాబూ..

ఉమ్మడి మేనిఫెస్టోకు బీజేపీ ససేమిరా



బాబును నమ్మని బీజేపీ

సాక్షి, అమరావతి: దేశంలో విశ్వసనీయత లేని నాయకుడు చంద్రబాబు అని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేంద్ర నాయకత్వం స్పష్టమైన సంకేతాలిచ్చింది. ఈ ఎన్నికల్లో టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకున్నప్పటికీ, ఉమ్మడిగా మేనిఫెస్టో ఇవ్వడానికి మాత్రం అంగీకరించలేదు. తద్వారా చంద్రబాబు హామీలకు బీజేపీ కానీ, ప్రధాని నరేంద్ర మోదీ కానీ గ్యారంటీ కాదని చెప్పింది. ఆ మేనిఫెస్టోపై బీజేపీ ముద్ర ఒక్కటి కూడా లేకుండా జాగ్రత్తపడింది. దానిపై బీజేపీ నేతల ఫొటోలు, గుర్తు ఉండకూడదని ఆ పార్టీ ముందే స్పష్టం చేసింది. చంద్రబాబు కమలం గుర్తు వేయించినా, చివర్లో తొలగించాల్సి వచ్చింది. చివరికి ఆ మేనిఫెస్టోని తాకడానికి కూడా బీజేపీ నేతలు ముందుకు రావడంలేదు.

2014లో టీడీపీతో పొత్తు పెట్టుకొన్న బీజేపీ అప్పట్లో ఉమ్మడి మేనిఫెస్టోకి అంగీకరించింది. ఆ మేనిఫెస్టోలో చంద్రబాబు రైతులు, డ్వాక్రా రుణాల మాఫీ, యువతకు జాబులు అంటూ ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చారు. ఆ మేనిఫెస్టోలో ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్ ఫొటోలు, మూడు పార్టీల గుర్తులు ఘనంగా ముద్రించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చకుండా అన్ని హామీలకు మంగళం పాడారు. అడుగడుగునా ప్రజలను వంచించారు. రుణ మాఫీ చేస్తానని చెప్పి రైతులు, మహిళలను నిలువునా మోసం చేశారు. జాబులు లేక యువత అల్లాడారు. పైగా, ఐదేళ్లూ విచ్చలవిడి అవినీతి, దోపిడీ జరగడంతో మరోసారి చంద్రబాబు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. ఆ నింద బీజేపీ పైనా పడింది. ఆ పార్టీ జాతీయ నేతలూ ఇదే నిర్ధారణకు వచ్చారు.

ఈ ఎన్నికల్లో మళ్లీ బీజేపీతో పొత్తుకు చంద్రబాబు వెంపర్లాడినప్పటికీ, ఆ పార్టీ జాతీయ నాయకత్వం తొలుత అంగీకరించలేదు. చంద్రబాబు ఢిల్లీలోని తన ఏజెంట్లు, బీజేపీలో ఉన్న తన అనుంగులు, ఇతరత్రా పైరవీలు చేశారు. అయినా బీజేపీ పెద్దలు ఆయన్ని నమ్మలేదు. ఢిల్లీలో రాత్రింబవళ్లు పడిగాపులు గాసి, కాళ్లా వేళ్లా పడి చిట్టచివరకు పొత్తు పెట్టుకోగలిగారు. బీజేపీ పొత్తయితే పెట్టుకొంది కానీ, చంద్రబాబును ఆ పార్టీ పెద్దలు నమ్మడంలేదన్న విషయం ప్రతి సందర్భంలోనూ బయటపడుతోంది. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన గెలుపే అసాధ్యమైతే, మేనిఫెస్టో విషయంలోనూ మరోసారి అభాసుపాలు కాకూడదని బీజేపీ అధిష్టానం భావించింది. దీంతో ఈసారి మేనిఫెస్టో విడుదల కార్యక్రమానికి ఓ పరిశీలకుడిని మాత్రమే పంపి మమ అనిపించింది. కనీసం రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి, పార్టీ రాష్ట్ర నాయకులు కూడా హాజరుకాలేదు. అంతేకాదు.. మేనిఫెస్టోలో కనీసం ప్రధాని మోదీ ఫొటోగానీ, కమలం గుర్తు గానీ ముద్రించేందుకు బీజేపీ పెద్దలు అంగీకరించలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్‌షా, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫొటోలు ముద్రించేందుకు కూడా ఒప్పుకోలేదు. అయితే, చంద్రబాబు తెలివిగా మేనిఫెస్టో కాపీలపై మోదీ, ఇతర నాయకుల ఫొటోలు లేకుండా, కమలం గుర్తును మాత్రం వేయించారు. బీజేపీ దీనికీ అంగీకరించలేదు. దాన్ని మార్చాల్సిందేనని పరిశీలకుడు సిద్ధార్థనాథ్‌సింగ్ పట్టుబట్టారు. దీంతో మేనిఫెస్టో ముఖచిత్రంలో అప్పటికప్పుడు మార్పులు చేశారు. అందుకే 12 గంటలకు జరగాల్సిన మేనిఫెస్టో విడుదల మూడు గంటలు ఆలస్యమైంది. చివరకు టీడీపీ, జనసేన పార్టీల మేనిఫెస్టోగానే చంద్రబాబు, పవన్ దాన్ని విడుదల చేశారు. బాబు, పవన్ ఫొటోలు, రెండు పార్టీల గుర్తులు మాత్రమే మేనిఫెస్టోలో ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా కనీసం దాన్ని పట్టుకునేందుకు సైతం బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్‌సింగ్ ఇష్టపడలేదు. పవన్, చంద్రబాబు మేనిఫెస్టోను విడుదల చేసి ఫొటోలకు పోజు ఇస్తూ దాన్ని సిద్ధార్థనాథ్‌ను పట్టుకోవాలని ఒక వ్యక్తి ఇవ్వగా, ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించడం టీవీల్లో ప్రత్యక్ష ప్రసారంలోనే కనిపించింది. చివరకు ఈ మేనిఫెస్టోకు టీడీపీ, జనసేనదే బాధ్యతని చంద్రబాబు చెప్పడం గమనార్హం. బీజేపీ జాతీయ స్థాయిలో ఒకే మేనిఫెస్టో విడుదల చేస్తుందని, కాబట్టి ఏపీలో కూటమిలో మేనిఫెస్టోకి మద్దతు తెలిపిందని ఆయన సర్దిచెప్పుకున్నారు. సిద్ధార్థనాథ్‌సింగ్ కూడా తాము రాష్ట్రానికో మేనిఫెస్టో ఇవ్వడంలేదని చెప్పారు. నిజానికి జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలోనూ వేర్వేరుగా మేనిఫెస్టోలు ప్రకటించే ఆనవాయితీ ఉన్నా కేవలం చంద్రబాబుపై నమ్మకం లేకే బీజేపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ పథకాలే బాబు హామీలు

సాక్షి, అమరావతి: టీడీపీ- జనసేన ప్రకటించిన తాజా మేనిఫెస్టోలో చాలా హామీలు ఇప్పటికే వైఎస్ జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా విజయవంతంగా అమలు చేస్తోంది. ఆ హామీలు ఇలా ఉన్నాయి..

టీడీపీ హామీ: స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు
ఇప్పటికే అమలవుతోందిలా: అమ్మఒడి కింద ప్రతి తల్లికి రూ.15వేలు ఇస్తోంది. ఈ మొత్తాన్ని రూ.17 వేలకు పెంచి అమలు చేస్తామని సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ప్రకటించారు.

టీడీపీ హామీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం పునరుద్ధరణ
ఇప్పటికే అమలవుతోందిలా: జగనన్న విదేశీ విద్యా దీవెన పేరిట ఇప్పటికే అమలవుతోంది. సీఎం జగన్ ఒక్కొక్కరికి రూ.1.25 కోట్ల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

టీడీపీ హామీ: కేజీ టూ పీజీ సిలబస్‌ని రివ్యూ చేస్తాం
ఇప్పటికే అమలవుతోందిలా: జగన్ ప్రభుత్వం ఇప్పటికే కేజీ టూ పీజీ సిలబస్‌ను రివ్యూ చేయడమే కాదు.. డిగ్రీలో ఆనర్స్‌ను ప్రవేశపెట్టింది. ఉన్నత విద్యలో అంతర్జాతీయ వర్సిటీలందించే 2 వేల కోర్సులను ఎడెక్స్ సర్టిఫికేషన్ ద్వారా ఇప్పటికే అందిస్తోంది.

టీడీపీ హామీ: రాష్ట్రంలో అనేక స్కూళ్లు మూతపడటానికి కారణమైన జీవో 117 రద్దు, మూతపడిన పాఠశాలల పునఃప్రారంభం
ఇప్పటికే అమలవుతోందిలా: 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో మూతపడిన 5 వేల స్కూళ్లను జగన్ ప్రభుత్వం పునరుద్ధరించి, అందుబాటులోకి తీసుకొచ్చింది. జీవో 117 ద్వారా విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లను ప్రవేశపెట్టింది.

టీడీపీ హామీ: ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తోంది.

టీడీపీ హామీ: బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందుల పంపిణీ
ఇప్పటికే అమలవుతోందిలా: ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. వీరికి సొంత ఊరులోనే ప్రభుత్వ వైద్యులు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారు.

టీడీపీ హామీ: కిడ్నీ, తలసేమియా వంటి వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10వేలు పింఛన్
ఇప్పటికే అమలవుతోందిలా: ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కిడ్నీ, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా వంటి వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్ అందిస్తోంది.

టీడీపీ హామీ: మూతపడిన ప్రతి నైపుణ్య శిక్షణా కేంద్రం పునఃప్రారంభం, విస్తరణ
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 192 స్కిల్ హబ్‌లు, 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది.

టీడీపీ హామీ: రాష్ట్ర యువతను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు రాష్ట్రాన్ని వేదికగా మారుస్తాం.
ఇప్పటికే అమలవుతోందిలా: ఆడుదాం ఆంధ్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా క్రీడా ప్రతిభను వెలికితీసే కార్యక్రమం జరుగుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారికి వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాల పేరిట గతంలోకంటే భారీగా పెంచి ప్రోత్సాహకాలను అందిస్తోంది. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కోసం ఆర్థిక సాయం అందిస్తోంది.

టీడీపీ హామీ: డిజిటల్ లైబ్రరీల స్థాపన
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్ జగన్ ప్రభుత్వం సచివాలయాలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తోంది.

టీడీపీ హామీ: ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ
ఇప్పటికే అమలవుతోందిలా: జగన్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తోంది.

టీడీపీ హామీ: ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు గౌరవవేతనం
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5 వేలకు పెంచి మరీ అందిస్తోంది.

టీడీపీ హామీ: 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా, రాయితీతో సోలార్ పంప్‌సెట్లు, మిగిలిన విద్యుత్ ప్రభుత్వం కొనుగోలు
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్ జగన్ ప్రభుత్వం 2019 నుంచి పగటి పూట నిరంతరాయంగా 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. ఇందుకోసం రూ.1,700 కోట్లతో ఫీడర్లను ఆధునికీకరించింది. రాయితీపై సోలార్ పంపుసెట్లు ఇప్పటికే అందజేస్తోంది. మిగిలిన విద్యుత్ కొనుగోలుకు గ్రిడ్‌కు అనుసంధానించే ప్రక్రియ కూడా జరుగుతోంది.

టీడీపీ హామీ: క్రిస్టియన్ శ్మశాన వాటికలకు స్థలం కేటాయింపు, జెరూసలేం యాత్రికులకు సాయం
ఇప్పటికే అమలవుతోందిలా: జగన్ ప్రభుత్వం క్రిస్టియన్ శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయిస్తోంది. జెరూసలేం యాత్రకు వెళ్లే వారికి ఏటా ఆర్థిక సాయం అందిస్తోంది.

టీడీపీ హామీ: రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం, ధరల స్థిరీకరణ నిధి, కౌలురైతులకు గుర్తింపు కార్డులు, సంక్షేమ ఫలాలు, పంటల బీమా వర్తింపు.

సేంద్రియ వ్యవసాయం చేసే వారికి ఆర్థికంగా, సాగు, మార్కెటింగ్ అంశాల్లో తోడ్పాటు. ప్రభుత్వ రంగంలో గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల ఆధునికీకరణ, నూతన యూనిట్ల ఏర్పాటు, దళారుల దోపిడిని కట్టడి చేసేందుకు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ చట్టం (ఏపీ ఎంసీ యాక్టు) పటిష్టంగా అమలు, డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ, సెరికల్చర్‌కు ప్రోత్సాహం
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లుగా రూ.13,500 చొప్పున రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఈ మొత్తాన్ని రూ.16 వేలకు పెంచుతున్నట్టు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పేర్కొంది. ఇప్పటికే రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారు. కౌలు రైతులకు పంట సాగు హక్కుదారు పత్రాలు (సీసీఆర్సీ) ప్రభుత్వం జారీ చేస్తోంది. సీసీఆర్సీలు పొందిన కౌలు రైతులకు భూ యజమానులతో సమానంగా సంక్షేమ ఫలాలు అందిస్తోంది. పంటల బీమా కూడా వర్తింపచేసి అమలు చేస్తోంది. ఆర్బీకే స్థాయిలో గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. ఏపీఎంసీ యాక్టును సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కోసం 90 శాతం సబ్సిడీ అందిస్తోంది. పట్టు రైతులకు కూడా ప్రోత్సాహకాలు ఇస్తోంది.

టీడీపీ హామీ: శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం
ఇప్పటికే అమలవుతోందిలా: వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే గ్రామ సచివాలయాల ద్వారా శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తోంది.

క్లుప్తంగా...

సీఎం జగన్ విశ్వసనీయతపై ఎలాంటి అనుమానాల్లేవు

బీజేపీ ఎంపీ జీవీఎల్ చిట్‌చాట్



సాక్షి, న్యూఢిల్లీ: సీఎం జగన్ విశ్వసనీయతపై ఎలాంటి అనుమానాలు లేవని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలకన్నా, కొత్త మేనిఫెస్టోలో ఎక్కువే ఉన్నాయన్నారు. ఏపీలో టీడీపీ, జనసేన నేతలు ప్రధాని మోదీ గురించి ఎక్కడా ప్రస్తావించడంలేదని, మోదీ పేరును ప్రస్తావించకపోవడం కూటమికి చాలా మైనస్ అవుతుందని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఏపీలో ఒంటరిగా బీజేపీ ఎదిగే అవకాశం లేదు కాబట్టే ఎంత వీలైతే అంత మిక్స్–మ్యాచ్ పద్ధతిలో ముందుకువెళ్తున్నామని చెప్పారు. గాజు గ్లాసును ఫ్రీ సింబల్ చేయడం వల్ల కూటమికి నష్టం కలుగుతుందని చెప్పారు. ముస్లిం రిజర్వేషన్ల అమలుకు ఏపీను ప్రయోగశాలగా మార్చారని ప్రధాని మోదీ చెప్పారని, ముస్లిం రిజర్వేషన్ల విషయంలో తమ తరఫు నుంచి ఎక్కడా రాజీ ఉండదని జీవీఎల్ అన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే మన్ననలు

సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి



సాక్షి, అమరావతి: ఉద్యోగ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తే మంచి మన్ననలు పొందవచ్చునని సీఎస్ డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి అన్నారు. ఏపీ సాధారణ పరిపాలన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్, సాధారణ పరిపాలనశాఖ సహాయ కార్యదర్శి అకుల వెంకటకనకదుర్గ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఘనంగా వీడ్కోలు సభ జరిగింది. జవహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరని, ఉద్యోగ విధులను మెరుగైన రీతిలో నిర్వహించడం ద్వారా మంచి మన్ననలు పొందవచ్చని తెలిపారు. పదవీ విరమణ చేసిన కె.ప్రవీణ్‌కుమార్, కనకదుర్గ మాట్లాడుతూ తమకు సహకరించిన అధికారులు, సిబ్బందికీ ధన్యవాదాలు తెలియజేశారు.

7న అనకాపల్లికి ప్రధాని మోదీ

సాక్షి, అనకాపల్లి: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న సీఎం రమేశ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు ప్రధాని మోదీ ఈ నెల 7న అనకాపల్లి రానున్నారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని ఉగ్గినపాలెం వద్ద బీజేపీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. తూర్పు గోదావరిజిల్లా రాజమహేంద్రవరంలో బహిరంగ సభలో పాల్గొని.. అక్కడ నుంచి సాయంత్రం 6 గంటలకు అనకాపల్లికి వస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

స్వతంత్రులకు గాజు గ్లాసు గుర్తుపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసును స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపు లేని పార్టీలకు కేటాయించడంపై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపులేని పార్టీల అభ్యర్థులకు గాజు గ్లాసు కేటాయించేలా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. కూటమి పార్టీలు, అభ్యర్థులు పోటీచేస్తున్న పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో గాజు గ్లాసు గుర్తును రిజర్వుడ్ సింబల్‌గా పరిగణించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసేలా ఆదేశాలివ్వండి..

హైకోర్టును ఆశ్రయించిన జనసేన

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేయని చోట గాజు గ్లాసు గుర్తును ఫ్రీ సింబల్స్ జాబితాలో చేరుస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ జనసేన పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. గాజు గ్లాసు గుర్తును తమకు మాత్రమే రిజర్వ్ చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ జనసేన పార్టీ 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేస్తోందని, తమకు గాజు గ్లాసు గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది జనవరిలో ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చిందన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయని చోట గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయిస్తూ ఆ గుర్తును ఫ్రీ సింబల్స్ జాబితాలో చేర్చిందని, దీని వల్ల ఓటర్లు గందరగోళానికి గురవుతారని తెలిపారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. జనసేన ఇచ్చిన వినతి పత్రంపై 24 గంటల్లో నిర్ణయం వెలువరిస్తామని తెలిపారు. 24 గంటల్లో నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం చెప్పిన నేపథ్యంలో విచారణను న్యాయమూర్తి బుధవారానికి వాయిదా వేశారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

అవ్వాతాతల పింఛన్ల పంపిణీపై చంద్రబాబుది రోజుకో విధానం

పింఛను లబ్ధిదారుల్లో ఇప్పటికే బ్యాంకు ఖాతా ఉన్న వారు ఎవరైతే ఉన్నారో వారందరికీ పింఛను డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోకి జమచేయాలి. సచివాలయాల దాకా వెళ్లి పింఛన్లు తీసుకోలేని వారికి మినహాయింపులు ఇవ్వొచ్చు. అలాంటి వారికి ఇంటి దగ్గరకు వెళ్లి ఇవ్వడానికి మా సిటిజన్ ఫర్ డెమోక్రసీకి అభ్యంతరంలేదు. ఇక బ్యాంకు అకౌంట్లులేని వారు సచివాలయంలో పింఛను డబ్బులు తీసుకునే అవకాశం కల్పించాలని ఈసీ అధికారులను కోరాం.

– చంద్రబాబు నమ్మినబంటు మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ 20 రోజుల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసిన తర్వాత మీడియాతో అన్న మాటలు.

తాము 2024 మార్చి 30న పేర్కొన్న ఆదేశాల ప్రకారం.. బ్యాంకు ఖాతాలున్న లబ్ధిదారులకు డీబీటీ (బ్యాంకు ఖాతాలో జమచేసే) విధానంలో పింఛన్ల పంపిణీకే ప్రాధాన్యత ఇవ్వండి. లేదంటే శాశ్వత ఉద్యోగుల ద్వారా పంపిణీ చేపట్టండి.

– ఏప్రిల్ 28న కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జారీచేసిన ఆదేశాల సారాంశం ఇది. ఏప్రిల్‌లో దివ్యాంగులకు ఇళ్లవద్దే.. మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ కొనసాగించడంపైనా టీడీపీ–బీజేపీ–జనసేన నేతలు 20 రోజులుగా రోజూ ఫిర్యాదులు చేయడంతో ఈసీ జారీచేసిన ఆదేశాలివి.

– సాక్షి, అమరావతి



టీడీపీ–బీజేపీ–జనసేన నేతల వరుస ఫిర్యాదులతో మే ఒకటి నుంచి చేపట్టే పింఛన్ల పంపిణీ డీబీటీ విధానంలో అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘమే స్పష్టంగా ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో బ్యాంకు ఖాతాలున్న 75 శాతం మంది పింఛనర్లకు బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్ల జమకు అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత 58 నెలలుగా ప్రతినెలా ఠంఛన్‌గా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా కొనసాగుతున్న పింఛన్ల పంపిణీని నెలరోజుల క్రితం అడ్డుకున్న విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కూడా ఆ పంపిణీ కొనసాగకూడదంటూ రోజూ ఆదేపనిగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసి, మళ్లీ అవ్వాతాతలు తనపై ఎక్కడ ఆగ్రహం చూపుతారోనని భయంతో 'పండుటాకులను బ్యాంకుల చుట్టూ తిప్పిస్తారా' అంటూ చంద్రబాబు ఎప్పటిలాగే ప్లేటు ఫిరాయించారు. నిజానికి.. మొదటినుంచీ చంద్రబాబుది ఇదే తరహా రాజకీయం. ఏ అంశంపైనైనా ముందు తప్పుచేసేసి దాన్ని సరిదిద్దుకునేందుకు ఎదుటివారిపై బురదజల్లుతూ రెండు నాల్కల ధోరణి అవలంబిస్తారు. రాష్ట్ర విభజన సమయంలో.. ప్రత్యేక హోదా తదితర అంశాల విషయంలో ఆయన అనేకమార్లు బొక్కబోర్లాపడినా తనదే పైచేయి అని బిల్డప్ ఇచ్చే రకం. ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని వలంటీర్లపై చంద్రబాబు అవలంబించిన వైఖరి కూడా అచ్చం ఇలాంటిదే.

నెలరోజుల క్రితం..

నిజానికి.. నాలుగున్నరేళ్లకు పైగా రాష్ట్రంలో వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రతినెలా ఠంఛనుగా లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ కొనసాగగా.. ఈ వర్గానికి చెందిన ఓట్లు టీడీపీకి దక్కవేమోనన్న దుగ్ధతో ఎన్నికల నేపథ్యంలో ఈ విధానంపై పచ్చముఠా ఇప్పుడు వరుసపెట్టి ఫిర్యాదులు చేసింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వయంగా ఈ ఏడాది మార్చి ఒకటిన ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అలాగే, చంద్రబాబు జేబులోని మనిషి, ఆయన సొంత సామాజికవర్గానికి చెందిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అయితే సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ పేరుతో అచ్చం ఇదే పనిమీద ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23, 25 తేదీల్లో పింఛన్ల పంపిణీలో వలంటీర్లను దూరంగా ఉంచాలని రెండుసార్లు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటివరకు ఇళ్లవద్దే ఇస్తున్న పింఛన్ల పంపిణీకి బ్రేకులు పడ్డాయి. ఫలితంగా.. ఏప్రిల్ నెల దివ్యాంగులు, కదలలేని స్థితిలో ఉండే అవ్వాతాతలకు ఇబ్బందిలేకుండా వారికి ఇంటివద్దే పింఛన్లను పంపిణీ చేసి, మిగిలిన వారికి సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ చేశారు. ఈ నిర్ణయంపై పింఛనర్లు తీవ్రస్థాయిలో రగిలిపోయారు. చంద్రబాబు, ఆయన ముఠా తీరుపై బహిరంగంగానే విరుచుకుపడ్డారు.

ఆగని ఫిర్యాదులు..

చంద్రబాబు ముఠా కోరుకున్నట్లుగా తీసుకున్న ఈ పింఛన్ల పంపిణీ నిర్ణయం ఆయనకే బెడిసికొట్టింది. అనుకున్నదొకటి.. అయినదొక్కటి బోల్తాకొట్టిందిరో బాబు పిట్ట అన్నట్లుగా తయారైంది ఆయన పరిస్థితి. దీంతో తన సహజ లక్షణమైన యూటర్న్‌ను తీసేసుకున్నారు. అంతే.. మళ్లీ గత నెలరోజులుగా టీడీపీ–జనసేన–బీజేపీతో కూడా పచ్చబ్యాచ్ ఉమ్మడిగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుల పరంపర కొనసాగించింది. ఇందులో భాగంగానే నిమ్మగడ్డ 20 రోజుల క్రితం మళ్లీ ఎన్నికల సంఘం అధికారులను కలిసి, పింఛన్ల పంపిణీ సచివాలయాల వద్ద కాకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేయాలని కోరారు. ఇలా దాదాపు రోజు మార్చి రోజు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. మరోపక్క.. తమ అనుకూల మీడియాలో రాష్ట్ర ఉన్నతాధికారులను బ్లాక్‌మెయిల్ చేసేలా నిత్యం కథనాలు రాయించి బ్యాంకుల ద్వారా పింఛన్లను పంపిణీ చేసే పరిస్థితి తీసుకొచ్చారు.

సెలవైనా ఒకటినే బ్యాంకులో పింఛను..

మేడే కారణంగా బ్యాంకులకు సెలవు అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా 65,49,864 మంది లబ్ధిదారులకు ఒకటో తేదీనే పింఛను డబ్బులను అందుబాటులో ఉంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.1,945.39 కోట్లు విడుదలచేసింది. వికలాంగ దివ్యాంగ వర్గానికి చెందిన లబ్ధిదారులతో పాటు తీవ్రమైన అనారోగ్యాల కారణంగా పింఛన్లు పొందుతున్న వారు, మంచం లేదా వీల్‌చైర్లకు పరిమితమయ్యే 16,57,361 మందికి ఒకటో తేదీ (బుధవారం) ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పంపిణీ చేపట్టేలా మంగళవారమే వారికి సంబంధించిన రూ.474.17 కోట్లను గ్రామ, వార్డు సచివాలయాల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన 48,92,503 మంది లబ్ధిదారుల పింఛన్ డబ్బులు బుధవారం బ్యాంకులకు సెలవు అయినప్పటికీ అదేరోజు ఉ.8 గంటల నుంచి వారి ఖాతాల్లో జమయ్యేలా అన్ని బ్యాంకులు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ల్యాండ్ టైట్లింగ్ కేంద్రం అమలు చేసే చట్టం

- దీనిపై ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రతిపక్షాల కుట్ర
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

అవనిగడ్డ: ల్యాండ్ టైట్లింగ్ అనేది కేంద్ర ప్రభుత్వం అమలు చేసే చట్టమని, రాష్ట్రంలో ఇంకా అమల్లోకి రాని ఈ చట్టంపై ప్రతిపక్షాలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కృష్ణాజిల్లా అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలకు ఏమీ దొరక్క, ప్రజలకు చెప్పడానికి ఏమీ లేక రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేని ఈ చట్టంపై దిగజారుడు రాజకీయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌లో ఎలాంటి లోపాలు కనబడకపోవడంతో ఈ చట్టం అమలైతే జగన్‌మోహన్‌రెడ్డి మీ భూములన్నింటినీ తాకట్టు పెట్టుకుంటారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మళ్లీ అధికారంలోకి రావాలనుకునే వారు ఎవరైనా ఇలా చేస్తారా అని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం అయినా ఇలా చేస్తుందా, అలా చేస్తే వ్యవస్థ నడుస్తుందా అన్నారు. ప్రజల మెదళ్లలో విషం ఎక్కించాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని గొప్పలు చెప్పుకునే బాబు అంత అసహ్యంగా మాట్లాడటానికి నోరెలా వచ్చిందో అర్థం కావడం లేదన్నారు.

మోసగించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య

రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం, ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతులను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. సమగ్ర భూ సర్వే సాహసోపేతమైన చర్య అని.. 6 వేల గ్రామాల్లో ప్రయోగాత్మకంగా జరుగుతున్న ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రాష్ట్రంలో భూములకు సంబంధించి వివాదాలు, ఎలాంటి గొడవలు ఉండవని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉంటే.. చంద్రబాబు చెబుతున్న మాటలు రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలవుతున్న విషయం తెలిసి చంద్రబాబు ఎంత ఆందోళనకు గురవుతున్నారో ఆయన మాటలను బట్టి అర్థం అవుతోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వందేళ్ల నుంచి ఉన్న భూ సమస్యను పరిష్కరించారని, లక్షలాది ఎకరాల్లో చుక్కల భూముల అంశాన్ని పరిష్కరించారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, 10 రోజుల తరువాత టీడీపీ, జనసేన మైకులు, వాళ్ల నోళ్లు మూగబోతాయని జోస్యం చెప్పారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బరిలో 36 మంది.. చోడవరంలో ఆరుగురే

విశాఖ పార్లమెంటరీ స్థానంలో అత్యధికంగా 33 మంది

- రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి అత్యల్పంగా 12 మంది
- ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించిన ఎన్నికల ప్రధానాధికారి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల నుంచి మొత్తం 454 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, 175 అసెంబ్లీ స్థానాల్లో 2,387 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణ సోమవారం ముగిసిందని.. పెద్దఎత్తున అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ముగిసిన అనంతరం పార్లమెంటరీ స్థానాలకు సంబంధించి అత్యధికంగా విశాఖ లోక్‌సభ స్థానంలో 33 మంది అభ్యర్థులు.. అత్యల్పంగా రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానం నుంచి 12 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారని తెలిపారు. శాసనసభా స్థానాల విషయానికి వస్తే.. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 46 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. అత్యల్పంగా చోడవరం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఆరుగురు అభ్యర్థులు మాత్రమే పోటీ పడుతున్నారని వివరించారు. కాగా.. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 40 మంది అభ్యర్థులు పోటీలో ఉండటం గమనార్హం.

ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేం

- రిటర్నింగ్ అధికారి చర్యలపై అభ్యంతరాలుంటే ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలి
- నారాయణ నామినేషన్‌పై దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: నెల్లూరు పట్టణ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ తన నామినేషన్ పత్రాల్లో తన రెండో భార్య ఇందిర గురించిన వివరాలు, ఆమె ఆస్తి వివరాలను వెల్లడించలేదని, అయినా ఆయన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆమోదించారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నెల్లూరుకు చెందిన న్యాయవాది దేశాయ్‌శెట్టి హనుమంతరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. భార్య వివరాల కాలమ్‌లో వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ ఎన్నికల ప్రక్రియ మొదలైందని, అందువల్ల ఈ వ్యవహారంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. రిటర్నింగ్ అధికారి తీరుపై అభ్యంతరాలుంటే ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. ఈసీ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ.. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడాన్ని రాజ్యాంగంలోని అధికరణ 329(బీ) నిషేధిస్తోందంటూ హనుమంతరావు పిటిషన్‌ను కొట్టేశారు.

'ఆరణి' పిటిషన్ కొట్టివేత

జాతీయ జనసేన పార్టీ తరఫున అల్లూరి శ్రీనివాసులు దాఖలు చేసిన నామినేషన్ పత్రంలో అనేక లోపాలున్నాయని, ఈ విషయంలో తాను లేవనెత్తిన అభ్యంతరాలను రిటర్నింగ్ అధికారి పట్టించుకోలేదంటూ జనసేన పార్టీ చిత్తూరు అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అల్లూరి శ్రీనివాసులు తన నామినేషన్ పత్రాల్లో తాను రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారని, అయినా రిటర్నింగ్ అధికారి అతని నామినేషన్‌ను ఆమోదించారని తెలిపారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. వాదనలు విన్న అనంతరం ఆరణి శ్రీనివాసుల పిటిషన్‌ను కొట్టేశారు. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేమని స్పష్టం చేశారు.

టీడీపీ, ఆంధ్రజ్యోతికి లీగల్ నోటీసులు

- తప్పుడు రాతలకు వారంలోగా క్షమాపణ చెప్పాలన్న సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి
- లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని వెల్లడి

సాక్షి, అమరావతి: నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తున్న తెలుగుదేశం పార్టీ, ఆంధ్రజ్యోతి దినపత్రికలకు ముఖ్యమంత్రి కార్యదర్శి, ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ విధుల్లో పాల్గొంటుంటే.. రాజకీయ పార్టీ రోజువారీ కార్యకలాపాల్లో, మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొన్నానంటూ తప్పుడు కథనం రాసినందుకు ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ శ్రీనివాస్, ఆమోద పబ్లికేషన్స్‌కు తన లాయర్ ద్వారా ఆయన నోటీసులు పంపించారు. ఈ తప్పుడు కథనాలను పట్టుకొని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో ఆయనకు కూడా నోటీసులు జారీ చేశారు. మేనిఫెస్టో కార్యక్రమంలో తాను పాల్గొనకపోయినా తప్పుడు కథనాలు ప్రచురించారని తెలిపారు. ఎంతో నిబద్ధతతో వివిధ హోదాల్లో పనిచేసిన తనకు పరువు నష్టం కలిగించే విధంగా.. ఎన్నికల్లో లబ్ధి కోసం తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని.. లేకపోతే రూ.5 కోట్లకు కోర్టులో పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు.

• తెలంగాణ

శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఫస్ట్ కోర్టు హాల్‌లో వీరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు, ఇతర న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. 2022, జూలైలో వీరిద్దరూ అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టగా, తాజాగా శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.



రాజేశ్వర్‌రావు



శ్రీనివాస్‌రావు



మనం చేసే పనుల్లో సాధ్యమైనంత తక్కువ దుఃఖం లేదా అసలు దుఃఖమే కలగని విధంగా జీవించాలి.
– బుద్ధదాస భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 1 మే 2024

సిగ్గూ ఎగ్గూ లేని తెంపరితనం

దేశమంతా నివ్వెరపోయిన వివాదం ఇది. ఘన కుటుంబ వారసత్వం... దేశంలోని అత్యున్నత ప్రజా ప్రాతినిధ్య వేదికైన పార్లమెంట్‌లో సభ్యత్వం... ఇవేవీ మనిషిలోని మకిలినీ, మృగాన్నీ మార్చలేక పోయిన విషాదం ఇది. మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడూ, ఆయన తదనంతరం కర్ణాటకలో హసన్ నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన యువకుడూ అయిన ప్రజ్వల్ రేవణ్ణ నిస్సహాయులైన పలువురు స్త్రీలతో సాగించిన బలవంతపు లైంగిక చర్యల వ్యవహారం సభ్యసమాజాన్ని తలదించుకొనేలా చేస్తోంది. ఏప్రిల్ 26 నాటి లోక్‌సభ పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు ఆ వికృత వీడియోలు వందల కొద్దీ బయటకు రావడం సొంత కుటుంబపార్టీ జేడీ(ఎస్)ను సైతం ఆత్మరక్షణలో పడేసింది. అన్నిటికీ మించి సామాన్యులకు రక్షకులమంటూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనవారే చివరకు భక్షకులుగా తయారవుతున్న రాజకీయ విలువల పతనానికి ఈ వ్యవహారం మరో నగ్నసాక్ష్యంగా నిలిచింది.

2019 నుంచి 2022 మధ్య పలుమార్లు తనను ప్రజ్వల్ రేవణ్ణ లైంగికంగా బలవంతం చేశారంటూ బాధితురాలు ఒకరు ఆరోపించారు. పనివారి నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగినుల దాకా పలువురితో ఈ మాజీ ప్రధాని మనుమడు ఇంట్లో, ఆఫీసులో ఇలానే వ్యవహరించారట. వాటిని స్వయంగా రికార్డ్ చేసి, బ్లాక్‌మెయిల్ చేస్తూ వచ్చారట. దాదాపు 3 వేల వీడియోలతో కూడిన ఆ వికృత చర్యల పెన్‌డ్రైవ్ ఇప్పుడు బయటపడింది. నిజానికి, ప్రజ్వల్ అకృత్య వీడియోల కథ కొత్తదేమీ కాదు. ఆయన వీడియోలు అనేకం కొన్నేళ్ళ క్రితమే బయటకొచ్చాయి. వాటి ప్రచురణ, ప్రసారాల్ని అడ్డుకొనేందుకు ఈ 33 ఏళ్ళ యువనేత అప్పట్లోనే కోర్టుకెళ్ళారు. మీడియా చేతులు కట్టేస్తూ హైకోర్టు నుంచి నిషేధపుటుత్తర్వులు తెచ్చుకున్నారు. తీరా ఇప్పుడు ఓ బాధితురాలు ముందుకొచ్చి ఫిర్యాదు చేయడంతో మరోసారి తేనె తుట్టె కదిలింది. ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం దాన్ని అందిపుచ్చుకొంది. ఈ మురికి చేష్టల కేసుపై ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసింది. ప్రజ్వల్ వివాదంలో రాజకీయాలున్నాయనే మాట వినిపిస్తున్నది అందుకే!

వీడియోలు అయిదేళ్ళ పాతవనీ, బాధిత మహిళలకు న్యాయం చేసే ఉద్దేశమే నిజంగా ఉంటే, ఈ పార్లమెంట్ సభ్యుడి లైంగిక దుష్ప్రవర్తనపై సాక్ష్యాలు చాలాకాలంగా ఉన్నా కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోలేదు? ప్రస్తుత ఎన్నికల సమయంలోనే ఈ అస్త్రం ఎందుకు బయటకు తీసింది? ఇవీ బీజేపీ ప్రశ్నలు. బాధితురాలు కేసు పెట్టడం, వీడియోల వివాదాన్ని మీడియా బట్టబయలు చేయడంతో చట్టం తన పని తాను చేసుకుపోతోందన్నది అధికార కాంగ్రెస్ జవాబు. ఆరోపణల పర్వమెలా ఉన్నా, నిందితుడు ప్రజ్వల్ ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీ(ఎస్), అలాగే దానితో పొత్తుపెట్టుకున్న బీజేపీలు నష్టనివారణ చర్యలు చేపట్టక తప్పలేదు. బీజేపీ అగ్రనేత – సాక్షాత్తూ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా సైతం ఈ వివాదాస్పద వీడియోలను ఖండిస్తూ, నారీశక్తినే తాము బలపరుస్తున్నామని మంగళవారం వివరణనివ్వాల్సి వచ్చింది. ప్రజ్వల్, అతని తండ్రి రేవణ్ణ విడిగా ఉంటారనీ, తమ కుటుంబంతో సంబంధం లేదనీ నిందితుడి బాబాయ్, మాజీ సీఎం కుమారస్వామి అనాల్సి వచ్చింది. ఈ సెక్స్ వీడియోల వివాదం ప్రభావం ఎన్నికల్లో తమ పార్టీపై పడకుండా చూడాలనే తాపత్రయం తెలుస్తూనే ఉంది. చివరకు, 'సిట్' దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు కుమారస్వామి ప్రకటించడం అనివార్యమైంది.

ప్రజ్వల్ రేవణ్ణ కేసు ఏదో నూటికో, కోటికో జరిగిన ఘటన అనుకుంటే పొరపాటే. రాజకీయ బలిమిని చూసుకొని కన్నూమిన్నూ కానని కొందరు... బలవంతపు లైంగిక చర్యలు, దాడులకు పాల్పడుతున్న కేసులు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. ఈ బడాబాబులు అధికారాన్నీ, హోదానూ అడ్డుపెట్టుకొని ఈ కేసుల నుంచి ఒంటి మీద దుమ్ము నలగకుండా బయటకు వచ్చేస్తున్నారు. మహిళా రెజ్లర్లతో లైంగికంగా అనుచిత రీతిలో వ్యవహరిస్తూ వచ్చిన బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ కేసు అంతర్జాతీయంగానూ వార్తల్లో నిలిచినా, ఇప్పటి దాకా అతీగతీ లేదు. బాధితులకు ఇప్పటికీ న్యాయం దక్కలేదు. సందీప్ సింగ్, ఖజన్ సింగ్ లాంటి పలువురు నేతల కేసుల కథ కూడా అంతే. గమ్మత్తేమిటంటే, గతంలోనే ఆరోపణలు ఎదుర్కొన్న ప్రజ్వల్ హైకోర్ట్ 'గ్యాగ్' ఉత్తర్వులను అడ్డం పెట్టుకొని, దర్జాగా గడిపేశాడు. సిగ్గుమాలిన నేరచర్యలు యథేచ్ఛగా కొనసాగించాడు. కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ ఫిర్యాదు మేరకు ఇప్పుడు ప్రభుత్వం తాజాగా దర్యాప్తు చేపట్టడంతో కష్టాలు తప్పలేదు. పోలింగైన వెంటనే గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు ఉడాయించాడు.

ప్రజ్వల్ వ్యవహారాలపై, అతని వీడియోల పెన్‌డ్రైవ్‌పై స్థానిక బీజేపీ నేత ఒకరు గత డిసెంబర్‌లోనే తన పార్టీని అప్రమత్తం చేశారు. జేడీ(ఎస్)తో పొత్తునూ, హసన్‌లో ప్రజ్వల్ అభ్యర్థిత్వాన్నీ వ్యతిరేకించారు. అన్నీ తెలిసినా బీజేపీ ముందుకెళ్ళి పొత్తు కొనసాగించడం, ప్రజ్వల్‌కు మద్దతుగా ఆ పార్టీ అధినాయకత్వం స్వయంగా ఎన్నికల ప్రచారం చేయడం విడ్డూరం. నారీశక్తికి వందనమంటూ కబుర్లు చెప్పి, మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తంటాలు పడే పార్టీలు, ప్రతినిధులు ఆడవారికి ఇస్తున్న అసలైన గౌరవం అంతంత మాత్రమే. పితృస్వామ్య భావజాలంతో స్త్రీని భోగ వస్తువుగా చూసే సంస్కృతి నుంచి ఇవాళ్టికీ మన సమాజం, నేతలు బయటపడనే లేదన్న చేదు నిజం పదే పదే రుజువవుతోంది. చివరకు తాజా లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం సైతం 15 శాతం లోపలే అన్నది మన మహిళా సాధికారత మాటల్లోని డొల్లతనానికి నిదర్శనం. ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. అధికారం మాటేమో కానీ, ముందుగా వారిని సుఖభోగ యంత్రాలుగా భావించడం మాని, మనుషులుగా గుర్తించాలి. ప్రజ్వల్ సహా కళంకిత నేతల్ని కఠినంగా శిక్షించడం ఆ క్రమంలో తొలి అడుగు.

'ఆల్ ఫ్రీ బాబు' పునరాగమనం

విశ్లేషణ



టంకశాల అశోక్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 2004 ఎన్నికలలో ఓడిన చంద్రబాబు 2009లోనైనా గెలవాలని లెక్కకు మిక్కిలి హామీలనిచ్చారు. అయినా ఓడారు. 2014లో బీజేపీ, పవన్ కల్యాణ్‌ల పొత్తుతోపాటు, ఎడాపెడా హామీలనిచ్చి గెలిచారు కానీ వాటిని అమలు చేయటంలో విఫలమయ్యారు, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, 2019లో ఓడారు. అందుకే ఉమ్మడి రాష్ట్ర చరిత్ర, కొత్త రాష్ట్ర చరిత్ర కలిసి ఆయనకు అలవికాని హామీల చంద్రబాబుగా పేరు తెచ్చాయి. అధికారం కోసం ప్రజలకు మోసపూరిత హామీలనిచ్చే నాయకునిగా అన్నమాట! ఈసారి మళ్లీ ఎలాగైనా గెలవాలని బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా హామీలను గుప్పిస్తున్నారు. అలా కాదంటే, దేనికెంత సొమ్ము అవసరమో, మొత్తానికి కలిపి ఎంతవుతుందో పోలింగుకు తగినంత ముందే ప్రజల పరిశీలన కోసం ప్రకటించాలి.

చరిత్ర మొదటిసారి విషాదంగా, రెండవసారి ప్రహసనంగా పునరావృతమవుతుందంటాడు కార్ల్ మార్క్స్. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల హామీలను చూస్తే ఆ మాట గుర్తుకు వస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 2004 ఎన్నికలలో ఓడిన ఆయన 2009లోనైనా గెలవాలని లెక్కకు అందనన్ని హామీలనిచ్చారు. అయినా ఓడారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో 2019లో ఓడిన ఆయన 2024లోనైనా గెలిచి తీరాలనుకుంటూ తిరిగి ఉచితాల హామీలను కుప్పలుతెప్పలుగా ఇస్తున్నారు. ఆయనలోని ఈ లక్షణాన్ని గమనించినందుకే 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆయనకు 'ఆల్ ఫ్రీ బాబు' అని పేరు పెట్టారు.

2009 ఎన్నికల ప్రచారం నాటి ఒక జ్ఞాపకం ప్రస్తుత సందర్భంలో మళ్ళీమళ్ళీ గుర్తుకు వస్తున్నది. అప్పుడు చంద్రబాబు ప్రతి సభలో తన ఉచిత హామీలను ఒక దానిని మించి మరొకటి ప్రకటిస్తుండేవారు. దానిపై రాజశేఖరరెడ్డి కూడా ప్రతి సభలో, "చంద్రబాబు ఆల్ ఫ్రీ బాబు అయిపోయారు. అన్నీ ఫ్రీగా ఇస్తారట. నమ్ముతారా?" అని ప్రజలను నేరుగా అడిగేవారు. అందుకు జవాబుగా ప్రజల నుంచి "నమ్మం, నమ్మం" అనే కేకలు పెద్ద ఎత్తున వినిపించేవి. చివరకు చంద్రబాబు అన్నన్ని హామీలిచ్చి కూడా రెండవసారి ఓడిపోయారు. ఇందులో చెప్పుకోవలసిన విశేషం మరొకటి ఉంది. తనవైపు నుంచి తాను కూడా 2004లో కొన్ని హామీలిచ్చిన రాజశేఖరరెడ్డి, 2009లో కొత్తగా దాదాపు ఏమీ ఇవ్వలేదు. అప్పటి ఆర్థిక మంత్రి రోశయ్య, మరికొన్ని హామీలను బడ్జెట్ భరించలేదని చెప్పటం అందుకు కారణమని అప్పుడు విన్నాము. దానితో రాజశేఖర రెడ్డికి చంద్రబాబు హామీలు అలవికానివనీ, కేవలం ఎన్నికలలో గెలిచేందుకు ఉచితాల వర్షం కురిపిస్తున్నారనీ అర్థమైంది. అప్పుడు, తన ప్రచారానికి కొత్త హామీలను కాకుండా 2004–2009 మధ్య కాలపు తన సమర్థవంతమైన పాలనను, దానివల్ల ప్రజలకు కలిగిన విశ్వాసాన్ని ఆధారం చేసుకోదలిచారు. ఈ ఆలోచన, అందుకు అనుగుణమైన ప్రచారం పనిచేశాయి. ఫలితం తెలిసిందే.

రాష్ట్రం విడిపోయిన తర్వాత జరిగిందేమిటో చూడండి. 2014లో బీజేపీ, పవన్ కల్యాణ్‌ల పొత్తుతో గెలిచిన చంద్రబాబు, అటువంటి పొత్తు ఉండి కూడా, ఏ పొత్తూ లేని జగన్‌మోహన్ రెడ్డిని ఓడించేందుకు ఎడాపెడా హామీలు ఇవ్వవలసి వచ్చింది. కానీ వాటిని అమలు చేయటంలో విఫలమై, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, 2019లో ఓడిపోయారు. తన పాలన ప్రజలను మెప్పించి ఉంటే, ఈ రెండవసారి పొత్తులు ఉన్నా లేకున్నా గెలవాల్సింది. కానీ అది జరగకపోగా, ఉమ్మడి రాష్ట్ర చరిత్ర, కొత్త రాష్ట్ర చరిత్ర కలిసి ఆయనకు అలవికాని హామీల చంద్రబాబుగా పేరు తెచ్చాయి. మరొక విధంగా చెప్పాలంటే, అధికారం కోసం ప్రజలకు మోసపూరిత హామీలనిచ్చే



నాయకునిగా అన్నమాట! తెలుగునాట ఎన్నికల చరిత్రలో ఇటువంటి అప్రతిష్ఠ సంపాదించిన నాయకుడు మరెవ్వరూ లేరు. తన 2004 నాటి ఎన్నికల ఓటమిని గమనిస్తే ఈ మాట మరింత బాగా అర్థమవుతుంది. ఎన్నికలకు కొద్దిముందు తిరుపతి వద్ద ఆయనపైన నక్సలైట్ దాడి జరిగింది. ఆ స్థాయి గల ఒక నాయకునిపై అంత తీవ్రమైన దాడి జరగటం అదే మొదలు, అదే ఆఖరు. అటువంటపుడు తన పట్ల చాలా సానుభూతి రావలసింది! అయినప్పటికీ అందువల్లగానీ, తన పాలనా ప్రతిష్ఠవల్ల గానీ గెలవగలననే నమ్మకం ఏర్పడని చంద్రబాబు, ముఖ్యంగా రైతుల కోసం, గ్రామీణుల కోసం డజన్ల కొద్దీ వరాలు ప్రకటించారు. అయినా గెలవలేదు.

ఎన్టీఆర్ ఉదంతాన్ని అట్లుంచినా, చంద్రబాబుకు సామాన్య ప్రజల సంక్షేమం కోరే నాయకునిగా ఎన్నడూ పేరు లేదు. అధికారానికి వచ్చిన కొత్తనుంచే అప్పటి ఆర్థిక సంస్కరణలను ఎంతో ఉత్సాహంగా భుజాన వేసుకున్న ఆయన తనను తాను సీఈఓగా చెప్పుకొన్నారు. సంస్కరణలకు దేశంలో అందరికీ మించిన పతాకధారి అయ్యారు. ఆ విషయంలో మన్మోహన్ సింగ్‌ను సైతం మించిపోయి దేశ విదేశాలలోనూ పేరు సంపాదించి ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లకు ప్రీతి పాత్రుడయ్యారు. కానీ ఆ క్రమంలో వ్యాపార వర్గాలకు ఎంత దగ్గరయ్యారో సామాన్య ప్రజలకు అంత దూరమయ్యారు. లోగడ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు, తర్వాత ఎన్టీఆర్ అమలుపరచిన సంక్షేమ పథకాలను తగ్గించి వేశారు లేదా రద్దుపరచారు. అందుకే ప్రజల విశ్వాసం కోల్పోయి 2004లో పరాజయం పాలవగా, ఆ పరిణామం ప్రజలను సంతోషపెట్టింది. కనీసం ఆర్థిక సంస్కరణలకీ, ఇండియా వంటి వెనుకబడిన సమాజంలో ప్రజా సంక్షేమానికీ మధ్య సమతులనాన్ని పాటించాలనే విజ్ఞత అయినా తనకు లేకపోయింది. అందువల్లనే ఈ 21వ శతాబ్దంలో జరిగిన నాలుగు ఎన్నికలలో (2004, 2009, 2014, 2019) మూడింట ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అయిదవ ఎన్నికను ఎదుర్కొంటున్నారు. తన ఆర్థిక సంస్కరణలు, పరిపాలన గొప్పగా ఉండి ఉంటే ప్రతిసారీ గెలవవలసింది! అది కూడా పొత్తుల కోసం చూడకుండా.

ప్రతిసారీ తన ప్రత్యర్థులను మించి ఎడాపెడా హామీలు ఇస్తున్నారంటేనే చంద్రబాబు బలహీనత అర్థమవుతున్నది. మరొకవైపు 2014లో వలె గెలిచినపుడు అయినా సదరు హామీలను ఎంత మాత్రం అమలుపరచక విఫలం కావటాన్ని బట్టి అవి బడ్జెట్‌తో, ఆర్థిక పరిస్థితితో నిమిత్తం లేనివని తెలిసిపోతున్నది. అవి అలవిమాలినవని ముందుగా గ్రహించలేనివాడు కాదాయన. అయినప్పటికీ ఆ పని చేశారంటే, 2014లో, 2019లో చేసి, ఇపుడు 2024 కోసం తిరిగి చేస్తున్నారంటే, ఆయన ఉద్దేశమే ప్రజలను మోసగించటమనుకోవాలి. ఏమి చేసైనా సరే అధికారం సంపాదించాలన్నమాట!

అదే పని చేసి తలమీదకు తెచ్చుకున్న రెండు ప్రభుత్వాల ఉదాహరణలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పొరుగునే ఉన్నాయి. ఒకటి కర్ణాటక, రెండు తెలంగాణ. రెండు చోట్ల కూడా కాంగ్రెస్ పార్టీ మితిమీరిన హామీలనిచ్చింది. అవి బడ్జెట్ శక్తికి మించిపోగలవని ఆర్థిక వేత్తలు ముందుగానే హెచ్చరించారు. అయినా పెడచెవిని పెట్టిన కాంగ్రెస్ ప్రజలను మభ్యపుచ్చి అధికారాన్నయితే సంపాదించింది గానీ, హామీలను అమలుపరచలేక ఏడాది తిరగకముందే తలకిందులవుతున్నది. ప్రజలలో నిరసనలు రెండు రాష్ట్రాలలోనూ మొదలయ్యాయి.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఈసారి ఇచ్చిన హామీలకు ఏటా సుమారు లక్షన్నర కోట్లు అవసరం కాగలవన్నది ఒక అంచనా. అది నిజం కాదని తెలుగుదేశం అధ్యక్షుడు చెప్పదలచుకుంటే, తన హామీలలో దేనికెంత సొమ్ము అవసరమో, మొత్తానికి కలిపి ఎంత అవుతుందో, రాష్ట్ర బడ్జెట్‌తో పోల్చినపుడు పరిస్థితి ఏమిటో పోలింగుకు తగినంత ముందే ప్రజల పరిశీలన కోసం ప్రకటించాలి. అది నిజాయితీగల పద్ధతి అవుతుంది. ప్రజలు విజ్ఞులని స్వయంగా చంద్రబాబు తరచూ గంభీరంగా ప్రకటిస్తుంటారు. ఒక నాయకుని గత పాలనలో ప్రజలకు కలిగే అనుభవం కూడా విజ్ఞతలోకి వస్తుంది. అందువల్ల, చంద్రబాబు గురించి ప్రజల గత కాలపు నిరాశలను, అపనమ్మకాలను మరచిపోయేటట్లు చేయాలంటే, ఆయన ఈ వివరాలు వెంటనే ప్రకటించాలి. లేనట్లయితే, ఆయనకు 2009లో రాజశేఖర రెడ్డి పెట్టిన 'ఆల్ ఫ్రీ బాబు' పేరును ప్రజలు తిరిగి గుర్తు చేసుకోగలరు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల మనసులోని మాటలు తాజాగా ఇలా...!

గూడు లేని జనాలు



జీవన వ్యయ సంక్షోభం వల్ల యూరప్ వ్యాప్తంగా జనాలు నాశనానికి దగ్గరగా ఉన్నారు. సోషల్ మార్కెట్ ఎకానమీ విఫలమైంది. నెలనెలకీ ఐర్లాండ్‌లో స్థిరమైన ఆశ్రయంలేని వాళ్ల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఇంటి అద్దెలు పిచ్చెక్కిస్తున్నాయి.


– మిక్ వాలెస్, ఐర్లాండ్ నుంచి యూరోపియన్ పార్లమెంట్ ఎంపీ

శతాబ్దపు ఘోరాలు



ఈ శతాబ్దపు అత్యంత తీవ్రవాద నేరంగా అక్టోబర్ 7(ఇజ్రాయెల్ మీద హమాస్ దాడి) నిలిచిపోతుంది. దాన్ని అనుసరించి సాగుతున్నది(గాజా మీద ఇజ్రాయెల్ దాడి) ఈ శతాబ్దపు అత్యంత రాజ్య ప్రాయోజిత హింసగా నిలిచిపోతుంది. యూఎస్/యూకే మద్దతుతో ఒక ప్రజాస్వామిక దేశంగా భావించేది దీన్ని చేపట్టడం దిగ్భ్రాంతికరం. – డార్లీ హెర్బర్ట్, విశ్లేషకుడు

తేడా లేదా?



భారత నాయకులు స్వదేశంలో చేసినట్టే, దేశీయ రాజకీయాల కోసమే (కెనడా ప్రధాని) జస్టిన్ ట్రూడో ఖలిస్తానీ అతివాదానికి మద్దతిస్తున్నాడని కొందరు భారత మేధావులు సూచిస్తున్నారు. నిజంగానా? అల్–ఖైదా స్లోగన్లు మార్మోగిన, 9/11 తీవ్రవాద దాడిని ఉత్సవం చేసుకొన్న ఏ సమావేశానికైనా భారత ప్రధాని హాజరయ్యారా?

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

మీకు నోరు లేదా?



పదేళ్ల క్రితం జర్మనీలోని ఒక వాటర్ పార్క్ వీడియోతో మొదలుపెట్టిన ఓ 29 ఏళ్ల యూట్యూబర్ (ధ్రువ్ రాఠీ) ఇవ్వాళ అత్యంత ప్రభావశీలమైన బీజేపీ విమర్శకుడు కావడం అనేది ప్రతిపక్షాల దుస్థితినే ఎక్కువగా చాటుతోంది. – సదానంద్ ధూమే, కాలమిస్ట్

యూత్, అంకుల్స్ మధ్య...




టీ20 ప్రపంచ కప్ జట్టు కోసం, అంకుల్స్ అంకుల్స్‌లా ఆడే, అంకుల్స్ యూత్‌లా ఆడే, యూత్ అంకుల్స్‌లా ఆడే, యూత్ యూత్‌లానే ఆడే ఆటగాళ్లందరినీ పరిగణనలోకి తీసుకుని, బీసీసీఐ చక్కని సమన్వయం చేసుకుంటుందని ఆశిస్తాను.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

కార్మికుల హక్కులను కాలరాస్తారా?

సందర్భం



బొల్లిముంత సాంబశివరావు

ప్రపంచ వ్యాప్తంగా పాలకుల, పెట్టుబడిదారుల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని కార్మికులు శపథం చేసే రోజు మే డే. 19వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైన పారిశ్రామిక విధానం వలన కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. ఈ పరిస్థితుల నుంచి బయట పడాలని 1884 అక్టోబర్ 7న అమెరికాలోని చికాగో నగరంలో ఓ కార్మిక సదస్సు నిర్వహించారు. పీడనకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పనికోసం ఉద్యమించాలనే అవగాహనకు సదస్సు వచ్చింది. ఇందుకు కార్మిక సంఘాలు సమ్మె ప్రారంభించాయి.

1886 మే 1న ఉదయం 10 గంటలకు అమెరికా అంతటా సమ్మె సైరన్ మోగింది. 13 వేల పారిశ్రామిక సంస్థలు మూత పడ్డాయి. 3 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రారంభమైన 24 గంటల తర్వాత కార్మికుల సంఖ్య 4 లక్షలకు చేరింది. చికాగో నగరంలో 40 వేల మంది కార్మికులు తమ కుటుంబాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అనేక దేశాల్లో ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వాలు బెంబేలు పడ్డాయి. పారిశ్రామిక వేత్తల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. పెట్టుబడిదారుల కనుసైగలతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు నేలకొరిగారు. కాల్పులను వ్యతిరేకిస్తూ 1886 మే 4న 'హే' మార్కెట్ కార్మికులతో నిండిపోయింది. 'ఖబడ్దార్ మమ్ములను కాల్చి చంపుతారా' అంటూ కార్మికుల ఆగ్రహావేశాల మధ్య సభ ప్రారంభమైంది. సభపై పోలీసులు దాడి చేయటంతో కార్మికులు తిరగబడ్డారు. చాలా మంది తలలు పగిలాయి, చేతులు, కాళ్లు తెగి పడ్డాయి. మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిచిపోయింది. ఏడుగురు పోలీసులు, ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కార్మిక నాయకులపై కేసులు బనాయించి 7 గురికి మరణశిక్ష, 8 మందికి పదిహేనేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. చికాగో కార్మికులపై పోలీసుల హింసాకాండను ఖండిస్తూ అనేక దేశాల్లో పెద్దఎత్తున ప్రదర్శనలు జరిగాయి. కార్మికుల అమరత్వం 8 గంటల పని దినం చట్టానికి నాంది పలికింది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస పాలనలో భారత కార్మికులు కూడా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. చికాగో కార్మికుల పోరాటానికి ముందే భారతీయ రైల్వే కార్మికులు 1862లో 8 గంటల పని డిమాండ్ చేస్తూ మొట్టమొదటి సమ్మె చేశారు. సమ్మెపై వలస పాలకులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత భారత పాలకులు, వలస పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలనే అమలు జరిపారు.

మోదీ ప్రభుత్వం కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, భద్రత– ఆరోగ్యం – పని పరిస్థితుల సంబంధిత కోడ్ అని నాలుగు కోడ్‌లుగా మార్చి... కార్మిక హక్కులను హరించింది. పారిశ్రామిక సంబంధాల కోడ్ కార్మిక హక్కులను కాల రాస్తోంది. ఈ కోడ్ రావటానికి ముందు కార్మికుల డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వటానికి 14 రోజుల వ్యవధి సరిపోయేది. ఇప్పుడు దాన్ని 60 రోజులకు పెంచారు. సమ్మెకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం యజమానులకు కల్పించారు. నాలుగు కోడ్‌లు రాక ముందు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు యజమానులే బాధ్యత వహించాలి. ఇప్పుడు కార్మికులే ప్రమాదాలకు బాధ్యత వహించాలి. ఎనిమిది గంటల పనికి స్వస్తి చెప్పి, యజమానులు కోరితే 10 నుంచి 12 గంటలు పని చేయాలి. అందుకు ప్రత్యేక వేతనం ఉండదు.

గత కార్మిక వర్గ ఉద్యమాలను అవగాహన చేసుకుని, మోదీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలి. అందుకు ఈ మే 1 నాంది కావాలి.

రైతు కూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు : 98859 83526

మే డే స్ఫూర్తిని కాపాడుకోవాలి!

వందల సంవత్సరాలుగా ప్రపంచ శ్రామిక ప్రజలు చిందించిన నెత్తుటి త్యాగాల గుర్తుగా అరుణ పతాకం రెపరెపలతో ప్రపంచ వ్యాప్తంగా సభలు ప్రదర్శనలతో... మే డే వచ్చింది. సకల దేశాల జాతుల మతాల, కులాల కార్మికులంతా ఒకటేనని ఈ ప్రపంచమే మనదని చాటి చెప్పిన కార్మిక వర్గ అంతర్జాతీయ దినమే మే డే. 19వ శతాబ్దం రెండవ అర్ధ భాగంలో ఇంగ్లండ్ కేంద్రంగా యూరప్ అమెరికా లలో సంభవించిన పారిశ్రామిక విప్లవ ఫలితంగా కార్మిక వర్గం పుట్టుకతోనే సంఘటిత సమరశీల పోరాటాలకు నాంది పలికింది.

ఆవిరి యంత్రం, జౌళి యంత్రాలు, రైళ్లు, టెలిగ్రాఫ్, మరమగ్గం తదితర అనేక యంత్ర సాధనాలను కనిపెట్టడంతో పారిశ్రామిక విప్లవం జరిగింది. దీని వలన అంతకు ముందు ఉన్న భూస్వామ్య ఉత్పత్తి వ్యవస్థ నిర్మూలించబడి పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ అమలులోకి వచ్చింది. కార్మిక వర్గంపై పెట్టుబడిదారీ వర్గ దోపిడీ తీవ్రంగా కొనసాగుతున్న కాలంలో కార్మిక వర్గం తమ సమస్యల కోసం సంఘటితంగా పోరాడవలసిన పరిస్థితులు ఏర్పడినాయి. ఈ పరిస్థితుల మధ్య 18 – 16 గంటల పని నుండి 8 గంటల పని దినం కోసం కార్మిక వర్గం రక్తతర్పణ చేసిన దినమే మే డేగా ప్రసిద్ధి చెందింది.



1923 మే 1వ తేదీన లేబర్ కిసాన్ పార్టీ నాయకుడు (ఆ తరువాత కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ) సింగార వేలు ఎర్రజెండాను ఎగరవేయడంతో ఆనాటి నుండి భారతదేశంలో కార్మిక వర్గం మే డేను జరపడం కొనసాగుతూ వస్తున్నది. రష్యాలో మేడే ఉత్సవాల్లో అక్కడి కమ్యూనిస్ట్ నాయకులు 8 పని గంటల డిమాండ్‌తో పాటు చిన్న చిన్న ఆర్థిక డిమాండ్‌లను చేర్చడాన్ని లెనిన్ నిరసించినాడు. మే డే రాజకీయ స్వభావాన్ని తక్కువ చేసే ఆర్థిక డిమాండ్‌లు చేర్చడాన్ని లెనిన్ వ్యతిరేకించారు. మే డే సందర్భంగా కార్మిక వర్గం రాజకీయ లక్ష్య సాధన కోసం ప్రతిన పూనాలని ఆయన చెప్పారు.

ఆ తర్వాత కాలంలో మే డే అంతర్జాతీయ కార్మిక వర్గానికి కేంద్ర బిందువు అయింది. ఎన్నో రాజకీయ డిమాండ్లు వివిధ సందర్భాల్లో చేర్చబడ్డాయి. అంతర్జాతీయ కార్మిక వర్గ సంఘీభావం, అందరికీ ఓటు హక్కు, సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేకత, వలసవాద అణచివేత వ్యతిరేకత, రాజకీయార్థిక సంఘాలు ఏర్పరచుకునే హక్కు, రాజకీయ ఖైదీల విడుదల వంటివి అందులో కొన్ని.

మే డే రాజకీయ చరిత్ర ప్రాముఖ్యాన్ని రూపుమాపేందుకు అమెరికా బూర్జువా సంస్కరణ వాద, అవకాశవాద సంఘ నాయకులు మే డే నాడు ప్రదర్శనలు కాకుండా సెలవు రోజు అయిన ఆదివారం జరపాలని 1890 లోనే నిర్ణయించారు. ఇటువంటి కుట్రతోనే అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ అవకాశవాద నాయకులు మే డేకు ప్రతిగా సెప్టెంబర్ ఒకటిని లేబర్ డేగా నిర్ణయించారు. అమెరికన్ ప్రభుత్వ కుట్ర పూరితంగా మే మొదటి తేదీని బాలల ఆరోగ్య దినంగా ప్రకటించింది.

భారతదేశంలో మతోన్మాద అనుబంధ కార్మిక సంఘం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ మే డేని గుర్తించకుండా 'విశ్వ కర్మ దినం' జరుపుతున్నారు. మే డేకు ఉన్న వర్గ స్వభావాన్ని మొద్దుబార్చడానికి మే డే రాజకీయ స్వభావాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వాలు, వివిధ సంస్కరణ వాద అవకాశవాద ట్రేడ్ యూనియన్‌లు మే డేను రికార్డింగ్ డ్యాన్సులతో పండుగలుగా జరుపుతున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మే నెల మొదటి రోజున ప్రపంచ కార్మిక వర్గం కమ్యూనిస్టు పార్టీలు అంతర్జాతీయ కార్మిక పోరాట దినోత్సవాన్ని జరుపుతూనే ఉన్నారు.

శ్రామిక ప్రజల దోపిడీకి, అణచివేతకు, మానవ సమాజం ఎదుర్కొంటున్న సకల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలకు మూల కారణంగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి సోషలిస్ట్ సమాజ నిర్మాణానికి కార్మిక వర్గం సంసిద్ధం కావాలనే మే డే చారిత్రక పిలుపును శ్రామిక వర్గం ఎత్తి పట్టాలి.

కార్మిక వర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!
ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!!

– జంపన్న : మార్క్సిస్ట్–లెనినిస్ట్ నాయకుడు
(నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం – మే డే)

సాధ్యమయ్యేనా?

'జినలోకోన్నతమైన తత్పురము తు–చా తప్పకుండంగ వర్ణన సేయన్ తరమే!' అంటూ వర్ణన చేశాడు ధూర్జటి మహాకవి కాళహస్తి పురాన్ని.

'తు–చ తప్పకుండా' అంటే, ఏ చిన్న విషయమూ వదిలి పెట్టకుండా, సంపూర్ణంగా అని అర్థం. ఈ జాతీయం తెలుగు వారి వాడుకలో తరచుగా వినిపిస్తుంది కానీ 'తు'– 'చ' లు సంస్కృత పదాలు. 'తు'– 'చ'– 'హి'–'వై'–'హ' ఇలాంటి ఏకాక్షర అవ్యయ పదాలు సంస్కృతంలో కొన్ని ఉన్నాయి. వీటికి, 'అయితే', 'మరియు', 'కదా', 'సుమా!', 'సుమీ!' అని వరసగా స్థూలంగా అర్థం చెప్పుకోవచ్చు.

జ్యోతిర్మయం

దాలా చోట్ల (అన్ని చోట్లా కాదు) ఈ పదాలు ఉన్నా లేకపోయినా, ఒక వాక్యం ద్వారా చెప్పదలచుకొన్న అర్థం మారదు. 'సుముఖశ్చ, ఏకదంతశ్చ... లంబోదరశ్చ...' అని చెప్పే గణపతి షోడశ నామాలలో ఈ 'చ' లకు ప్రత్యేకం అర్థమేమీ లేదు. 'దృష్ట్వా తు పాండవానీకం...' అన్న భగవద్గీత శ్లోకంలో 'తు' ఊత పదం. 'కిం కరిష్యతి వై యమః' అన్న చోట 'వై' కి చెప్పుకోదగ్గంత అర్థం లేదు. 'నిరర్థకం తు–హి ఇత్యాది...' అన్నాడు జయదేవుడు. 'పూరణా ఏక ప్రయోజనమ్'. శ్లోక పాదం పూరించటం మాత్రమే ప్రయోజనం, అని.

ఈ తు–చలు కావ్యాలలో కంటే పురాణాలలో ఎక్కువగా కనిపిస్తాయి. కారణం పురాణాలలో కథను లక్షల కొద్దీ శ్లోకాలలో చెప్పాలి. అన్ని లక్షల శ్లోకాలు ఛందస్సు చట్రంలో బిగించి అల్లేటప్పుడు, అక్కడక్కడా మక్కు పెట్టవలసి వస్తుంది. ముఖ్యంగా జాబితాలు కట్టి చెప్పాల్సి వచ్చినప్పుడు. ధృతరాష్ట్రుడి నూరుగురు కొడుకుల పేర్లు ఇవీ, ఫలానా వంశంలో రాజులు వీళ్లు అని వరసగా చెప్పాలంటే, ఆ పేర్లన్నీ తు–చలు లేకుండా వరసగా ఛందస్సులో ఇమడవు.

ఫలానా వారి మాటో, ఆదేశమో, సలహానో, ఉపదేశమో తు–చ తప్పకుండా పాటించటమంటే, నూటికి నూరు శాతం వాళ్ళు చెప్పింది చెప్పినట్టు చేయటం. 'ఇది ముఖ్యం, అది అముఖ్యం' అని సొంత బుద్ధి వాడకుండా, పూర్తి భక్తి గౌరవాలతో చెప్పిందంతా చేసేయటం.

'కాళహస్తిపురంలో ఎన్నెన్నో విశేషాలు ఉన్నాయి. వాటిలో ఏ చిన్న విశేషమూ వదలకుండా సమగ్రంగా, మొత్తం ఉన్నదున్నట్టు వర్ణించడమనేది ఎవరికయినా సాధ్యం అవుతుందా!' అంటున్నాడు ధూర్జటి.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.అష్టమి రా.12.58 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: శ్రవణం రా.12.31 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.4.18 నుండి 5.46 వరకు (తెల్లవారితే గురువారం), దుర్ముహూర్తం: ఉ.11.32 నుండి 12.20 వరకు, అమృత ఘడియలు: ప.2.03 నుండి 4.12 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.39, సూర్యాస్తమయం: 6.14.

క్లుప్తంగా...

ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖకు ఘన సన్మానం



సాక్షి, అమరావతి: చైనాలో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ (స్టేజ్-1)లో జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిందని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న కొనియాడారు. మంగళవారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో వెన్నం జ్యోతి సురేఖను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో మహిళల వ్యక్తిగత ఈవెంట్, గ్రూప్ ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్‌లో మూడు బంగారు పతకాలు సాధించడం దేశానికి, రాష్ట్రానికి ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సురేఖ తండ్రి సురేంద్ర, శాప్ అధికారులు రామకృష్ణ తదితరులున్నారు.

రైల్వేలో 'జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర'

- మే 25వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహణ
- ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా

సాక్షి, అమరావతి: 'జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర' పేరుతో భారతీయ రైల్వే ప్రత్యేక ఆధ్యాత్మిక పర్యాటక ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చినట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరువణ్ణామలై(అరుణాచలం), రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూర్ సందర్శనల కోసం 'భారత్ గౌరవ్ టూరిస్టు ట్రైన్'ను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. మే 25వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ ప్రత్యేక రైలులో విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కవచ్చునని పేర్కొన్నారు. ఒక్కో ప్రయాణికుడి భోజనం, వసతి సౌకర్యాలతో కలిపి టికెట్ ధర స్లీపర్ క్లాస్ రూ.14,250, థర్డ్ ఏసీ రూ.21,900, సెకండ్ ఏసీ రూ.28,450గా ఉందన్నారు. www.irctctourism.com వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చునని, మరిన్ని వివరాలకు 92814 95848, 89779 14121 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏపీ సీఎం మళ్లీ జగనే

- ఆర్‌ఎస్‌ఎస్‌పీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్



చిత్తూరు రూరల్ (కాజీపాళెం): ఏపీలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి పదవిని అలంకరిస్తారని ఆర్‌ఎస్‌ఎస్‌పీ కర్ణాటక అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మిగిలిన కులాల్లోని పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కరోనా కట్టడికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారని చెప్పారు. నవరత్నాలతో సంక్షేమ ఫలాలను గడపకే అందించారని, ఆరోగ్య శ్రీ వ్యయాన్ని రూ. 25 లక్షలకు పెంచారని తెలిపారు. మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో గెలుస్తుందని వివరించారు.

10 లక్షల గోవింద నామాలు రాసిన బెంగళూరు విద్యార్థిని

- కీర్తనకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించిన టీటీడీ



తిరుమల: మొట్ట మొదటిసారిగా పది లక్షల గోవింద నామాలు రాసిన విద్యార్థిని కీర్తనకు టీటీడీ మంగళవారం శ్రీవారి బ్రేక్ దర్శనం కల్పించింది. బెంగళూరుకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కీర్తన 10 లక్షల గోవింద నామాలు రాసింది. తమ పెద్దలు, ఊరి వారు చిన్నతనం నుంచి రామకోటి రాయడం చూసేదానిని, తమ కుల దైవం వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో 2023 నవరాత్రుల నుంచి గోవింద నామాలు రాయడం ప్రారంభించినట్లు కీర్తన చెప్పారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గోవింద నామాలు భక్తిశ్రద్ధలతో రాసినట్లు తెలిపారు. కాగా, చిన్నారులు, విద్యార్థులు, యువతలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు గోవింద నామాలు రాసే బృహత్తర కార్యక్రమాన్ని టీటీడీ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 10 లక్షల గోవింద నామాలు రాసిన వారికి మాత్రమే శ్రీవారి బ్రేక్ దర్శనం, కోటి సార్లు గోవింద నామాలు రాసిన వారికి, వారితో పాటు, వారి కుటుంబ సభ్యులకు బ్రేక్ దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది.

కదిరి టీడీపీ అభ్యర్థి కారులో
రూ.2 కోట్ల నగదు

▶ మొదటి పేజీ తరువాయి


వివరాల ప్రకారం.. ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం టూటౌన్ పోలీసులు స్పెషల్ పార్టీ, మొబైల్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఏపీ 39 ఆర్‌క్యూ 0999 ఫార్చునర్ వాహనాన్ని తనిఖీ చేశారు. రెండు బ్యాగుల్లో నగదు పట్టుబడింది. దాన్ని లెక్కించి రూ.1,99,97,500 ఉన్నట్టు నిర్ధారించారు. పంచనామా నిర్వహించి.. ఈ ప్రక్రియనంతా వీడియో రికార్డింగ్ చేశారు.

రామ్‌నగర్‌నుంచి తరలిస్తూ..

కందికుంట వెంకటప్రసాద్ కారు డ్రైవర్ సోమవారం రాత్రి బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తిని పికప్ చేసుకుని అనంతపురం రాజు రోడ్డులోని టీడీపీ నాయకుడికి చెందిన మాసినేని హోటల్‌లో దించినట్టు సమాచారం. రాత్రి అక్కడే బస చేసిన డ్రైవర్ మంగళవారం ఉదయం అనంతపురం రామ్ నగర్‌లోని ఓ ఇంటి నుంచి రెండు బ్యాగుల్లో నగదు సమకూర్చుకున్నట్టు సమాచారం. అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్, సూర్యానగర్ రోడ్డు మీదుగా నేరుగా కదిరికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ.. తనిఖీలు ఉంటాయనే ఉద్దేశంతో విద్యుత్ నగర్ సర్కిల్ మీదుగా వాహనాన్ని మళ్లించారు. కానీ.. పోలీసులు విద్యుత్ నగర్ సర్కిల్‌లోనూ వాహన తనిఖీలు చేపట్టడంతో నగదు పట్టుబడింది.

కారు కందికుంట పేరుతోనే..

ఏపీ 39 ఆర్‌క్యూ 0999 నంబర్ గల ఫార్చునర్ కారు కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేరుతోనే రిజిస్ట్రేషన్ అయింది. నగదు పట్టుబడిన విషయం తెలిసిన వెంటనే వెంకటప్రసాద్ నల్లచెరువు మండలంలో ఎన్నికల ప్రచారాన్ని అర్ధంతరంగా ముగించుకుని కదిరిలోని ఇంటికి వెళ్లిపోయారు. కదిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు ఖాయమనే సంకేతాలు వస్తుండటంతో కందికుంట అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ క్రమంలోనే ఓటర్లకు నగదు ఎర వేయడానికి సిద్ధమయ్యారు. అనంతపురం, ఇతర ప్రాంతాల నుంచి డబ్బు తెప్పించుకుని కదిరిలో పంచేలా ప్రణాళిక రచించుకున్నారు. ఈ క్రమంలోనే పోలీసుల తనిఖీల్లో సుమారు రూ.2 కోట్ల నగదు పట్టుబడింది.



ఆదాయపు పన్ను అధికారుల విచారణ

వెంకటప్రసాద్ వాహన డ్రైవర్ ఆనంద్‌కుమార్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఎవరిచ్చారు? ఇందుకు సంబంధించిన పత్రాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారిస్తున్నారు. రూ.10 లక్షలకు పైగా నగదు తీసుకెళ్తూ పట్టుబడితే ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అనంతపురం పోలీసులు ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. డ్రైవర్ ఆనంద్‌కుమార్‌ను ఆదాయపు పన్ను శాఖ అధికారులు కూడా విచారిస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదును తరలించడానికి గల కారణాలు ఏమిటి? బ్లాక్ మనీ కాకపోతే అందుకు తగిన ఆధారాలు ఇవ్వాలని సూచించారు. ఈ మొత్తం ఎవరి నుంచి తీసుకున్నారు? ఎందుకు ఇంత పెద్దమొత్తంలో నగదు ఇవ్వాల్సి వచ్చింది? తదితర కోణాల్లో ఆరా తీస్తున్నారు.

వైఎస్సార్ జిల్లా వేంపల్లె ఎన్నికల ప్రచారంలో సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ (ఇన్‌సెట్‌లో) ఎస్టీ కాలనీలో బాబుకు జగన్‌మోహన్‌రెడ్డి అని నామకరణం చేస్తున్న వైఎస్ భారతమ్మ





వైఎస్సార్ పేరును కాంగ్రెస్సే ఇరికించింది

- ఇదే విషయాన్ని ఎన్నోసార్లు షర్మిల సైతం చెప్పారు
- ఇప్పుడు కాంగ్రెస్ పంచన చేరి దుష్ప్రచారం చేస్తున్నారు
- నేను కేసుల్లో ఇరికించానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం
- అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుతో తలదించుకుంటుందని అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. కుట్రపూరితంగా వైఎస్సార్ పేరును కేసుల్లో కాంగ్రెస్ పార్టీ ఇరికించిందని ఆరోపించారు. ఇదే విషయాన్ని ఎన్నోసార్లు షర్మిల సైతం చెప్పారన్నారు. తాను ఇరికించానని ఆమె నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. లేకుంటే షర్మిల దేనికి సిద్ధమో చెప్పాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మంగళవారం పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మహానేత వైఎస్సార్‌ను కాంగ్రెస్ పార్టీ దోషిగా చిత్రీకరించే కుట్రలను అడ్డుకునేందుకు తాను న్యాయపరంగా పోరాటం చేశానన్నారు. కానీ, షర్మిల మాత్రం వైఎస్సార్ మరణానంతరం ఆ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేసిన కాంగ్రెస్ పంచన చేరి తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా గతంలో కాంగ్రెస్ పార్టీకి మహానేత వైఎస్సార్ పేరును ఉచ్చరించే అర్హత లేదన్న షర్మిల వ్యాఖ్యలను వీడియోలను ప్రదర్శించి పొన్నవోలు వినిపించారు. వైఎస్సార్‌పై కేసులు పెట్టింది కాంగ్రెస్ అన్న షర్మిల.. ఇప్పుడు మాట మారుస్తున్నారని మండిపడ్డారు.

నాతో ఎవరూ కేసులు వేయించలేదు..

కాంగ్రెస్ నేత శంకర్రావు వైఎస్సార్ పేరును అత్యంత దారుణంగా చిత్రీకరిస్తూ కోర్టుకు లేఖలు రాశారని పొన్నవోలు సుధాకర్ రెడ్డి గుర్తు చేశారు. వ్యక్తిగత రాజకీయ స్వార్థం కోసం తాను మాటలు మార్చట్లేదన్నారు. 'వైఎస్సార్ పేరును కేసుల్లో ఇరికిస్తుంటే అన్యాయమని స్పందించాను. అంతేగానీ నాతో ఎవరూ కేసులు వేయించలేదు. ఆ సంగతి తెలుసుకొని షర్మిల మాట్లాడాలి. 2011 డిసెంబర్‌లో నేను కేసు వేసే నాటికి కనీసం వైఎస్ జగన్‌ను చూడలేదు.. నాకు ఆయనతో పరిచయం లేదు. ఆనాడు వైఎస్సార్‌పై చంద్రబాబు, టీడీపీ నేతలు రాష్ట్రపతికి లేఖ రాసిన మాట వాస్తవం కాదా? ఇలాంటి కేసుల్లో సంతకాలు చేసిన మంత్రులు, సంబంధిత అధికారులు బాధ్యులు అవుతారు. కానీ వైఎస్సార్, వైఎస్ జగన్ ఎలా బాధ్యులు అవుతారు. ఈ వాస్తవం కోర్టుకు వివరించే ప్రయత్నం చేశాను' అని పొన్నవోలు వివరించారు. రాజధానిలో చంద్రబాబు భూదోపిడీ, వందల కోట్ల విలువైన సదావర్తి భూముల దోపిడీ, తెలంగాణలో ఓటుకు కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కేసుల్లోనూ తాను పోరాటం చేశానన్నారు. బాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను చేసిన పోరాటం చూసి సీఎం జగన్ ఏఏజీగా అవకాశం కల్పించారన్నారు. క్విడ్ ప్రో కో అంటే వైఎస్సార్‌పై ఫిర్యాదు ఇచ్చిన శంకర్ రావుకు మంత్రి పదవి ఇవ్వడం కాదా అని నిలదీశారు. తన ఊపిరి ఉన్నంత వరకు చంద్రబాబు అక్రమాలపై పోరాటం చేస్తానన్నారు. షర్మిల చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తనపై, సీఎం జగన్‌పై ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. కొంత మంది పకోడిగాళ్లు షర్మిల భుజం మీద తుపాకీ పెట్టి తనను కాలుస్తున్నారని మండిపడ్డారు. అలాగే తన భుజం మీద తుపాకీ పెట్టి సీఎం జగన్‌ను కాల్చాలని చూస్తున్నారని.. ఈ విషయం షర్మిల తెలుసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



గన్నవరంలో పార్టీలో చేరిన ఎమ్మార్పీఎస్ నేతలతో వంశీమోహన్

గండ్రాయి (జగ్గయ్యపేట)/గన్నవరం: కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట నియోజకవర్గం గండ్రాయి గ్రామంలో టీడీపీకి చెందిన 100 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను సమక్షంలో మంగళవారం చేరాయి. గన్నవరంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ ఆధ్వర్యంలో 470 మంది ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో చేరారు.

ఆదిమూలం.. నువ్వు మా ఊరికి రావద్దు

- దళితుడివైన నువ్వు ఏకంగా దళితులకే అన్యాయం చేశావు
- మేం సాగుచేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్నావు
- టీడీపీ అభ్యర్థిపై కుక్కంబాకం దళిత మహిళల ఆగ్రహం
- తమ గ్రామంలోకి రాకుండా రోడ్డుకు అడ్డంగా ముళ్లకంప వేసిన వైనం



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలంను అడ్డుకున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ (తిరుపతి జిల్లా): 'దళిత ఎమ్మెల్యేగా ఉంటూ దళితులకే అన్యాయం చేశావు. దళితులు సాగుచేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వకుండా నువ్వు భూస్వాములతో కలిసి అడ్డుకున్నావు. ఇప్పుడు నువ్వు మా గ్రామంలోకి ఓట్లు అడిగేందుకు రావొద్దు...' అని టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలంను తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబాకం గ్రామ దళిత మహిళలు అడ్డుకున్నారు. ఏకంగా రోడ్డుపై అడ్డంగా ముళ్లకంప వేసి తీవ్ర నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు... కోనేటి ఆదిమూలం సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం కోసం కుక్కంబాకం గ్రామానికి వెళ్లగా, దళిత మహిళలు నిరసన చేపట్టారు. ఎమ్మెల్యేగా ఐదేళ్లు పనిచేసిన ఆదిమూలం ఒక్క దళితుడికి సహాయం చేసిన దాఖలాలు లేవని, ఆయన వల్ల తమకు జరిగిన నష్టాన్ని మహిళలు ఏకరువుపెట్టారు. తమ గ్రామంలోకి ఆదిమూలంను రానీయబోమని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా దళిత మహిళలు మాట్లాడుతూ కుక్కంబాకం గ్రామంలోని సర్వే నంబరు 81లో 80ఎకరాల భూమిని సుమారు 40 కుటుంబాలు పదేళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. అయితే దళిత ఎమ్మెల్యేగా ఉంటూ కోనేటి ఆదిమూలం భూస్వాములతో కుమ్మక్కై తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వనీయకుండా అడ్డుకున్నారని చెప్పారు. పలుమార్లు ఆదిమూలం వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నా పట్టించుకున్న పాపానపోలేదని వాపోయారు. రెవెన్యూ సిబ్బందితో అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేశాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన వల్ల సెంటు భూమి లేకుండా తీవ్రంగా నష్టపోయామని చెప్పారు. అలాంటి వ్యక్తికి ఓటు ఎలా వేయాలని నిలదీశారు. దీంతో గ్రామపెద్దలు జోక్యం చేసుకుని మహిళలను శాంతింపజేయటంతో దాదాపు గంట సేపటి తర్వాత వివాదం సద్దుమణిగింది.

కుటుంబ సభ్యుల మెడకోసి హత్య..
ఆపై ఆత్మహత్య

విజయవాడ గురునానక్ కాలనీలో ఓ డాక్టర్ అఘాయిత్యం

స్నేహితుల మోసం, ఆర్థిక ఇబ్బందులే కారణం?



డాక్టర్ శ్రీనివాస్ (ఫైల్)



భార్య ఉష, కొడుకు శ్రీహాన్(ఫైల్)

పటమట (విజయవాడ తూర్పు): ప్రాణాలు పోయాల్సిన డాక్టర్ విచక్షణ మరచి తల్లి, భార్య, పిల్లల మెడలు కోసి పాశవికంగా హత్య చేసి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున విజయవాడలో చోటుచేసుకుంది. స్నేహితుల మోసంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడమే ఈ దారుణానికి కారణమని సమాచారం. పటమట పోలీసుల వివరాల ప్రకారం... గురునానక్‌నగర్ సమీపంలోని మారుతీ కో–ఆపరేటివ్ సొసైటీ కాలనీలో ఆర్థోపెడిక్ వైద్యుడు డి. శ్రీనివాస్ (40) నివాసం ఉంటున్నాడు. కొంతకాలం క్రితం స్నేహితులతో కలిసి శ్రీజ ఆర్థోపెడిక్ క్లినిక్‌ను స్థాపించాడు. ఇందుకోసం పలుచోట్ల అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు చెల్లించాలంటూ ఒత్తిడి రావడంతో మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో తల్లి రమణమ్మ (65), భార్య ఉష (38), కుమార్తె శైలజ (11), కుమారుడు శ్రీహాన్ (8) రాత్రి నిద్రపోతుండగా, కత్తితో మంగళవారం తెల్లవారు జామున వారి మెడలు కోసి హత్య చేశాడు. అనంతరం ఉదయం 7 గంటల సమయంలో తానూ దాబా గ్రిల్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రోజూ మాదిరి పనికోసం వచ్చిన పనిమనిషి చూసి ఈ విషయాన్ని పక్కింటి వారికి చెప్పింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న విజయవాడ సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ, డీసీపీ అధిరాజాసింగ్ రాణా తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు విచారణ చేపట్టారు. విజయవంతంగా నడుస్తున్న ఆస్పత్రి నష్టాల్లోకి రావడానికి అతని స్నేహితులే కారణమని, అతడిని మోసం చేశారని మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి

వల్లూరు: వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గ పరిధిలోని వల్లూరు మండలం థెరిసా నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు సోమవారం రాత్రి ఇనుప రాడ్లు, కత్తులతో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభాకర్ రాత్రి ఇంటి వద్ద జై జగన్ అంటూ నినాదాలు ఇస్తుండడంతో పవన్, హరి అనే టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. కంటి వద్ద బలమైన గాయం కాగా చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.



టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రభాకర్

జనసేన నేతలపై చింతమనేని మండిపాటు

- చంద్రబాబు, పవన్ చెప్పారని మిమ్మల్ని భరిస్తున్నాం
- ఇష్టం లేకపోతే మాతో ప్రచారానికి రావద్దు
- పెదవేగిలో జనసేన ఇన్‌చార్జి వెంకటలక్ష్మిపై చింతమనేని మండిపాటు
- కవ్వగుంటలో కొట్టుకున్న జనసేన కార్యకర్తలు



కవ్వగుంటలో కొట్టుకుంటున్న జనసైనికులు

పెదవేగి: ఏలూరు జిల్లా దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ మరోసారి తన నోటిదురుసు చూపించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా ఎన్నికల ప్రచారసభలో రెండు పార్టీల కార్యకర్తలు హాజరైన సమావేశంలో మాట్లాడటం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చింతమనేని ప్రభాకర్, ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన నేత కొఠారు ఆదిశేషు కలిసి మంగళవారం పెదవేగి మండలం జగన్నాథపురం పంచాయతీ జ్ఞానేశ్వరపురంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జనసేన నేతలు వెంకటలక్ష్మి, ఆదిశేషు మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ వర్గాల మధ్య మాటల యుద్ధం సాగుతున్న తరుణంలో వెంకటలక్ష్మిపై చింతమనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన నేతలు ఇష్టమైతే మాతో కలిసి రండి.. లేకపోతే ఎవరూ రావద్దు.. మీలో మీరు గొడవపడి మా మీటింగుల్లో చికాకుపెడితే కుదరదు.. అంటూ వెంకటలక్ష్మిపై విరుచుకుపడ్డారు. దీంతో మీరే అందరినీ ఎందుకు పిలుస్తున్నారు.. జనసేన ఇన్‌చార్జి ఎవరో తెలియదా అని ఆమె బదులివ్వడంతో చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ చెప్పారు కాబట్టి మిమ్మల్ని భరిస్తున్నామని, మీకు ఇష్టం లేకపోతే మా ప్రచారంలో ఎవరూ పాల్గొనవద్దని చింతమనేని కుండబద్దలు కొట్టినట్టు చెప్పేశారు. మీ గ్రూపు గొడవలుంటే మీ మీటింగ్‌లో మాట్లాడుకోండి.. రాజకీయ పార్టీ కాబట్టి మీటింగ్‌కు అందరినీ పిలుస్తాం.. వాళ్లను, వీళ్లను పిలవకూడదు అని చెప్పొద్దు.. అంటూ మండిపడ్డారు.

జనసేన వర్గాల బాహాబాహీ: జగన్నాథపురంలో ప్రచారం అనంతరం కవ్వగుంటలో చింతమనేని ప్రచారం చేయాల్సి ఉంది. ఈ క్రమంలో అక్కడ జనసేన ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, పార్టీ నేత ఆదిశేషు వర్గాల వారు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ బాహాబాహీకి దిగి కర్రలతో దాడిచేసుకున్నారు. ఈ కొట్లాటలో ముగ్గురికి గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారం చేసిన చింతమనేని.. జనసేన కార్యకర్తలు రావద్దంటూ చెప్పి వెళ్లిపోయారు.

ఎస్సీ కాలనీలో పార్టీ ఆఫీస్ ప్రారంభించరా?

- టీడీపీ నేతలపై వీరులపాడు దళిత యువకుల ఆగ్రహం
- ఆ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, ఫొటోలు తొలగించి నిరసన



మాట్లాడుతున్న ఎస్సీ కాలనీ యువకులు

వీరులపాడు: 'మా ఎస్సీ కాలనీల్లో టీడీపీ కార్యాలయాలు పెట్టకూడదా.. మేం ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాలను కనీసం ప్రారంభించేందుకు కూడా మీరు రారా..?' అని టీడీపీ నేతల తీరుపై వీరులపాడు గ్రామ దళిత యువకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వీరులపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 30మంది యువకులు కలిసి టీడీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రారంభోత్సవానికి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్యలను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి వీరులపాడులో చిన్ని, సౌమ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో కార్యాలయం ప్రారంభించేందుకు మాత్రం వెళ్లలేదు. 'ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించడం ఏమిటీ..' అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసకుమార్, గ్రామ అధ్యక్షుడు నల్లమల ఉమామహేశ్వరరావు అడ్డుకోవడంతో కేశినేని చిన్ని, సౌమ్య అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన ఎస్సీ కాలనీ యువకులు టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన జెండాలు, ఫ్లెక్సీలు, నాయకుల ఫొటోలు చించివేసి నిరసన తెలిపారు. టీడీపీపై అభిమానంతో పార్టీ విజయానికి కృషిచేయాలని భావిస్తున్న తమను అవమానించడం బాధాకరమని దళిత యువకులు మంగళవారం విలేకరుల ఎదుట తమ ఆవేదనను వ్యక్తంచేశారు.

తన్నుకున్న 'తడ' తెలుగు తమ్ముళ్లు

ఆస్పత్రి పాలైన పార్టీ సీనియర్ లీడర్

తడ (తిరుపతి జిల్లా): తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. వివరాల్లోకి వెళితే బీవీపాళెం పంచాయతీలోని పాతకుప్పంకి చెందిన సీనియర్ మత్స్యకార నాయకులు సెల్వం సుధాకర్‌కు అదే పంచాయతీకి చెందిన మరో మత్స్యకార నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మనోహర్‌కు కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నది. మనోహర్ ఓ హత్య కేసుతోపాటు మరెన్నో వివాదాస్పద కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తడ పార్టీ కార్యాలయంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొనడంతో మనోహర్ సుధాకర్‌పై దాడికి దిగాడు. ఈ గొడవలో సుధాకర్ చెయ్యి విరగడంతో ఆయన ప్రస్తుతం చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ వివాదం సూళ్లూరుపేటలోని సీనియర్ నాయకులు, పార్టీ సమన్వయకర్త కొండేపాటి గంగాప్రసాద్ వద్దకు చేరడంతో అర్ధరాత్రి వరకు సర్దుబాటు యత్నాలు నడిచాయి. అయితే గ్రామ పెద్దలు కుల కట్టుబాట్ల మేరకు మనోహర్‌పై చర్యలకు సిద్ధం అయినట్లు తెలిసింది. మనోహర్ మాజీ మంత్రి పరసా వెంకటరత్నం వర్గానికి చెందిన వాడిగా దెబ్బతిన్న సుధాకర్ నెలవల సుబ్రమణ్యం వర్గంగా చెబుతున్నారు.

కాంగ్రెస్ ప్రేమ దుకాణాల్లో ఫేక్ వీడియోలు

నా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు.. నకిలీ వీడియోలు సృష్టిస్తున్నారు

ప్రతిపక్షంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం ● మహారాష్ట్రలో మోదీ ఎన్నికల ప్రచారం

షోలాపూర్: విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, సమస్యలు.. కవల పిల్లలు అని విమర్శించారు. దశాబ్దాలపాటు పరిపాలించిన కాంగ్రెస్ మన దేశానికి ఇచ్చింది పేదరికాన్ని తప్ప ఇంకేమీ లేదని ధ్వజమెత్తారు. మంగళవారం మహారాష్ట్రలోని లాతూర్, ధారాశివ్, షోలాపూర్ జిల్లాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి బీజేపీకి వ్యతిరేకంగా కృత్రిమ మేధ సాయంతో ఫేక్ వీడియోలు సృష్టించి, సోషల్ మీడియాలో వ్యాప్తిలోకి తీసుకొస్తోందని ఆరోపించారు. తన రూపాన్ని, గొంతును అనుకరిస్తూ.. తాను అనని మాటలు అన్నట్లుగా, తన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ నకిలీ వీడియోలు తయారు చేస్తున్నారని, సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ వీడియోలను కాంగ్రెస్ ప్రేమ దుకాణంలో అమ్మకానికి పెట్టారని అన్నారు. ఎన్నికల పోరాటంలో బీజేపీని ఎదుర్కొనే దమ్మూ ధైర్యం లేక విపక్షాలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం సాగిస్తున్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్ధాలను ప్రజలెవరూ నమ్మడం లేదని, అందుకే తప్పుడు దారులు ఎంచుకుందని విమర్శించారు. కాంగ్రెస్ అబద్ధాల దుకాణం మూతపడక తప్పదని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే..



పాకిస్తాన్‌కు విజ్ఞాపన పత్రాలు బంద్

"కాంగ్రెస్ పాలనలో మన దేశంలో ఉగ్రవాద దాడులు జరిగిన వెంటనే పాకిస్తాన్‌కు విజ్ఞాపనలు పంపించే పరిస్థితి ఉండేది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలంటూ పాకిస్తాన్‌కు విజ్ఞప్తులు చేసేవారు. అది చూసి మీడియాలో కొందరు మిత్రులు కాంగ్రెస్‌ను పొగుడుతూ చప్పట్లు కొడుతూ ఉండేవారు. అప్పట్లో ఇలాంటి వినతిపత్రాలపై పత్రికల్లో నిత్యం పతాక శీర్షికలతో వార్తలు వస్తుండేవి. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముష్కరుల దాడులు ఆగిపోయాయి. విజ్ఞాపన పత్రాలను మనం నమ్ముకోవడం లేదు. శత్రువుల భూభాగంలోకి అడుగుపెట్టి మరీ గట్టిగా బుద్ధిచెబుతున్నాం. దేశ భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడడం లేదు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహించాం. నవభారత్ ప్రగతికి ఇదొక సూచిక. ఏ క్షణమైనా కూలిపోయే స్థితిలో ఉండే బలహీన ప్రభుత్వం బలమైన దేశాన్ని నిర్మించలేదు. ఈ ఎన్నికల్లో మన దేశ ఆత్మగౌరవానికి సంబంధించిన ఎన్నికలు. ప్రపంచ అభివృద్ధికి నేడు భారత్ వేగాన్ని అందిస్తోంది. గత పదేళ్లలో మనం ఎన్నో ఘనతలు సాధించాం. బలమైన ప్రభుత్వంతోనే అనుకున్నది సాధించగలం.

ఓటు వృథా చేసుకోవద్దు

దేశ ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ నాశనం చేసింది. నేను ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ గురించి మాట్లాడితే కాంగ్రెస్ యువరాజుకు జ్వరం వచ్చేస్తోంది. దేశాన్ని దోచుకున్న నేతలు ఇప్పుడు జైల్లో ఉన్నారు. జనం సొమ్ము మింగేసినవారు తిరిగి కక్కాల్సిందే. అవినీతిపరుల నుంచి డబ్బు తిరిగి వసూలు చేస్తాం. ఇది మోదీ గ్యారంటీ. కాంగ్రెస్‌కు ఒక్క కుటుంబమే ముఖ్యం. మాకు దేశంలోని ప్రతి కుటుంబం ముఖ్యమే. 2014, 2019లో ప్రజలు మాకు ఇచ్చిన అవకాశాన్ని వారికి మేలు చేయడానికే ఉపయోగించాం. సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం. రిజర్వేషన్ల విషయంలో బీజేపీపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోంది. ఇప్పుడు సాక్షాత్తూ బాబా సాహెబ్ అంబేడ్కర్ వచ్చినా రిజర్వేషన్లను రద్దు చేయలేరు. విద్య, ఉద్యోగాల్లో అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. వాటిని రద్దు చేయడం ఎవరివల్లా కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత వేసి, ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టాలన్నదే కాంగ్రెస్ కుట్ర. ఎస్సీ, ఎస్టీ నాయకత్వాన్ని కాంగ్రెస్ ఎదగనివ్వలేదు. గత పదేళ్లలో పార్లమెంట్‌లో, అసెంబ్లీల్లో అడుగుపెట్టిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల్లో అత్యధిక శాతం బీజేపీ, ఎన్డీయేకు చెందినవారే. ఈ ఎన్నికల్లో కనీసం 275 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ఉంది. అలాంటి పార్టీకి ఎన్నికల్లో మద్దతు పలికి ఎవరూ ఓటు వృథా చేసుకోవద్దు. మహారాష్ట్రలో సంచరించే ఆత్మ(శరద్ పవార్) ఒకటి ఉంది. ఆయన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతులకు చేసింది సున్నా. ఎన్నికల సమరంలో ప్రజలు ఆయనను ఓటుతో శిక్షించే సమయం వచ్చింది.

ప్రధాని పదవిని ముక్కలు చేస్తారట!

దేశ ప్రజలను, రైతులను కాంగ్రెస్ దగా చేసింది. వారి కలలను విచ్ఛిన్నం చేసింది. కాంగ్రెస్ హయాంలో రైతన్నలకు దక్కాల్సిన నిధులను, ఎరువులను కూడా లూటీ చేశారు. సాగునీటి వసతి కల్పించలేదు. ప్రాజెక్టులు పూర్తిచేయలేదు. ప్రతిభావంతులైన మన దేశ యువతకు కాంగ్రెస్ వల్ల అన్యాయం జరిగింది. మన దేశం ముక్కలు కావడాన్ని కళ్లారా చూసినవారు ఇప్పుడు ప్రధానమంత్రి పదవిని ముక్కలు చేయాలని అనుకుంటున్నారు. విపక్ష కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఇన్‌స్టాల్‌మెంట్లలో పంచుకుంటారట! ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు అనేది దేశాన్ని దోచుకొనే పథకమే. కాంగ్రెస్ పార్టీ ప్రమాదకరమైన ఆట ఆడుతోంది" అని ప్రధాని మోదీ ఆరోపించారు.

కాంగ్రెస్ ఎజెండాపై ఓటర్లను అప్రమత్తం చేయండి

ఎన్డీయే అభ్యర్థులకు ప్రధాని మోదీ లేఖ

విపక్ష కాంగ్రెస్ దురుద్దేశాలు, ఎజెండాపై ఓటర్లను అప్రమత్తం చేయాలని ప్రధానమంత్రి మోదీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అభ్యర్థులకు వ్యక్తిగతంగా లేఖలు రాశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, ఓటు బ్యాంక్‌కు మతపరంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆ పార్టీ ఎత్తుగడ అని పేర్కొన్నారు. వారసత్వ పన్ను విధించి, ప్రజల ఆస్తులను లాక్కొని ఓటు బ్యాంక్‌కు అప్పగించాలన్నదే కాంగ్రెస్ ఎజెండా అని విమర్శించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విభజన, విద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆక్షేపించారు. ప్రమాదకరమైన కాంగ్రెస్ ఎజెండాను ఓటర్లకు వివరించి, అప్రమత్తం చేయాలని ఎన్డీయే అభ్యర్థులను మోదీ కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీకి ఒక విలువైన కార్యకర్త అని ఆయన రాసిన లేఖలో ప్రధాని ప్రశంసించారు. గతంలో గుజరాత్ మంత్రిగా, ఇప్పుడు కేంద్రమంత్రిగా అమిత్ షా చక్కటి పనితీరు ప్రదర్శిస్తున్నారని కొనియాడారు.



ఎన్నికల విచిత్రం

మహారాష్ట్రలోని మాథా పట్టణంలో మంగళవారం ఎన్నికల ప్రచారసభలో గొంగళి కప్పుకుని సంప్రదాయ వస్త్రధారణలో కనిపించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

ముగ్గురు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతి

దుమ్ముగూడెం/వర్ల: ఛత్తీస్‌గఢ్‌లో రెండు వారాల వ్యవధిలోనే మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణపూర్, కాంకేర్ జిల్లాల పరిధిలోని మావోయిస్టులకు పెట్టనికోటగా ఉన్న అబుజ్‌మడ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతిచెందారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్, డీఆర్‌జీ దళాలు సోమవారం రాత్రి నుంచి గాలింపు కొనసాగిస్తున్నాయి. మంగళవారం ఉదయం టేక్‌మెట, కాకూర్ గ్రామాల మధ్యనున్న అటవీ ప్రాంతంలోని సమావేశ ప్రాంతానికి చేరుకున్న బలగాలపైకి మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య హోరాహోరీ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో ముగ్గురు మహిళలు సహా పది మంది మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయి. ఘటనాస్థలి నుంచి ఏకే 47, ఇన్సాస్ రైఫిళ్లతో పాటు భారీ ఎత్తున మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. పలువురు మావోయిస్టులు గాయపడ్డారని వారి కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు.

16 మంది నక్సల్స్ లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో రెండు వారాల్లో జరిగిన రెండు భీకర ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో బీజాపూర్ జిల్లాలో మంగళవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

మరోసారి ఉల్లంఘిస్తే జైలు తప్పదు..

ట్రంప్‌కు న్యూయార్క్ కోర్టు హెచ్చరిక ● 9 వేల డాలర్ల జరిమానా

న్యూయార్క్: హష్ మనీ కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టు గట్టి వార్నింగిచ్చింది. తాము ఇచ్చిన గ్యాగ్ ఉత్తర్వులను 9 పర్యాయాలు ఉల్లంఘించినందుకు 9 వేల డాలర్ల జరిమానా విధించింది. సాక్షులు, జడ్జీలతోపాటు ఈ కేసుకు సంబంధించి మరికొందరిపై మరోసారి ఇలా వ్యాఖ్యలు చేస్తే జైలుకు పంపక తప్పదని హెచ్చరించింది. న్యూయార్క్ జడ్జి జువాన్ ఎం మెర్చన్ ఈ మేరకు తీర్పు చదువుతున్న సమయంలో ట్రంప్ తలదించుకుని నేల చూపులు చూస్తూ ఉండిపోవడం గమనార్హం. శుక్రవారం కల్లా జరిమానా చెల్లించాలని, ట్రంప్ సొంత 'ట్రూత్ సోషల్' వేదికపై చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలను తొలగించాలని ఆదేశించారు. గ్యాగ్ ఉత్తర్వుపై ట్రంప్ మరో ఉల్లంఘన ఆరోపణలపై గురువారం విచారణ జరగనుంది. ఓ పోర్న్ నటితో బంధం బయటికి పొక్కనివ్వరాదంటూ ఆమెకు మాజీ లాయర్ ద్వారా డబ్బులు ముట్టజెప్పిన ఆరోపణలపై కోర్టు విచారణ జరుపుతోంది.

అనంత్‌నాగ్ పోలింగ్ వాయిదా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి మే 7వ తేదీన జరగాల్సిన పోలింగ్‌ను ఈసీ మే 25వ తేదీకి వాయిదా వేసింది. అననుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పోలింగ్‌ను వాయిదా వేయాలంటూ జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ తదితరులు ఇటీవల ఈసీని కోరారు. దీనిపై కశ్మీర్ యంత్రాంగం అందజేసిన నివేదిక ఆధారంగా పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఈసీ తెలిపింది.

బీజేపీలోకి మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే

భోపాల్: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే రాంనివాస్ రావత్ మంగళవారం బీజేపీలో చేరారు. షియోపూర్ జిల్లాలో జరిగిన బీజేపీ ర్యాలీలో సీఎం మోహన్ యాదవ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.

వీడియోల వెనుక రాహుల్ హస్తం!

- మంత్రి అమిత్ షా ఆగ్రహం
- రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన లేదని వెల్లడి

గువాహటి: కాంగ్రెస్‌లో నిరాశ, అసంతృప్తి తీవ్రస్థాయికి చేరాయని, అందుకే ఆ పార్టీ ఫేక్ వీడియోలు సృష్టిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియోల వెనుక కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హస్తం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, రాష్ట్రాల్లో ఆ పార్టీ అధ్యక్షులు సైతం ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో నిస్సిగ్గుగా షేర్ చేస్తున్నారని దుయ్యబట్టారు. సిద్ధాంతాలు, విలువలు, మేనిఫెస్టో ఆధారంగా ఎన్నికల్లో పోటీ పడాలి తప్ప ఫేక్ వీడియోలను నమ్ముకోవడం ఏమిటని కాంగ్రెస్‌ను నిలదీశారు. మంగళవారం అస్సాం రాజధాని గౌహతిలో అమిత్ షా మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసే ధైర్యం రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, ఉన్న కొద్ది



పాటి ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడానికి తంటాలు పడుతోందని చెప్పారు. ఈసారి కూడా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదని అన్నారు. దేశమంతటా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. అన్ని మతాల పౌరులకు ఒకే పౌర చట్టం ఉండాలన్నారు. లౌకిక దేశంలో మతానికో చట్టం ఉండడం సరైంది కాదని, రాజ్యాంగ స్ఫూర్తికి అది విరుద్ధమేనని అన్నారు. అధికారంలోకి వస్తే సివిల్ కాంట్రాక్టులు మైనార్టీలకు ఇస్తామని కాంగ్రెస్ చెబుతోందని ఆక్షేపించారు. తక్కువ బిడ్ దాఖలు చేసిన వారికి కాంట్రాక్టులు అప్పగిస్తారు తప్ప ఇలా మతం ఆధారంగా కాంట్రాక్టులు ఇస్తామనడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కూడా మతపరమైన రిజర్వేషన్ ఉందా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.

రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని అమిత్ షా మండిపడ్డారు. కాంగ్రెస్ అబద్ధాలకు అంతు లేకుండా పోతోందని ధ్వజమెత్తారు. ఓటర్లను మైనార్టీగా, మెజార్టీగా చూసే అలవాటు తమకు లేదని కాంగ్రెస్‌కు చురక అంటించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని స్పష్టంచేశారు. బడుగు బలహీన వర్గాల హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం, రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన బీజేపీకి ఎంతమాత్రం లేదని పునరుద్ఘాటించారు.

మోదీ 'ఆత్మ' వ్యాఖ్యలకు పవార్ కౌంటర్

పుణె: మహారాష్ట్రలో ఓ ఆత్మ తిరుగుతోందని, గెలవలేక అది ఇతరులను మంచి పని చేయనీయకుండా చెడగొడుతోందని శరద్‌పవార్‌నుద్దేశిస్తూ ప్రధాని మోదీ చేసిన పరోక్ష వ్యాఖ్యలపై ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్ దీటుగా బదులిచ్చారు. జున్నార్ తహసీల్ పరిధిలో మంగళవారం జరిగిన ఎన్సీపీ ఎన్నికల మీటింగ్‌లో పవార్ మాట్లాడారు. "కొన్నేళ్ల క్రితం అంటే 2016లో పుణెలో ప్రధాని మోదీ ఒక ప్రసంగం చేశారు. పవార్ సాహెబ్ వేలు పట్టుకునే రాజకీయాల్లోకి వచ్చానని మోదీ ఆనాడు సభాముఖంగా సెలవిచ్చారు. ఇప్పుడేమో గత 45 ఏళ్లుగా ఒక ఆత్మ అవిశ్రాంతంగా మహారాష్ట్రను విశ్రాంతి తీసుకోనివ్వట్లేదని నన్ను దూషిస్తున్నారు. నా ఆత్మ అస్వస్థతకు గురైన మాట నిజమే. కానీ సొంత పనుల్లో అలసిపోయి కాదు. రైతుల కడగళ్లు, ధరవరల నుంచి సామాన్య ప్రజానీకాన్ని గట్టెక్కించేందుకు కష్టపడి నా ఆత్మ అలా అలసిపోయింది. ప్రజల కష్టాలు తీర్చేందుకు 100 రెట్లు ఎక్కువగా కష్టించేందుకైనా నా సదా సిద్ధం' అని పవార్ వ్యాఖ్యానించారు.

పార్టీ నుంచి ప్రజ్వల్ సస్పెండ్

బెంగళూరు: లైంగిక దౌర్జన్యం, వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంగా సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్‌ను జేడీఎస్ తమ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. మంగళవారం హుబ్బళ్లిలో జేడీఎస్ కోర్ కమిటీ భేటీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడకు ప్రజ్వల్ సస్పెన్షన్‌పై సిఫార్సుచేసిన కొద్ది సేపటికే పార్టీ ప్రజ్వల్‌ను సస్పెండ్‌చేసింది. "మహిళలను ప్రజ్వల్ లైంగికంగా వేధిస్తున్నట్లు సంబంధిత వీడియోలు సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. ఆ వీడియోలు పార్టీకి,



పార్టీ నాయకత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయి. పార్టీ నియమావళి, క్రమశిక్షణా నిబంధనావళిని ఉల్లంఘించిన కారణంగా తక్షణం ఆయన్ను సస్పెండ్‌చేస్తున్నాం" అని సస్పెన్షన్ ఉత్తర్వులో పార్టీ పేర్కొంది. కోర్ కమిటీ భేటీలో కర్ణాటక రాష్ట్ర జేడీఎస్ చీఫ్ హెచ్‌డీ కుమారస్వామి కూడా పాల్గొన్నారు. "కేసు దర్యాప్తు కోసం ప్రభుత్వం నియమించిన సిట్ నివేదిక, ప్రభుత్వ చర్యలను బట్టి సస్పెన్షన్‌ను పొడిగిస్తామని కుమారస్వామి చెప్పారు.

ఎందుకు ఇప్పుడే అరెస్ట్ చేశారు?

కేజ్రీవాల్ కేసులో ఈడీని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: సరిగ్గా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్ట్ చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఎదుట మంగళవారం వాదనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ధర్మాసనం ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును పలు ప్రశ్నలు అడిగింది. మనీలాండరింగ్ కేసులను 365 రోజుల్లో పూర్తి చేయాలన్న నిబంధనలుండగా..ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై న్యాయ ప్రక్రియ ప్రారంభానికి, కేజ్రీవాల్ అరెస్టుకు మధ్య చాలా సమయం ఎందుకు ఉందని అడిగింది. ఈ కేసుకు సంబంధించిన అటాచ్‌మెంట్లు ఏవైనా ఉంటే, వాటికి పిటిషనర్‌తో ఏమైనా సంబంధం ఉందా అని కూడా ఆరా తీసింది. 'వ్యక్తి స్వేచ్ఛ అత్యున్నతం. దానిని ఎవరూ కాదనలేరు' అని పేర్కొంది. 'ఇదే కేసులో కస్టడీలో ఉన్న మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై ఇచ్చిన తీర్పులో మొదటి భాగం ఆయనకు అనుకూలంగా, రెండో భాగం వ్యతిరేకంగాను ఉంది. కేజ్రీవాల్‌కు ఇందులోని ఏ భాగంతో సంబంధం ఉందో చెప్పండి. పదేపదే కోర్టును ఆశ్రయిస్తున్నారనే కారణంతో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసే అధికారం ఈడీకి ఉంటుందా? శుక్రవారం విచారణలో వీటికి సమాధానమివ్వండి' అని అదనపు సొలిసిటర్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది.

ఆరేళ్లుగా నిద్రలోనే ఉన్నారెందుకు?

ఉత్తరాఖండ్ అధికారులపై సుప్రీం కన్నెర్ర ● 'పతంజలి' క్షమాపణ ప్రకటనలపై సంతృప్తి

న్యూఢిల్లీ: పతంజలి ఆయుర్వేద సంస్థ తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఆరేళ్లపాటు కిమ్మనని ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ(ఎస్ఎల్ఏ)పై సుప్రీంకోర్టు కన్నెర్ర చేసింది. 'ఏప్రిల్ 10వ తేదీన మేం ఆదేశాలిచ్చిన తర్వాత మాత్రమే ఎస్ఎల్ఏ మేల్కొంది. దేశంలో చట్టాలున్న విషయం, తన అధికారాలు, బాధ్యతలను గురించి తెలుసుకుంది. మేం అన్నీ చేశామంటూ ఇప్పుడు తనే సొంతంగా సర్టిఫికెట్ ఇచ్చుకుంటోంది' అంటూ ఎస్ఎల్ఏ ఇచ్చిన వివరణపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'కావాలనుకుంటే క్షణాల్లో పనులు చేస్తారు. లేదంటే ఏళ్లకు ఏళ్లు దొర్లిస్తుంటారు.. అని అర్థమవుతోంది' అని వ్యాఖ్యానించింది. సానుభూతి కావాలంటే కనీసం తమ వద్ద జరిగిన విషయాలను వెల్లడించి నిజాయతీతో ఉండాలని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆరేళ్లపాటు ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోవడానికి కారణం ఏం చెబుతారు? అంటూ సూటిగా ప్రశ్నించింది. దివ్యా ఫార్మసీ, పతంజలి ఆయుర్వేద సంస్థకు చెందిన 15 ఉత్పత్తుల లైసెన్సులను రద్దు చేస్తూ ఏప్రిల్ 15వ తేదీన ఆదేశాలిచ్చామంటూ ఎస్ఎల్ఏ వేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం పైవిధంగా స్పందించింది. అయితే, ఎస్ఎల్ఏ తీసుకున్న చర్యలు చట్ట ప్రకారంగానే ఉన్నాయా అంటూ అనుమానం వ్యక్తం చేసింది. తాజాగా మరో అఫిడవిట్ దాఖలు చేసేందుకు ఎస్ఎల్ఏకి పది రోజుల గడువిచ్చింది.

క్షమాపణ ప్రకటనపై సంతృప్తి

బేషరతుగా క్షమాపణలు చెబుతూ యోగా గురువు రాందేవ్, బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద సంస్థ వార్తా పత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో మెరుగైన పురోగతి కనిపించిందటూ ధర్మాసనం ప్రశంసించింది. ప్రత్యక్ష హాజరు నుంచి రాందేవ్, బాలకృష్ణలకు మినహాయింపు ఇవ్వాలన్న వినతిపై ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. మే 7వ తేదీన జరిగే విచారణకు మాత్రం వారిద్దరూ రావాల్సిన అవసరం లేదని తెలిపింది.

ఐఎంఏ అధ్యక్షుడిపై ఆగ్రహం

పతంజలి తరఫున హాజరైన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ వాదనల సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. 'మేం మంచి పనులు చేశాము. మా వైద్యులు కూడా చనిపోయారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు మా వైపు వేలెత్తి చూపడం దురదృష్టకరం' అని సోమవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అశోకన్ వ్యాఖ్యానించడం తనకు ఆందోళన కలిగించిందన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ..అదే నిజమైతే, ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన వాటికంటే కూడా చాలా తీవ్రమైన అంశమిది. మరింత తీవ్ర పరిణామాలకు సిద్ధమై ఉండండి' అంటూ ఐఎంఏ ప్రెసిడెంట్ అశోకన్‌ను హెచ్చరించింది.

ఎలక్షన్ బీట్

తొలిదశ 66.14% ; రెండోదశ 66.71%

ఎట్టకేలకు పోలింగ్ శాతాలను ప్రకటించిన ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ముగిసిన 11 రోజులకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ శాతాన్ని అధికారికంగా మంగళవారం ప్రకటించింది. ఏప్రిల్ 19న తొలి దశకు జరిగిన ఎన్నికల్లో 66.14 శాతం పోలింగ్ నమోదుకాగా, ఏప్రిల్ 26న రెండో దశకు జరిగిన ఎన్నికల్లో 66.71 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో తొలి దశలో 69.43 శాతం, రెండో దశలో 69.64 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి తొలి దశలో 101 స్థానాలకు, రెండో దశలో 88 స్థానాలకు పోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

తొలిసారిగా బరిలో మాజీ మంత్రి ఆనంద్ శర్మ

న్యూఢిల్లీ: కేంద్రమంత్రులుగా పనిచేసిన రాజ్యసభ సభ్యులను బీజేపీ ఈసారి లోక్‌సభ బరిలో దింపినట్లే కాంగ్రెస్ సైతం సీనియర్ నేత ఆనంద్ శర్మను లోక్‌సభలో పోటీకి నిలుపుతోంది. కేంద్ర మాజీ మంత్రి అయిన ఆనంద్ శర్మను హిమాచల్‌లోని కంగ్రా నుంచి కాంగ్రెస్ బరిలో నిలిపింది. లోక్‌సభకు శర్మ పోటీచేయడం ఇదే తొలిసారి. 1984 ఏప్రిల్‌లో తొలిసారిగా ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత నాలుగుసార్లు ఆయన ఎగువసభకే ఎన్నికయ్యారు.

యూపీలో రాహుల్, ప్రియాంక పోటీ లేనట్లే!

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో సోనియా గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా భావించే అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాల నుంచి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోటీ చేయడంలేదని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి వరుసగా రెండోసారి పోటీకి దిగిన సంగతి తెలిసిందే. అక్కడ పోలింగ్ సైతం ముగిసింది. ఆయన అమేథీ లోనూ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అమేథీ నుంచి రాహుల్‌ను, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంకను బరిలోకి దింపాలని కాంగ్రెస్ నేతలు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని రాహుల్ చెప్పారు. కానీ, అమేథీ నుంచి పోటీకి దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రియాంక సైతం పోటీకి విముఖత చూపుతున్నారు.

బీజేపీ గెలుపు కోసం హోమాలు

వాషింగ్టన్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ విజయాన్ని కాంక్షిస్తూ అమెరికాలోని పలు నగరాల్లో బీజేపీ మద్దతుదారులు యాగాలు చేపట్టారు. న్యూజెర్సీ, న్యూయార్క్, వర్జీనియా, మేరీలాండ్, షికాగోల్లో ఆదివారం యాగాలు నిర్వహించినట్లు ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ-యూఎస్ఏ ఒక ప్రకటనలో తెలిపింది. షికాగో శివారులోని ఆలయంలో జరిపిన పవిత్ర చండీ యాగం, వర్జీనియాలోని శ్రీ వెంకటేశ్వర లోటస్ ఆలయంలో జరిగిన గణపతి హోమంలో భారత సంతతికి చెందిన నిపుణులు, వాణిజ్యవేత్తలు, నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఎక్కువ సంతానం' నిందలెందుకు: ఖర్గే

చంపా(ఛత్తీస్‌గఢ్): ఆర్థిక పరిస్థితుల కారణంగా పేదలకే ఎక్కువ మంది సంతానాన్ని కలిగి ఉంటున్నారు, అలాంటప్పుడు ముస్లింలే లక్ష్యంగా ఎందుకు విమర్శలు చేసుకుంటున్నారంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ముస్లింలు కూడా ఈ దేశ ప్రజలేనని చెప్పారు. ప్రతిపక్ష ఇండియా కూటమి మెజారిటీ సీట్లు సాధించనుందని గ్రహించిన మోదీ..మంగళసూత్రాలు, ముస్లింల గురించి మాట్లాడు తున్నారంటూ దుయ్యబట్టారు. బీజేపీకి 400పైగా సీట్లు రావడం పేదల సంక్షేమానికి మంచిది కాదని, వారి నుంచి హక్కులను లాగేసుకుంటుందని ఖర్గే ఆరోపించారు.

కాంగ్రెస్ 'ఓట్ జీహాద్' వ్యాఖ్యలు

ఫరూఖాబాద్: జీహాద్‌కే ఓటేయాలంటూ కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ బంధువు మరియా ఆలం ఓటర్లను కోరడం వివాదాస్పదంగా మారింది. సోమవారం యూపీలోని ఫరూఖాబాద్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో వీరిద్దరూ పాల్గొని ఇండియా కూటమి తరఫున ప్రచారం చేశారు. జీహాద్‌కే ఓటేయాలని, బీజేపీని ఓడించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో మైనారిటీలకు ఓట్ జీహాద్ అవసరమని ఆలం పేర్కొన్నారు. నిఘా బృందాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మరియా ఆలంతోపాటు వేదికపై ఉన్న సల్మాన్ ఖుర్షీద్‌పై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

ఆగని పాలస్తీనా అనుకూల ఆందోళనలు

న్యూయార్క్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో మొదలైన ఆందోళనలు మరింత విస్తరిస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజామున న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలోని హామిల్టన్ హాల్ భవంతిని విద్యార్థి నిరసనకారులు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. భవంతిలోకి ఎవరూ రాకుండా బ్యారికేడ్లు అడ్డుపెట్టి కిటికీల్లో పాలస్తీనా జెండాలను ఎగరేశారు. టెక్సాస్, ఉతా, వర్జీనియా, న్యూజెర్సీల్లోని వర్సిటీల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. చర్చలు, సంప్రతింపులు విఫలమై చివరకు పోలీసులు కలగజేసుకుని చాలా మంది విద్యార్థులను అరెస్ట్‌చేస్తున్న దృశ్యాలే అంతటా కనిపిస్తున్నాయి. నిరసనకు దిగిన విద్యార్థుల సస్పెన్షన్ ప్రక్రియ మొదలైందని కొలంబియా వర్సిటీ తెలిపింది. సోమవారం ఆస్టిన్‌లోని టెక్సాస్ వర్సిటీలో మరో 40 మందిని అరెస్ట్‌చేశారు.



జ్యోతిసురేఖకు ఘనస్వాగతం

గన్నవరం: ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో మూడు బంగారు పతకాలు సాధించిన వి.జ్యోతిసురేఖకు విమానాశ్రయంలో మంగళవారం డెప్యూటీ కలెక్టర్ల సంఘ సభ్యులు స్వాగతం పలికారు.



దీపక్ మిశ్రాను కలిసిన సీపీ

విజయవాడస్పోర్ట్స్: ఈసీఐ నియమించిన స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రాను పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	27	42.1
జగ్గయ్యపేట	26	43
మచిలీపట్నం	29	37
గుడివాడ	29	41

న్యూస్‌రీల్

సజావుగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల విభాగం అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ముందస్తుగా ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్) సజావుగా పంపిణీ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధి, బందర్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో సంపత్ కుమార్‌కు బీఎల్ఓ మంగళవారం వీఐఎస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల విభాగం అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఇంటింటికీ వీఐఎస్‌లను పంపిణీ చేస్తున్నారని వివరించారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.91 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.1.91 కోట్ల నగదును కానుకలు, ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 15 రోజులకు రూ.1,91,27,261 నగదు, 370 గ్రాముల బంగారం, 3.850 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. యూఎస్ఏ డాలర్లు 516, ఓమన్ బైసాలు 100, 20 యూకే పౌండ్లు, 40 ఇంగ్లాండ్ పౌండ్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, 15 కెనడా డాలర్లు, 1000 కొరియాకు చెందిన వాన్‌లు హుండీల ద్వారా సమకూరాయని పేర్కొన్నారు. ఇక దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ-హుండీ ద్వారా రూ.44,831 సమర్పించారు. కానుకల లెక్కింపును దేవదాయ శాఖ అధికారులు, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ నృత్య ప్రదర్శనతో దుర్గమ్మకు మంగళవారం నీరాజనాలను అర్పించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై జార్ఖండ్‌కు చెందిన తరిత్ సర్కార్ కథక్ నృత్యం, వెస్ట్ బెంగాల్‌కు చెందిన హేమంత్ విశ్వకర్మ బృందం మణిపురి నృత్యం ప్రదర్శించింది. ఇతర రాష్ట్రాల కళాకారులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి నృత్య ప్రదర్శన ఇవ్వడం భక్తులకు మరుపురాని అనుభూతిని అందించింది. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

నేను లేక.. మీరుండలేరు..!

సొంత ఆస్పత్రి ఏర్పాటు కల సాకారమైందని సంతోషించేలోపే ఆ డాక్టర్‌ను ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆస్పత్రి విషయంలో నమ్మిన స్నేహితులు మోసం చేయడంతో మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తాను లేకపోతే తల్లి, భార్య, పిల్లలు అనాథలుగా మారతారని భయపడ్డాడు. భార్యాపిల్లలపై అతను పెంచుకున్న ప్రేమే వారి పాలిట శాపంగా మారింది. తాను ఆత్మహత్య చేసుకునే ముందు ఆ నలుగురి ప్రాణాలు తీశాడు. ఈ విషాద ఘటన విజయవాడ గురునానక్ నగర్‌లో మంగళవారం జరిగింది.

- స్నేహితుల మోసం, ఆర్థిక ఇబ్బందులతో వైద్యుడి ఆత్మహత్య
- అనాథలవుతారన్న భయంతో తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను హతమార్చిన వైనం
- విజయవాడ గురునానక్ నగర్‌లో అలుముకున్న విషాదఛాయలు
- స్నేహితుల ద్రోహమే దారుణానికి కారణమన్న కుటుంబ సభ్యులు



భార్య ఉష, కుమారుడు శ్రీహాన్‌తో డాక్టర్ శ్రీనివాస్ (ఫైల్)



కుమార్తె శైలజ (ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను హతమార్చి ఆత్మహత్య చేసుకున్న ఆర్థోపెడిక్ సర్జన్ ధారావత్ శ్రీనివాస్(40) ఘటన విజయవాడ నగరంలో మంగళవారం సంచలనం రేకెత్తించింది. చిరకాల స్వప్నమైన ఆస్పత్రిని ప్రారంభించిన అనతికాలంలోనే దాన్ని వదులుకోవాల్సి రావడంతో మనస్తాపానికి గురైన అతను తాను అల్లారుముద్దుగా సాకుతున్న ఇద్దరు పిల్లలు, తనతో జీవితాన్ని పంచుకున్న భార్యను, తనను పెంచి పెద్ద చేసిన తల్లిని హతమార్చి, తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం విజయవాడ గురునానక్ నగర్‌లో జరిగింది. శ్రీనివాస్ అన్న దుర్గాప్రసాద్ పటమట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన విజయవాడ పోలీస్ కమిషనర్ రామకృష్ణ, డీసీపీ అదిరాజ్‌సింగ్ కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు..

విజయవాడ గురునానక్ నగర్‌లోని మారుతీ కో-ఆపరేటివ్ కాలనీలో ప్లాట్ నంబరు 53లోని భవనంలో నివసించే ధారావత్ శ్రీనివాస్ గుంటూరులో వైద్య విద్య అభ్యసించారు. అనంతరం విజయవాడలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ చేశారు. సొంత ఆస్పత్రి ప్రారంభించాలని కలలు కన్నారు. ఈ క్రమంలో తన సేవింగ్స్‌తోపాటు ఓ ప్రైవేటు బ్యాంక్ నుంచి లోను తీసుకుని ఇటీవల సూర్యారావుపేటలో శ్రీజ ఆర్థోపెడిక్ క్లినిక్ ప్రారంభించారు. ఆస్పత్రికి అవసరమైన పరికరాలను క్రమంగా సమకూర్చుకుంటున్నారు. పూర్తిస్థాయిలో యంత్రపరికరాలు ఏర్పాటు చేసేందుకు డాక్టర్ ధారావత్ శ్రీనివాస్ స్నేహితులైన నగరంలోని ఆస్పత్రుల్లో పనిచేసే ముగ్గురు వైద్యులు అప్పులు ఇచ్చారు. దీంతో అప్పులు రూ.3 కోట్లకు చేరాయి. బ్యాంకు రుణం, స్నేహితుల వద్ద చేసిన అప్పులతో ఆస్పత్రి నడుపుతున్నా అనుకున్నంత స్థాయిలో ఆదాయం రావడం లేదు. అదే సమయంలో తామిచ్చిన అప్పులు తీర్చాలని స్నేహితులు ఒత్తిడి చేశారు. అప్పు కింద ఆస్పత్రిలో 90 శాతం వాటాను వారు సొంతం చేసుకున్నారు. స్నేహితులు చేసిన మోసాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురయ్యాడు.

వారం క్రితమే దారుణానికి వ్యూహం

తన ఆర్థిక పరిస్థితులు రోజురోజుకు మరింతగా దిగజారడంతో తానే ప్రాణంగా జీవిస్తున్న తల్లి, భార్య, పిల్లలు అనాథలవుతారని డాక్టర్ శ్రీనివాస్ భావించారు. వారి ప్రాణాలు తీసి, ఆత్మహత్య చేసుకోవాలని భావించారు. ఏప్రిల్ 25వ తేదీన గురునానక్ నగర్‌లోని సూపర్ మార్కెట్‌కు వెళ్లి రెండు చాకులు కొన్నారు. మంగళవారం తెల్లవారుజామున నిద్రపోతున్న తల్లి రమణమ్మ (65), భార్య ఉషా (38), కూతురు శైలజ (11), శ్రీహాన్ (6) మెడపై కత్తితో గాట్లు పెట్టి హత్య చేశారు. ఉదయం 6.30 గంటల సమయంలో ఇంటిలో ఉన్న కొంత నగదు, నగలు, ఆస్తి తాలూకా డాక్యుమెంట్లను ఓ బ్యాగులో సర్ది దానిని కారులో పెట్టారు. అనంతరం ఎదురింటి గేటుకు ఉన్న డబ్బాలో తన అన్న దుర్గాప్రసాద్‌కు రాసిన లెటరు, తన కారు తాళం చెవిని అందులో వేశారు. ఆ సమయంలో ఆ ఇంటి యజమాని గుర్తించి డాక్టర్ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. వాటిని తన అన్నకు అప్పగించాలని చెప్పిన శ్రీనివాస్ తిరిగి తన ఇంటికి వచ్చి వరండాలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.



విలపిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ నాయక్ బంధువులు



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

తన వాట్సాప్‌కు వాయిస్ మెసేజ్

ఆత్మహత్య చేసుకునే ముందు డాక్టర్ శ్రీనివాస్ తన వాట్సాప్ నంబరుకు వాయిస్ మెసేజ్ పెట్టుకున్నారు. తన పరిస్థితికి తానే కారణమని, తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, ఆర్థిక పరమైన ఇబ్బందుల నుంచి బయటపడలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నారు. తాను లేకపోతే తన కుటుంబ సభ్యులు అనాథలు అవుతారన్న భయంతో వారిని కూడా హతమార్చుతున్నానని ఆ మెసేజ్‌లో వివరించారు. డాక్టర్ శ్రీనివాస్‌కు పిల్లలు శైలజ, శ్రీహాన్ అంటే ప్రాణం. ఆస్పత్రి నుంచి ఇంటికి రాగానే ఆటిజంతో బాధపడుతున్న కుమార్తె శైలజతో ఎక్కువసేపు గడిపేవారు. చుట్టుపక్కల వారితో ఎంతో స్నేహంగా ఉండేవారు.

స్నేహితుల మోసాన్ని జీర్ణించుకోలేక..!

ఆర్థోపెడిక్ సర్జన్‌గా విజయవంతంగా కొనసాగుతున్న శ్రీనివాస్‌కు సొంతగా ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నది కల. ఆ మేరకు సూర్యారావుపేటలో శ్రీజ ఆర్థోపెడిక్ క్లినిక్‌ను ప్రారంభించారు. దాని నిర్వహణ కోసం స్నేహితులు అప్పులు ఇచ్చారు. ఆ అప్పులు తీర్చాలని ఒత్తిడిచేసి చివరకు ఆస్పత్రిలో 90 శాతం వాటా రాయించుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోనే పనిచేయాలని శ్రీనివాస్‌ను ఒత్తిడిచేశారు. దీంతో మనస్తాపం చెంది శ్రీనివాస్ తల్లి, భార్య, పిల్లలను హత మార్చి ఆత్మహత్య చేసుకున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్ తండ్రి జమలయ్య నాయక్ విజయవాడ తూర్పు ఏసీపీగా పనిచేశారు. అతని అన్న నల్గొండ జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. శ్రీనివాస్ అత్తింటి వారు కూడా ఆర్థికంగా స్థితి మంతులే. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల మరణానికి తీర్చలేనంత అప్పులు కారణం కాదని, తన స్నేహితులే మానసిక క్షోభకు గురిచేశారని బంధువులు ఆరోపిస్తున్నారు.

క్లూస్ టీంతో ఆధారాల సేకరణ

డాక్టర్ శ్రీనివాస్ కుటుంబ సభ్యుల మరణాలపై విచారణ చేపట్టిన పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి. రామకృష్ణ డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించారు. స్నిఫర్ డాగ్ మంగళవారం ఉదయం శ్రీనివాస్ కదలికలను పసిగట్టింది. హత్య అనంతరం తను ఎదురింటికి వెళ్లటం, అక్కడి నుంచి కారు వద్దకు రావటం, మళ్లీ ఎదురింటి గేటు వద్దకు వెళ్లడాన్ని స్నిఫర్ డాగ్ గుర్తించింది. శ్రీనివాస్ హత్యకు వినియోగించిన చాకులు, దాని బిల్లు, సూపర్ మార్కెట్ సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు డాక్టర్ శ్రీనివాసే కుటుంబ సభ్యులను హత్యచేశాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఏసీపీ భాస్కరరావు, పటమట సీఐ మోహనరెడ్డి, మాచవరం సీఐ గుణరాము, పటమట, మాచవరం పోలీసులు కేసు దర్యాప్తులో పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీ సాధించాలి

- ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థులతో భేటీ



వైఎస్సార్ సీపీ నాయకులతో చర్చిస్తున్న ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ తరఫున మచిలీపట్నం పార్లమెంట్, అవనిగడ్డ శాసనసభ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, సింహాద్రి రమేష్‌బాబును అఖండ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అవనిగడ్డలో ఆయన ఇరువురు అభ్యర్థులతో పాటు స్థానిక నాయకులతో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో ఇద్దరు అభ్యర్థులు గెలుపొందేలా పనిచేయాలన్నారు. చేసిన పనులు చెప్పుకొని ఓట్లడిగే ధైర్యం వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. కూటములు ఎన్ని కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. అమలు కాని హామీలు ఇచ్చి 2014లో వలె మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ఎన్నికల ఫలితాల తర్వాత పవన్ కల్యాణ్, చంద్రబాబు నోర్లు మూతపడనున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రం ప్రారంభం

పెనమలూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వణుకూరు గ్రామంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. ఆయన వణుకూరు కాసాకాలనీ 157వ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయించి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాజు మాట్లాడుతూ మోడల్ పోలింగ్ కేంద్రంలో 1,146 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 538 మంది, మహిళలు 608 మంది ఉన్నారన్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో ఈ పోలింగ్ కేంద్రంలో 1010 మంది ఓటర్లు ఉండగా 902 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. 2024 ఎన్నికలకు సంబంధించి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవటానికి అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేట్రేగుతున్న పచ్చ సైన్యం

- ఎన్నికల ప్రచారంలో రెచ్చగొడుతున్న టీడీపీ శ్రేణులు
- రసాభాసగా మారుతున్న వసంత ఎన్నికల ప్రచారం
- 23 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసుల నమోదు



వెస్ట్ ఇబ్రహీంపట్నంలో షాదీఖానా స్థలం కబ్జా విషయంలో ముస్లింలపై దౌర్జన్యానికి దిగిన టీడీపీ నాయకులు(ఫైల్)

జి.కొండూరు: మైలవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ ఎన్నికల ప్రచారంలో టీడీపీ శ్రేణులు పేట్రేగుతున్నాయి. ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. వివాదాలు, దాడులకు దిగుతూ, రెచ్చగొడుతూ అలజడులు సృష్టిస్తున్నాయి. బైక్‌లు, ట్రాక్టర్లతో ప్రమాదకర విన్యాసాలు చేస్తూ, విచ్చలవిడిగా బాణసంచా కాలుస్తూ ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ప్రజల అభిమానాన్ని పొందుతూ సాగాల్సిన వసంత వెంకటకృష్ణప్రసాద్ ఎన్నికల ప్రచారం ఓటమి భయంతో బల ప్రదర్శన దిశగా చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తున్నాయి.

వరుస దాడులు

వసంత వెంకటకృష్ణప్రసాద్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి ఆ పార్టీలో వర్గ పోరు నెలకొంది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ నాయకులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల వెస్ట్ ఇబ్రహీంపట్నంలో షాదీఖానా స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తికి టీడీపీ కౌన్సిలర్ భర్త అండగా ఉంటున్నాడని స్థానిక ముస్లింలు వసంత వెంకటకృష్ణప్రసాద్ భార్య శిరీషను ఎన్నికల ప్రచారంలో నిలదీశారు. దీంతో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయి ముస్లింలపై దాడి చేశాయి. ఆ మరుసటి రోజే జి.కొండూరు మండలం గంగినేని గ్రామంలో వసంత వెంకట కృష్ణప్రసాద్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో పాటు ఆ పార్టీ జెండాను తగలబెట్టారు. సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నం మండల పరిధి కొటికలపూడిలో నిర్వహించిన వసంత ఎన్నికల ప్రచారంలో టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించి భారీ ఎత్తున బాణసంచా కాల్చడంతో ఆ పక్కనే ఉన్న ఇళ్లపై పడి పలువురికి గాయాలయ్యాయి.

23 మందిపై కేసుల నమోదు

వసంత వెంకటకృష్ణప్రసాద్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించి కోడ్ ఉల్లంఘన చర్యలకు పాల్పడ్డాయి. ఈ ఘటనలకు సంబంధించి నియోజకవర్గంలోని పలు పోలీసుస్టేషన్లలో 23 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడిలో సోమవారం రాత్రి జరిగిన బాణసంచా ఘటనలో వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో పాటు ఎనిమిది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేశారు. వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించినరోజు ఇబ్రహీంపట్నం రింగు సెంటర్లో టీడీపీ శ్రేణులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతూ బాణసంచా కాల్చిన ఘటనలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇటీవల మైలవరం మండలం మొర్సుమల్లిలో ఏర్పాటు చేసిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో బైక్‌లతో విన్యాసాలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ స్థానికులను ఇబ్బంది పెట్టిన ఘటనలో 11 మంది టీడీపీ కార్యకర్తలపై మైలవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇలా వరుస ఘటనలతో వసంత వెంకటకృష్ణప్రసాద్ చేస్తున్న ఎన్నికల ప్రచారంపై నియోజకవర్గ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



ప్రచార పర్వం

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని 25వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా చిరువ్యాపారితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు - విజయవాడ సెంట్రల్



విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తదితరులు

- విజయవాడ పశ్చిమ

నిడదవోలు- కొవ్వూరు మధ్య ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని నిడదవోలు-కొవ్వూరు రైల్వే లైన్‌లో ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేసినట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మండురూప్‌కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు-కొవ్వూరు స్టేషన్ల మధ్య 14.82 కిలోమీటర్ల మేర రూ.21.83 కోట్లతో తొమ్మిది నెలల్లో ఈ ఆటోమేటిక్ లాకింగ్ సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేసినట్లు వివరించారు. విజయవాడ – గన్నవరం, విజయవాడ – కృష్ణా కెనాల్ మధ్య కూడా ఈ సిస్టం ఏర్పాటు పనులు త్వరలోనే పూర్తవుతాయని పేర్కొన్నారు. గూడ్స్, ప్యాసింజర్ ట్రైన్ల రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రూట్లలో ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. దీని ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు మే 3వ తేదీ నుంచి వివిధ అంశాల్లో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, బాటిక్ ప్రింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్, ఐస్‌క్రీమ్ మేకింగ్, ఫ్యాషన్ జ్యువెలరీ, హోమ్ క్రాఫ్ట్ మేకింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న వారు విజయవాడ రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866-2470420 నంబరులో కాని సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

కడుపు నొప్పితో గుర్తు తెలియని యువకుని మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసుస్టేషన్ పరిధిలో కడుపు నొప్పితో మావిడాల ప్రవీణ్(37)అనే యువకుడు చనిపోయినట్టు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రవీణ్ సోమవారం సాయంత్రం కడుపులో నొప్పిగా ఉందని ప్రకాష్‌నగర్లో వీరన్న ఆసుపత్రికి వెళ్లాడు. వారు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో పంపగా అక్కడ చనిపోయాడు. ఆటోలో వెళ్లేటప్పుడు తాను లెనిన్ సెంటర్లో వంటమాస్టర్‌గా పనిచేస్తానని చెప్పినట్టు తెలిసింది. మృతుని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్లో సంప్రదించాలని కోరారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ

విజయవాడస్పోర్ట్స్: నిష్పక్షపాతంగా, చిత్తశుద్ధితో, కర్తవ్య దీక్షతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ పోలీస్ అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ లొకేషన్లు, పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసే బందోబస్తు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంసీసీ బృందాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశంలో చర్చించారు. బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి వసతి ఏర్పాట్లు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద, సెన్సిటివ్ ప్రదేశాల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో డీసీపీలు కె.శ్రీనివాసరావు, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఉదయరాణి, ఏడీసీపీలు కృష్ణమూర్తినాయుడు, టి.కనకరాజు, కె.శ్రీహరిబాబు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న పోలీస్ కమిషనర్ రామకృష్ణ

ప్రధానమైన సూచనలు

- ఎలాంటి ఆటంకం లేకుండా, భయం లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితులను కల్పించాలి.
- ఒకే ప్రాంతంలో, ఒకే సమయంలో వేర్వేరు పార్టీలు, వేర్వేరు అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించాలనుకుంటే రెండూ కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.
- ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టిబొమ్మలను తీసుకెళ్లడం, అలాంటివి తగులబెట్టడం నిషేధం. ఇలాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తపడాలి.
- పోలింగ్ సమయం ముగియడానికి 48 గంటల ముందు ప్రచారాలు ఆపివేయాలి.
- పోలింగ్ సమయం ముగియడానికి 48 గంటల ముందు అన్ని మద్యం షాపులను మూసివేసేటట్లు తగు చర్యలు తీసుకోవాలి.
- ఇతరుల ఆస్తులపై జెండాలు, బ్యానర్లు కట్టడం, నోటీసులు అతికించడం, నినాదాలు రాయడం వంటి చర్యలను నియంత్రించాలి.

అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎల్‌హెచ్ కళాశాల విద్యార్థులు

మైలవరం: అంతర్ విశ్వ విద్యాలయాల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు కృష్ణా యూనివర్సిటీ తరఫున మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు టి.ఎస్.విజయ్, కె.వెంకటేశ్వరరావు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఖర్కు రవి తెలిపారు. మైలవరం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మంగళవారం మాట్లాడుతూ మే 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు కేరళ రాష్ట్రం, కొట్టాయంలోని ఎంజీ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పీడీ మేజర్ మన్నే స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి విద్యార్థులను అభినందించారు.



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, పీడీ మేజర్ స్వామి

చెస్ ఫిడే రేటింగ్ టోర్నీ విజేతలు ఇమ్రాన్, షణ్ముఖచంద్ర



విజయవాడస్పోర్ట్స్: స్పార్క్ చెస్ అకాడమీ మొదటి అంతర్జాతీయ చెస్ ఓపెన్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్ విన్నర్‌గా ఎండీ ఇమ్రాన్(ఏపీ), రన్నర్‌గా శ్రీషణ్ముఖచంద్ర(తెలంగాణ) నిలిచారు. కానూరులోని షామ్‌రాక్ స్కూల్‌లో ఈ నెల 25వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఆరు రోజుల పాటు పది రౌండ్లలో జరిగిన ఈ పోటీలలో మొత్తం 405 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విన్నర్‌కు రూ.70 వేలు, రన్నర్‌కు రూ.40 వేలు నగదు బహుమతిని అందజేసినట్లు నిర్వాహకులు తాళ్ల నరేష్ తెలిపారు. టాప్-25 ర్యాంక్‌లు సాధించిన క్రీడాకారులకు కూడా నగదు బహుమతి అందజేశామన్నారు. టాప్-10లో శ్రీచరణ్(తెలంగాణ), విహాన్‌కార్తికేయ(తెలంగాణ), జె.మల్లేశ్వర్(ఏపీ), సాయిసంతోష్(ఏపీ), భావన్(ఏపీ), అఫ్రీద్(ఏపీ), రామకృష్ణ(యూనియన్ బ్యాంక్), ధనుష్(ఏపీ) చోటు దక్కించుకున్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏపీ చెస్ సంఘం కార్యదర్శి భీమారావు, సహాయ కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, కల్యాణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ భారతి, కృష్ణాజిల్లా చెస్ సంఘం కార్యదర్శి ఫణికుమార్ విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు అందజేశారు.

సజావుగా బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్

- నియోజకవర్గానికి అదనంగా 321 బ్యాలెట్ యూనిట్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను లోపాలు లేకుండా, సజావుగా నిర్వహించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్‌ల తొలిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఇప్పటికే నిర్వహించామన్నారు. సెంట్రల్ నియోజక వర్గంలో 20 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఒక బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది అభ్యర్థులు, ఒక నోటా బటన్‌కు మాత్రమే వీలుంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఈ నియోజక వర్గానికి రెండో బ్యాలెట్ యూనిట్ అవసరమైనట్లు తెలిపారు. అదనంగా 321 బ్యాలెట్ యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. వీటికి సంబంధించి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాము వద్ద బీయూల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు

● ఓటు హక్కు.. వినియోగించుకోవడం మన విధి



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు తిరువూరులో వినూత్న కార్యక్రమం చేపట్టారు. తిరువూరు ఆర్డీఓ కె.మాధవి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో స్వీప్ నేతృత్వంలో అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, వెలుగు, మెప్మా సిబ్బంది "ఓటు మన హక్కు.. ఓటు వేద్దాం..మే 13..69 తిరువూరు" అక్షరాల కూర్పులా కూర్చున్నారు.

–తిరువూరు

యువతకు ఉత్తేజం శ్రీశ్రీ కవిత్వం

- వేడుకగా మహాకవి 114 జయంతి
- 10 గ్రంథాల ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: తన కవిత్వంతో యువతకు ఉత్తేజాన్నిచ్చిన వ్యక్తి మహాకవి శ్రీశ్రీ అని శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంపల్లి అశోక్ కుమార్ అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం శ్రీశ్రీ 114వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సాహిత్యానికి సంబంధించిన 10 గ్రంథాలను ఆవిష్కరించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ తన కవిత్వం ద్వారా సమాజంలోని అసమానతలను వెలికితీసినట్లు తెలిపారు. శ్రీశ్రీ సాహిత్య నిధి ద్వారా శ్రీశ్రీ సాహిత్యం ప్రచురిస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ జనజీవన చైతన్యం శ్రీశ్రీ కవిత్వం అని అభివర్ణించారు. కార్యక్రమంలో ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, గోళ్ళ నారాయణరావు, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, సాహిత్య సేవా సంస్థల ప్రతినిధులు అరుణ్ కుమార్, దివి కుమార్, బండ్ల మాధవరావు, మోహన్ రాంప్రసాద్, చెరుకూరి సత్యనారాయణ, యువ కవులు చలపాక ప్రకాష్, పాణిగ్రాహి రాజశేఖర్, సీనియర్ జర్నలిస్ట్ వడ్ల మూడి పద్మ తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీ రచించిన వందేమాతరం ఆంగ్లీ కవనం, స్త్రీ వ్యాసక్రీడలు, స్వశేఖరం, మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు, కథాకేళి, శ్రీశ్రీ షష్టిపూర్తి ప్రత్యేక సంచిక, అరుణతార ప్రత్యేక సంచిక, రెడ్ స్టార్ ఓవర్ శ్రీశ్రీ, అవంత్స సోమసుందర్ రచించిన శరత్చంద్రిక, చెరుకూరి సత్యనారాయణ రచించిన పామర ప్రస్థానం గ్రంథాలను అతిథులు ఆవిష్కరించారు.



శ్రీశ్రీ సాహిత్యం ఆవిష్కరణ సభలో అరసవిల్లి కృష్ణ, ఎక్స్‌రే కొల్లూరి, ఆంజనేయరాజు, సింగంపల్లి

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్యాధికారి గీతాబాయి

పెనమలూరు: చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. ఆమె కానూరులో టాప్‌స్టార్ ఆస్పత్రి, పామర్రులో శృతి ఆస్పత్రి, కూచిపూడి సిలికాన్ ఆస్పత్రిలలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆస్పత్రుల నిర్వహణ, అల్ట్రా సౌండ్ పరీక్ష కేంద్రాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గీతాబాయి మాట్లాడుతూ గర్భధారణ పూర్వము, గర్భస్థ పిండ ప్రక్రియ, లింగ ఎంపిక నిషేధచట్టం 1994 ప్రకారం జన్యు సంబంధిత సలహా కేంద్రాలు, ప్రయోగశాలలు, అల్ట్రాసౌండ్ పరీక్ష కేంద్రాలు, ఇమేజింగ్ కేంద్రాలు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని నమోదు చేయాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు కేంద్రాలు తిరిగి రెన్యువల్ చేయాలని తెలిపారు. ఆయా కేంద్రాలలో పనిచేసే సిబ్బంది తగిన విద్యార్హతలు ఉండాలని సూచించారు. నాణ్యమైన పరికరాలు, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర కమిషన్ ఆదేశాల మేరకు ఆస్పత్రులకు ఫైర్ సేఫ్టీ సంబంధిత పరికరాలు ఏ విధంగా పని చేస్తున్నాయో ఆమె తనిఖీ చేశారు. ముఖ్యంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ఫైర్ ఎన్‌వోసీ సర్టిఫికెట్ అందుబాటులో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా ఆస్పత్రులు, పరీక్ష కేంద్రాలలో చట్ట వ్యతిరేకంగా పని చేస్తున్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి గీతాబాయి హెచ్చరించారు.



కానూరు టాప్‌స్టార్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

ముదిరాజులను గుర్తించిన వారికే మద్దతు

ఏబీకేఎంఎం జాతీయ యువత అధ్యక్షుడు మహేందర్ కేసరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది జనాభాగల ముదిరాజ్ సామాజిక వర్గాన్ని గుర్తించిన రాజకీయ పార్టీకి మద్దతుగా నిలుస్తామని అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ మహాసభ (ఏబీకేఎంఎం) జాతీయ యువత అధ్యక్షుడు మహేందర్ కేసరి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందే తెనుగు (ముదిరాజు) సామాజిక వర్గం వలన అని తెలిపారు. అటువంటి రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం తగిన గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది జనాభాలో 20 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, అయితే సోషల్ మీడియాలో కేవలం 1,83,000 మంది మాత్రమే ఉన్నట్లు పెట్టిన ఫేక్ న్యూస్ ట్రోల్ అవుతుండటంతో తమ సామాజిక వర్గం అయోమయానికి గురవుతున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో ముదిరాజుల ఓట్లు కీలకంగా మారనున్న నేపథ్యంలో తమను గుర్తించి ఆదరించిన పార్టీ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని మహేందర్ కేసరి చెప్పారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్న నారాయణ మాట్లాడుతూ కులగణనలో భాగంగా కచ్చితమైన ముదిరాజుల జనాభా సంఖ్య తేల్చాలని లేదా మహాసభ తరఫున తామే సర్వే చేసి ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో ఏబీకేఎంఎం ప్రధాన కార్యదర్శి బోనం వెంకటయ్య, స్టేట్ పొలిట్ బ్యూరో సభ్యుడు శిరిబోయిన శివాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.సాంబశివరావు, పి.బాలు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివాజీ (క్రేన్), పిట్టల అల్లూరయ్య, ఒంద్రు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్, వేదికపై నారాయణ తదితరులు

కొటికలపూడి ర్యాలీ ఘటనలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంతపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడిలో సోమవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి మైలవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో పాటు మరో 8 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొటికలపూడి గ్రామంలో సోమవారం రాత్రి వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎన్నికల ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు బాణసంచా కాల్చారు. బాణసంచా నిప్పురవ్వలు సమీపంలో ఉన్న ఆర్సీఎం చర్చి కూడలి వద్ద కూర్చున్న రెంటపల్లి జోజప్ప, బండి రాఘవలపై పడి వారిద్దరూ గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ వసంత కృష్ణప్రసాద్‌తో పాటు టీడీపీ నాయకులు నాయుడు సాంబయ్య, జొన్నలగడ్డ కృష్ణ, రెంటపల్లి నాగరాజు, రెంటపల్లి గోపి, కొమ్మూరి సత్యన్నారాయణ, అర్వా బాలాజీ, నంబూరు నాగమల్లేశ్వరరావు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

వడ్డీతో నష్టపరిహారం చెల్లింపునకు ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీతో సహా నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు శ్రీలక్ష్మీ రాయల మంగళవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నంకు చెందిన కేవీ రాఘవయ్య అహ్మదాబాద్‌లోని నెమరిట్ ఇంజినీరింగ్ కంపెనీకి చెందిన మిక్సర్ అండ్ షిఫ్టర్ మిషన్‌కు రూ.46 వేలను 2023 ఫిబ్రవరి 6వ తేదీన యూపీఐ ద్వారా చెల్లించి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. వారం రోజుల్లో మిషన్ డెలివరీ చేస్తామని చెప్పారు. ఎన్ని నెలలు గడిచినా మిషన్ డెలివరీ కాలేదు. ఫోన్ చేసినా స్పందించకపోవటంతో రాఘవయ్య వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు వినియోగదారుడు రాఘవయ్యకు రూ.46 వేలు 9 శాతం వడ్డీతో సహా చెల్లించాలని రూ.10 వేలు మానసిక వేదనకు, రూ.5 వేలు ఖర్చుల నిమిత్తం 30 రోజుల్లో నెమరిట్ ఇంజినీరింగ్ కంపెనీ వారు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరు కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక ఫైర్‌స్టేషన్ వద్ద రాఘవయ్య పార్కు వంతెన సమీపంలో బందరు కాలువ ఒడ్డున నీటిలో ఒక మృతదేహం తేలియాడుతున్నట్లు మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కాలువ నుంచి వెలికితీశారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మృతుని వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జైలు వార్డర్ ఆత్మహత్య

అవనిగడ్డ: కృష్ణాజిల్లా అవనిగడ్డ సబ్ జైలు వార్డర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్‌ఐ రమేష్ అందించిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంకు చెందిన దాసరి నాగ శివ కుమార్ (37) స్థానిక సబ్ జైలులో 2020 నుంచి వార్డర్‌గా పని చేస్తున్నారు. అవనిగడ్డలో తాను నివాసం ఉంటున్న ఇంట్లోనే మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రమేష్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలికి వచ్చి నాగ శివకుమార్‌ని కిందకు దింపి చూడగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఘటనా స్థలిలో నాగశివకుమార్ మృతదేహం, పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమేష్, పోలీసు సిబ్బంది

నాచుగుంటలో వివాహిత ఆత్మహత్య



నాగాయలంక: మండలంలోని నాచుగుంట గ్రామంలో వివాహిత సైకం వాణి(36) తన గృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. మృతురాలి సోదరుడు చెన్ను వెంకటేశ్వరరావు(పెనుమూడి)ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాచుగుంటకు చెందిన సైకం జయరాజుతో సమీపంలోని తులబెట్లదిబ్బ గ్రామానికి చెందిన వాణికి 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.40 వేలు పసుపు కుంకుమ కింద ఇచ్చారు. వారికి ఇద్దరు పిల్లలు. వారి కాపురం చాలాకాలం సజావుగానే సాగింది. కొంత కాలం క్రితం వాణికి, ఆమె మామ నాగమల్లేశ్వరరావుకు మధ్య గొడవలు తలెత్తాయి. కోడలిపై లేనిపోని మాటలతో అనుమానం కలిగించేలాగా ఆమె భర్త జయరాజుకు చెపుతుండటంతో జయరాజు భార్య వాణిని తరచు మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. ఈ విషయం ఆమె తన కుటుంబ సభ్యులతో చెప్పుకుని వాపోగా, తాము వచ్చి మాట్లాడతామని చెప్పారు. ఈలోగా ఆమె చినమామ సుబ్బారావు నాగాయలంక సెంటర్‌లో హేళనగా మాట్లాడి అల్లరి చేయడం, అత్త మేరీ, మామ నాగమల్లేశ్వరరావు కోడలిని నువ్వు ఎందుకు బతికి ఉండటం ఆత్మహత్య చేసుకుని చావచ్చుగా అంటూ సూటిపోటి మాటలతో వేధించడంతో సోమవారం ఆమె ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించింది. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పంచనామా అనంతరం మంగళవారం మృతదేహానికి అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు.

అభివృద్ధి విఘాతకులు !

- గతంలో ఆపిన రోడ్డు వేస్తుంటే గద్దె అనురాధ ఓవరాక్షన్
- గుణదల చిన రైస్ మిల్ రోడ్డుకు జనవరిలోనే శంకుస్థాపన
- వర్క్ ఆర్డర్ తీసుకుని పనులు కూడా అప్పుడే ప్రారంభం
- ఇప్పుడు వెళ్లి రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న అనురాధ
- వాళ్లు అభివృద్ధి చేయరు.. చేసే వారిని చేయనివ్వరు అంటున్న ప్రజలు



జనవరిలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవళ్లిక, పక్కన దేవినేని అవినాష్, బెల్లం దుర్గ, ఇతర నాయకులు (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు):అభివృద్ధి చేయడం వారికి చేతకాదు. చేసే వారిని కూడా చేయనివ్వరు. అదే గద్దె రామ్మోహన్, ఆయన భార్య అనురాధ నైజం. పదేళ్లు తూర్పు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నా చేసిందేమి లేదు. చెప్పుకోవడానికి ఒక అభివృద్ధి పనికూడా లేదు. కానీ పనిచేసే వారిపై ఆరోపణలు చేయడం , అడ్డుకోవడం చేస్తూ నియోజకవర్గంలో గద్దె రామ్మోహన్, అనురాధ అభివృద్ధి విఘాతకులుగా మిగిలి పోతున్నారని తూర్పు ప్రజలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

జనవరిలోనే శంకుస్థాపన....

గుణదల చిన రైస్‌మిల్ రోడ్డు వేసేందుకు నగర పాలక సంస్థ రూ.49 లక్షలు మంజూరు చేసింది. అన్ని అనుమతులు రావడంతో జనవరిలోనే కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవళ్లిక శంకుస్థాపన చేశారు. ఆ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పాల్గొన్నారు. అప్పుడే పనులు ప్రారంభించినా, కాంట్రాక్టర్ ఆర్థిక వెసులు బాటు లేక నగంలో ఆపారు. దీంతో రెండు రోజుల కిందట రోడ్డును పూర్తి చేసేందుకు మెటీరియల్ తరలించి మంగళ వారం పనులు ప్రారంభించారు.

అనురాధ ఓవరాక్షన్....

రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో గద్దె రామ్మోహన్ భార్య అనురాధ అక్కడకు వచ్చి ఓవరాక్షన్ చేశారు. రోడ్డు వేస్తున్న కార్మికులను బెదిరించి పనులు ఆపు చేయించారు. రోడ్డు పనులను జనవరిలోనే ప్రారంభించామని, ఎన్నికల్ కోడ్‌తో తమకు సంబంధం లేదని కాంట్రాక్టర్ చెబుతున్నా వినకుండా తమ అనుచరులను వెంట తీసుకొచ్చి బెదిరింపులకు పాల్పడ్డారు. అంతేకాదు వివాదాస్పద వాతావరణం సృష్టించి గొడవ జరిగితే దానిని సానుభూతి కోసం వాడుకునే ప్రయత్నం చేశారు. ఆమె ఓవరాక్షన్ చూసి అక్కడి ప్రజలు చీదరించుకుంటున్నారు.

ఆమె నైజం అంతే..

ఎన్నికల సమయంలో సంబంధం లేని విషయాల్లో వివాదాలు సృష్టించడం, ఎదుటి వారిని రెచ్చగొట్టడం, ఏదైనా జరిగితే, దాడులు జరిగాయంటూ సానుభూతి ప్రచారం చేసుకోవడం ఆమె నైజమని ప్రజలు చెబుతున్నారు. ప్రతి ఎన్నికల్లో ఇదే రకంగా వ్యవహరిస్తుంటారని వారి తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా తూర్పు ప్రజలు గద్దె అనురాధ, రామ్మోహన్‌ల వంచన రాజకీయాలు తెలుసుకోవాలంటున్నారు.

ఎప్పుడో ప్రారంభించాం

గుణదల చిన రైసుమిల్లు రోడ్డు నిర్మాణ పనులను జనవరిలోనే ప్రారంభించారు. దానిని రూ.49 లక్షల అంచనాతో వేసేందుకు అప్పుడు కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ కూడా ఇవ్వడం జరిగింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి మధ్యలో నిలుపుదల చేశారు. ఇప్పుడు మళ్లీ వేస్తుంటే, గద్దె అనురాధ వచ్చి నిలుపుదల చేయడం దురదృష్టకరం. వీళ్లైతే ప్రజలకు మంచి చేయాలే కానీ, మంచి చేస్తున్న వారిని చేయకుండా అడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తగిన రీతిలో ఓటుతో సమాధానం చెబుతారు.

–భీమిశెట్టి ప్రవళ్లిక, మూడవ డివిజన్ కార్పొరేటర్

జగనన్నతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు



ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతున్న కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు):అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదేళ్లుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న సంక్షేమ రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి సీఎంగా అవకాశం ఇవ్వాలని 17, 22 డివిజన్ల కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, తాటిపర్తి కొండారెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం రాణిగారితోట, 17వ డివిజన్‌లోని పలు వీధుల్లో తంగిరాల రామిరెడ్డి, కృష్ణలంక, 22వ డివిజన్‌లోని బైరెడ్డి వారి వీధి, సతీష్‌కుమార్‌రోడ్డు, అన్నమ్మ తల్లి గుడి ఏరియా, దోబీఖానా ప్రాంతాల్లో తాటిపర్తి కొండారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటే వేయాలని అభ్యర్థించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు రామిరెడ్డి, కొండారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలన్నారు. వచ్చే నెల 13న జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే దేవినేని అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపే ప్రాంతాలివే..

లబ్బీపేట(విజయవాడతూర్పు):మొగల్రాజపురం సెక్షన్ లబ్బీపేట విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మత్తుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా లబ్బీపేట 11 కేవీ ఫీడర్ పరిధిలోని పిచ్చయ్యవీధి, మసీదువీధి, దుర్గారైస్‌మిల్ ఏరియా, పైడియ్య వీధి, టెంపుల్ స్ట్రీట్, లబ్బీపేట పశువుల ఆస్పత్రి రోడ్డు, ఎంజీరోడ్డులో కొంత ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

- ఆటోనగర్(విజయవాడతూర్పు):స్క్యూబ్రిడ్జి సెక్షన్‌లోని విద్యుత్ ఉపకేంద్రం,11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళీపురం, ఎంజీరోడ్డు బెంజిసర్కిల్ మైత్రేయవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిద్ధార్థలో ఘనంగా శ్రీశ్రీ జయంతి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఆధునిక భావజాలంతో కార్మికుల, కర్షకుల పక్షాన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) నిలిచి ఎన్నో సాహిత్య రచనలు చేశారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలు కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ కాదేదీ కవితకు అనర్హం అంటూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితను చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపకుడిగా ఆధునిక సాహిత్యాన్ని శ్రీశ్రీ ముందుకు నడిపారని కొనియాడారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ శ్రీశ్రీ చేసిన రచనలను నేటి తరం యువత చదవాలన్నారు. సిద్ధార్థ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ జీవిత విశేషాలను తెలియజేశారు. తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.సీరజ, డాక్టర్ ఎంవీ.రమణమూర్తి, జీ.శేషారత్నంతోపాటుగా విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీశ్రీ రచనల్లోని ముఖ్యమైన వాటిని అధ్యాపకులు చెప్పి విద్యార్థులను ఉత్తేజపరిచారు.

'స్ఫూర్తి'లో వేసవి శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షలు రాసి అలసిపోయిన విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండేందుకు అలాగే వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి మరింత పదును పెట్టేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని 'స్ఫూర్తి' క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాప్, డిజిటల్ పెయింటింగ్‌ల్లో నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు గాయత్రి నగర్, వాసిరెడ్డి శివరామకృష్ణయ్య వీధిలో ఉన్న తమ సంస్థలో నేరుగా కానీ 9849355339, 9390847433 నంబర్లలో కానీ సంప్రదించాలని కోరారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్:జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవ లందించి మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఆరుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసిన కె.వెంకటేశ్వరరావు (ఎస్ఐ), ఎండీగౌస్(ఎస్ఐ), ఎండీ షరీఫుల్లా (ఏఎస్ఐ), కె.బాబురావు (ఏఆర్ఎస్ఐ), ఎంవీ బాస్కర రావు (హెడ్ కానిస్టేబుల్), వి.వెంకటేశ్వరరావు (హెడ్ కానిస్టేబుల్)ను కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీసీపీ కె.శ్రీనివాసరావు, ఇన్ చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ టి.కనకరాజు, ఏవో రంగారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు సోమయ్య పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



అవినాష్‌ను ఆశీర్వదిస్తున్న మహిళలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను ఒక్కసారి ఎమ్మెల్యేగా దీవించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ కోరారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లోని తారకరామనగర్ కరకట్ట ప్రాంతంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హారతులతో ఆప్యాయంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అవినాష్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలు అందించి ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్లి ఓటు అడిగే అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. ఈ డివిజన్‌లో ఇప్పటికే 5 సార్లు ప్రతి గడపకు వెళ్లానని, ఇంటి ముంగిటకు వెళ్తుంటే సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉండాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి పని జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిందేనని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్కులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, కొండ ప్రాంతాల్లో మెట్లు, డ్రెయిన్లు, లైట్లు, సబ్‌స్టేషన్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే నన్నారు. రూ.2 వేల కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెప్పే గద్దె రామ్మోహన్ ఆ పనులు ఎక్కడ ఉన్నాయో మాకు చూపించాలని కోరారు. మేము చేసిన అభివృద్ధి చూపిస్తాం, మీరు చేసింది చూపించడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. గద్దె మోసాలన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నాయని, ఆయన ఓటమి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తాను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశానన్నారు. తనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మీలో ఒక్కడిగా, మీ బిడ్డగా అన్ని విధాలుగా మీకు అండగా నిలిచానన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే మీకు మరింత సేవ చేసుకునే అదృష్టం తనకు లభిస్తుందన్నారు. నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల మనస్సులు గెలుచుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రతి ఒక్కరూ నడిచి మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గద్దెను చీదరించుకుంటున్న ప్రజలు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక గద్దె రామ్మోహన్ నిత్యం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఆయన చేసే పనులను ప్రజలు చీదరించుకుంటున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. కృష్ణలంక, 21వ డివిజన్‌లోని ఆర్చ్ రోడ్డు, గుంటూరు వారి వీధి, పచ్చమేడ బజార్, వల్లూరి వారి వీధి, హైస్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించామన్నారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. డివిజన్ రూ.90 కోట్ల సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. ఎన్నో మంచి కార్యక్రమాలు చేశాం కాబట్టే దమ్ముగా, ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామని పేర్కొన్నారు. టీడీపీ నేతలు ఏమి చేశారో చెప్పుకోలేక దాక్కుని తిరుగుతున్నారని దుయ్యబట్టారు. గతంలో టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారని తెలిపారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో విడుదల చేసి అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. టీడీపీని ప్రజలు నమ్మడం లేదన్నారు. గద్దె రామ్మోహన్‌కు బాయ్ బాయ్ చెప్పేందుకు తూర్పు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుప్పాల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నడూ లేని విధంగా తూర్పులో అభివృద్ధి



కోగంటి వారి వీధిలో ప్రచారం చేస్తున్న దేవినేని సుధీర



ఎంజీ రోడ్డులో ప్రచారం చేస్తున్న కేశినేని హైమా

లబ్బీపేట(విజయవాడతూర్పు):ప్రజలకు మంచి చేసిన పాలకులు ఎవరో గుర్తించి ప్రజలు ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ కుమార్తె కేశినేని హైమా కోరారు. ఆమె మంగళవారం 8వ డివిజన్‌లోని పీ అండ్ టీ కాలనీ, ఎంజీ రోడ్డులో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లు పాటు కుల, మత, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా పాలన అందించిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతేకాక విజయవాడ పార్లమెంటు, తూర్పు అసెంబ్లీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరిగాయని తెలిపారు. అభివృద్ధి ఎవరు చేసారో గుర్తించి ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర కోరారు. ఆమె 9వ డివిజన్‌లోని సీతారామనగర్, కోగంటి వారి వీధి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. మంచి మనస్సున్న వారిని గెలిపించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, 9వ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల పట్టం

డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు):రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్‌లో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కృష్ణవేణిరోడ్డు, శివశంకర్‌రోడ్డుతో పాటు వీఎంఆర్ రోడ్డులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ డివిజన్‌లో సుమారు 8 పర్యాయాలు ఇంటింటికి తిరిగినట్లు చెప్పారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి గతంలో ఏప్రభుత్వం చేయలేదన్నారు. డ్రెయినేజీలు, రోడ్లు, కరకట్ట ప్రజలకు తాగు నీటి పైపులైన్‌తో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఈ డివిజన్‌ను దత్తత తీసుకున్న గద్దె రామమోహన్ ఒక్క నయా పైసా అభివృద్ధికి ఖర్చు చేయలేదని దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరలా మూడవ సారి మోసం చేయడానికి దొంగచాటుగా ప్రజలను కలిసేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానికులు మాత్రం వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరలా రెండవసారి అధికారంలోకి తీసుకొచ్చే విధంగా పట్టుదలతో ఉన్నారన్నారు. తూర్పు నియోజకవర్గ మ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)లకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు, వెంకటరెడ్డి, దశరధరామయ్య, రెహమాన్, నాగభూషణం, సత్యన్నారాయణ, అబ్బు, రాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

వేడుకగా సంగీత కళాశాల వార్షికోత్సవం



వీణపై సంప్రదాయ కీర్తనలు పలికిస్తున్న విద్యార్థినులు



దండమూడి సుమతీ రామ్మోనరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల వార్షికోత్సవం కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతం అభ్యాసం చేసిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థితిలో ఉన్నారని చెప్పారు. భరతనాట్యం అధ్యాపకురాలు భాగవతుల సౌమ్య భరతనాట్య బృందం సంప్రదాయంలోనూ, అజయకుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. వయోలిన్ అధ్యాపకురాలు కృష్ణవేణి బృందం వయోలిన్‌పై పలు అంశాలను ప్రదర్శించారు. గాత్ర విభాగానికి సంబంధించి, లక్ష్మీనరసమ్మ, మల్లాది కార్తీక త్రివేణి, శోభాలక్ష్మి బృందాలు శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుతూ పలు సంకీర్తనలు, దేశ భక్తి గీతాలు ఆలపించారు. వీణ అధ్యాపకురాలు మాధవి, మృదంగం అధ్యాపకులు ఫల్గుణ్, స్టీవెన్‌రాజు, తబలా అధ్యాపకుడు అమృత కుమార్ తన విద్యార్థులతో పలు అంశాలను ప్రదర్శించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత దండమూడి సుమతీ రామ్మోనరావును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త బాలాంత్రపు ప్రసూన, గోళ్ళ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):నగర పాలక సంస్థ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి బి.విజయ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. 47వ డివిజన్ పరిధిలోని సర్కిల్-1 కార్యాలయంలో మంగళవారం మొబైల్ కోర్ట్ జరిగింది. సర్కిల్- కార్యాలయం పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 25 కేసులపై ఆయన విచారణ జరిపి రూ.14,730 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేసి నగర పరిశుభ్రతకు తూట్లు పొడవద్దని సూచించారు. ముఖ్యంగా డ్రెయిన్లలో చెత్తాచెదారం పడేసి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించవద్దని కోరారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించేవారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఒకసారి జరిమానా విధించాక రెండో సారికూడా అదే తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్-1 డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలు ప్రశంసనీయం

సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి



సాయిబాబా దంపతులను సత్కరిస్తున్న కమిషనర్ విజయకుమార్‌రెడ్డి, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌర సంబంధాల శాఖలో ప్రచార సహాయకులు, దృశ్య శ్రవణ సూపర్‌వైజర్‌గా 33 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన అగం సాయిబాబా ప్రభుత్వ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన అగం సాయిబాబాకు ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలోని డీపీఆర్వో కార్యాలయంలో మంగళవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సభకు విజయ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సాయిబాబా దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. 33 ఏళ్ల పాటు కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం, విజయవాడలోని కార్యాలయాల్లో అలుపెరగని సేవలందించిన సాయిబాబా ప్రతిభను నేటితరం ఉద్యోగులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. దాదాపు 10 మందికి పైగా జిల్లా కలెక్టర్ల వద్ద పని చేసి.. ప్రతి ఒక్కరితో శభాష్ అనిపించుకున్నారని చెప్పారు. ఆయన సేవలను భవిష్యత్తులో సమాచార శాఖ వినియోగించుకుంటుందన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్‌కుమార్, టి.కస్తూరి, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ సీవీ కృష్ణారెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ బి.పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం.భాస్కర్ నారాయణ, జీవీ ప్రసాద్, డీపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకులు పీవీ ప్రసాద్, కమిషనర్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సహాయ సంచాలకులు, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు.

చంద్రబాబు మేనిఫెస్టో అంతా గారడీ

ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): తాము అధికారంలోకి వస్తే ఏవేవో చేస్తామంటూ చంద్రబాబు బూటకపు మాటలు చెపుతున్నాడని, వాటిని నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ అన్నారు. ఆయన సోమవారం విజయవాడ లబ్బీపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని హామీలైనా ఇస్తాడని, ఆ తర్వాత వాటన్నింటినీ తుంగలో తొక్కడం ఆయన నైజం అన్నారు. ఆయన 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశాడని, ఒక్కరికైనా సెంటు ఇంటి స్థలం ఇచ్చాడా అని ప్రశ్నించారు. ఇప్పుడు రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తానంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయన విడుదల చేసిన మ్యానిఫెస్టో అంతా గారడీ అని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, శ్రీలంకలాగా మారిపోతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అవే పథకాలు అమలు చేస్తానంటే ఎలా నమ్మగలం అన్నారు. ఒకవైపు వలంటీర్లను తొలగించి తమ కార్యకర్తలు చెప్పిన వారికే పథకాలు ఇస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ చెబుతుంటే, చంద్రబాబు మాత్రం గౌరవ వేతనం పెంచుతామంటున్నారని అంటే ఓట్లు కోసం ఆడే డ్రామా అని అర్థం అవుతుందన్నారు. ముస్లింలను మోసం చేసిన నయవంచకుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు.



చారిత్రక ప్రాంతం..
తూర్పు నియోజకవర్గం

1967లో ఏర్పాటు....

విజయవాడ తూర్పు నియోజకవర్గం 1967లో ఏర్పాటైంది. ఇక్కడి నుంచి ప్రథమ ఎమ్మెల్యేగా వీఎస్‌సీఆర్ తెన్నేటి (కాంగ్రెస్) గెలుపొందారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో 1972లో దమ్మాలపాటి రామారావు (కాంగ్రెస్), 1978లో నాదెండ్ల భాస్కరరావు (కాంగ్రెస్), 1983లో అడుసుమిల్లి జయప్రకాష్ (టీడీపీ), 1985లో వంగవీటి మోహనరంగా (కాంగ్రెస్), 1989, 94లో వంగవీటి రత్నకుమారి (కాంగ్రెస్) గెలుపొందారు. కాగా 1999లో సినీనటుడు కోట శ్రీనివాసరావు బీజేపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 2004లో వంగవీటి రాధాకృష్ణ (కాంగ్రెస్) గెలుపొందారు. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా 2009లో తూర్పు రూపాంతరం చెందింది. గతంలో ఉన్న తూర్పులోని కృష్ణలంక, లబ్బీపేట ప్రాంతాలతో పాటు, కంకిపాడు నియోజకవర్గంలోని పటమట, గుణదల ప్రాంతాలు కూడా చేరాయి. దీంతో 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్, పీఆర్‌పీ మధ్య ముక్కోణపు పోటీలో పీఆర్పీ అభ్యర్థి యలమంచిలి రవి 190 ఓట్లతో గెలుపొందారు. కాగా 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ గెలుపొందారు.

ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలిలా....

పథకం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం
వైఎస్సార్ పెన్షన్ కానుక	21536	రూ.375.47 కోట్లు
వైఎస్సార్ చేయూత	34661	రూ.64.99 కోట్లు
వైఎస్సార్ ఆసరా	30602	రూ.119.17 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ	3869	రూ.20.40 కోట్లు
వైఎస్సార్ బీమా	678	రూ.6.39 కోట్లు
జగనన్న తోడు	22443	రూ.22.44కోట్లు
జగనన్న చేదోడు	9639	రూ.9.64 కోట్లు
వైఎస్సార్ కళ్యాణ మస్తు	111	రూ.89.25 లక్షలు
అర్చకులు, ఇమామ్, పాస్టర్లకు	30	రూ.36 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	7651	రూ.11.48 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	4256	రూ.6.39 కోట్లు
వైఎస్సార్ లా నేస్తం	125	రూ. 1.50 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	5	రూ.1.20 లక్షలు
వైఎస్సార్ వాహనమిత్ర	7485	రూ.7.49 కోట్లు
జగనన్న అమ్మఒడి	20235	రూ.28.33 కోట్లు
జగనన్న విద్యాదీవెన	16294	రూ.27.09 కోట్లు
జగనన్న వసతి దీవెన	18430	రూ.17.85 కోట్లు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	114	రూ.11.40 లక్షలు
విద్యార్థులకు ట్యాబ్‌లు	2515	రూ.8.30 కోట్లు
ఇళ్ల స్థలాలు	32,211 మందికి	
రైస్ కార్డులు	57,359మందికి	

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి ఇలా...

- కృష్ణానది రిటైనింగ్‌వాల్ : రూ.360 కోట్లు
- బెంజిసర్కిల్ రెండో ఫ్లై ఓవర్ : రూ. 110 కోట్లు
- మూడు సబ్‌స్టేషన్లు : రూ. 21 కోట్లు
- మన బడి నాడు–నేడు : రూ.20 కోట్లు
- డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ, పార్కులు వంటి పనులు : రూ.140 కోట్లు


ప్రభావం చూపే కులాలు

కమ్మ
కాపు
ఎస్సీ

అనేక దేవాలయాలకు నెలవు
ప్రసిద్ధి చెందిన మొగల్రాజపురం గుహలు
దక్షిణ భారతదేశంలోనే రెండవ అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రం గుణదల మేరీమాత ఆలయం
దేశంలోనే మొట్టమొదటి వైద్య విశ్వ విద్యాలయం వంటివి అనేకం

ఆధ్యాత్మిక నిలయం విజయవాడ

విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. రాజకీయంగా ఎంతో మంది ప్రముఖులు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కేవలం రాజకీయాలే కాకుండా చరిత్రాత్మక ప్రదేశాలు సైతం ఈ నియోజకవర్గంలోనే ఉండటం విశేషం. దక్షిణ భారత దేశంలోనే రెండవ అతిపెద్ద పుణ్యక్షేత్రం గుణదల మాత ఆలయం, కంచి ఆధ్వర్యంలో ఉన్న లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, పటమటలో గణపతి సచ్చిదానంద ఆశ్రమం, బెంజిసర్కిల్ సమీపంలో షిరిడీసాయి ఆలయం ఎంతో ప్రాముఖ్యత పొందాయి. అంతేకాదు దేశంలోనే మొట్టమొదటి హెల్త్ యూనివర్సిటీ కూడా విజయవాడ తూర్పులోనే ఉంది. వెయ్యి పడకల ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల, మొగల్రాజపురం గుహలు ఇలా ఎన్నో ప్రాచుర్యం పొందిన ప్రాంతాలు ఉన్నాయి. అంతేకాదు బందరు రోడ్డులోని పశువుల ఆస్పత్రికి గుర్తింపు ఉంది.



ప్రధాన పార్టీ అభ్యర్థులు ఈస్ట్ నియోజకవర్గ మ్యాప్

వైఎస్సార్ సీపీ :
దేవినేని అవినాష్

టీడీపీ :
గద్దె రామ్మోహన్



లబ్బీపేట (విజయవాడ తూర్పు) : విజయవాడ అంటేనే గుర్తుకు వచ్చేది ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయం. విజయవాడకు పశ్చిమాన ఉన్నది పశ్చిమ నియోజకవర్గమైతే, తూర్పు దిక్కున విజయవాడ తూర్పు నియోజకవర్గం ఉంది. ఒకప్పుడు విజయవాడ అంతా ఒకే నియోజకవర్గంగా ఉండేది. నగర జనాభా పెరగడంతో 1967లో విజయవాడ పశ్చిమ, తూర్పుగా రెండు నియోజకవర్గాలు ఏర్పాటు చేశారు. క్రమేణా జనాభా పెరుగుతూ రావడంతో 2009లో విజయవాడ పశ్చిమ, తూర్పుతో పాటు సెంట్రల్ నియోజకవర్గం కూడా ఏర్పాటైంది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే అధికంగా ఉన్నారు. విద్యావంతులు, ఉన్నత వర్గాల వారు కూడా అధికమే. విజయవాడ బెంజిసర్కిల్ పేరు చెబితే రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారైనా గుర్తు పట్టగలరు. ఆ బెంజిసర్కిల్ తూర్పు నియోజకవర్గంలోనే ఉంది. అంతేకాదు దక్షిణ భారత దేశంలోనే రెండవ అతిపెద్ద పుణ్యక్షేత్రం గుణదల మాత ఆలయం, కంచి ఆధ్వర్యంలో ఉన్న లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, పటమటలో గణపతి సచ్చిదానంద ఆశ్రమం, బెంజిసర్కిల్ సమీపంలో శ్రీ షిరిడీసాయి ఆలయం ఎంతో ప్రాముఖ్యత పొందాయి. అంతేకాదు దేశంలోనే మొట్టమొదటి హెల్త్ యూనివర్సిటీ కూడా విజయవాడ తూర్పులోనే ఉంది. వెయ్యి పడకల ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల, మొగల్రాజపురం గుహలు ఇలా ఎన్నో ప్రాచుర్యం పొందిన ప్రాంతాలు ఉన్నాయి. అంతేకాదు బందరు రోడ్డులోని పశువుల ఆస్పత్రికి గుర్తింపు ఉంది.


గుణదల మేరీ మాత పుణ్యక్షేత్రం



మొగల్రాజపురం గుహలు

చరిత్రలో నిలిచేలా అభివృద్ధి పనులు....


విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 2019–24 మధ్య కాలంలో చరిత్రలో నిలిచేలా అభివృద్ధి పనులు జరిగాయి. ఎక్కడా లేని విధంగా ఈ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. కృష్ణానది వరద వస్తే ప్రజలు సామాన్లు సర్దుకుని పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాల్సిన దయనీయ పరిస్థితికి విముక్తి పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి సుమారు రూ.360 కోట్లు వెచ్చించి కృష్ణానదికి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. అంతేకాదు బెంజిసర్కిల్‌లో రెండు ఫ్లై ఓవర్లు, ప్రభుత్వాస్పత్రిలో రూ.150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్, రూ. 170 కోట్లతో ఆస్పత్రిలో నాడు–నేడు పనులు, మనబడి నాడు–నేడు వంటి వాటితో రూపురేఖలే మార్చేశారు.

వైద్యో నారాయణో హరీ..!


నాగేశ్వరరావును పరీక్షిస్తున్న డాక్టర్ సింహాద్రి

కోడూరు: 'వైద్యో నారాయణో హరీ' అనే పదానికి వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అక్షరాల సరిపోతారు. వైద్యుడు దేవుడితో సమానం అని ప్రజల నమ్మకాన్ని తన వృత్తి ద్వారా చాటిన చంద్రశేఖరరావు ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో తన మానవత్వాన్ని చాటుతున్నారు. మంగళవారం కోడూరు మండలంలోని మందపాకల గ్రామంలో చంద్రశేఖరరావు పర్యటించారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన కడవకొల్లు శ్రీనివాసరావు(చిన్నయ్య) తన తండ్రి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని చెప్పడంతో చంద్రశేఖరరావు వారి ఇంటికి వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి, రిపోర్టులను పరిశీలించారు. త్వరగా కోలుకుంటావని ధైర్యం చెప్పారు. ప్రముఖ అంకాలజీ వైద్యుడిగా పేరుగాంచిన చంద్రశేఖరరావు ఎన్నికల బరిలో నిలబడి కూడా ఈ విధంగా ప్రజలకు సేవలందించడంపై ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వంశీకి బీఎస్పీ అభ్యర్థి సింహాద్రి మద్దతు



గన్నవరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పూర్తి మద్దతుగా నిలుస్తున్న దళితుల ఓట్లను చీల్చేందుకు టీడీపీ చేసిన కుట్రలు భగ్నమయ్యాయి. వైఎస్సార్ సీపీకి నష్టం కలిగించేందుకు బీఎస్పీ అభ్యర్థిగా సింహాద్రి రాఘవేంద్రరావుతో టీడీపీ నామినేషన్ వేయించి పోటీలో దింపింది. చివరికి వీరి కుతంత్రాలను పసిగట్టిన ఆయన తన నామినేషన్ విత్‌డ్రా చేసుకుని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సింహాద్రి మీడియాతో మాట్లాడుతూ.. తన నామినేషన్ ఉపసంహరణకు ప్రధాన కారణం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బీఎస్పీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జ్‌తో పాటు కావు సంఘం నగర అధ్యక్షుడినైన తనకు రెండు నెలలుగా యార్లగడ్డతో పరిచయం ఉందన్నారు. బహుజనుల ఓట్లను చీల్చేందుకు తనను ఇక్కడి నుంచి బీఎస్పీ అభ్యర్థిగా యార్లగడ్డ పోటీకి దించినట్లు చెప్పారు. జనసేన పొత్తుతో పోటీ చేస్తున్నప్పటికీ ఆయన ఆఫీస్‌లో పవన్ ఫొటో లేకపోవడం, కనీసం జనసేన కండువా కప్పుకునేందుకు యార్లగడ్డ ఇష్టపడకపోవడం బాధించిందన్నారు. ముఖ్యంగా వంగవీటి రంగా మర్డర్ కేసులోని ముద్దాయిలు ఆయన వెంట తిరగడం గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయాలను యార్లగడ్డ వద్ద ప్రస్తావించగా రంగాను, పవన్‌కళ్యాణ్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. యార్లగడ్డను చిత్తుగా ఓడించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

- రియల్ రంగంలో దూకుడు
- ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవు
- జిల్లా రాజకీయాలకు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్



గగనతలంలో గన్నవరం

గన్నవరం విమానాశ్రయం

గన్నవరం: రాష్ట్రంలోనే రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గంగా గన్నవరానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య, ఉక్కుమనిషి కాకాని వెంకటరత్నం వంటి రాజకీయ ఉద్దండులు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. రెండో ప్రపంచ యుద్ధ అవసరాల నిమిత్తం బ్రిటీష్ పాలకులు గన్నవరం ప్రాంతంలో నిర్మించిన విమానాశ్రయం దినదినాభివృద్ధి చెంది ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా రూపుదిద్దుకుంది. పూర్వం తాలుకా కేంద్రంగా గన్నవరం విరజిల్లింది. ఒకప్పుడు వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం ప్రస్తుతం విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో గణనీయమైన వృద్ధి సాధిస్తుంది.

రాజకీయ పోరు

రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరం నియోజకవర్గ ఓటర్లు తీర్పు విభిన్నంగా ఉంటుంది. ఇక్కడ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, టీడీపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయం సాధించారు. 1955లో జరిగిన మొదటి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి పుచ్చలపల్లి సుందరయ్య కాంగ్రెస్ అభ్యర్థి వెలివెల సీతారామయ్యపై 821 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కూడా సీపీఐ అభ్యర్థి పుచ్చలపల్లి సుందరయ్య గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన వెలివెల సీతారామయ్య కొద్ది రోజులకే మరణించగా 1968లో జరిగిన ఉప ఎన్నికల్లో కాకాని వెంకటరత్నం గెలుపొంది మంత్రిగా రాష్ట్ర క్యాబినేట్‌లో పనిచేశారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి టీఎస్.ఆనంద్‌బాయి, 1978లో సీపీఎం అభ్యర్థిగా పుచ్చలపల్లి సుందరయ్య విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1983లో ముసునూరు రత్నబోస్, 1985లో మూల్పూరు బాలకృష్ణారావు ఆ పార్టీ అభ్యర్థులుగా విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా ముసునూరు రత్నబోస్ తిరిగి గెలుపొందగా, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా గద్దె రామ్మోహనరావు గెలుపొందారు. 1999లో టీడీపీ అభ్యర్థిగా దాసరి వెంకటబాలవర్ధనరావు, 2004లో స్వతంత్ర అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, 2009లో టీడీపీ అభ్యర్థి దాసరి వెంకటబాలవర్ధనరావు తిరిగి విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గెలుపొందారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

- గన్నవరం సమీపంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలోని పలు ముఖ్య నగరాలతో పాటు యూఏఈలోని షార్జాకు విమాన సర్వీస్‌లు నడుస్తున్నాయి.
- ఉంగుటూరు మండలంలోని పెద్దఅవుటపల్లిలో ఉన్న బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రానికి సంక్రాంతి రోజుల్లో జరిగే జయంతి ఉత్సవాలకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.
- హనుమాన్‌జంక్షన్ నాలుగు కూడళ్ల సెంటర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం ఎంతో ప్రసిద్ధి పొందింది. స్వామివారిని దర్శించుకునేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు.
- కేసరపల్లి గ్రామ పరిధిలోని ఎన్టీఆర్ పశు వైద్య కళాశాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. నోరులేని మూగజీవాలకు వైద్య సేవ అందించేందుకు వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ పశువైద్య విద్యను అభ్యసిస్తున్నారు.
- గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఐటీ పార్కు స్థాపితమైంది. ఐటీ పార్కుతో పాటు హెచ్‌సీఎల్ ఏర్పాటుతో ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా గుర్తింపు సాధించింది.
- చిన్నఆవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అనుసంధానంగా ఆస్పత్రి, దంత వైద్యశాలలతో పాటు నియోజకవర్గంలో పలు కార్పొరేట్ హాస్పిటల్స్ ఉండడంతో వివిధ జిల్లాలకు చెందిన ప్రజలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు.
- నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఇంజినీరింగ్, ఫార్మసీ, డెంటల్, పాలిటెక్నిక్, నర్సింగ్, కార్పొరేట్ కళాశాలలు, ఇంటర్నేషనల్ స్కూల్స్ అందుబాటులో ఉండడంతో విద్యా కేంద్రంగా విరాజిల్లుతోంది.


హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం

ఓటర్ల వివరాలు

1955లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 55,220 మంది ఉండగా, ప్రస్తుతం నియోజకవర్గ మొత్తం ఓటర్లు 2,79,054.

పురుషులు :	1,34,226
మహిళలు :	1,44,816
ఇతరులు :	12



నియోజకవర్గ స్వరూపం

గన్నవరం నియోజకవర్గం గతంలో గన్నవరం, ఉంగుటూరు మండలాలు పూర్తిగా బాపులపాడు మండలంలో తొమ్మిది గ్రామాలు, కంకిపాడు మండలంలో రెండు గ్రామాలు, ఉయ్యూరు మండలంలో రెండు గ్రామాలు ఉండేవి. పునర్విభజన తర్వాత గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలు పూర్తిగా విజయవాడ రూరల్ మండలంలో తొమ్మిది గ్రామాలతో నియోజకవర్గం ఏర్పడింది. గన్నవరం నియోజకవర్గానికి తూర్పున గుడివాడ, పడమర మైలవరం, దక్షిణం పెనమలూరు, ఉత్తరం నూజివీడు నియోజకవర్గాలు ఉన్నాయి.

గన్నవరం నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి వివిధ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధి(డీబీటీ)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	52,754	462.34
జగనన్న అమ్మ ఒడి	32,561	112.62
వైఎస్సార్ చేయూత	20,076	101.18
వైఎస్సార్ ఆసరా	56,866	189.05
వైఎస్సార్ రైతు భరోసా	34,508	166.06
ఇంటి నిర్మాణానికి(నేరుగా చెల్లింపులు)	10,175	83.26
వైఎస్సార్ సున్నా వడ్డీ(ఎస్)	65,586	14.57
వైఎస్సార్ కాపునేస్తం	3,428	13.00
ఉచిత పంటల బీమా	6,675	6.52
జగనన్న విద్యా దీవెన	18,487	100.20
జగనన్న వసతి దీవెన	15,000	24.53
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2,801	8.42
వైఎస్సార్ బీమా	1,939	14.33
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	10,906	9.32
వైఎస్సార్ వాహన మిత్ర	2,777	7.80
సున్నా వడ్డీ పంట రుణాలు	10,197	2.51
జగనన్న చేదోడు	1,708	4.23
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	12,160	54.85
తెల్లరేషన్ కార్డుదారులకు కోవిడ్ సాయం	81,450	8.14
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	7,677	6.00

ఇతర పథకాలు

వైఎస్సార్ నేతన్న నేస్తం	129	55 లక్షలు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	55	10 లక్షలు
వైఎస్సార్ లా నేస్తం	06	14 లక్షలు
వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా	105	88 లక్షలు
అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు సాయం	130	20 లక్షలు
మొత్తం	4,48,356	1391.34

నాన్ డీబీటీ పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(కోట్లలో)
జగనన్న తోడు	7,681	14.24
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	15,893	32.08
జగనన్న గోరుముద్ద	15,608	14.49
జగనన్న విద్యా కానుక	14,204	10.84
ఇళ్ల స్థలాలు(భూసేకరణ పరిహారం)	18,479	419.03
మొత్తం	71,865	490.68


బ్రదర్ జోసెఫ్ తంబి పుణ్యక్షేత్రం


ఎన్టీఆర్ పశువైద్య కళాశాల


ఐటీ హబ్



పీలేరు నియోజకవర్గం కలికిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



మైదుకూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

నాయకుడంటే ఓ నమ్మకం..

టంగుటూరు, మైదుకూరు, కలికిరి ఎన్నికల సభల్లో సీఎం జగన్

[illegible] ... 75 ఏళ్లు వచ్చాయి ... [illegible] ... ఎందుకు చంపకూడదు? అని అడుగుతాడు ఈ పెద్దమనిషి. పవర్‌లో వస్తే జగన్‌ను పాతేస్తానని కూడా అంటాడు. ... బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు, ... [illegible]

బంగారం వేలం వేయించిన చంద్రబాబు

చంద్రబాబూ రైతుల రుణ మాఫీపై తొలి సంతకం చేస్తానన్నావు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపిస్తానన్నావు. మరి రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేశావా? బ్యాంకుల్లో పెట్టిన బంగారాన్ని విడిపించకపోగా ఏకంగా వేలం వేయించాడు. చంద్రబాబు రైతులకు ఉచితంగా పంటల బీమా ఏరోజైనా ఇచ్చాడా? సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిన చరిత్ర ఏ రోజైనా ఉందా? సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చాడా? లేక ఎగరగొట్టారా? పెట్టుబడి సాయంగా చంద్రబాబు ఏ ఒక్క రైతుకైనా రైతు భరోసా అందించారా? ఎన్నికలు రావడంతో జగన్ కంటే ఎక్కువ డబ్బులిస్తానంటూ నమ్మబలుకుతున్నాడు.

రైతులపై కాల్పులు జరిపించిన బాబు


వ్యవసాయం దండగ అని నువ్వు మాట్లాడిన మాట నిజం కాదా చంద్రబాబూ? రైతులపై బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపించింది నువ్వు కాదా? రైతులను విచారించేందుకు ఏకంగా ప్రత్యేక పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక కోర్టులు తెచ్చింది నువ్వు కాదా? రైతన్నలకు ఉచిత కరెంటు ఇస్తే తీగల మీద బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందన్న మాటలు నీవి కావా? రైతులను అన్ని రకాలుగా మోసం చేసి నిట్ట నిలువునా ముంచిన నీది బోగస్ రిపోర్టు కాదా?

పెన్షన్లపై బాబు కుట్రలు

ఈ బోగస్ బాబు చేస్తున్న మరో దుర్మార్గం చూడండి. పెన్షన్ల విషయంలో బాబు కుట్రలను గమనించండి. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏ ఒక్కరోజైనా అవ్వాతాతల బాధలను పట్టించుకున్నాడా? పెన్షన్లు ఇంటికే పంపించిన చరిత్ర చంద్రబాబు హయాంలో ఉందా? మీ జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఆందోళనతో తన మనిషి నిమ్మగడ్డ రమేష్ ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉత్తరం రాయించి ఇంటికి వచ్చే ఆ పెన్షన్లను ఆపించారు. వలంటీర్ల సేవలను రద్దు చేయించిన వ్యక్తి ఈ చంద్రబాబు కాదా? తాను చేసిన వెధవ పనికి ఆ అవ్వాతాతలంతా తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతుండటంతో ఆ నెపాన్ని జగన్ మీదకు తోస్తున్నాడు. ఇంతకంటే దిగజారుడు రాజకీయం ప్రపంచ చరిత్రలో ఉంటుందా?

నీ కళ్లకు పచ్చ కామెర్లా?

బడులకు పంపే తల్లులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి అనే పథకాన్ని నీ హయాంలో ఏ రోజైనా తెచ్చావా బాబూ? పేదింటి పిల్లలకు ఇంగ్లిష్ మీడియం, బైలింగ్వల్ టెక్స్ట్ బుక్స్, 8వ తరగతికి వచ్చే సరికి ట్యాబ్‌లు, 6వ తరగతి నుంచే ఐఎఫ్‌పీలతో డిజిటల్ బోధన, సీబీఎస్‌ఈ నుంచి ఐబీ వరకు ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్, బైజూస్ కంటెంట్ లాంటివి కనిపించడం లేదా చంద్రబాబూ? పచ్చకామెర్లు వచ్చాయా నీ కళ్లకు? పూర్తి ఫీజులు చెల్లిస్తూ జగనన్న విద్యాదీవెన, ఖర్చులకు ఇబ్బంది పడకుండా వసతి దీవెన, తొలిసారిగా ఆన్‌లైన్ సర్టిఫైడ్ వర్టికల్స్ ఇవన్నీ వచ్చింది ఈ 58 నెలల కాలంలోనే కాదా? మరి చదువుల విషయంలో చంద్రబాబు రిపోర్టు బోగస్ కాదా?







ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.రఘురామిరెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతున్న సీఎం వైఎస్ జగన్

మన అభ్యర్థులను ఆశీర్వదించండి

[illegible] ... చింతల రామచంద్రారెడ్డిని ... ఆశీర్వదించి గొప్ప మెజార్టీతో గెలిపించాలి.

[illegible] మనమే పూర్తి చేస్తాం..

[illegible] ప్రాజెక్టును పూర్తి ... పరిస్థితుల కారణంగా అనుకున్న ... [illegible] ... వర్షాలు అంతంత మాత్రంగా పడటంతో ... ప్రాముఖ్యత తెలుస్తోంది. వచ్చే టర్మ్‌లో [illegible] ప్రాజెక్టును పూర్తి చేస్తాం.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు, సాక్షి ప్రతినిధి, కడప, సాక్షి రాయచోటి: అసత్యాల హరిశ్చంద్రులంతా 2014 తరహాలో మరోసారి కూటమి కట్టి మళ్లీ మోసగించేందుకు తయారయ్యారని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాను వరుసబెట్టి 58 నెలలుగా మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే చంద్రబాబుకు పిచ్చి కోపం వస్తోందని వ్యాఖ్యానించారు. 'చంద్రబాబూ! నువ్వు పేదలకు చేసిన మంచి ఏమిటని అడిగితే సమాధానం చెప్పకుండా జగన్‌ను తిడితే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. నాయకుడంటే ప్రజలకు నమ్మకం కలిగేలా ఉండాలన్నారు. చంద్రబాబుది బోగస్ రిపోర్టు అయితే మీ జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్. ఇద్దరి పాలనలే ఇందుకు నిదర్శనం' అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం టంగుటూరులో, మధ్యాహ్నం వైఎస్సార్ జిల్లా మైదుకూరులో, సాయంత్రం అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరిలో నిర్వహించిన బహిరంగ సభల్లో సీఎం జగన్ మాట్లాడారు.

నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం..

ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. ఇది జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధం కాదు. పేదలకు–చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. మీరు వేసే ఓటు పేదల తలరాతలను మారుస్తుంది. మీ జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కూడా సజావుగా కొనసాగింపు, పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపు. మళ్లీ మోసపోవటమే. మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. లకలకా అంటూ మళ్లీ ఐదేళ్లు మీ అందరి రక్తం తాగేందుకు తలుపు తడుతుంది. చంద్రబాబును నమ్మటం అంటే కొండచిలువ నోట్లో తలకాయ పెట్టడమే. నాయకుడంటే ప్రజల్లో నమ్మకం ఉండాలి. తాను ఒక మాట చెబితే చేస్తాడనే నమ్మకం ఆ నాయకుడిపై ప్రజలకు కలగాలి. మేనిఫెస్టోలో చెప్పిన 99శాతం వాగ్దానాలను అమలు చేసి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం.

ఎవరు మనసున్న మనిషి?

చంద్రబాబు హయాంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు ఇచ్చిన పెన్షన్ ఎంత? కేవలం రూ.1,000 మాత్రమే. ఈరోజు మీ బిడ్డ ఇస్తున్న పెన్షన్ రూ.3,000. మరి ఎవరికి మనసుంది? చంద్రబాబు ఏనాడైనా ఆ అవ్వాతాతలకు తోడుగా ఉన్నాడా? ఇంటికే పెన్షన్ పంపించాడా? 14 ఏళ్ల పాలనలో ఎన్నడైనా బటన్లు నొక్కి అక్కచెల్లెమ్మలకు మంచి చేశాడా? మరి మీ బిడ్డ 130 సార్లు బటన్లు నొక్కి నేరుగా రూ.2.70 లక్షల కోట్లు ఎక్కడా లంచాలు లేకుండా పారదర్శకంగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాడు. అందుకనే మంచి చేసిన ఫ్యాను ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింక్‌లోనే ఉండాలి. వలంటీర్లు మళ్లీ మీ ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లలు, మన బడులు, మన చదువులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన హాస్పిటల్స్ మెరుగుపడాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలి.

బాబుది బోగస్ రిపోర్ట్.. జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్

బాబు వస్తే జాబొస్తుందని 2014లో చంద్రబాబు, ఎల్లో మీడియా ఊదరగొట్టాయి. చంద్రబాబు ఐదేళ్లలో ముష్టి వేసినట్లు 32 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తే మీ జగన్ 2.31 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాడు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో గవర్నమెంట్ ఉద్యోగాలు నాలుగు లక్షలు మాత్రమే ఉంటే ఈ 58 నెలల కాలంలో మీ బిడ్డ ఏకంగా మరో 2.31 లక్షల గవర్నమెంట్ ఉద్యోగాలు భర్తీ చేశాడు. మన చెల్లెమ్మలు, తమ్ముళ్లే గ్రామ సచివాలయాలు, మెరుగుపడిన ఆస్పత్రులు, బాగుపడిన స్కూళ్లలో కనిపిస్తున్నారు. మరి బాబు రిపోర్ట్ బోగస్ కాదా? ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో మీ [illegible] వాస్తవం కాదా?

అక్కచెల్లెమ్మలను ఆదుకున్నాం..

18 శాతం ఓవర్ డ్యూస్‌తో ఎన్‌పీఏలుగా సి, డి గ్రేడ్లలోకి పడిపోయిన పొదుపు సంఘాలకు మీ జగన్ పునరుజ్జీవం కల్పించాడు. ఈరోజు లోన్ రీపేమెంట్ ఏకంగా 99.7 శాతానికి చేరుకుని దేశానికే ఆదర్శంగా నిలిచాయి. అక్కచెల్లెమ్మల కోసం ఆసరాతోపాటు సున్నావడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు, పిల్లల చదువులకు తోడుగా విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి అందించి అండగా నిలిచాం. మహిళా సాధికారతకు అర్థం చెబుతూ ఏకంగా చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవుల్లో, కాంట్రాక్టుల్లో అక్కచెల్లెమ్మలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది మీ బిడ్డ ప్రభుత్వమేనని గర్వంగా చెబుతున్నా. అక్కచెల్లెమ్మలకు రక్షణగా దిశ యాప్, గ్రామంలోనే మహిళా పోలీస్ సేవలు అందుబాటులోకి తెచ్చాం. అమ్మ ఒడిని రూ.15వేల నుంచి రూ.17 వేలకు, అవ్వాతాతల పెన్షన్లను రూ.3 వేల నుంచి దశలవారీగా రూ.3,500కి పెంచుకుంటూ వెళతామని మాటిస్తున్నా.

రైతన్నలకు జగన్ ఏం చేశాడంటే..

- ఎన్నడూ లేని విధంగా అన్నదాతలకు రైతు భరోసా ఇచ్చింది మీ బిడ్డ జగన్. సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తోంది మీ జగన్.
- గ్రామాల్లో ఆర్బీకేలు తేవడంతోపాటు 9 గంటలు పగటిపూటే నాణ్యమైన ఉచిత విద్యుత్, ఈ–క్రాప్, ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధరలు, ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, రైతన్నలకు సలహాలు, దళారీలు లేకుండా పంటల కొనుగోళ్లు ఇవన్నీ జరిగింది ఎప్పుడంటే మీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాకే.
- మీ జగన్ చెప్పిన దాని కంటే మిన్నగా రైతన్నలకు సాయం చేశాడు. రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పినా అంతకంటే మిన్నగా ఐదేళ్లలో రూ.67,500 పెట్టుబడి సాయంగా అందించాడు.
- ఈ దఫా అధికారంలోకి వచ్చాక ఏటా రూ.16 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.80 వేలు రైతన్నల చేతిలో పెడతామని చెబుతున్నా. మరి మాట తప్పకుండా కచ్చితంగా ఇచ్చే మీ జగన్‌ను నమ్మాలా? లేక ఇస్తానని మోసం చేసే చంద్రబాబును నమ్మాలా?

డెవలప్ చేసిందెవరు?

- చంద్రబాబు డెవలప్‌మెంట్ కింగ్ అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 బాకా ఊదుతుంటాయి. చంద్రబాబు ఏం డెవలప్‌మెంట్ చేశాడో మీరే చెప్పండి. గ్రామాల్లో పౌర సేవల్ని పూర్తిగా మారుస్తూ, గ్రామ స్వరాజ్యానికి అర్థం చెబుతూ ఏకంగా 15 వేల గ్రామ వార్డు సచివాలయాలు కట్టింది ఎవరు? ఈరోజు 11 వేల విలేజ్ వార్డు క్లినిక్‌లు కనిపిస్తున్నాయంటే వాటిని కట్టింది ఎవరు? మన గ్రామాల్లో 11 వేల రైతు భరోసా కేంద్రాలు కట్టింది ఎవరు? గ్రామానికే ఫైబర్ గ్రిడ్, వేగంగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణం జరుగుతున్నది కూడా మీ బిడ్డ హయాంలోనే. నాడు–నేడుతో గవర్నమెంట్ బడులు, ఆస్పత్రులు బాగు పడ్డాయంటే కారణం ఎవరు?

బాగు చేసింది ఎవరయ్యా?


జగన్‌లా 17 మెడికల్ కాలేజీలు తెచ్చావా బాబూ? జగన్‌లా 4 కొత్త సీ పోర్టులు కట్టావా? 10 ఫిషింగ్ హార్బర్లు కట్టావా? ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కట్టావా? మీ జగన్ సర్ఫేస్ వాటర్ (రిజర్వాయర్ నుంచి ఉపరితల జలాలు) తరలించి ఉద్దానం వాసుల కిడ్నీ కష్టాలను తీర్చాడు. వెలిగొండ టన్నెళ్లను ప్రకాశం జిల్లాకు తెచ్చింది మీ జగన్ కాదా? జగన్‌లా ఎయిర్‌పోర్టుల విస్తరణ చేశావా చంద్రబాబూ? భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును పరుగులు తీయించావా? 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 ఇండస్ట్రియల్ నోడ్లు ఇవన్నీ నువ్వు పరిగెత్తించావా? జగన్‌లా ఎంఎస్‌ఎంఈలకు ఏనాడైనా సపోర్ట్ చేశావా? జగన్‌లా స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ ఓ రైతు భరోసాగానీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఆసరా, సున్నా వడ్డీ, వాహన మిత్ర, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, జగనన్న తోడు, జగనన్న చేదోడు, లా నేస్తం వంటి పథకాలను తెచ్చావా చంద్రబాబూ? అన్నింటికీ మించి పేదరికం సంకెళ్లను తెంచేలా పిల్లల చదువులను బాగు చేసింది ఎవరయ్యా చంద్రబాబూ? డెవలప్‌మెంట్ విషయంలో కూడా బాబుది బోగస్ రిపోర్టే.

మీ సంస్కారానికి ఓ నమస్కారం..

నేను వరుసబెట్టి 58 నెలలుగా మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే చంద్రబాబుకు పిచ్చి కోపం వస్తోంది. మా బాబును ఇలాంటి ప్రశ్నలు అడుగుతావా? అని ఈనాడుకు, ఆంధ్రజ్యోతికి, టీవీ 5, దత్తపుత్రుడికి కోపం వస్తోంది. వదినమ్మకూ కోపం వస్తోంది. వీరందరికీ పిచ్చి పిచ్చిగా కోపం వస్తోంది. వీరితోపాటు చంద్రన్న కాంగ్రెస్‌కు కూడా కోపం వస్తోంది. మనకు కౌంటర్‌గా వారు లిస్టులు చదువుతున్నారు. కాకపోతే అవి స్కీమ్‌ల లిస్టులు కాదు. అవన్నీ నాపై తిట్లు, శాపనార్థాలు, బెదిరింపులు, బూతులు, అబద్ధాల లిస్టులు. అవి ప్రతి రోజూ గడగడ చదివేస్తున్నారు. అయ్యా మీ అందరి సంస్కారానికి ఓ నమస్కారం.



కలికిరి సభలో అభిమాని ఉత్సాహం...



టంగుటూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

2014లో బాబు ముఖ్యమైన మోసాలివీ..

- రూ.87,612 కోట్ల రైతు రుణాలు మాఫీ చేశాడా? రూ.14,205 కోట్లు డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాల్లో కనీసం ఒక్క రూపాయి మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25వేలు బ్యాంకుల్లో వేస్తామని నమ్మబలికిన చంద్రబాబు ఏ ఒక్కరి ఖాతాలోనైనా రూపాయి జమ చేశాడా?
- ఇంటింటికీ ఉద్యోగం లేదంటే రూ.2 వేల నిరుద్యోగ భృతి అని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ ప్రకారం ఐదేళ్లలో రూ.1.20 లక్షలు ఎవరికైనా ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇళ్లు ఒక్కరికైనా ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాల మాఫీ జరిగిందా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి, ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ అన్నాడు. కొండపి, మైదుకూరులో ఎక్కడైనా కనిపిస్తున్నాయా?
- పోనీ ప్రత్యేక హోదా తెచ్చాడా? అది కూడా అమ్మేశాడు.
- అవే మూడు పార్టీలు ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కారు అంటూ మరోసారి మోసాలకు సిద్ధమయ్యాయి.

[illegible]

చంద్రబాబూ నువ్వు పేదలకు చేసిన మంచి ఏమిటని అడిగితే నీ దగ్గర నుంచి సమాధానం లేదు. పాత మేనిఫెస్టోను అమలు చేశావా? అంటే సమాధానం రాదు. మీ కొత్త మేనిఫెస్టోకు విశ్వసనీయత ఏమిటి? ప్రజలకు జవాబు చెప్పకుండా జగన్‌ను తిడితే ఏం ప్రయోజనం? ఇంటింటికీ ఎవరు మంచి చేశారు? ఎవరు అందరినీ మోసగించారు? వారి చరిత్ర ఏమిటనేది ప్రజలందరికీ తెలుసు.

[illegible]

టీడీపీ, జనసేన మేనిఫెస్టోను నమ్మం

- ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన ప్రకటించిన మేనిఫెస్టోను ముస్లిం సమాజం నమ్మేదిలేదని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2014లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ 2024లో అవే హామీలను మేనిఫెస్టోలో చేర్చి ముస్లింలను మోసం చేసేందుకు బాబు, పవన్ ప్రయత్నిస్తున్నారన్నారు.

ప్రజల్ని మభ్యపెట్టేలా టీడీపీ, జనసేన మేనిఫెస్టో

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శ

సాక్షి, అమరావతి: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు మంగళవారం విడుదల చేసిన మేనిఫెస్టో అస్పష్టమైన హామీలతో ప్రజలను మభ్య పెడుతున్నట్లు ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వారి ఉమ్మడి మేనిఫెస్టోలో విభజన హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితుల ప్రస్తావనే చేయకపోవడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తాం, రిజర్వేషన్లు సమీక్షిస్తాం, ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బీజేపీ ప్రకటనలపై టీడీపీ, జనసేనలు తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కూటమి గెలవదనే ఫ్రస్టేషన్‌లో బాబు, పవన్

- వైఎస్సార్‌సీపీ నేత రావెల




సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి గెలిచే అవకాశం లేదనే ఫ్రస్టేషన్‌కు గురై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి రావెల కిషోర్‌బాబు విమర్శించారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్‌కు పొలిటికల్ హాలిడే ఇచ్చేద్దామంటూ అర్థంపర్థం లేకుండా పవన్ వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల తర్వాత పవన్ పొలిటికల్ హాలిడే తీసుకుంటారని, మరి విదేశాలకు విహారయాత్రలకు వెళ్తాడో, సినిమాలకు కేటాయిస్తాడో చూడాలన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం విషయంలో పచ్చమీడియా విష్రప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

నల్లారి కిరణ్‌పై కేసులో చర్యలు నిలిపివేత

సాక్షి, అమరావతి: మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిపై చిత్తూరు జిల్లా రొంపిచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిస్తూ విచారణను జూన్‌కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోకుండా బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏప్రిల్ 7న రొంపిచర్ల బస్టాండ్ దగ్గర సమావేశం నిర్వహించారంటూ ఎంపీడీవో రెడ్డప్ప ఆచార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నల్లారి కిరణ్‌పై కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలంటూ కిరణ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ శ్రీనివాసరెడ్డి మంగళవారం విచారణ జరిపి రొంపిచర్ల పోలీసులు కిరణ్‌కుమార్‌రెడ్డిపై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హైకోర్టు న్యాయవాదుల సంఘ కార్యవర్గం ఎన్నిక



చిదంబరం



రంగారెడ్డి

సాక్షి అమరావతి: హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది కలిగినీడి చిదంబరం గెలుపొందారు. తన ప్రత్యర్థులైన సీనియర్ న్యాయవాదులు ఉప్పుటూరి వేణుగోపాలరావు, చిత్తరువు రఘుపై విజయం సాధించారు. చిదంబరానికి 715 ఓట్లు రాగా.. వేణుగోపాలరావుకు 507, రఘుకు 501 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా ఎస్.రంగారెడ్డి గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి, టీడీపీ బలపర్చిన కేపీఎం కృష్ణారెడ్డిపై 48 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా నన్నపనేని శ్రీహరి, సంయుక్త కార్యదర్శిగా ఒరుగంటి ఉదయకుమార్ గెలుపొందారు. లైబ్రరీ కార్యదర్శిగా రమ్యకృష్ణ, కోశాధికారిగా జంపన శ్రీదేవి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా షేక్ రిజ్వాన్ అలీ విజయం సాధించారు. మహిళా ప్రతినిధిగా వేముల బేబీరాణి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు (30 సంవత్సరాలు)గా కె.మోహన్‌రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ (లేడీ)గా శేషుకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ (20 సంవత్సరాలు)గా పరమేశ్వరరావు గెలిచారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లు (జనరల్)గా ఎ.స్వరూపారెడ్డి, నాగోళ్ల ఐశ్వర్య, సీహెచ్ వరలక్ష్మి, అబ్దుల్ రషీద్, అహ్మద్ షేక్ గెలుపొందారు. వీరంతా ఏడాది పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు.

బాబు కిచిడీ మేనిఫెస్టో

సూపర్ సిక్స్‌లో సగం వైఎస్సార్‌సీపీ నుంచి.. సగం పక్క రాష్ట్రాల నుంచి కాపీ

177 ఎన్నికల హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్

- నిస్సిగ్గుగా వైఎస్ జగన్ అమ్మఒడి పథకం పేరు మార్చి అమలు చేస్తానని హామీ
- రైతు భరోసా పేరు మార్చి యథాతథంగా మేనిఫెస్టోలో పెట్టిన బాబు
- అధికారంలో ఉన్నప్పుడు చేయని మెగా డీఎస్సీపై యువతకు గేలం
- ఏపీలో అమల్లో ఉన్న పలు కార్యక్రమాలను మేనిఫెస్టోలో పెట్టుకున్న వైనం



సాక్షి, అమరావతి: చంద్రబాబు అంటేనే మోసం, మాయ, వెన్నుపోటు. ఏదో విధంగా ప్రజలను మభ్యపెట్టడం, అధికారంలోకి వస్తే అదే ప్రజలను మోసం చేసి, వెన్నుపోటు పొడిచి, తాను లాభపడటం.. ఇదే నైజం. ప్రజలకు మేలు చేసే మనసు ఆయనకు ఏ కోశానా లేదు. మంగళవారం విడుదల చేసిన తాజా మేనిఫెస్టోలోనూ చంద్రబాబు ఇదే నైజాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం ఏపీలో, పక్క రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలనే కాపీ కొట్టి తన మేనిఫెస్టో తయారు చేశారు. నిబద్ధతతో పనిచేసే నాయకుడైతే ప్రజలకు తానేమి మేలు చేస్తాడో ఆలోచించి, వాటిని మేనిఫెస్టోలో చెప్తాడు. కానీ, చంద్రబాబు ప్రజల కోసం ఏమీ చేయరన్నది గతంలో ఆయన పరిపాలనే విస్పష్టంగా చెబుతుంది. ఇటువంటి నాయకుడి మేనిఫెస్టోలో ఏ హామీలు ఉంటే ప్రజలకేం ఉపయోగం? అందుకే చంద్రబాబు ఇప్పటికే రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న ప్రజోపయోగ పథకాలు, పక్క రాష్ట్రాల్లో ఉన్నవీ తెచ్చి తాజా మేనిఫెస్టోలో చేర్చేసుకున్నారు.. ఏమాత్రం కష్టం లేకుండా. గతంలో 2104, 2019లో తాను ప్రజలను మోసగించడానికి ఇచ్చిన హామీలను కూడా ఈసారి మేనిఫెస్టోలో ఉంచారు.. ఇందులో ఆయన ఏమాత్రం సిగ్గుపడలేదు. ఈ మేనిఫెస్టోలో 177 హామీలు ఉన్నప్పటికీ, అవన్నీ కాపీ కొట్టినవి, పాతవే.

అరువు తెచ్చుకున్న సూపర్ సిక్స్

చంద్రబాబు తాజా మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన ప్రధాన హామీలు అన్నీ అరువు తెచ్చుకున్నవే. వీటిలో సగం రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న పథకాలు కాగా, మిగతావి పక్క రాష్ట్రాల నుంచి కాపీ కొట్టారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందించే పథకాలను అమ్మఒడి, రైతు భరోసా పేరుతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐదేళ్ల నుంచి అమలు చేస్తోంది. వీటికే పేర్లు మార్చి, చంద్రబాబు మేనిఫెస్టోలో రాసుకున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కూడా వైఎస్సార్‌సీపీ నుంచి కాపీ కొట్టిందే. ఇది కాకుండా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకి నెలకు రూ.1500, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను తెలంగాణ, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి కాపీ కొట్టారు. అంతే కాదు.. జాబు కావాలంటే బాబు రావాలంటూ 2014లో ఊదరగొట్టిన చంద్రబాబు.. జాబు లేదంటే నిరుద్యోగ భృతి అంటూ యువతను నిలువునా మోసం చేసి, మళ్లీ అదే హామీ ఇప్పుడూ ఇవ్వడమే ఆయనలోని గొప్పతనం.

అవినీతి అమరావతిని మళ్లీ కదతారట

అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ పేదలను పట్టించుకోని చంద్రబాబు.. మళ్లీ అధికారంలోకి వస్తే వారిని సంపన్నులను చేసేందుకు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ4) పేరుతో పథకాలు ఇస్తానని ప్రకటించారు. అంతర్జాతీయ అవినీతి కుంభకోణంగా మారిన రాజధాని అమరావతి నిర్మాణాన్ని కొనసాగిస్తానని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల గురించి పట్టించుకోకుండా అమరావతి జపం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని నమ్మబలుకుతున్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు వద్దే వద్దంటూ అక్కడ హైకోర్టు బెంచిని తక్షణం ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. అగ్రిగోల్డ్ ఆస్తులను కొల్లగొట్టి లక్షలాది మందిని నడిరోడ్డున పడేసిన విషయాన్ని మరచిపోయి, ఇప్పుడు బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెబుతున్నారు.

రూ.4 వేలు పింఛనంటూ మాయ హామీ

చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లూ సామాజిక పింఛన్లు రూ.1,000 మాత్రమే ఇచ్చారు. అందులోనూ చాలా మోసాలు. ఇచ్చిందే తక్కువ. అందులోనూ జన్మభూమి కమిటీల దందా, అవినీతి. వృద్ధులు నెల నెలా నానా అవస్థలుపడి ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లి, అక్కడ ఇచ్చినంత తెచ్చుకోవాల్సిన దుస్థితి. అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పెన్షనర్లకు చంద్రబాబు పెట్టిన అవస్థల నుంచి విముక్తి కల్పిస్తూ సీఎం జగన్ చర్యలు చేపట్టారు. బాబు రూ. వెయ్యి పింఛను ఇవ్వగా, దానిని సీఎం జగన్ రూ.3 వేలు ఇచ్చి, ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం ఐదేళ్లుగా ఇస్తున్న రూ.3 వేలను రూ.4 వేలకు పెంచి ఇస్తామని చంద్రబాబు మభ్యపెట్టే హామీ ఇచ్చారు. అది కూడా 50 ఏళ్లకే ఇస్తామని చెప్పడం మాయ చేయడానికేనని కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. గతంలో చేయకుండా ఇప్పుడు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ అంటూ ప్రకటించారు. ప్రతి ఇంటికీ మేలు చేసేలా జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థను తూలనాడి, 2 నెలలుగా వారిని విధులకు దూరం చేసిన చంద్రబాబు.. వారికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తానని ప్రకటించడం ఆయన దివాళాకోరుతనమే. ఉద్యోగుల గురించి ఏనాడూ పట్టించుకోని చంద్రబాబు.. ఇప్పుడు అధికారంలోకి వస్తే వారికి మేలు చేస్తానంటున్నారు.

ఇది మరో రకం మోసం

ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి ఆ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో చేయాలని చెబుతున్న ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించడమూ ప్రజలను మోసం చేయడమే. 2014, 2019 మేనిఫెస్టోల్లో చెప్పినట్టుగానే ఈ మేనిఫెస్టోలోనూ పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని, నదుల అనుసంధానం, ప్రతి ఎకరానికి నీరు అంటూ పాత హామీలను పెట్టారు. రాష్ట్రంలో ఇప్పుడు పారదర్శకంగా ఇసుక విధానం అమలవుతుండగా తన హయాంలో అభాసుపాలైన ఉచిత ఇసుక విధానాన్ని మళ్లీ తెస్తానని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి సకల మౌలిక వసతులతో గ్రామాల ముఖ చిత్రమే మారిపోయినా, గ్రామాల్లో మౌలిక వసతులు, మండల, జిల్లా కేంద్రాల్లో వర్క్ ఫ్రం హోం స్టేషన్లు అంటూ హామీలిచ్చారు.

బీసీలకు బురిడీ

చంద్రబాబు అధికారంలో ఉండగా బీసీలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు తగ్గించేశారు. ఇప్పుడు 34 శాతం ఇస్తామని చెప్పడం ఆ వర్గాలను మభ్యపెట్టడమే. 2014, 2019 మేనిఫెస్టోల్లో చెప్పినట్టుగానే ఇప్పుడూ బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేస్తామని మరోసారి పాత హామీనే ఇచ్చారు.

మరోసారి మహిళలను మోసం చేసేలా..

స్వయం సహాయక సంఘాలను మళ్లీ కొత్త తరహాలో మోసం చేయడానికి చంద్రబాబు కొత్త హామీ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల రుణాలు మాఫీ చేస్తానని 2014 మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరినీ వంచించి, ఆ సంఘాలను దివాలా తీయించారు చంద్రబాబు. ఇప్పుడు రూ. 3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామంటూ నిస్సిగ్గుగా మరోసారి ప్రకటించారు. ఇది మరోసారి మహిళలను వంచనకు గురిచేయడమే.

[illegible]

సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.25 లక్షల విలువైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. చంద్రబాబు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేలా ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని ప్రకటించారు. అంటే చంద్రబాబు వస్తే ప్రజలకు బీమానే వర్తిస్తుంది తప్ప, ఆరోగ్య శ్రీ ఉండదు. ఆరోగ్యానికి భరోసా ఉండదు. డిజిటల్ హెల్త్ కార్డులు ఇప్పటికే రాష్ట్రంలో కోట్ల మందికి పంపిణీ చేసినా తానూ చేస్తానని చెప్పారు. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష పథకాలన్నీ వైద్యాన్ని పేదలకు చేరువ చేయగా వాటికి ఏమాత్రం సాటిరాని, తీసికట్టుగా జన ఔషధి కేంద్రాలు, బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందులు పంపిణీ చేస్తామని చెబుతున్నారు. విద్యా రంగంలో వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులు తెస్తే, వాటి దరిదాపుల్లోకి సైతం రాలేని స్థితిలో కేజీ టు పీజీ సిలబస్‌ని రివ్యూ చేస్తామని, మూతపడిన పాఠశాలలు పునరుద్ధరిస్తామంటూ పస లేని హామీలు ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రస్తుతం అమల్లో ఉండగా, నేరుగా కాలేజీలకే రుసుం చెల్లిస్తామని ప్రకటించి దానిపైనా తిరకాసు హామీ ఇచ్చారు.

ఇప్పుడు అమలవుతున్నవే ఆయనొచ్చి చేస్తాడట..

- సీఎం జగన్ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ముస్లింలు, కాపులు, వడ్డెరలు, ఆర్య వైశ్యులు, క్షత్రియులు, అగ్రవర్ణ పేదలకు నవరత్నాలతో రూ వేల కోట్ల సంక్షేమం అందిస్తుంటే.. ఇప్పుడు బాబు వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని అనడం కొసమెరుపు.
- 2019 ఎన్నికల్లో ఇచ్చినట్టుగానే గ్రామాల్లో పేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానని, పక్కా ఇళ్లు కట్టిస్తానంటూ పాత పాటే పాడారు. నిజానికి ఈ ఐదేళ్లలో పేదలకు సీఎం వైఎస్ జగన్ 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వగా, వీటిలో ఇప్పటికే 22 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఆయనొచ్చి చేసేదేముంది?
- నైపుణ్య శిక్షణ కేంద్రాలు, క్రీడా మౌలిక సదుపాయాలు, డిజిటల్ లైబ్రరీలు ఇప్పటికే రాష్ట్రంలో ఉన్నా, వాటి గురించి మేనిఫెస్టో చేర్చడం ప్రజలను మభ్యపెట్టడం కాక మరేమిటి? కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇప్పటికే రాష్ట్రంలో అమల్లో ఉండగా తానూ అమలు చేస్తానని ప్రకటించడం పక్కా మోసమే.
- వైఎస్ జగన్ ప్రభుత్వం ఏడాది నుంచి రాష్ట్రంలో శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు ఇస్తుండగా.. తాము అందిస్తామంటూ అదే హామీ ఇచ్చారు.
- గొర్రెల పెంపకం యూనిట్లకు రాయితీలు, బీమా సౌకర్యం ఇప్పటికే ఉండగా దాన్ని తాను ఇస్తానని అంటున్నారు.
- నాయీ బ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తుండగా దాన్ని ఇస్తానంటూ చెప్పుకొంటున్నారు.
- మత్స్యకారుల సంక్షేమానికి ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తుండగా దాన్ని పెంచుతామని నమ్మబలికారు.
- వైఎస్సార్‌సీపీ వాహన మిత్ర పథకం అమలు చేస్తూ రవాణా రంగ కార్మికులకు మేలు చేస్తుండగా, ఇప్పుడు తాను డ్రైవర్లకు ప్రమాద బీమా ఇస్తానని, వడ్డీ సబ్సిడీ ఇస్తానంటూ నమ్మబలికారు.
- వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ విద్యుత్ సరఫరా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తుండగా తాను అధికారంలోకి వస్తే ఇస్తానన్నారు.
- వైఎస్ జగన్ సీఎం కాగానే ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయగా, ఇప్పుడు తాను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.
- సేంద్రీయ వ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, ప్రభుత్వ గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీ యూనిట్ల వంటివన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తుండగా వాటిని తన మేనిఫెస్టోలో పెట్టుకున్నారు. ఇప్పుడు అమల్లో ఉన్న పథకాలన్నీ తాను చేస్తాననడం ప్రజలను వంచించడమే కదా?

నీ హామీలకు డబ్బెక్కడిది బాబూ?

ఏడాదికి రూ.1.65 లక్షల కోట్లు కావాలని అంచనా

- అంత సొమ్ము సమకూర్చుకోవడం సాధ్యమా?
- అన్ని ఆర్థిక వనరులు రాష్ట్రంలో ఉన్నాయా?
- ప్రజలను వంచించేందుకు ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చేస్తావా?
- సీఎం జగన్ పథకాల అమలుకు రూ.70 వేల కోట్ల వ్యయం
- అన్ని లెక్కలు వేసుకుని, ఆర్థిక క్రమశిక్షణ చూసుకునే ఆయన హామీలిచ్చారు
- ఏ లెక్కలు చూడకుండా, ఇష్టం వచ్చినట్లు ఇచ్చిన హామీలకు డబ్బులెలా తెస్తావ్?
- చంద్రబాబు మేనిఫెస్టోపై నిపుణుల విస్మయం

సాక్షి, అమరావతి: అధికారమే పరమావధిగా ప్రజలను వంచించేందుకు సిద్ధమైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మేనిఫెస్టోలో ఇష్టం వచ్చినట్లు ఇచ్చిన హామీల అమలుకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారు? ఈ ప్రశ్న ఇప్పుడు ఆర్థిక నిపుణులను సైతం వేధిస్తోంది. అలవికాని హామీలను ఎడాపెడా ఇచ్చేసిన చంద్రబాబు అసలు వాటిని అమలు చేయడం సాధ్యమా? అందుకు ఎంత ఖర్చు అవుతుంది? అంత సొమ్ము ఎక్కడి నుంచి సమీకరిస్తారు? అనే అంశాలకు సమాధానం లేదు. ప్రాథమిక అంచనాల ప్రకారం చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి రూ 1.65 లక్షల కోట్లు ఖర్చవుతుంది. అంత డబ్బు సమీకరించుకునే అవకాశం ఉందా? రాష్ట్రంలో అందుకు తగ్గ వనరులు ఉన్నాయా?.. అంటే లేదనే సమాధానం వస్తుంది.

వాస్తవికంగా ఆలోచిస్తూ..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించదు కాబట్టే సీఎం వైఎస్ జగన్‌కు ఇంకా సంక్షేమం అందించాలని మనసులో ఉన్నా కొత్త హామీలు ఇవ్వలేదు. అన్ని లెక్కలు వేసుకుని, వనరుల సమీకరణ చూసుకుని చేయగలిగే హామీలను మాత్రమే ఆయన మేనిఫెస్టోలో చేర్చారు. ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం ఏటా రూ.70 వేల కోట్లు దాకా ఖర్చు చేస్తున్నారు. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా పారదర్శకంగా నేరుగా లబ్ధిదారులకే ప్రయోజనం చేకూరుస్తున్నారు. దీనికి అదనంగా మరికొంత లబ్ధిని జోడిస్తూ మేనిఫెస్టోను రూపొందించారు. తాము అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు, వాటికి అయ్యే ఖర్చు, ఎక్కడి నుంచి సమీకరిస్తామనే విషయాలను ఆయన కూలంకషంగా వివరించారు. పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోనే డబ్బు జమ చేయడం (డీబీటీ) లాంటి వినూత్న విధానాల ద్వారా చాలా పకడ్బందీగా ఐదేళ్లు ఆర్థిక క్రమశిక్షణ పాటించి ఇబ్బందికర పరిస్థితుల్లోనూ నెట్టుకొచ్చారు. పింఛన్లకు ఇంకా ఎక్కువ ఇవ్వాలని ఉన్నా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలించవు కనుకే రూ 3,500 చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఒకవేళ అప్పులు తెద్దామన్నా అవి కూడా పరిమితులకు లోబడే తేవాల్సి ఉంటుంది. అన్నీ బేరీజు వేసుకుని, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పథకాలను కొనసాగించేందుకు సిద్ధమయ్యారు.

వేలం పాటలా పోటీ పడి హామీలు

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కనీస ఆలోచన లేకుండా ఇష్టం వచ్చినట్లు హామీలు గుప్పించారు. చిత్తశుద్ధితో నెరవేర్చే ఉద్దేశం లేనందువల్లే వేలం పాటలో రేటు పెట్టినట్లుగా సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలకే తాను ఇంకా ఎక్కువ ఇస్తానని నమ్మబలికారు. అమ్మఒడి, రైతు భరోసా పథకాల పేర్లు మార్చి ఇష్టం వచ్చినట్లు ప్రకటించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న చాలా పథకాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో ప్రకటించిన పథకాలను సైతం కాపీ కొట్టి మేనిఫెస్టోలో చేర్చి ప్రజలను ఏమార్చేందుకు సిద్ధమయ్యారు. మరి ఇన్ని హామీలను అమలు చేయడం సాధ్యమా? ఇంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారనే దానికి ఆయన వద్ద



సమాధానం లేదు. మేనిఫెస్టో విడుదల చేసినప్పుడు ఒక మీడియా ప్రతినిధి ఈ హామీల అమలుకు ఎంత ఖర్చవుతుందని అడగడంతో సమాధానం చెప్పకుండా కస్సుమని మండిపడ్డారు. దాన్నిబట్టే ఆయనకు తాను ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టమైంది. సీఎం జగన్ ఇస్తున్నారు కాబట్టి తాను అంతకంటే ఎక్కువ ప్రకటించి ప్రజలను నమ్మించాలి, ఆ తరువాత ఎలాగూ అమలు చేసేది లేదని తనకు అలవాటైన రీతిలో వాగ్దానాలు చేస్తున్నారు.

సాధ్యం కాదనే బీజేపీ పట్టించుకోలేదు

చంద్రబాబు హామీలను అమలు చేయడం సాధ్యం కాదని గుర్తించడం వల్లే బీజేపీ ఆయన మేనిఫెస్టోను అంగీకరించలేదు. ప్రధాని మోదీతోపాటు బీజేపీ నేతల ఫొటోలు మేనిఫెస్టోలో కనీసం ముద్రించేందుకు కూడా ఒప్పుకోలేదు. చివరికి మేనిఫెస్టోను తాకడానికి సైతం బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్‌సింగ్ ఇష్టపడలేదంటే బాబు హామీలపై వారికి ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. అంటే చంద్రబాబు హామీలకు కేంద్రం నుంచి కూడా ఎలాంటి సహకారం ఉండదని చెప్పకనే చెప్పేశారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు సమకూర్చుకునే పరిస్థితులు లేక, కేంద్రం సహకరించకపోతే చంద్రబాబు అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారనే దానికి సమాధానమే లేదు. అంటే ఆయన ఇచ్చిన హామీలు అమలు చేసేవి కావని తేటతెల్లమైంది. కేవలం ప్రజలను మభ్య పెట్టేందుకు, మరోసారి మాయ చేసేందుకే వేలం పాట మాదిరిగా సంక్షేమ పథకాలు ప్రకటించారు. పొరపాటున జనం నమ్మితే ఇక అంతే సంగతులు. 2014లో మాదిరిగా ఆ మేనిఫెస్టో మాయం కావడం ఖాయం.

కూటమిది అసత్యాల మేనిఫెస్టో


- హామీలన్నీ జగన్ అమలు పరిచినవే
- అరచేతిలో వైకుంఠం చూపే చంద్రబాబు.. ఓట్లకోసం ముస్లింలు, క్రిస్టియన్లు కావాలి
- మాజీ మంత్రి పేర్ని నాని



చిలకలపూడి (మచిలీపట్నం): ప్రజలను మరోకసారి మోసం చేసేందుకే ఎన్డీయే కూటమి అసత్యాల మేనిఫెస్టోను విడుదల చేసిందని మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) విమర్శించారు. ఆయన మంగళవారం రాత్రి కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మూడు పార్టీలు కలిశామని కూటమి అభ్యర్థులు చెప్పుకొంటున్నా.. మేనిఫెస్టోపై ఒకరి ఫొటో లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. మూడుఫోటోలు రెండు ఫోటోలయ్యాయంటే మేనిఫెస్టోలోని అంశాలు ఫొటోలేని వారికి ఇష్టం లేదా అని ప్రశ్నించారు. అడిన అబద్ధం ఆడకుండా జరగనివి, అసత్యాల మేనిఫెస్టో రూపొందించిన కూటమి సభ్యులు.. 40 ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్లు ముఖ్యమంత్రి చేశానని చెప్పుకోవటం చూస్తే ప్రజలకే అర్థమవుతోందన్నారు. 50 ఏళ్ల వయసున్న సీఎం జగన్ 2019లో మేనిఫెస్టోను విడుదల చేసి 99 శాతం అమలు చేసి ప్రజలకు మంచిచేస్తేనే నాకు ఓటేయండని ధైర్యంగా అడుగుతున్నారని చెప్పారు. సంవత్సరానికి 71 వేల కోట్లతో సంక్షేమ పథకాలను ధైర్యంగా అమలు చేశారన్నారు. నిజాయితీగల వారైతే చంద్రబాబు 2014 మేనిఫెస్టోలో అమలు చేసిన వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా గ్రూపుల వారికి రూ.14 వేల కోట్ల రుణాలు, రైతులకు రూ.84 వేలకోట్ల రుణాలు మాఫీచేస్తానని చెప్పి.. వాటిని ఎంతవరకు అమలు చేశావో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. జన్మభూమి కమిటీల పేరుతో పంచాయతీ వ్యవస్థను సర్వనాశనం చేసింది చంద్రబాబేనన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమిగా ఏర్పడ్డామని, ఎన్డీయేలో కలిశామని చెప్పుకొంటున్న చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రత్యేకహోదా, రైల్వేజోన్, విశాఖ స్టీల్‌ప్లాంట్, కడప స్టీల్ కర్మాగారం ఏర్పాటు విషయాలు ఎందుకు పొందుపరచలేదో చెప్పాలన్నారు.

అధికారం కోసమే కూటమి

అధికారం కోసమే కూటమిగా ఏర్పడ్డారని ఇప్పటికే ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. ఏపీలో ఏడాదికి 10 శాతం మాత్రమే పెరుగుతున్న ఆదాయాన్ని బట్టి సీఎం జగన్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఏడాదికి రూ.2 లక్షల కోట్లు అవసరమయ్యే విధంగా మేనిఫెస్టో రూపొందించిన చంద్రబాబు ఆ డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో, ఏ విధంగా అమలు చేస్తారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పాటుపడతానని చెబుతున్న చంద్రబాబు ఆయన పాలనలో ముస్లింలకు ఎమ్మెల్యే, మంత్రి పదవి ఇవ్వలేదని గుర్తుచేశారు. రాజ్యాధికారంలో మైనార్టీలు భాగస్వామ్యులు కాకూడదనుకునే బాబుకు ఇప్పుడు వారిపై ప్రేమ పుట్టుకొచ్చిందా అని నిలదీశారు. రజకులకు, కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయన్నారు. నాయీబ్రాహ్మణులకు ఉపకరణాలు ఇస్తామని చెబుతున్న చంద్రబాబు వారి పిల్లలకు చదువులు ఎందుకు చెప్పించవని ప్రశ్నించారు. వారు ఆర్థికంగా, విద్యాపరంగా ఎదగకుండా కులవృత్తిలోనే బతకాలా అని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజలకు మేలు జరిగితేనే నాకు ఓటు వేయండని ధైర్యంగా చెబుతున్న సీఎం జగన్ లాగా చెప్పగల దమ్ముందా అని చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబు ఏది చెబితే అదేనంటూ.. కూటమిలో పార్టీలు బుర్రకథల బ్యాచ్‌లా ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2014లో కోటిమంది నిరుపేదలు ఉన్నప్పుడు ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి చెల్లిస్తానని మాయమాటలు చెప్పి ఏ ఒక్కరికి ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా..ఇప్పుడు 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తానని అసత్యాల దొంతర అయిన మేనిఫెస్టోలో చెప్పటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.



ఖరీదు కట్టే షరాబు లేడు

ఇంతకు ముందు వివరించి చెప్పడం కొంత కష్టమయ్యేది. ఇప్పుడు అర్బన్ క్లాప్ వంటి సంస్థలు వచ్చాయి కనుక సులువు. అర్బన్ క్లాప్ వారికి బాత్‌రూమ్‌ల క్లీనింగ్ కోసం కాల్ చేస్తే వాళ్లు ఒక్కో బాత్‌రూమ్‌కు ఇంతని చార్జ్ చేస్తారు. ఇంట్లో రెండుంటే రెంటికీ చార్జ్ పడుతుంది. అదీ ఒకసారికి అమ్మ వారంలో రెండు సార్లు, నెలలో ఏడెనిమిది సార్లు రెండు బాత్‌రూమ్‌లు కడుగుతుంది. ఆమెకు ఆ చార్జ్ మొత్తం ఇవ్వాలి లెక్క ప్రకారం. అలాగే కిచెన్ క్లీన్ చేయాలంటే కూడా ఒక చార్జ్ ఉంటుంది. అమ్మ రోజూ వంటిల్లు సర్ది సర్ది, ప్లాట్‌ఫామ్ కడిగి, స్టవ్ రుద్ది క్లీన్ చేస్తుంది. ఆ చార్జ్ కూడా ఆమెకు ఇవ్వాలి. అమ్మ శ్రమకు కనీసం విలువ కట్టాలని కొన్ని సందర్భాలలో కోర్టులు కూడా అంటున్నాయి. కొన్ని సంస్థలు అమ్మ శ్రమను ఎలా విలువ కట్టవచ్చో కూడా చెబుతున్నాయి.



1. అపర్చునిటీ కాస్ట్ మెథడ్:
అంటే అమ్మ బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తే నలభై వేలు వస్తాయనుకుంటే, ఆమె ఆ ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండిపోతే ఆమె శ్రమ విలువను నెలకు నలభై వేలుగా గుర్తించాలి. (అమ్మ ఉద్యోగం చేసి కూడా అంత శ్రమా చేస్తుంటే నలభైకి మరో నలభై కలిపి ఇంటికి ఇస్తున్నట్టు).

2. రీప్లేస్‌మెంట్ కాస్ట్ మెథడ్:
ఇల్లు చిమ్మడం, బట్టలుతకడం, ఆరిన బట్టల్ని మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడం, బిల్లులు కట్టడం, వంట చేయడం, ఇంటిని కనిపెట్టుకుని ఉండటం... వీటన్నింటినీ బయట వ్యక్తులతో సర్వీసుగా తీసుకుంటే (అర్బన్ క్లాప్ మాదిరిగా) ఎంత అవుతుందో లెక్కగట్టి అది అమ్మ చేసే పని శ్రమగా గుర్తించడం.

3. ఇన్‌పుట్/అవుట్‌పుట్ కాస్ట్ మెథడ్:
అలా కాకుండా ఈ పనులన్నింటికీ ఒక యోగ్యమైన ఉద్యోగిని పెట్టుకుంటే మార్కెట్ అంచనాను బట్టి ఎంత జీతం ఇవ్వాల్సి వస్తుందో అంత జీతం ఇవ్వడం.

అవన్నీ సరే. కంటికి కనిపించే పనులకు కట్టే విలువ. కాని పిల్లవాడు స్కూల్లో పడి దెబ్బ తగిలించుకుని ఇంటికి వస్తే అమ్మ దగ్గరకు తీసుకుని, మందు రాసి, ధైర్యం చెప్పి, వాడి పక్కన కూచుని కబుర్లు చెప్తుందే... ఆ ప్రేమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?


మే డే రోజున ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదాలు వినిపిస్తుంటాయి. కాని ఇంటి పని చేస్తూ, అది ఎక్కువైనా చేస్తూ, కుటుంబమంతా ఆ పనిలో భాగం కావాలన్న సంగతిని చెప్పడానికి కూడా తటపటాయిస్తూ, అది వద్దనుకుంటే ఆ ఆప్షన్ లేక, తప్పించుకోవడానికి వీల్లేని ఆ పనిని చేస్తూ కూడా విలువ లేని పని చేస్తున్నామన్న న్యూనతను అనుభవిస్తూ తమ హక్కులు ఏమిటో తమకే తెలియని తల్లి, భార్య, కుమార్తె, చెల్లెళ్లను కార్మికులుగా గుర్తించాలని ఎవరూ అనుకోరు

స్త్రీల ఇంటి శ్రమ దేశంలోని యంత్రాంగం సజావుగా పనిచేయడంలో కీలకమైనది. వారు..
1. దేశం కోసం పని చేసి రిటైరైన వృద్ధుల సేవలో ఉంటారు. 2. దేశానికి ఆదాయం తెచ్చిపెట్టే యువత సేవలో ఉంటారు. 3 దేశానికి భవిష్యత్తులో అంది రావాల్సిన పిల్లల సేవలో ఉంటారు

'కుటుంబం' అనే బంధంలోకి వచ్చి కూతురిగా, కోడలిగా, భార్యగా వీరు 'ప్రేమ'తో, 'బాధ్యత'తో, 'బంధం'తో ఈ సేవ చేస్తారు. అంత మాత్రం చేత ఈ సేవను నిరాకరించడానికి వీల్లేదు. శ్రమగా చూడక్కర్లేదని భావించకూడదు. ఇంత చేస్తున్నా 'ఇంట్లో కూచుని ఏం చేస్తుంటావ్?' అనే మాటను వాళ్లు పడాలా?

ఉద్యోగం చేసినా చేయకపోయినా ఒక గృహిణి రోజుకు సగటున మూడున్నర గంటలు ఇంటి పని చేస్తుంటే పురుషుడు కేవలం గంటన్నర ఇంటి పని చేస్తున్నాడు

స్త్రీలు తమ ఇంటి పనిని ఒక్కరోజు మానేసి సహాయనిరాకరణ చేస్తే దేశం స్తంభిస్తుంది. అందుకే స్త్రీల శ్రమను గౌరవించే మే డే రోజున వారికి కృతజ్ఞతలు తెలియచేయాలి. విలువైన శ్రమ చేస్తున్నందుకు సమాజం వారికి హార్దిక అభినందనలు తెలియచేయాలి •


1. సాచి 2. షలీన హ్యాట్స్ 3. అవంతి 4 అనన్య నందా 5. అంకిత కుందు 6 రజిత బెనర్జీ 7 లిష మిశ్రా 8. మైథిలీ ఠాకూర్ 9. దియా వదిరాజ్

యూత్ పల్స్

సెల్ఫ్-మేడ్ మ్యూజిక్ స్టార్స్

క్షణ క్షణం సంగీత పర్వం

యువ సంగీతాభిమానులకు అచ్చంగా నచ్చే మాట... మ్యూజిక్ మేక్స్ ఎవ్రీ థింగ్ బెటర్. ఇట్టే మరిచిపోయే లక్షణం నుంచి జ్ఞాపకశక్తి పెరగడం వరకు, క్రియేటివిటీని ఎంజాయ్ చేయడం నుంచి క్రియేటివ్ పవర్ పెంచుకోవడం వరకు, జడత్వం నుంచి నిత్యజీవనోత్సాహం వెల్లివిరియడం వరకు, అనామకత్వం నుంచి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగడం వరకు ఎన్నో రకాలుగా సంగీతం యువతకు బలం అయింది. సంగీత రత్నాలను వెదుకుతూ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలోకి అడుగు పెట్టిన యువతరం ఆ ప్లాట్‌ఫామ్‌లలోనే మ్యూజిక్ స్టార్‌లుగా మెరవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రత్యేకత.


ఆరు సంవత్సరాల వయసులో పాటల కోసం గొంతు సవరించింది బెంగళూరుకు చెందిన దియా వదిరాజ్. రకరకాల మ్యూజిక్ జానర్‌లలో టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది. కోల్‌కతాకు చెందిన రజిత బెనర్జీ అయిదు సంవత్సరాల వయసులో 'సింగింగ్ స్టార్' షోలో పాల్గొంది. 'స రే గ మ ప' లిటిల్ ఛాంప్స్‌లో ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలిచింది. 'స్వీట్ వాయిస్' రజిత గొంతు నుంచి వచ్చిన 'జరాసీ ఆహట్' పాట 6.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మల్టీ టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది అంకిత కుందు. రియాల్టీ షోలలో పాడడం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బిహార్‌కు చెందిన మైథిలీ ఠాకూర్ రైజింగ్ స్టార్ షోతో ఫేమ్ అయింది. భోజ్‌పురి, క్లాసికల్, ఫోక్ సాంగ్స్‌ను పాడడంలో మంచి పేరు తెచ్చుకుంది. యూట్యూబ్‌లో ఆమె వీడియోలు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇండియన్-అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ లిశా మిశ్రా పాటలను రికార్డ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. బాలీవుడ్ సినిమాలలో కూడా పాడింది. ఇండియన్ ఐడల్ జూనియర్‌గా 2015లో సంగీత ప్రపంచానికి పరిచయం అయింది భువనేశ్వర్‌కు చెందిన అనన్య నందా. బాలీవుడ్ పాటల్లోనే కాదు క్లాసికల్‌లోనూ మంచి పేరు తెచ్చుకుంది. మెలోడియస్ వాయిస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

బోస్టన్ (యూఎస్)లో పుట్టిన అవంతి నగ్రల్‌కు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ముంబైకి వచ్చిన తరువాత తన పాషన్‌నే కెరీర్‌గా చేసుకుంది. మ్యూజిక్‌లో రకరకాల జానర్స్‌ను మిక్స్ చేయడంలో గట్టి పట్టు సాధించిన అవంతికి యూట్యూబ్ చానల్ కూడా ఉంది. ఇందులో తన లైవ్ పర్‌ఫార్మెన్స్ వీడియోలను అప్‌లోడ్ చేస్తుంది. అవంతికి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

ఆర్ అండ్ బీ, హిప్-హాప్, సోల్, పాప్ మ్యూజిక్‌లలో బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటోంది షలీన హ్యాట్స్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ముంబైకి చెందిన సాచి రాజాధ్యక్ష ఆల్ట్-పాప్ మ్యూజిక్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఆమె పవర్‌ఫుల్, సోల్ వాయిస్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

దియ నుంచి అవంతి వరకు ఎందరో, ఎందరెందరో యంగ్ మ్యూజిషియన్స్ సంగీతం పట్ల అంకితభావంతో సెల్ఫ్-మేడ్ సూపర్‌స్టార్‌లుగా ఎదిగారు. ఎంతోమంది ఔత్సాహికులకు రోల్ మోడల్స్‌గా మారారు. •



స్పాటిఫైతో ప్రయాణం ప్రారంభించి స్టార్‌గా ఎదిగిన ఆర్టిస్ట్‌లలో జస్లీన్ రాయల్ ఒకరు. సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. హిట్ బాలీవుడ్ ట్రాక్స్ కంపోజ్ చేసింది. 'ప్రపంచ ప్రేక్షకులతో కనెక్ట్ కావడానికి, శ్రోతల అభిప్రాయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులు చేయడానికి స్పాటిఫై ఉపయోగపడింది' అంటుంది జస్లీన్ రాయల్.

సినిమా

- తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
- రూ. రెండు కోట్లు వసూలు చేసిన తొలి తెలుగు చిత్రం
- జాతీయ అవార్డు తెచ్చుకున్న తొలి తెలుగు పాట 'తెలుగు వీర లేవరా...'
- ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం

అల్లూరికి అర్ధ శతాబ్దం



'మా మన్యం దొర సీతారామరాజు వచ్చాడు'... ప్రజల్లో సంబరం. దొరకు పాదాభివందనం చేశారు. కానీ అతను నిజమైన దొర కాదు. మన్యం దొర అల్లూరి సీతారామ రాజు గెటప్ వేసుకున్న నటుడు. అప్పటికే నిజమైన అల్లూరి సీతారామరాజుని చూసిన కొందరు వృద్ధులు లొకేషన్లో ఆ గెటప్‌లో ఉన్న నటుడికి పాదాభివందనం చేశారు. వెండితెరపై సీతారామరాజుగా కనిపించక ముందే అలా షూటింగ్ లొకేషన్లో [illegible] 'భేష్' అనిపించుకున్నారు కృష్ణ. అల్లూరి సీతారామరాజు గెటప్ అంటే కృష్ణ తప్ప వేరే ఏ నటుడూ వద్దు అనేంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు సూపర్ స్టార్. 1974 మే 1న విడుదలైన 'అల్లూరి సీతారామరాజు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొన్ని విశేషాలు తెలుసుకుందాం...

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'అగ్గిరాముడు' సినిమా 1954 ఆగస్టు 5న విడుదలైంది. బుర్రిపాలెంకు చెందిన కృష్ణ తెనాలిలో ఆ సినిమా చూశారు. అందులో అల్లూరి గురించి బుర్రకథగా చెప్పే సీన్ కృష్ణను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై సింహ'ని కూడా చూశారు కృష్ణ. ఆ సినిమా పాటల పుస్తకం చివరి పేజీలో ఎన్టీఆర్ తర్వాతి చిత్రం 'అల్లూరి సీతారామరాజు' అనే ప్రకటనతో పాటు అల్లూరి గెటప్‌లో స్కెచ్‌తో గీసిన ఎన్టీఆర్ బొమ్మ ఉంది. ఆ సినిమా కోసం కృష్ణ ఎదురు చూశారు. అయితే ఆ సినిమా ప్రారంభమైనా తర్వాత ఆగిపోయింది. పై చదువుల కోసం ఏలూరు వెళ్లిన కృష్ణకి నాటకాలపై ఆసక్తి కలిగింది. అది కాస్తా సినిమాలవైపు మళ్లడంతో చెన్నైకి చేరుకున్నారు. అప్పుడు ప్రజా నాట్యమండలి రాజారావు బృందం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నాటకానికి మంత్రముగ్ధుడయ్యారు కృష్ణ. ఆ తర్వాత హీరో అయిన కృష్ణ 'అసాధ్యుడు'లో (1968) అంతర్నాటకంలో భాగంగా సీతారామరాజు వేషం వేశారు. ఆ వేషంలో చక్కగా ఉన్నారంటూ జనాలు కితాబిచ్చారు. దీంతో తాను హీరోగా అల్లూరి చరిత్రతో సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు కృష్ణ. అయితే 1972లో శోభన్‌బాబు హీరోగా సీతారామరాజు మూవీ నిర్మించనున్నట్లు డి. లక్ష్మీ నారాయణ (డీఎల్) ప్రకటించారు. కానీ అనారోగ్యం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నారాయన. కృష్ణ హీరోగా 'పెద్దలు మారాలి' సినిమా తీశారు డీఎల్. ఆ చనువుతో సీతారామరాజు కథని కృష్ణకి ఇచ్చి, ఆసక్తి ఉంటే సినిమా తీసుకోమన్నారు. అలా 'అల్లూరి సీతారామరాజు' చేసే అవకాశం కృష్ణకి వచ్చింది.



డేరింగ్ అండ్ డ్యాషింగ్ కృష్ణ

కృష్ణకు 'డేరింగ్ అండ్ డ్యాషింగ్' అని పేరు. 'అల్లూరి సీతారామరాజు' కథలో వాణిజ్యపరమైన అంశాలు ఉండవని, పైగా హీరో చనిపోతాడని ఫైనాన్స్ ఇవ్వడానికి ఫైనాన్షియర్లు, పంపిణీ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. 'ఇంత రిస్క్ అవసరమా.. ఈ సినిమా వద్దు' అని శ్రేయోభిలాషులు కృష్ణకు చెప్పారు. ఎన్టీఆర్ కూడా వద్దనే అన్నారు. అయినా తాను ఓ హీరోగా రూపొందిన 'దేవుడు చేసిన మనుషులు' శత దినోత్సవంలో అల్లూరి సీతారామరాజు సినిమా తీస్తున్నానని, అది తన నూరో చిత్రంగా ఉంటుందని కృష్ణ ప్రకటించారు. 1973 డిసెంబరులో మద్రాస్ వాహినీ స్టూడియోలో షూటింగ్ ఆరంభమైంది. అల్లూరి సీతారామరాజు గెటప్‌లో ఉన్న కృష్ణపై ఫస్ట్ షాట్ తీశారు. సినిమా మొదలుపెట్టినప్పట్నుంచి అనేక ఇబ్బందులు. చింతపల్లి అడవిలో షూటింగ్ కాబట్టి అక్కడ గెస్ట్ హౌస్‌లు లేకపోవడంతో యూనిట్‌లోని దాదాపు ఐదువందల మందికి ఒక కాలనీలా తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండ ప్రాంతంలో షూటింగ్. భయంకరమైన చలి. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశారు దర్శకుడు రామచంద్రరావు అస్వస్థతకి గురి కావడం ఓ ఊహించని షాక్. ఆయన్ని చెన్నైకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం చేయించినా కోలుకోలేదు. ఫిబ్రవరి 14న తుది శ్వాస విడిచారు. మిగతా భాగాన్ని కృష్ణ తెరకెక్కించారు. యుద్ధ సన్నివేశాలను దర్శకుడు కేఎస్ఆర్ దాస్ రూపొందించారు. రామచంద్రరావు మీద గౌరవంతో దర్శకుడిగా ఆయన పేరే ఉంచేశారు కృష్ణ.

సినిమా స్కోప్.. ఈజీ కాదు

తెలుగులో పూర్తి స్థాయిలో రూపొందిన తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. అయితే అప్పుడు సినిమా స్కోప్ అంత ఈజీ కాదు. ఈ మూవీకి వీఎస్ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు. అప్పట్లో సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసేందుకు రెండే లెన్స్‌లు ఉండేవట. కాగా సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసే లెన్స్‌కి కెమెరా వ్యూఫైండర్స్ ఉండవట. దీంతో ఊహించుకుని ఫ్రేమ్ సెట్ చేసుకునేవారట. ఈ ప్రక్రియను వీఎస్ ఆర్ స్వామి ముంబైలో అధ్యయనం చేసి రావడంతో 'అల్లూరి సీతారామరాజు' ఈజీగా చేయగలిగారు.

అల్లూరి చేయిసన్న ఎన్టీఆర్

అల్లూరి సీతారామరాజు సినిమా మొదలుపెట్టి, ఆపినా ఆ సినిమా తీయాలన్న ఎన్టీఆర్ ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' వచ్చిన చాలా ఏళ్లకు ఆ సినిమా తీద్దామని పరుచూరి బ్రదర్స్‌తో అన్నారు ఎన్టీఆర్. కానీ సోదరులు వద్దని సలహా ఇచ్చి, కృష్ణ చేసిన సినిమా చూడమన్నారు. ఎన్టీఆర్ కోరిక మేరకు 'అల్లూరి సీతారామరాజు'ని ప్రత్యేకంగా చూపించారు కృష్ణ. "అద్భుతంగా తీశారు. నేను అల్లూరి సీతారామరాజు తీయను" అన్నారు ఎన్టీఆర్.

మహారథి చేతికి స్క్రిప్ట్

త్రిపురనేని మహారథి చేతిలో డీఎల్ ఇచ్చిన స్క్రిప్ట్ పెట్టి, 'ఈ సబ్జెక్ట్‌లో సినిమా తీయడానికి కావాల్సినంత దమ్ము ఉందా' అడిగారు కృష్ణ సోదరుడు హనుమంతరావు. 'చాలా ఉంది' అన్నారు మహారథి. కానీ, తనకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో ఒక్క సన్నివేశం తప్ప మహారథికి వేరే ఏదీ నచ్చలేదు. పరిశోధనలు చేసి, స్క్రిప్ట్ తయారు చేశారు. దర్శకుడిగా వి. రామచంద్రరావును తీసుకున్నారు. సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీయాలని నిర్ణయించింది పద్మాలయా స్టూడియోస్ సంస్థ (కృష్ణ సొంత నిర్మాణ సంస్థ).

అల్లూరి పాటలు అజరామరం

'అల్లూరి సీతారామరాజు'లోని పాటలన్నీ సూపర్ హిట్. పి. ఆదినారాయణరావు ఈ సినిమాకు సంగీత దర్శకుడు. సినిమా ఆరంభంలో వచ్చే 'రగిలింది విప్లవాగ్ని..', సినిమా చివర్లో వచ్చే.. 'ఓ విప్లవజ్యోతి...' పాటలకు ఆరుద్ర సాహిత్యం అందించగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. 'వస్తాడు నా రాజు..' పాటను నారాయణరెడ్డి రాయగా, 'హైలెస్సా.. హైలెస్సా... కొండ దేవతా నిన్ను కొలిచేవమ్మా..' పాటలను కొసరాజు రాశారు. 'తెలుగు వీర లేవరా..' పాటను శ్రీశ్రీ రాశారు. ఈ పాటను ఘంటసాలతోనే పాడించాలన్నది కృష్ణ సంకల్పం. ఆ సమయానికి ఘంటసాల ఆరోగ్యం సరిగా లేదు. ఆ తర్వాత ఘంటసాల ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఆయన ఈ పాట పాడారు. కానీ ఈ సినిమా విడుదల కాకముందే ఘంటసాల కాలం చేశారు. ఈ పాటకు వి రామకృష్ణ గొంతు కలిపారు. ఈ పాటకుగాను జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డు శ్రీశ్రీని వరించింది. ఓ తెలుగు సినిమాలోని పాటకు జాతీయ పురస్కారం రావడం అదే తొలిసారి. అలాగే ఇదే సినిమాలోని 'వందేమాతరం అంటూ నినదించిన..', 'హ్యాపీ క్రిస్మస్..' పాట, 'అరుణాయ శరణ్యాయ' శ్లోకం వంటివి కూడా వీనుల విందుగా ఉంటాయి

రికార్డులు భళా

'అల్లూరి సీతారామరాజు' సినిమా 19 కేంద్రాల్లో (బెంగళూరుతో కలుపుకుని) వందరోజులు, 2 కేంద్రాల్లో 25 వారాలు, హైదరాబాద్‌లోని సంగం థియేటర్‌లో రజతోత్సవం, అలాగే షిఫ్టింగులతో ఏడాది పాటు ఆడటం విశేషం. ఈ చిత్రం స్వర్ణోత్సవం చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో ఘనంగా జరిగాయి స్వాతంత్ర్య సమరయోధులు ఇంటూరి వెంకటేశ్వరరావు, అనిసెట్టి సుబ్బారావు, దాశరథి, సుంకర సత్యనారాయణ, కేఎస్ గోపాలకృష్ణన్ వంటి వారిని సత్కరించారు. అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ. పదివేలతో ఓ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాలను సీతారామరాజు సోదరుడు సత్యనారాయణరాజుకి అందించారు కృష్ణ. ఇలా ఈ సినిమాకి సంబంధించిన విశేషాలు చాలా ఉన్నాయి.


'అల్లూరి...' తర్వాత 'పాడి పంటలు'తోనే హిట్... 'అల్లూరి సీతారామరాజు' చూసిన విజయా వాహిని సంస్థ అధినేతల్లో ఒకరైన దర్శక-నిర్మాత చక్రపాణి అభినందించారు. కానీ 'ఈ సినిమా తర్వాత నీ సినిమాలు ఆడటం కష్టం' అని కూడా కృష్ణతో అన్నారు. ఆయన అన్న మాటలు నిజమయ్యాయి. 'అల్లూరి సీతారామరాజు' తర్వాత కృష్ణ చేసిన ప్రతి చిత్రాన్నీ ఈ సినిమాతో పోల్చారు ప్రేక్షకులు. దాంతో ఆ తర్వాత కృష్ణ నటించిన పది సినిమాలకు పైగా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. చివరికి పద్మాలయా స్టూడియోస్ నిర్మించిన 'పాడి పంటలు'(1976) విజయంతో హీరోగా కృష్ణ పూర్వ వైభవాన్ని పొందారు.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు


● అబ్బూరి రవి

'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ– "ఈ సినిమాలో పెళ్లి అనే సబ్జెక్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూనే, ఆడియన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా తీశాం. ముఖ్యంగా ఇది పెళ్లి కాని ప్రతి వారు కోరుకునే కంటెంట్. క్లీన్ ఎంటర్‌టైనర్. 'ఆ ఒక్కటీ అడక్కు' అనేది ఈవీవీగారి క్లాసిక్ టైటిల్. ఈ సినిమాకు ఈ టైటిల్‌ను అన్నప్పుడు కాస్త భయం వేసింది. కానీ ఈ కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోతుందని నరేశ్‌గారే సూచించారు. ఇక నాకు డైరెక్షన్ చేయాలని ఉంది. ఆ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం 'గూఢచారి 2', 'డెకాయిట్' సినిమాలకు వర్క్ చేస్తున్నాను" అని చెప్పుకొచ్చారు.

ముఫాసా ఈజ్ బ్యాక్




హాలీవుడ్ లయన్ కింగ్ మళ్లీ వస్తున్నాడు. 1994లో వచ్చిన యానిమేటెడ్ మ్యూజికల్ డ్రామా 'ది లయన్ కింగ్' ఆధారంగా 'ది లయన్ కింగ్' టైటిల్‌తోనే సినిమా వచ్చింది. జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ముఫాసా, సింబ (ముఫాసా తనయుడు), ముఫాసా తమ్ముడు స్కార్‌లు ప్రధాన పాత్రధారులుగా 'ది లయన్ కింగ్' సినిమా కథనం సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ట్రైలర్, ఫస్ట్ లుక్ విడుదలైంది. డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' రిలీజ్ కానుంది

వినూత్న కథాంశంతో...



● విరాజ్ అశ్విన్, రవితేజ మహాదాస్యం

రవితేజ మహాదాస్యం హీరోగా మద్దుల మదన్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆర్ట్ మేకర్స్ సమర్పణలో సౌజన్య కావూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సీన్‌కి విరాజ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సహనిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.

తిండిబోతు దెయ్యం


● నరసింహా, మోనిక, వాసవి

నరసింహా బోదాసు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కామెడీ హారర్ ఫిల్మ్ 'తిండిబోతు దెయ్యం'. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరోయిన్లు. శిరీష నరసింహా బోదాసు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శిరీష నరసింహా బోదాసు కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. "ఈ సినిమాలో కొత్తదనం ఉంటుంది" అన్నారు నరసింహా బోదాసు



ఇంగ్లండ్ టి20 జట్టులో జోఫ్రా ఆర్చర్

గాయం నుంచి కోలుకుని పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకున్న పేస్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఏడాది తర్వాత మళ్లీ ఇంగ్లండ్ జట్టులోకి వచ్చాడు. టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే ఇంగ్లండ్ జట్టును మంగళవారం ప్రకటించారు. ఆర్చర్ పునరాగమనం చేయగా, జోస్ బట్లర్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. మొయిన్ అలీ, బెయిర్‌స్టో, హ్యారీ బ్రూక్, స్యామ్ కరన్, బెన్ డకెట్, టామ్ హార్ట్‌లే, విల్ జాక్స్, క్రిస్ జోర్డాన్, లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, రీస్ టాప్లే, మార్క్ వుడ్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.





రోహిత్ శర్మ

ప్రపంచకప్ వేటకు సిద్ధం

టి20 ప్రపంచకప్ సమరాన్ని గెలిచేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ మరోసారి అనుభవాన్నే నమ్ముకుంది. ఐపీఎల్‌లో అద్భుత బ్యాటింగ్‌తో కొందరు కుర్రాళ్లు అదరగొడుతున్నా... సీనియర్లకు ప్రాధాన్యతనిచ్చింది. దీంతో పాటు ప్రస్తుతం ఫామ్ గొప్పగా లేకున్నా... అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఇప్పటికే ఎంతో కొంత ప్రభావం చూపించిన వారిపైనే కమిటీ విశ్వాసం ఉంచింది. గత టి20 వరల్డ్ కప్‌లో ఆడిన 9 మందికి ఈసారి మళ్లీ అవకాశం కల్పించింది. అందుకే వరల్డ్ కప్ టీమ్ సెలక్షన్ దాదాపుగా అంచనాలకు తగినట్లుగానే సాగింది. ఒకరిద్దరు ఆటగాళ్ల ఎంపిక విషయంలో కాస్త ఆశ్చర్యకర నిర్ణయాలు కనిపించినా... మొత్తంగా అర్హత కలిగిన వారికే అమెరికా–వెస్టిండీస్ వీసా లభించింది. గత వరల్డ్ కప్ సెమీఫైనల్లో ఓటమి తర్వాత పూర్తిగా కుర్రాళ్లతో టి20ల్లో బోర్డు కొత్త ప్రయోగాలు చేసినా... తర్వాతి మెగా టోర్నీకి వచ్చేసరికి మళ్లీ తమ పాత ప్రణాళికకే కట్టుబడటం చెప్పుకోదగ్గ అంశం.

టి20 మెగా టోర్నీకి భారత జట్టు ప్రకటన

రిషభ్ పంత్ పునరాగమనం

సామ్సన్, దూబే, యశస్వి జైస్వాల్‌లకు అవకాశం

గిల్, రాహుల్, రింకూలకు దక్కని చోటు

అనుభవజ్ఞులకే అవకాశమిచ్చిన సెలక్టర్లు

అహ్మదాబాద్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 9వ టి20 ప్రపంచ కప్ కోసం భారత సెలక్టర్లు 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బోర్డు సెలక్షన్ కమిటీ మంగళవారం సమావేశమై ఆటగాళ్లను ఎంపిక చేసింది. రోహిత్ శర్మ వరుసగా రెండో టి20 ప్రపంచకప్‌లో కెప్టెన్ హోదాలో బరిలోకి దిగనుండగా... 2022లో ఆస్ట్రేలియా గడ్డపై టి20 వరల్డ్ కప్‌లో ఆడిన వారిలో 9 మంది ఈసారీ టీమిండియా చాన్స్ దక్కించుకున్నారు. గత టోర్నీలో భారత్ సెమీఫైనల్ వరకు చేరింది. సెలక్టర్లు ప్రకటించిన జట్టులో నలుగురు బ్యాటర్లు, ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లు, ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు ఉన్నారు. మరో నలుగురు ఆటగాళ్లను రిజర్వ్‌లుగా కూడా ఎంపిక చేశారు. జూన్ 1 నుంచి 29 వరకు జరిగే వరల్డ్ కప్‌లో గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ జూన్ 5న తమ తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడుతుంది. ఆ తర్వాత జూన్ 9, 12, 15 తేదీల్లో వరుసగా పాకిస్తాన్, అమెరికా, కెనడా జట్లను టీమిండియా ఎదుర్కొంటుంది. ఐపీఎల్‌లో ప్లే ఆఫ్స్ చేరని జట్ల ఆటగాళ్లతో కూడిన మొదటి బృందం ఈ నెల 21న ముందుగా కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు అమెరికాకు బయల్దేరుతుంది.

జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, సంజూ సామ్సన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చహల్, అర్‌‌ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్. **రిజర్వ్ ఆటగాళ్లు:** శుబ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, ఆవేశ్ ఖాన్

ఐపీఎల్ ప్రదర్శనతోనే...

జట్టు ఎంపికలో తాజా ఐపీఎల్ ప్రదర్శనను సెలక్టర్లు పరిగణనలోకి తీసుకున్నారా అంటే అవునని, కాదని కూడా సమాధానం వస్తుంది. చెన్నై తరఫున మిడిలార్డర్‌లో ఒక్కర్లతో చెలరేగిపోతున్న శివమ్ దూబేకు ఐపీఎల్ కారణంగానే పిలుపు దక్కింది. ఈ టోర్నీలో అతను ఏకంగా 172.41 స్ట్రయిక్‌రేట్‌తో 350 పరుగులు సాధించాడు. భారత్‌కు ఆడిన 21 టి20ల్లో కూడా అతను ఆకట్టుకున్నాడు. ఇక కారు ప్రమాదం నుంచి కోలుకొని ఐపీఎల్‌లో రాణిస్తున్న రిషభ్ పంత్‌ను కూడా సెలక్టర్లు ఎంపిక చేశారు. లీగ్‌లో అతను 158.58 స్ట్రయిక్‌రేట్‌తో 398 పరుగులు చేశాడు. అయితే పరుగులకంటే పూర్తి ఫిట్‌గా పంత్ కనిపించడం కూడా సానుకూలాంశంగా మారింది. మరోవైపు రెండో వికెట్ కీపర్‌గా కేరళకు చెందిన సంజూ సామ్సన్ కూడా ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా రాజస్తాన్ రాయల్స్ టీమ్‌ను సమర్థంగా నడిపించడంతో పాటు 161.08 స్ట్రయిక్‌రేట్‌తో సామ్సన్ 385 పరుగులు సాధించాడు.

ఎవరు... ఎందుకు... ఎలా?

2022 వరల్డ్ కప్‌కు ఎంపిక చేసిన ఆడిన జట్టుతో పోలిస్తే రోహిత్, కోహ్లి, సూర్యకుమార్, పంత్, హార్దిక్, అక్షర్, అర్‌‌ష్‌దీప్, చహల్, బుమ్రా (టోర్నీకి ముందు గాయంతో తప్పుకున్నాడు) తమ స్థానాలు నిలబెట్టుకున్నారు. 2021, 2022లో వరల్డ్ కప్‌లలో ఆడిన జట్టులో దాదాపు అదే టాప్–6 ఇప్పుడు కూడా మళ్లీ ఎంపికయ్యారు. కేఎల్ రాహుల్ స్థానంలో యశస్వి రావడం మినహా ఎలాంటి మార్పూ లేదు. యశస్వి ఈ సీజన్ ఐపీఎల్‌లో వరుస వైఫల్యాల తర్వాత సెంచరీతో ఆకట్టుకోవడంతో అతనికి అవకాశం దక్కింది. బ్యాటింగ్‌లో ఇప్పుడు కావాల్సిన 'ఫైర్' లేదని ఎన్ని విమర్శలు వస్తున్నా అగ్రశ్రేణి బ్యాటర్లుగా రోహిత్, కోహ్లిల స్థానం ఎప్పుడూ ప్రశ్నార్థకం కాదు. సూర్యకుమార్ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. రవీంద్ర జడేజా కూడా గొప్ప ప్రదర్శన చేయకపోయినా ఆల్‌రౌండ్ నైపుణ్యం అతనికి కలిసొచ్చింది. జడేజా ఉన్న తర్వాత అక్షర్ పటేల్ ఎంపిక కూడా కాస్త ఆశ్చర్యకరమే.

హార్దిక్ మళ్లీ...

ఇటీవల ఆటలో వైఫల్యాలతో పాటు ముంబై కెప్టెన్సీ వ్యవహారాలతో అన్ని వైపుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యాకు సెలక్టర్లు మాత్రం అండగా నిలిచారు. వన్డే వరల్డ్ కప్‌లో గాయపడి కోలుకున్న తర్వాత భారత్‌కు ఆడకపోయినా అతనిపై నమ్మకముంచారు. ఐపీఎల్‌లోనూ విఫలమైనా... అతని తరహాలో సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్థానం కోసం ప్రత్యామ్నాయం లేక ఎంపిక చేయక తప్పలేదు. దూబే అసలు బౌలింగ్ చేయకపోవడం, హార్దిక్ ఎన్నో కొన్ని ఓవర్లు వేస్తుండటం వల్ల కూడా అతని స్థానానికి ఢోకా లేకుండా పోయింది.

నలుగురు స్పిన్నర్లతో...

అమెరికాలో తొలిసారి వరల్డ్ కప్ జరుగుతుండంతో కొత్తగా అక్కడ తయారు చేస్తున్న పిచ్‌లు ఎలా ఉంటాయో సరిగ్గా ఎవరూ అంచనా వేయలేని పరిస్థితి. అయితే స్పిన్‌కు అవకాశం ఉంటే తమ అన్ని అస్త్రాలను వాడుకునేందుకు భారత్ సిద్ధమైంది. జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్, యుజువేంద్ర చహల్‌లు జట్టులో ఉన్నారు. కుల్దీప్ చాలా కాలంగా మంచి ఫామ్‌లో ఉండగా... గత రెండు సిరీస్‌లలో భారత జట్టులో చోటు దక్కించుకోని చహల్ పునరాగమనం చేసి తొలిసారి టి20 వరల్డ్ కప్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. మధ్య ఓవర్లలో ప్రత్యర్థిని కట్టడి చేసేందుకు వీరిని వాడుకోవచ్చు. బుమ్రాకు తోడుగా అర్‌‌ష్‌దీప్, సిరాజ్‌లను ఎంపిక చేశారు. ఈ ఫార్మాట్‌లో గొప్ప ప్రదర్శన లేకపోయినా, ఐపీఎల్‌లోనూ పెద్దగా రాణించలేకపోతున్నా... ప్రస్తుత స్థితిలో అనుభవం ఉన్న పేసర్ అతనే కావడంతో సిరాజ్‌కు తొలిసారి టి20 ప్రపంచకప్ ఆడే చాన్స్ లభించింది. లెఫ్టార్మ్ పేసర్ కావడమే అర్‌‌ష్‌దీప్ బలం. కొంత కాలంగా లయ కోల్పోయి ఇబ్బంది పడుతున్నా అర్‌‌ష్‌దీప్‌ను సెలక్టర్లు మళ్లీ నమ్మారు.

గత వరల్డ్ కప్‌లో సెమీస్ ఓటమి తర్వాత మళ్లీ అంతర్జాతీయ టి20 ఆడని రాహుల్‌ను తప్పించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అతని స్ట్రయిక్‌రేట్ కూడా అంతంత మాత్రమే. రాహుల్ తరహాలోనే శుబ్‌మన్ గిల్ కూడా ఈ ఫార్మాట్‌లో పెద్దగా ప్రభావం చూపించింది లేదు.



రాహుల్

పాపం రింకూ సింగ్...



వరల్డ్ కప్ జట్టు ఎంపికలో అన్నిరకాలుగా చర్చకు దారి తీసిన విషయం రింకూ సింగ్‌ను ఎంపిక చేయకపోవడం. విధ్వంసకర బ్యాటింగ్‌తో గత ఏడాది ఐపీఎల్ నుంచి అతను తానేంటో నిరూపించుకున్నాడు. లోయర్ మిడిలార్డర్‌లో ఫినిషర్‌గా సత్తా చాటాడు. భారత్ తరఫున లభించిన పరిమిత అవకాశాల్లో (11 ఇన్నింగ్స్‌లు) ఏకంగా 176.23 స్ట్రయిక్ రేట్, 89 సగటుతో పరుగులు సాధించాడు. కానీ చివరకు వచ్చేసరికి అతనికి వరల్డ్ కప్ చాన్స్ లభించలేదు. ఈసారి ఐపీఎల్‌లో గొప్పగా ఆడకపోవడం వాస్తవమే అయినా కోల్‌కతా టాపార్డర్ రాణిస్తుండటంతో అతనికి పెద్దగా అవకాశాలు రాలేదు. 9 మ్యాచ్‌లలో కేవలం 82 బంతులే ఆడే చాన్స్ దక్కింది. మిడిలార్డర్‌లో భారీ షాట్లు కొట్టే సామర్థ్యం ఉన్న బ్యాటర్ కోసం జరిగిన చర్చలో రింకూపై దూబేదే పైచేయి అయింది. ఒకవేళ తుది జట్టులో హార్దిక్‌ను తప్పించాల్సి వచ్చినా... దూబే బౌలింగ్ ఎంతో కొంత ఉపయోగపడగలదని సెలక్టర్లు భావించారు.

రోహిత్ శర్మ



వయసు: 37
ఆడిన టి20లు: 151
చేసిన పరుగులు: 3974
అత్యధిక స్కోరు: 121 నాటౌట్
సెంచరీలు: 5
అర్ధ సెంచరీలు: 29
స్ట్రయిక్‌రేట్: 139.97
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 8

విరాట్ కోహ్లి



వయసు: 35
ఆడిన టి20లు: 117
చేసిన పరుగులు: 4037
అత్యధిక స్కోరు: 122 నాటౌట్
సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 37
స్ట్రయిక్‌రేట్: 138.15
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 5

సూర్యకుమార్



వయసు: 33
ఆడిన టి20లు: 60
చేసిన పరుగులు: 2141
అత్యధిక స్కోరు: 117
సెంచరీలు: 4
అర్ధ సెంచరీలు: 17
స్ట్రయిక్‌రేట్: 171.55
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 2

హార్దిక్ పాండ్యా




వయసు: 30
ఆడిన టి20లు: 92
చేసిన పరుగులు: 1348
అత్యధిక స్కోరు: 71 నాటౌట్
అర్ధ సెంచరీలు: 3
స్ట్రయిక్‌రేట్: 139.86
తీసిన వికెట్లు: 73
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 3

రిషభ్ పంత్



వయసు: 26
ఆడిన టి20లు: 66
చేసిన పరుగులు: 987
అత్యధిక స్కోరు: 65 నాటౌట్
అర్ధ సెంచరీలు: 3
స్ట్రయిక్‌రేట్: 126.37
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 2

శివమ్ దూబే




వయసు: 30
ఆడిన టి20లు: 21
చేసిన పరుగులు: 276
అత్యధిక స్కోరు: 63 నాటౌట్
అర్ధ సెంచరీలు: 3
తీసిన వికెట్లు: 8
స్ట్రయిక్‌రేట్: 145.26
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

అర్‌‌ష్‌దీప్ సింగ్



వయసు: 25
ఆడిన టి20లు: 44
తీసిన వికెట్లు: 62
ఉత్తమ బౌలింగ్: 4/37
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 1

యుజువేంద్ర చహల్




వయసు: 33
ఆడిన టి20లు: 80
తీసిన వికెట్లు: 96
ఉత్తమ బౌలింగ్: 6/25
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

కుల్దీప్ యాదవ్



వయసు: 29
ఆడిన టి20లు: 35
తీసిన వికెట్లు: 59
ఉత్తమ బౌలింగ్: 5/17
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

రవీంద్ర జడేజా




వయసు: 35
ఆడిన టి20లు: 66
చేసిన పరుగులు: 480
అత్యధిక స్కోరు: 46 నాటౌట్
స్ట్రయిక్‌రేట్: 125.32
తీసిన వికెట్లు: 53
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 5

సంజూ సామ్సన్



వయసు: 29
ఆడిన టి20లు: 25
చేసిన పరుగులు: 374
అత్యధిక స్కోరు: 77
అర్ధ సెంచరీలు: 1
స్ట్రయిక్‌రేట్: 133.09
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

యశస్వి జైస్వాల్



వయసు: 22
ఆడిన టి20లు: 17
చేసిన పరుగులు: 502
అత్యధిక స్కోరు: 100
సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 4
స్ట్రయిక్‌రేట్: 161.93
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

జస్‌ప్రీత్ బుమ్రా



వయసు: 30
ఆడిన టి20లు: 62
తీసిన వికెట్లు: 74
ఉత్తమ బౌలింగ్: 3/11
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 2

మొహమ్మద్ సిరాజ్



వయసు: 30
ఆడిన టి20లు: 10
తీసిన వికెట్లు: 12
ఉత్తమ బౌలింగ్: 4/17
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

అక్షర్ పటేల్



వయసు: 30, ఆడిన టి20లు: 52
చేసిన పరుగులు: 361
తీసిన వికెట్లు: 49
ఉత్తమ బౌలింగ్: 3/9
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

రెండో టి20లోనూ భారత మహిళల గెలుపు

రాణించిన హేమలత, రాధా యాదవ్



సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన రెండో టి20కి వర్షం అంతరాయం కలిగించగా.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ 19 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 119 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ ముర్షిదా ఖాతున్ (49 బంతుల్లో 46; 5 ఫోర్లు) రాణించగా, రీతూ మోని (18 బంతుల్లో 20; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. రాధా యాదవ్ 3, శ్రేయాంక, దీప్తి శర్మ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు వర్షంతో ఆట నిలిచే సమయానికి 5.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది. భారత్ ఓపెనర్ షఫాలీ వర్మ (0) డకౌట్ కాగా, స్మృతి మంధాన (5 నాటౌట్) నింపాదిగా ఆడింది. కానీ హేమలత దయాళన్ (24 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగింది. మైదానం చిత్తడిగా మారడంతో మళ్లీ మ్యాచ్ కొనసాగించే అవకాశం లేకపోయింది. హేమలతకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ పరాజయం



చెంగ్డూ: ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత జట్టు లీగ్ దశను పరాజయంతో ముగించింది. ఆతిథ్య చైనా జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0–5తో పరాజయం పాలైంది. వరుసగా మూడో విజయంతో చైనా గ్రూప్ టాపర్‌గా నిలువగా... ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత జట్టు రెండు విజయాలు సాధించి రెండో స్థానంతో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. చైనాతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో ఇషారాణి 12–21, 10–21తో చెన్ యు ఫె చేతిలో... రెండో మ్యాచ్‌లో ప్రియ–శ్రుతి మిశ్రా 13–21, 12–21తో చెన్ కింగ్ చెన్–జియా యి ఫాన్ చేతిలో ఓడిపోయారు. హన్ యుయెతో జరిగిన మూడో మ్యాచ్‌లో అన్‌మోల్ తొలి గేమ్‌ను 9–21తో కోల్పోయి రెండో గేమ్‌లో 1–4తో వెనుకబడిన దశలో గాయపడి వైదొలిగింది. దాంతో చైనా 3–0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో సిమ్రన్ సింగ్–రితిక ద్వయం 9–21, 10–21తో లియు షెంగ్ షు–టాన్ నింగ్ జోడీ చేతిలో ఓడిపోగా... ఆఖరి మ్యాచ్‌లో తన్వి శర్మ 7–21, 16–21తో వాంగ్ జి యి చేతిలో ఓటమి పాలైంది.

సూపర్ స్టొయినిస్...

- లక్నో ఖాతాలో ఆరో విజయం
- ముంబై ఇండియన్స్‌కు ఏడో ఓటమి



లక్నో: బౌలర్లు శాసించిన ఐపీఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ పైచేయి సాధించింది. 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. నేహల్ వధేరా (41 బంతుల్లో 46; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 35 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మోసిన్ ఖాన్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్నో 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ (45 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్స్) నెమ్మదించిన పిచ్‌పై కీలకపాత్ర పోషించాడు. హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీశాడు.

ముంబై 28/4

మెరుపులు మెరిపించాల్సిన పవర్ ప్లేలో ముంబై కష్టాలపాలైంది. రోహిత్ (4), సూర్యకుమార్ (10), తిలక్ వర్మ (7), హార్దిక్ పాండ్యా (0) ఇలా హిట్టర్లంతా వరుస కట్టడంతో 6 ఓవర్లలో ముంబై 28/4 స్కోరు చేసింది. 8వ ఓవర్లో 8 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాన్ కిషన్‌కు లైఫ్ వచ్చింది. లేదంటే పరిస్థితి ఇంకాస్త క్లిష్టంగా ఉండేది. పదో ఓవర్లో ముంబై కష్టంగా 50 పరుగులు దాటింది. కిషన్ (36 బంతుల్లో 32; 3 ఫోర్లు) నేహల్ వధేరా ఐదో వికెట్‌కు 53 పరుగులు జోడించారు. వీళ్లిద్దరు అవుటయ్యాక ఆఖర్లో టిమ్ డేవిడ్ ధాటిగా ఆడటంతో ముంబై ఆ మాత్రం స్కోరు చేయగలిగింది.

మొదటి ఓవర్లోనే అర్షిన్ కులకర్ణి (0) డకౌటైనా... కెప్టెన్ రాహుల్ (22 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్), స్టొయినిస్ క్రీజులో పాతుకుపోవడంతో పవర్ ప్లేలో లక్నో 52/1 స్కోరు చేసింది. కాసేపటికే రాహుల్ నిష్క్రమించినప్పటికీ స్టొయినిస్ తర్వాత వచ్చిన బ్యాటర్స్‌తో జట్టును లక్ష్యం వైపు నడిపించాడు. 39 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. స్వల్ప వ్యవధిలో స్టొయినిస్, టర్నర్ (5) అవుటైనప్పటికీ పూరన్ (14 బంతుల్లో 14 నాటౌట్; 1 సిక్స్) బాధ్యతగా ఆడి మిగతా లక్ష్యాన్ని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) మయాంక్ (బి) బిష్ణోయ్ 32; రోహిత్ (సి) స్టొయినిస్ (బి) మోసిన్ 4; సూర్యకుమార్ (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 10; తిలక్ వర్మ (రనౌట్) 7; హార్దిక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 0; నేహల్ (బి) మోసిన్ 46; టిమ్ డేవిడ్ (నాటౌట్) 35; నబీ (బి) మయాంక్ 1; కొయెట్జీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 144. వికెట్ల పతనం: 1–7, 2–18, 3–27, 4–27, 5–80, 6–112, 7–123. బౌలింగ్: స్టొయినిస్ 3–0–19–1, మోసిన్ 4–0–36–2, నవీనుల్ 3.5–0–15–1, మయాంక్ 3.1–0–31–1, రవి బిష్ణోయ్ 4–0–28–1, దీపక్ హుడా 2–0–13–0

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) నబీ (బి) హార్దిక్ 28; అర్షిన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషార 0; స్టొయినిస్ (సి) తిలక్ (బి) నబీ 62; హుడా (సి) బుమ్రా (బి) హార్దిక్ 18; పూరన్ (నాటౌట్) 14; టర్నర్ (బి) కొయెట్జీ 5; బదోని (రనౌట్) 6; కృనాల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 145. వికెట్ల పతనం: 1–1, 2–58, 3–99, 4–115, 5–123, 6–133. బౌలింగ్: తుషార 4–0–30–1, బుమ్రా 4–0–17–0, కొయెట్జీ 3–0–29–1, పియూష్ చావ్లా 3–0–23–0, హార్దిక్ పాండ్యా 4–0–26–2, నబీ 1.2–0–16–1

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	9	8	1	16	0.694
కోల్‌కతా	9	6	3	12	1.096
లక్నో	10	6	4	12	0.094
చెన్నై	9	5	4	10	0.810
హైదరాబాద్	9	5	4	10	0.075
ఢిల్లీ	11	5	6	10	-0.442
గుజరాత్	10	4	6	8	-1.113
పంజాబ్	9	3	6	6	-0.187
ముంబై	10	3	7	6	-0.272
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × పంజాబ్
వేదిక: చెన్నై
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

హర్షిత్ రాణాపై జరిమానా, ఒక మ్యాచ్ సస్పెన్షన్



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ పేస్ బౌలర్ హర్షిత్ రాణా తన అనుచిత ప్రవర్తనతో భారీ మూల్యమే చెల్లించుకున్నాడు. అతనిపై 100 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించడంతో పాటు ఒక మ్యాచ్ సస్పెండ్ చేశారు. గతంలో హైదరాబాద్ బ్యాటర్ మయాంక్ అగర్వాల్‌ను అవుట్ చేశాక హర్షిత్ అతన్ని లక్ష్యంగా చేసుకొని 'ఫ్లయింగ్ కిస్' ఇవ్వడంతో 60 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు. తాజాగా సోమవారం ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో పోరెల్ వికెట్ తీసినప్పుడు కూడా అలాగే అతి చేశాడు. దీంతో రెండోసారి తప్పును పునరావృతం చేయడంతో ఐపీఎల్ నియమావళి ప్రకారం జరిమానాతో పాటు సస్పెన్షన్ వేటు వేశారు.

సాక్షి బిజినెస్
బుధవారం
1-5-2024

స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 188 74,482

నిఫ్టీ 38 [illegible]

బులియన్ 87,000

ఫారెక్స్ రేట్లు 10.30 12.39

ధర పెరిగినా బంగారమే



- జనవరి–మార్చి త్రైమాసికంలో డిమాండ్ 8% అప్
- పరిమాణంలో 136.6 టన్నులు
- ఆర్‌బీఐ కొనుగోళ్లు 19 టన్నులు

న్యూఢిల్లీ: భారత్ కుటుంబాల్లో బంగారానికి ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. దీనిని ప్రతిబింబిస్తూ, ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో 2023 ఇదే కాలంతో పోల్చితే భారత్ పసిడి డిమాండ్ 8 శాతం పెరిగి 136.6 టన్నులకు (ఆభరణాలు, పెట్టుబడులు) పెరిగింది. ధర తీవ్రంగా ఉన్నా ఈ స్థాయి డిమాండ్ నెలకొనడం గమనార్హం. సమీక్షా కాలంలో త్రైమాసిక సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్‌టీ మినహా) 10 గ్రాములకు రూ.49,943.80 నుంచి రూ.55,247.20కి ఎగసింది. ఇక భారత్ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇదే కాలంలో ఏకంగా 19 టన్నులు కొనుగోలు చేసింది. 2023 క్యాలెండర్ ఇయర్ మొత్తంలో ఆర్‌బీఐ కొనుగోళ్లు 16 టన్నులే కావడం గమనార్హం. తాజా 'క్యూ1 2024, గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' నివేదికలో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) ఈ అంశాలను తెలిపింది.

ప్రపంచ వ్యాప్తంగా 3 శాతం అప్

మార్చి త్రైమాసికంలో ప్రపంచ పసిడి డిమాండ్ 3% పెరిగి 1,238 టన్నులకు చేరింది. 2016 తర్వాత ఈ స్థాయి డిమాండ్ పటిష్టత ఇదే తొలిసారి. సగటు త్రైమాసిక ధర ఔన్స్‌కు (31.1 గ్రాములు) 2,070 డాలర్లు. వార్షికంగా ఈ రేటు 10% అధికమైతే త్రైమాసికంగా 5 % ఎక్కువ. సెంట్రల్ బ్యాంకులు తమ హోల్డింగ్స్‌ను ఈ కాలంలో 290 టన్నులు పెంచుకున్నాయి.

- మార్చి త్రైమాసికంలో భారత్ పసిడి డిమాండ్ విలువ రూపాయల్లో వార్షిక ప్రాతిపదికన 20 శాతం పెరిగి రూ.75,470 కోట్లకు చేరింది.
- సమీక్షా కాలం మొత్తం పసిడి డిమాండ్ 4 శాతం పెరిగి 95.5 టన్నులు. పెట్టుబడుల (కడ్డీలు, నాణేలు వంటివి) విలువ 41.1 టన్నులుగా నమోదైంది.
- విలువల్లో చూస్తే ఆభరణాలకు డిమాండ్ 15% పెరిగి రూ 52,750 కోట్లకు చేరింది. పెట్టుబడుల్లో విలువ 32% పెరిగి రూ.22,720కి ఎగసింది.
- మార్చి త్రైమాసికంలో పసిడి దిగుమతులు 25 % పెరిగి 179.4 టన్నులుగా నమోదయ్యాయి.
- గోల్డ్ రీసైక్లింగ్ విలువ 10% పెరిగి 38.3 టన్నులుగా నమోదైంది.
- 2024లో 700 నుంచి 800 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయన్నది అంచనా.

జోయాలుక్కాస్ అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: జోయాలుక్కాస్ అక్షయ తృతీయ సందర్భంగా పలు ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 అంతకుపైబడిన వజ్రాలు, అన్‌కట్ వజ్రాల కొనుగోలుపై రూ.2,000 విలువైన గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. రూ.50,000, అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలుపై రూ.1000 గిఫ్ట్ వోచర్, రూ 10,000 విలువైన వెండి ఆభరణాలు కొనుగోలుపై రూ 500 గిఫ్ట్ వోచర్‌ను అందిస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని షోరూంల్లో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. కస్టమర్లు ఈ ఆఫర్‌ను వినియోగించుకోవాలని ఎండీ, చైర్మన్ జోయ్ ఆలుక్కాస్ కోరారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక ఆఫర్లు



హైదరాబాద్: అక్షయ తృతీయ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. బంగారు వజ్రాభరణాల తయారీ చార్జీలపై 25% వరకు, ప్రెషియా/ఎరా ఆభరణాల తయారీ, కొనుగోలుపై ఫ్లాటు 25%. వజ్రాభరణాల కొనుగోలుపై 25% వరకు తగ్గింపు ఆఫర్ పొందవచ్చు. కనీసం 10% చెల్లింపుతో ముందస్తు బుకింగ్ సౌకర్యం కల్పిస్తుంది. ఉచితంగా వెండి నాణెమూ పొందవచ్చు. ఈ మే 12 వరకు అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ఆఫర్‌ను కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-5-2024 ఫామ్ ధర...

విశాఖ	400-00
చిత్తూరు	468-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	370-00
విజయవాడ	370-00
హైదరాబాద్	365-00
వరంగల్	367-00


మార్చిలో మౌలిక రంగం వృద్ధి 5.2 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ మార్చిలో 5.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంది. ఫిబ్రవరికన్నా (7.1 శాతం) ఈ రేటు తగ్గడం గమనార్హం. 2023లో ఇదే నెల్లో ఈ గ్రూప్ వృద్ధి రేటు 4.2 శాతంగా ఉంది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలు కలిగి ఉన్న ఈ గ్రూప్‌నకు మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో 40.27 శాతం వెయిటేజ్ ఉంది. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్–మార్చి) ఈ రంగం వృద్ధి రేటు 7.8 శాతం నుంచి 7.5 శాతానికి తగ్గింది. కాగా మే మొదటి పక్షంలో ఐఐపీ గణాంకాలు వెల్లడి కానున్నాయి. వార్షికంగా ఈ గణాంకాల స్పీడ్ తగ్గే అవకాశం ఉందని నిపుణుల అంచనా.

ఆఖరి గంటలో అమ్మకాలు

ఇంట్రాడేలో నిఫ్టీ ఆల్‌టైం హై ● బ్యాంకులు, ఐటీ షేర్ల భారీ విక్రయాలు



ముంబై: ఆఖరి గంటలో బ్యాంకులు, ఐటీ, మెటల్, ఫార్మా షేర్లలో భారీ విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలూ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. చివరి గంటలో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు పాల్పడడంతో సూచీలు లాభాలన్నీ హరించుకుపోయాయి. ఇంట్రాడేలో 765 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 188 పాయింట్లు నష్టపోయి 74,482 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 74,346 వద్ద కనిష్టాన్ని 75,111వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 140 పాయింట్లు ఎగసి 22,783 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 38 పాయింట్లు కోల్పోయి 22,604 వద్ద నిలిచింది.

జేఎన్‌కే ఇండియా సక్సెస్

ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో జేఎన్‌కే ఇండియా షేరు లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర (రూ.415)తో పోలిస్తే బీఎస్‌ఈలో 49% ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 72% ఎగసి రూ 712 వద్ద గరిష్టాన్ని అందుకుంది. చివరికి 67% లాభంతో రూ.694 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,860 కోట్లుగా నమోదైంది.

మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మార్కెట్లు సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.

ఐవోసీ లాభం సగానికి డౌన్

క్యూ4లో రూ. 4,838 కోట్లు ● రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) నికర లాభం సగానికి పైగా క్షీణించింది. రూ. 4,838 కోట్లకు పరిమితమైంది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2.28 లక్షల కోట్ల నుంచి రూ. 2.21 లక్షల కోట్లకు తగ్గింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 7 తుది డివిడెండ్ ప్రకటించింది. రూ. 5 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

పూర్తి సంవత్సరానికి రికార్డు లాభాలు..

పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ చరిత్రలోనే అత్యధిక లాభాలను ఐవోసీ ప్రకటించింది. రూ. 39,619 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇక ఆదాయం రూ. 9.41 లక్షల కోట్ల నుంచి రూ. 8.71 లక్షల కోట్లకు తగ్గింది. ముడి చమురు శుద్ధికి సంబంధించి ప్రతి బ్యారెల్‌పై వచ్చే స్థూల రిఫైనింగ్ మార్జిన్ 19.52 డాలర్ల నుంచి 12.05 డాలర్లకు తగ్గింది. అంతర్జాతీయంగా ముడి చమురు రేట్లు తగ్గినా దేశీయంగా ఇంధనాల ధరలను తగ్గించకుండా దాదాపు రెండేళ్ల పాటు అదే స్థాయిలో కొనసాగించడమనేది ఐవోసీ వంటి కంపెనీలకు లాభించింది.

స్పందన స్ఫూర్తి లాభం 22 శాతం జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో స్పందన స్ఫూర్తి నికరలాభం 22 శాతం ఎగసి రూ 129 కోట్లు సాధించింది. టర్నోవర్ 8 శాతం అధికమై రూ 710 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 41 శాతం దూసుకెళ్లి రూ 378 కోట్లను తాకింది. రాబడి 106 బేసిస్ పాయింట్లు పెరిగి 24.2 శాతంగా ఉంది. వ్యయాలు 15 శాతం అధికమై రూ.194 కోట్లకు చేరాయి. పన్నుకు ముందు లాభం 24 శాతం దూసుకెళ్లి రూ.172 కోట్లకు చేరింది. కొత్త కస్టమర్ల సంఖ్య క్యూ3తో పోలిస్తే 30 శాతం దూసుకెళ్లి 4.4 లక్షలు నమోదైంది. మంజూరైన రుణాలు 30 శాతం పెరిగి రూ 3,970 కోట్లుగా ఉన్నాయి. 2023-24లో స్పందన స్ఫూర్తి నికరలాభం 488 శాతం దూసుకెళ్లి రూ 501 కోట్లు సాధించింది. టర్నోవర్ 72 శాతం ఎగసి రూ 2,534 కోట్లకు చేరింది. నిర్వహణలో ఉన్న ఆస్తులు 2024 మార్చి 31 నాటికి 41 శాతం పెరిగి రూ.11,973 కోట్లకు ఎగశాయి. సంస్థ యాక్టివ్ కస్టమర్ల సంఖ్య 33 లక్షలకుపైమాటే.

సెంట్రల్ బ్యాంక్ లాభం 41 శాతం అప్..

క్యూ4లో రూ. 807 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ. 807 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో నమోదైన రూ. 571 కోట్లతో పోలిస్తే ఇది 41 శాతం అధికం. సమీక్షాకాలంలో బ్యాంకు ఆదాయం రూ. 8,567 కోట్ల నుంచి రూ. 9,699 కోట్లకు ఎగిసింది. వడ్డీ ఆదాయం రూ. 7,144 కోట్ల నుంచి రూ. 8,337 కోట్లకు చేరినట్లు బ్యాంకు తెలిపింది. అటు స్థూల మొండి బాకీలు (జీఎన్‌పీఏ) 8.44 శాతం నుంచి 4.5 శాతానికి దిగి వచ్చాయి. నికర ఎన్‌పీఏలు 1.77 శాతం నుంచి 1.23 శాతానికి తగ్గాయి. మొండి బాకీల నిష్పత్తి తగ్గడంతో ఎన్‌పీఏలకు కేటాయింపులు సైతం రూ. 789 కోట్ల నుంచి రూ. 509 కోట్లకు తగ్గాయి. మరోవైపు, ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) లేదా రైట్స్ ఇష్యూ ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు బ్యాంకు వివరించింది.

విప్రోకు నోకియా భారీ ఆర్డర్

న్యూఢిల్లీ: విప్రో తాజాగా టెలికమ్యూనికేషన్స్ కంపెనీ నోకియా నుంచి భారీ ఆర్డర్ దక్కించుకుంది. ఇందులో భాగంగా నోకియా ఉద్యోగుల అనుభవాన్ని మెరుగుపరిచే ఐటీ సపోర్ట్ సొల్యూషన్‌ను విప్రో రూపొందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లోని 86,700 మంది నోకియా సిబ్బంది కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన క్లౌడ్ ఆధారిత పరిష్కారాన్ని అందిస్తామని విప్రో తెలిపింది. కాగా డీల్ విలువ వెల్లడికాలేదు.

జాబ్ పాయింట్



హెచ్‌యూఆర్‌ఎల్, న్యూఢిల్లీలో 80 పోస్టులు

న్యూఢిల్లీలోని హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్(హెచ్‌యూఆర్‌ఎల్).. ఒప్పంద/రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 80
» పోస్టుల వివరాలు: మేనేజర్–20, ఇంజనీర్–34, ఆఫీసర్–17, చీఫ్ మేనేజర్–02, అసిస్టెంట్ మేనేజర్–07.
» విభాగాలు: కాంట్రాక్ట్స్ అండ్ మెటీరియల్స్, కెమికల్, మార్కెటింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సేఫ్టీ, ఫైనాన్స్, కార్పొరేట్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్స్, లీగల్
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: స్క్రీనింగ్/రాత పరీక్షలు, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలు ఆధారంగా ఎంపిక చేస్తారు
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.05.2024
» వెబ్‌సైట్: https://jobs.hurl.net.in

ఆర్‌ఆర్‌సీ–ఉత్తర రైల్వేలో 38 స్పోర్ట్స్ కోటా గ్రూప్–డి పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్, నార్తర్న్ రైల్వే స్పోర్ట్స్ కోటాలో.. 2023–24 సంవత్సరానికి సంబంధించి గ్రూప్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 38
» క్రీడలు: ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, హాకీ, బ్యాడ్మింటన్, కబడ్డీ, రెజ్లింగ్, చెస్.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడలో వివిధ స్థాయిల్లో ప్రతిభ చూపి ఉండాలి.
» వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.05.2024
» ట్రయల్ తేది: 10.06.2024.
» వెబ్‌సైట్: https://www.rrcnr.org

కర్ణాటక సర్కిల్– తపాలా శాఖలో స్టాఫ్ కార్ డ్రైవర్ పోస్టులు

బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, కర్ణాటక సర్కిల్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన స్టాఫ్ కార్ డ్రైవర్(ఆర్డినరీ గ్రేడ్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» కర్ణాటక పోస్టల్ రీజియన్లు: ఎస్‌కే రీజియన్, ఎన్‌కే రీజియన్, బీజీ(హెచ్‌క్యూ) రీజియన్.
» పోస్టుల వివరాలు: స్టాఫ్ కార్ డ్రైవర్ 27 పోస్టులు
» అర్హత: పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు మూడేళ్ల పని అనుభవం, మోటార్ మెకానిజంపై పరిజ్ఞానం కలిగి ఉండాలి
» వయసు: 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి
» వేతనం: నెలకు రూ 19,900 నుంచి రూ 63,200 ఉంటుంది.
» ఎంపిక విధానం: రాత పరీక్ష, డ్రైవింగ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను మేనేజర్, మెయిల్ మోటార్ సర్వీస్, బెంగళూరు చిరునామాకు పంపించాలి
» దరఖాస్తులకు చివరి తేది: 14.05.2024
» వెబ్‌సైట్: www.indiapost.gov.in

ఏఐఆర్‌ఐ ఢిల్లీలో ప్రాజెక్టు పోస్టులు

న్యూఢిల్లీలోని ఐకార్– ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)– 04 పోస్టులు, సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)– 06 పోస్టులు, యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు– 05.
» అర్హతలు: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: dpp.mpp2022@gmail.com.
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 12.05.2024
» వెబ్‌సైట్: https://iari.res.in/en/news.php

యూజీసీ నెట్.. మార్పులివే!

» యూజీసీ నెట్ 2024 జూన్ నోటిఫికేషన్ విడుదల
» నూతన విధానంలో మూడు కేటగిరీలుగా పరీక్ష నిర్వహణ
» నెట్‌తో జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాలు
» నాలుగేళ్ల డిగ్రీతోనూ నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

యూజీసీ నెట్.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్–నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! జేఆర్‌ఎఫ్‌తో పీహెచ్‌డీలో చేరేందుకు.. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువులకు ప్రామాణికంగా నిలుస్తున్న పరీక్ష! అందుకే.. బోధన, పరిశోధన విభాగాల్లో కెరీర్ కోరుకునే అభ్యర్థులు ఎక్కువగా యూజీసీ–నెట్‌కు ప్రిపరేషన్ సాగిస్తుంటారు. తాజాగా యూజీసీ.. నెట్‌లో కీలక మార్పులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ నెట్–2024 జూన్‌లో కొత్త మార్పులు, ఈ పరీక్షతో ప్రయోజనాలు, అర్హతలు, బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..



ఇంతకాలం పీహెచ్‌డీలో చేరాలంటే.. పీజీ పూర్తి చేసి.. నెట్‌లో సంబంధిత సబ్జెక్ట్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. యూజీసీ తాజా నిర్ణయంతో నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు కూడా నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెట్ స్కోర్ ఆధారంగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు. యూజీసీ–నెట్‌ను ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది.. తొలి విడత పరీక్ష జూన్–2024కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో అర్హత ప్రమాణాలు, నెట్ నిర్వహించే కేటగిరీలలో మార్పులు ప్రకటించారు

విద్యార్హతలు

- కనీసం 55% మార్కులతో పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్) ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పీహెచ్‌డీలో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 75 శాతం మార్కులు సాధించాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం మినహాయింపు కల్పిస్తారు.
- అర్హత కోర్సు చివరి సంవత్సరం/చివరి సెమిస్టర్ చదువుతున్న వారు కూడా నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగాల అభ్యర్థులకు సర్టిఫికెట్లు పొందాకే వీటికి అర్హత లభిస్తుంది. పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే వారు నెట్ ఫలితాలు విడుదలైన సంవత్సరంలోపు నిర్దేశిత శాతంతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

వయసు

- జేఆర్‌ఎఫ్ అభ్యర్థుల వయసు జూన్ 1, 2024 నాటికి 30ఏళ్లు మించకూడదు. ఓబీసీ–ఎన్‌సీఎల్, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు లభిస్తుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్, పీహెచ్‌డీలో ప్రవేశం కోరే అభ్యర్థులకు ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

నాలుగేళ్ల డిగ్రీతో పీహెచ్‌డీ

యూజీసీ–నెట్ 2024 జూన్ నోటిఫికేషన్ ప్రకారం–నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు కూడా నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో అర్హత సాధించి యూనివర్సిటీలలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందొచ్చు. యూనివర్సిటీలు నాలుగేళ్ల డిగ్రీతోనూ పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించాలని యూజీసీ ఇప్పటికే మార్గనిర్దేశకాలు జారీ చేసింది. దీనికోసం నెట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. పీహెచ్‌డీలో ప్రవేశం పొందాలనుకునే నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులు కనీస 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని నిర్దేశించింది.

మూడు కేటగిరీలుగా పరీక్ష

- ఇప్పటి వరకు రెండు కేటగిరీల్లోనే (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్) నెట్‌ను నిర్వహించారు. రీసెర్చ్/జేఆర్‌ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగానికి అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితం అవుదామనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకునే వారు. దీనికి భిన్నంగా ఇకపై మూడు కేటగిరీలుగా నెట్ పరీక్షను నిర్వహించనున్నారు. అవి..
- కేటగిరీ–1: జేఆర్‌ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్), అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం
- కేటగిరీ–2: అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశం.
- కేటగిరీ–3: పీహెచ్‌డీలో ప్రవేశానికి మాత్రమే.

పరీక్ష స్వరూపం

- యూజీసీ నెట్ పరీక్ష స్వరూపంలో ఎలాంటి మార్పులు లేవు. గతంలో మాదిరిగానే రెండు పేపర్లుగా మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ రెండు పేపర్లు కూడా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు
- పేపర్–1: టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్. ఈ విభాగంలో 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పేపర్–2: సబ్జెక్ట్ పేపర్: అభ్యర్థుల డొమైన్ సబ్జెక్ట్ నుంచి 100 ప్రశ్నలతో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్–1(టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్) మూడు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్ పరీక్షలో మూడు కేటగిరీల అభ్యర్థులు (జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్, పీహెచ్‌డీ) ఉత్తీర్ణత సాధించాలంటే.. తాము రాసిన పేపర్లలో కనీస అర్హత మార్కులు సాధించాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు పొందాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్– ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా వర్తిస్తుంది.

బెస్ట్ స్కోర్‌కు మార్గం

ఉమ్మడి పేపర్‌కు సన్నద్ధత

మూడు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి పేపర్‌గా నిర్దేశించిన పేపర్–1లో.. టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాల (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు చొప్పున అడుగుతారు

సబ్జెక్ట్ పేపర్‌కు ఇలా

పేపర్–2లో ప్రశ్నలు అభ్యర్థుల పీజీ స్పెషలైజేషన్ లేదా డొమైన్ సబ్జెక్ట్ ఆధారంగా ఉంటాయి. ఇందులో రాణించేందుకు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్ ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల ప్రశ్నలు ఏ విధంగా అడిగినా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 10
- ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణ అవకాశం: 2024, మే 13–15
- యూజీసీ–నెట్ పరీక్ష తేదీ: 2024, జూన్ 18
- వివరాలకు వెబ్‌సైట్: https://ugcnet.nta.nic.in

నెట్‌తో ప్రయోజనాలెన్నో!

- యూజీసీ నెట్‌లో ప్రతిభ చూపి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అవి..
- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు బేసిక్ పే రూ.57 వేలు చెల్లించే విధంగా యూజీసీ నిర్ణయించింది.
- జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు (జేఆర్‌ఎఫ్) ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో మూడేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ సమయంలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున జేఆర్‌ఎఫ్ అందుతుంది. జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్‌ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్ల పాటు నెలకు రూ.35 వేల ఫెలోషిప్ పొందొచ్చు. జేఆర్‌ఎఫ్, ఎస్‌ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారికి సైంటిస్ట్‌లుగా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. సైంటిస్ట్‌లుగా ఎంపికైన వారికి.. వారి గ్రేడ్ ఆధారంగా ప్రారంభంలోనే నెలకు రూ.లక్షకు పైగా వేతనం పొందే అవకాశాలున్నాయి.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు నెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి జేఆర్‌ఎఫ్, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత లభిస్తుంది
- ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

క్లుప్తంగా

ఏకలవ్య జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గిరిజన సంక్షేమ గురుకులాల పరిధిలోని ఏకలవ్య(ఈఎంఆర్ ఎస్) జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఎస్.భార్గవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపులకు మే 3వ తేదీ నుంచి 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది పదవ తరగతి పాసైన గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు www.aptwgurukulam.ap.gov.in ను చూడాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి భార్గవి విజ్ఞప్తి చేశారు.

'సుప్రీం'లో రాజధాని పిటిషన్లపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ రాజధానికి సంబంధించి సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. రద్దు చేసిన చట్టాలపై హైకోర్టు తీర్పు సరికాదంటూ ఏపీ ప్రభుత్వం, మరో తొమ్మిది మంది దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చాయి. అయితే, పిటిషన్ బెంచ్ ముందుకు రాకుండానే కోర్టు సమయం ముగియడంతో పలువురు న్యాయవాదులు ఈ విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పిటిషన్‌పై తర్వాత విచారిస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. తదుపరి తేదీ ఇవ్వాలని న్యాయవాదులు కోరగా జాబితాలో కొనసాగుతుందని జస్టిస్ ఖన్నా పేర్కొన్నారు.

పాలిసెట్ ప్రాథమిక 'కీ' విడుదల

- మే 4 వరకు అభ్యంతరాల స్వీకరణ
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

సాక్షి, అమరావతి: పాలిసెట్–2024 ప్రాథమిక 'కీ'ని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మంగళవారం విడుదల చేశారు. https://apsbtet.ap.gov.in వెబ్‌సైట్‌లో 'కీ' అందుబాటులో ఉందని తెలిపారు. 'కీ'లో అభ్యంతరాలు ఉంటే sbtexams.apsbtet@gmail.com మే 4వ తేదీలోగా ఫిర్యాదు చేయాలని, ఫైనల్ 'కీ' మే 5వ తేదీన https://apsbtet.ap.gov.in వెబ్ సైట్‌లో ప్రకటిస్తామన్నారు. మే 10లోగా ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఎంఎంటీటీసీతో సాంకేతిక విద్యా శాఖ ఒప్పందం

రాయదుర్గం: ఉన్నత విద్యా రంగంలో సామర్థ్యం పెంపుదల, ఎడ్యుకేషనల్ ఎకోసిస్టమ్‌ను మెరుగుపర్చడంపై హెచ్‌సీయూలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ)తో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సామర్థ్యం పెంపొందించే కార్యక్రమాలను హెచ్‌సీయూ చేపట్టనుంది. తెలుగు లెక్చరర్ల కోసం చివరి బ్యాచ్ శిక్షణ ముగింపు వేడుకల సందర్భంగా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. దీనిపై హెచ్‌సీయూ ఎంఎంటీటీసీ అధికారులు, ఏపీ ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ అధికారులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, ఏపీ ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫీజు చెల్లింపునకు చివరి అవకాశం

నేటి సాయంత్రంతో ముగియనున్న గడువు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బుధవారం సాయంత్రంలోగా ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. గతంలో కళాశాలల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 30 వరకు ఇచ్చిన గడువును కాలేజీ యాజమాన్యాల కోరిక మేరకు మరొక్క రోజు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల ప్రయోజనం కోసం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, బుధవారం సాయంత్రం ఆరుగంటల్లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని విజ్ఞప్తి చేసింది.

విద్యాధన్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: 'విద్యాధన్–2024' ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సరోజిని దామోదరన్ ఫౌండేషన్ మంగళవారం తెలిపింది. ఏపీలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు పదో తరగతిలో 90శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్, డిప్లొమా చదువుల నిమిత్తం ఏటా రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇవ్వనుంది. దివ్యాంగులకు 75శాతం ఉత్తీర్ణత సాధించాలి. విద్యార్థి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసుకున్న పై చదువుల నిమిత్తం రూ.10వేల నుంచి రూ.70వేల వరకు ఆర్థిక సాయాన్ని అందించనుంది. వార్షిక ఆదాయం రూ.2 లక్షలలోపు ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొంది. జూన్ 7లోగా www.vidyadhan.org లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. సందేహాలకు 8663517131, vidyadhan.andhra@sdfoundationindia.com మెయిల్‌ను సంప్రదించాలని కోరింది. ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎస్‌డీ శిబులాల్, ఆయన భార్య కుమారిశిబులాల్ విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందనే లక్ష్యంతో ఈ ఫౌండేషను స్థాపించారు.

పవన్‌ను ఓడించి, తరిమేయడం ఖాయం

▶ మొదటి పేజీ తరువాయి

ఎండగట్టారు. పిఠాపురంలో పవన్‌కళ్యాణ్‌ను ఓడించకపోతే తన పేరు ముద్రగడ పద్మనాభం రెడ్డిగా మార్చుకుంటానని సవాల్ విసిరారు. ఉప్మా, కాఫీలు పెడుతున్నారని విమర్శించడం పవన్‌కు తగదని, ఇంటికి వచ్చినవారికి మర్యాద చేయటం తమ కుటుంబానికి అలవాటని చెప్పారు. 2014 నుంచి బీజేపీతో కలిసే ఉన్న పవన్‌కళ్యాణ్ ప్రత్యేకహోదా ఎందుకు తీసుకురాలేదని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటుపరం కాకుండా ఎందుకు ఆపలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు.

త్వరలో ప్యాకప్

తెలంగాణ ఎన్నికల్లో పవన్ నిలబెట్టిన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచారు కదా అని ఎద్దేవా చేశారు. సినిమాల్లో నటించండి.. ఇలా రాజకీయాల్లో నటించడం కుదరదని స్పష్టం చేశారు. త్వరలో పవన్ పార్టీ ప్యాకప్ అవుతుందన్నారు. 1978లో చంద్రబాబు, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి వెళ్లామన్నారు. 1978లో చంద్రబాబుకు శిథిలమైన పెంకుటింటికి మరమ్మతులు చేయించడానికి కూడా డబ్బులు లేని విషయం మర్చిపోయారా.. అని నిలదీశారు. 2019లో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశానని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బల్లగుద్ది మరీ చెబుతున్నారని, 2014లో ఇచ్చిన హామీలు సంపూర్ణంగా అమలు చేశానని చంద్రబాబు చెప్పగలరా అని ముద్రగడ ప్రశ్నించారు. ఈ సమావేశంలో ముద్రగడ గిరిబాబు, గౌతు స్వామి, గణేశుల లచ్చబాబు, గోపు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో మీడియాతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

కాపు ఉద్యమానికి ఎందుకు మద్దతు ఇవ్వలేదు?

విషయాలపై అవగాహన లేక, తెలుసుకోవడానికి ఖాళీలేక పవన్ బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తుని ఘటన 2016లో జరిగిందన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఆ సంఘటన జరిగినప్పుడు ఇప్పుడు పవన్ పక్కన ఉన్న జ్యోతుల నెహ్రూ వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని, ఆ ఘటనకు చంద్రబాబే కారణమనే విషయం తెలుసుకోవాలని సూచించారు. తాను చేతగానివాడిననుకున్నప్పుడు కాపుల కోసం పవన్ ఏంచేశారు, ఎందుకు రోడ్డెక్కలేదని ప్రశ్నించారు. కాపు ఉద్యమానికి ఎందుకు మద్దతు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పదవి కోసం హైదరాబాద్ నుంచి పిఠాపురం ఎందుకు పారిపోయి వచ్చాడని ప్రశ్నించారు. అసలు పవన్ కల్యాణ్ అడ్రస్ ఏమిటి? ఎక్కడ పుట్టాడని అడిగారు.

డోన్‌లో కొత్తగా ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల

- ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిప్లొమా కోర్సు
- వైఎస్సార్ వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ మీటింగ్‌లో నిర్ణయం

సాక్షి, అమరావతి: ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిప్లొమా కోర్సును ప్రవేశపెడుతూ నంద్యాల జిల్లా డోన్‌లో కొత్తగా ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. మంగళవారం వర్సిటీ వీసీ డాక్టర్ టి.జానకిరామ్ అధ్యక్షతన జరిగిన 31వ అకడమిక్ కౌన్సిల్ మీటింగ్‌లో పీజీ విద్యార్థుల పరిశోధనా ప్రమాణాలను పెంపొందించడానికి, పరిశోధనా పత్రాల నాణ్యత ప్రమాణాల స్థాయిని కన్సార్షియం ఆఫ్ ఈ–రిసోర్స్ ఇన్ అగ్రికల్చర్ ద్వారా మెరుగుపర్చాలని నిర్ణయించారు. యూజీసీ నిబంధనల మేరకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పద్ధతిని అమలు చేయాలని తీర్మానించారు. ఎన్ఈపీలో భాగంగా ప్రొఫెసర్లకు డిగ్రీ విద్యార్థుల బోధనలో సహాయ పడడానికి పీహెచ్‌డీ విద్యార్థులను బోధన సహాయకులుగా(టీచింగ్ అసిస్టెంట్ షిప్) నియమించడానికి నిర్ణయించారు. బోధన విధానంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రత్యేకంగా మార్గదర్శకాలను రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులైన ఎక్స్ అఫీషియోగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, ఎన్‌టీపీజీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ వీణాగుప్త, ఐఏఆర్ఐ ప్రొఫెసర్ డాక్టర్ రీతు జైన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

24న ఏపీఈఆర్‌సీ భవనం ప్రారంభోత్సవం

ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జునరెడ్డి ఆదేశాలు


కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలులో రూ.21 కోట్లతో నిర్మిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీఈఆర్‌సీ) భవనాన్ని ఈనెల 24న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. కర్నూలు శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలో రెండు ఎకరాల్లో నిర్మిస్తున్న భవనం పనుల పురోగతిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈనెల 15 నాటికి మొత్తం పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ సివిల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే విశాఖపట్నం నుంచి సామగ్రిని కర్నూలుకు తరలిస్తామన్నారు. 24న ఏపీఈఆర్‌సీ భవనాన్ని తప్పకుండా ప్రారంభించాల్సి ఉందని, ఇందుకు అవసరమైన పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఈఆర్‌సీ సీఈవో చలపతి, సభ్యుడు (టెక్నికల్) ఠాకూర్ రామసింగ్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, విద్యుత్ శాఖ సివిల్ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ నాగార్జునరెడ్డి

ఆ నోటిని శాశ్వతంగా మూసేయాలి

- సీఎం జగన్‌పై మరోసారి చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు
- దెందులూరు ఎన్నికల ప్రచారంలో రెచ్చిపోయిన బాబు



దెందులూరు: 'జగన్‌మోహన్‌రెడ్డి.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది'.. అంటూ ఇటీవల నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు.. ఆ నోటిని శాశ్వతంగా మూసేయాలి అంటూ తాజాగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏలూరు జిల్లా దెందులూరులో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు హత్యా రాజకీయాలు తెలుసా? గొడ్డలితో చంపేసి నామీద పెట్టాలని చూశారు. కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామా పూర్తయ్యాయి ఆ నోటికి మూత వేయాలి. శాశ్వతంగా మూసివేయాలి. మీరంతా సహకరించాలి.' అని చెప్పారు. పులివెందులలో హత్యారాజకీయాలు ఎందుకు జరుగుతున్నాయో తెలుసుకోవాలన్నారు. సైకో జగన్.. పిల్లలకు ఉద్యోగాలిస్తానని చెప్పి ఇవ్వకుండా గంజాయి ఇస్తే నాయకుడవుతాడా అని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేని దద్దమ్మ అన్నారు. కేసులకు భయపడను.. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. వడ్డీతో సహా చెల్లిస్తా అని పేర్కొన్నారు. ఇప్పటివరకు మంచితనం చూశారని, ఇకపై తనలో కఠినత్వాన్ని చూస్తారని చెప్పారు. అబద్ధాలు చెప్పడంలో సైకో పీహెచ్‌డీ చేశారన్నారు. దెందులూరును ఎమ్మెల్యే దందాలూరుగా మార్చేశారని చెప్పారు. పేకాట కంపెనీలు, జూదాలు ఆడిస్తున్నారన్నారు. ఆయన బుద్ధి గడ్డితిన్నదని, గుడి, బడి తేడాలేకుండా మద్యం అమ్మిస్తున్నాడని ఆరోపించారు. తండ్రీకొడుకులు నియోజకవర్గంలో వసూళ్లు చేస్తున్నారన్నారు. రైతుకు గోనె సంచులు ఇవ్వలేని వెర్రిపప్ప ఇక్కడ ఎంపీగా పోటీచేసేందుకు కొడుకుని పంపారని విమర్శించారు.

సైకో భూతాన్ని వదిలించుకోవాలి

తెనాలి: రాష్ట్రానికి పట్టిన సైకో భూతాన్ని ప్రజలు వదిలించుకోవాలని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఎన్నికల ప్రచారసభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సైకోలను చిత్తు చిత్తుగా ఓడించి ఇంటికి పంపాలన్నారు. సర్వజనుల సంక్షేమమే ధ్యేయంగా మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ సెంటు పట్టా భూమిలో రూ.80 కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. తెనాలిలో చంద్రబాబు ఎన్నికల ప్రచారసభను బీజేపీ కార్యకర్తలు, నాయకులు బహిష్కరించారు. ఆ పార్టీ జెండా కనిపించలేదు

జూన్ 8న ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్ష

సాక్షి, అమరావతి: డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో జనవరి–2025 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఉద్దేశించిన ప్రవేశపరీక్ష షెడ్యూల్ మారినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 1న జరగాల్సిన పరీక్షను జూన్ 8న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ ఒకటో తేదీన ఎనిమిది రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రవేశ పరీక్ష తేదీని మార్చినట్టు ఆయన తెలిపారు.

చంద్రబాబు నయవంచకుడు, హంతకుడు

- ఆచరణ సాధ్యంగాని మేనిఫెస్టో ప్రకటించాడు
- వైఎస్సార్ మరణం వెనుక చంద్రబాబు పాత్రపై అనుమానాలు
- సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నంలోను చంద్రబాబు హస్తం
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



కావలిలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

కావలి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మొదటినుంచి ఎంతటి నయవంచకుడో.. అంతటి హంతకుడు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తి అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేందుకు ఆచరణ సాధ్యంగాని హామీలతో మేనిఫెస్టో విడుదల చేశాడన్నారు. గతంలో 14 సంవత్సరాల్లో ఏమీచేయలేని చంద్రబాబు ఇప్పుడు అన్నీ చేస్తానని అబద్ధాలు చెబుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు దగ్గర విఠాలాచార్య సినిమాల తరహాలో ఎటువంటి మంత్రదండం లేదన్నారు. గత 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎంత శాతం అమలు చేశారో అందరికీ తెలుసన్నారు.

జగన్‌కు చంద్రబాబు ద్వారా ప్రాణహాని..

చంద్రబాబు మొదటి నుంచి అబద్ధాలకోరు మాత్రమే కాకుండా హంతకుడు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తి అని దుయ్యబట్టారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన రెండుసార్లు హత్యా ప్రయత్నం జరిగిందన్నారు. ఇందులో చంద్రబాబునాయుడి హస్తం ఉందని చాలా స్పష్టంగా తెలుస్తోందని చెప్పారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోవడానికి రెండురోజులు ముందు చంద్రబాబు ఏమన్నాడో అందరూ ఒకసారి గుర్తుతెచ్చుకోవాలన్నారు. 'ఫినిష్ అయిపోతాడు.. ఎక్కడ ఏ లోకాల్లో కలిసిపోతారో..' అని చంద్రబాబు అన్నాడన్నారు. ఈ తర్వాత హెలికాప్టర్ దుర్ఘటనలో వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించారని గుర్తుచేశారు. ఇది ప్రమాదం కాదని, చంద్రబాబు హస్తం తప్పకుండా ఉంటుందని ఇప్పటికే రెండు రాష్ట్రాల ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి.. ఆ దున్నపోతును రాయి తీసుకుని కొట్టమని చెప్పాడు.. ఆ తర్వాతనే సీఎంపై రాయితో హత్యాయత్నం జరిగిందని చెప్పారు. గాల్లో వచ్చాడు.. గాల్లోనే పోతాడంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు, జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. జగన్‌కు చంద్రబాబు ద్వారానే ప్రాణహాని ఉందనే భయం పార్టీ కేడర్‌లో ఉందని తెలిపారు. చంద్రబాబు గతం తీసుకుంటే వంగవీటి రంగా హత్యలో, ఐఏఎస్ అధికారి రాఘవేందర్‌రావు హత్యకేసులో, కారంచేడు దళితుల ఊచకోత ఘటనలో, చెరుకూరుపాడు నారాయణరెడ్డి హత్యకేసులో, కందుకూరులో ఆర్యవైశ్య సోదరుడిని దారుణంగా హత్యచేసిన ఘటనలో కూడా చంద్రబాబు హస్తం ఉందని చెప్పారు. సొంత మామ నందమూరి తారకరామారావును వెన్నుపోటు పొడిచి, ఆయన మానసికంగా కుంగిపోయి చనిపోయేందుకు కారణమైన చంద్రబాబునాయుడిని ఈ రోజు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. చంద్రబాబుకు తగిన విధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని విజయసాయిరెడ్డి చెప్పారు. ఎంపీ బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఏలియన్స్ సమూహం

ఎన్నికల సభలో పవన్‌కళ్యాణ్

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ ఏలియన్స్ సమూహంగా తయారైందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎద్దేవా చేశారు. మంగళవారం రాత్రి ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలకు వైఎస్సార్‌సీపీ రంగులు వేసేందుకు ఈ ప్రభుత్వం రూ.2,300 కోట్లను దుర్వినియోగం చేసిందన్నారు. రూ.1,300 కోట్లను భవనాల రంగుల కోసం వెచ్చిస్తే.. కోర్టు తీర్పుతో తిరిగి వాటిని తొలగించేందుకు మరో రూ.1,000 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి అవినీతికి అంతు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. తండ్రీకొడుకులు రూ.40 వేల కోట్ల ఇసుక దోపిడీకి పాల్పడితే.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వారు వెన్నుదన్నుగా నిలిచారని ఆరోపించారు. జగన్ చేస్తున్న దోపిడీ భారం 5 కోట్ల మంది ప్రజలపైనే పడుతుందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా భూయజమానులకు పూర్తి హక్కు లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. పద్మవ్యూహంతో కూటమి ముందుకు వెళుతుందని, వచ్చే ఎన్నికల్లో తమ విజయాన్ని ఆపడం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కాదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిలిచిపోవడం వెనుక జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, కేవలం ఆ కాలువ వల్ల తెలుగుదేశం పార్టీ సామాజిక వర్గానికి చెందిన రైతులకు మేలు కలుగుతుందనే ఉద్దేశంతో నిలిపివేశారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిలిచిపోవడానికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. సభలో ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, పోలవరం అసెంబ్లీ జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న పవన్ కళ్యాణ్

బాబు, పవన్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

కాపులంతా వైఎస్సార్‌సీపీ వైపే • వైఎస్సార్ సీపీ నేత అడపా శేషు

సాక్షి, అమరావతి: చంద్రబాబును ఎవరూ నమ్మే స్థితిలో లేరు కాబట్టే పవన్‌కళ్యాణ్‌తో జతకట్టి గెలుద్దామనే భ్రమలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ నేత అడపా శేషు అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాపులను సీఎం జగన్ కాపు కాశారా.. చంద్రబాబు, పవన్ కాపు కాశారా? అనేది ప్రజలను అడిగితే చెబుతారన్నారు. కాపులకు ఈ విషయం తెలుసు కాబట్టే వైఎస్సార్‌సీపీకి, సీఎం జగన్‌కు మద్దతు పలుకుతున్నారని చెప్పారు. మంత్రివర్గంలో గాని, రాజకీయ పదవులలోగాని, అసెంబ్లీ సీట్ల కేటాయింపులో సైతం కాపులకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని వివరించారు. కాపులంటే గిట్టని చంద్రబాబు కాపుల ఆరాధ్య దైవమైన వంగవీటి రంగాను హత్య చేయించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా సైతం కాపులపై అక్రమ కేసులు బనాయించారని గుర్తు చేశారు. పవన్‌కు రాజకీయ అవగాహన లేదన్నారు. రాజకీయాలకు ఆయన పనికి రారనే విషయం కూడా అర్థమైందని.. అందుకే కాపులు పవన్‌కు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఎల్లో మీడియా రకరకాలుగా రాస్తుంటుందని, ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.

పిఠాపురం ప్రజలు వాత పెడతారు

పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి మాట్లాడుతూ.. పవన్‌ను గత ఎన్నికల్లోనే చిత్తుచిత్తుగా ఓడించామన్నారు. ఆయన పార్టీ తరఫున గెలిచిన ఒక్క ఎమ్మెల్యే నమ్మకాన్ని కూడా పవన్ సంపాదించలేదన్నారు. అలాంటి వ్యక్తి వైఎస్సార్‌సీపీని ఓడిస్తాననటం హాస్యాస్పదమన్నారు. పవన్ చదువు, ఆయన సంస్కారం ఏమిటో ఎన్నికల అఫిడవిట్ చూస్తేనే తేలిపోయిందన్నారు. భీమవరం, గాజువాకలో ప్రజలు పవన్ను పాతాళానికి తొక్కేశారని, దాంతో పారిపోయి పిఠాపురం చేరుకున్నారని ఎద్దేవా చేశారు. పిఠాపురం ప్రజలు కూడా పవన్‌కు కర్రు కాల్చి వాత పెడతారన్నారు.

26 నుంచి జూన్ 9 మధ్యలో హజ్ యాత్ర

- ఏపీ నుంచి 2,580 మంది హజ్ యాత్రికులు
- గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలోని మదర్సాలో హాజీలకు వసతి
- మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఏపీ నుంచి హజ్ యాత్రను విజయవంతం చేయాలని అధికారులను మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ ఆదేశించారు. హజ్–2024 యాత్ర సఫలం చేయటంలో భాగంగా ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని వించిపేటలోని సాజాహిర్ ముసాఫిర్ ఖానాలో మంగళవారం నిర్వహించిన తొలి సన్నద్ధత సమావేశంలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికిగాను ఇప్పటివరకు 2,580 మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 728 మంది, హైదరాబాద్ పాయింట్ నుంచి 1,118 మంది, బెంగుళూరు పాయింట్ నుంచి 725 మంది, చెన్నై పాయింట్ నుంచి 9 మంది యాత్రకు బయలుదేరనున్నట్లు వివరించారు. యాత్రికులు ఆయా ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి మే 26–జూన్ 9 మధ్య బయలుదేరి తిరిగి జూలై 1–21 లోపు విజయవాడకు చేరుకుంటారని తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలోని మదర్సాలో వసతి ఏర్పాటు చేశామన్నారు. హ్యాండ్ బ్యాగేజి కింద 8 కేజీల బ్యాగ్, చెక్ ఇన్ లగేజీ కింద 20 కేజీల బరువున్న 2 బ్యాగులకు అనుమతి ఉందని చెప్పారు. హజ్ యాత్రికులు ప్రయాణానికి ముందే తమ స్వస్థలంలో ఎస్‌బీఐ ఖాతా ఓపెన్ చేయించుకోవాలన్నారు. ఒక్కో యాత్రికునికి రూ.4లక్షల వరకు ఫారిన్ ఎక్స్చేంజ్ అందిస్తున్నట్లు చెప్పారు.

కార్మికులతో చర్చలు జరిపాం

- హైకోర్టుకు నివేదించిన గంగవరం పోర్టు యాజమాన్యం
- నివేదికను పరిశీలించి.. కౌంటర్ దాఖలు చేస్తామన్న ప్రభుత్వం
- విచారణ 2వ తేదీకి వాయిదా



సాక్షి, అమరావతి: న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా అధికారుల సమక్షంలో కార్మికులతో చర్చలు జరిపామని గంగవరం పోర్టు యాజమాన్యం హైకోర్టుకు తెలిపింది. ఆ చర్చలకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచినట్లు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. పోర్టు యాజమాన్యం ఇచ్చిన నివేదికను పరిశీలించాల్సి ఉందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు కౌంటర్ దాఖలుకు గడువినిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 2వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా జరగడం లేదని.. దీని వల్ల ప్లాంట్ మూతపడే ప్రమాదం ఉన్నందున బొగ్గు సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలంటూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ జయసూర్య.. సమస్య పరిష్కారానికి కార్మికులతో జిల్లా అధికారుల సమక్షంలో చర్చలు జరపాలని గంగవరం పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు రాగా.. పోర్టు యాజమాన్యం చర్చల విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది.

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం



అంబాజీపేట/రావులపాలెం: సీఎం జగన్ ప్రధాని మోదీకి తొత్తుగా మారారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. ఆయన పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అంబాజీపేటలో మంగళవారం షర్మిల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే రావులపాలెంలో మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. సీబీఐ నిందితుడిగా చూపిన అవినాశ్‌రెడ్డికి మళ్లీ కడప ఎంపీ టికెట్ ఇవ్వడం వల్లే తాను అక్కడ పోటీ చేస్తున్నానని తెలిపారు. అదే పెదనాన్న జార్జిరెడ్డి కుమారులకు ఇచ్చినా, చిన్నాన్న కుమారులకు ఇచ్చినా తాను బరిలో ఉండేదానిని కాదని చెప్పారు. జగన్, వైఎస్సార్ కుటుంబానికి, ఆయన అభిమానులకు, కడప జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వివేకా హత్యపై సీబీఐ విచారణ కోరిన జగన్ అధికారంలోకి వచ్చాక ఎందుకు వద్దన్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకా ఓటమికి భాస్కర్‌రెడ్డి, మనోహర్ రెడ్డి కుటుంబాలు కారణం కాదా అని నిలదీశారు. అలాంటివారికి అప్పుడూ, ఇప్పుడూ ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. తాను కడపలో ఓడిపోతానని నిజంగా అనిపిస్తే వైఎస్ కుటుంబం అంతటిని దించి కడపలో ప్రచారం ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించారు. రాజశేఖరరెడ్డి పేరును సీబీఐ చార్జిషీట్లో కాంగ్రెస్ పార్టీ చేర్పించిందనడం సబబు కాదన్నారు. రాజశేఖరరెడ్డి పేరును చేర్చకపోతే జగన్ ఈ కేసుల నుంచి బయటపడడని కోర్టులో పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అదే పనిగా పిటిషన్లు వేశారన్నారు. మోదీ చేతిలో, రాష్ట్రంలో తన ఇంట్లో ఉన్నవాళ్ల చేతిలో జగన్ రిమోట్ కంట్రోల్‌గా మారారని ఆరోపించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada NTR District - 520 007 (AP), Editor V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No 0866-2547436 Fax No 0866-2547433 RNI Reg No APTEL/2008/23794

సాక్షి 2024
జైత్రయాత్ర
బుధవారం
పే. 1

గుసగుస

బాబు దందా



టీడీపీ అధినేత చంద్రబాబు తన వక్రబుద్ధిని మరింత దారుణంగా అమలు చేస్తున్నారు. ఏపీలో ఎన్ని పొత్తులతు, కుతంత్రాలకు పాల్పడినా ఓటమి తప్పదని తెలిందట. అయినా భారీ స్థాయిలో ఓట్లను కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారట. ఇప్పటికే ఎన్నారైలు బరి తెగించి మాట్లాడిన వీడియోలు బయటకు వచ్చాయి. ఇప్పుడు బాబు చేపట్టిన వసూళ్ల దందాపై ఆ పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు. తెలంగాణలోని ఏపీకి చెందిన తన అను'కుల'వర్గ వ్యాపారుల నుంచి భారీగా వసూళ్లు చేపట్టారట. ఈ మొత్తం రూ.1500 కోట్లని చెప్పుకుంటున్నారు. గతేడాది జరిగిన తెలంగాణ ఎన్నికల్లోనూ బాబు ఆదేశాల మేరకు ఈ వర్గం అక్కడి కాంగ్రెస్ పార్టీకి రూ.వెయ్యి కోట్ల వరకు సమర్పించిందట.

మేమింతే.!



పొర్లింది.. పొర్లింది కొట్టినా.. మీసాలకు మట్టి అంటలేదన్నట్లుంది జనసేన పార్టీ శ్రేణుల తీరు. పిఠాపురంలో పొత్తుల నేపథ్యంలో సీటు చేజిక్కించుకున్న పవన్‌కు టీడీపీ నేత వర్మ తీరు భయపెడుతోందట. పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో వర్మ, పవన్ కలిసి ప్రచారం చేస్తున్న వీడియోలను తెగ పోస్టు చేస్తున్నారు. వాస్తవం తెలిసిన స్థానిక జనసేన నాయకులు వర్మ తీరును ఎండగడుతున్నారు. ఆయన ప్రచారం చేసే ప్రాంతాల్లో జనసేన నాయకుల్ని రావొద్దని చెప్పడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. గెలిస్తే తన గొప్ప, ఓడితే మా తప్పు అన్నట్లుగా వర్మ వ్యవహరిస్తున్నారని పవన్‌కు మొరపెట్టుకున్నారట. పవన్ మాత్రం ఎన్నికలయ్యే వరకు భరించక తప్పదన్నారట. దీంతో అభిమానుల అత్యుత్సాహం పార్టీని ఎంతగా ముంచుతుందోనని స్థానిక నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

ఛీ.. చిన్నమ్మ



పొత్తు పార్టీల మేనిఫెస్టో విడుదల ప్రహసనాన్ని గమనించిన ప్రతి ఒక్కరి నోటా చిన్నమ్మ(పురందేశ్వరి) మాటే. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా మేనిఫెస్టో విడుదలలో తన మార్కు చూపిస్తారనుకున్నారు. తీరా చిన్నమ్మ జాడే లేకుండా పోయింది. పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక ఇతరత్ర విషయాల్లో చిన్నమ్మ చేసిన ద్రోహాన్ని బీజేపీ కేంద్ర పెద్దలు గమనించే.. ఆమెను పక్కనెట్టేశారట. ఇందుకు స్థానిక బీజేపీ నేతలు గట్టిగానే కృషి చేశారని సమాచారం. చిన్నమ్మను నమ్ముకుని ముందుకెళ్తే ఏపీలో బీజేపీ ఆనవాళ్లు లేకుండా పోతాయని, ఈ రెండు మాసాల్లో జరిగిన పరిణామాలను వివరిస్తూ నివేదికలు పంపారట. బీజేపీని టీడీపీ తోకపార్టీగా మార్చేశారని ఘాటుగానే చెప్పారట.

'ఉండి'లో గండి


అల్లం అంటే నాకు తెలీదా.. బెల్లంలా పుల్లగా ఉంటుందన్నాడట వెనకటికొకడు. ఉండి నియోజకవర్గంలో రఘురామకృష్ణరాజు(ఆర్ఆర్ఆర్) పరిస్థితి సేమ్ టు సేమ్. ఎంపీ సీటుకు టికానా లేక, పచ్చిచెడి టీడీపీ నుంచి ఎమ్మెల్యే సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తన కోసం త్యాగాలు చేసిన టీడీపీ నేతలు తన అడుగులకు మడుగులొత్తుతారని అనుకున్నారట. కానీ రోజురోజుకూ వారి వ్యతిరేకత పెరుగుతోంది. మంతెన కూడా ముఖం చాటేస్తున్నారు. ఇందుకు ఆర్ఆర్ఆర్ గోరోజనమే కారణమట. తాజాగా ఆకివీడు మండల పార్టీ అధ్యక్షుడికి ఈయన పెగ తగిలిందట. తనను కలిసేందుకు వస్తే గంటకు పైగా ఆఫీసు ముందు కూర్చోబెట్టారట. ఇప్పుడే ఇలా ఉంటే.. ఈయన్ని గెలిపిస్తే దగ్గరికి చేరగలమా?అంటూ పార్టీ నేతలు వాపోతున్నారు.

కేంద్రం టైటిల్‌తో బాబు డ్రామా

అమల్లోకే రాని ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై నాటకాలు

- భూములు లాక్కుంటున్నారంటూ ఎల్లో ముఠా వికృత క్రీడ
- ఐవీఆర్‌ఎస్ కాల్స్, వీడియోలతో భయభ్రాంతుల్ని చేసే యత్నం
- భూములన్నీ జగన్ పేరిటే రిజిస్టరు చేస్తున్నారంటూ పిచ్చి వ్యాఖ్యలు
- నిజానికి ఈ చట్టం తెచ్చేందుకు 1989 నుంచీ కేంద్రం ప్రయత్నాలు
- 2009, 2011, 2015, 2019లో నాలుగుసార్లు ముసాయిదా చట్టాలు
- దేశ వ్యాప్తంగా అమలు చేయటానికి 'నీతి ఆయోగ్' కమిటీ
- ఎలా అమలు చేయాలో వివరిస్తూ రోడ్ మ్యాప్ జారీ
- దానికి తగ్గట్టు 2019లో ముసాయిదా చట్టం చేసిన మోదీ సర్కారు
- దీన్ని అమలు చేయాలంటే భూముల రీ సర్వే పూర్తవ్వాలి
- రీ సర్వేలో పక్కాగా ప్రతి ఒక్కరి హక్కునూ తేలుస్తూ పత్రాలు
- వాటి ఆధారంగానే అన్ని శాఖల రికార్డులూ ఏకం చేసి 'రిజిస్టరు'
- రాష్ట్రంలో 17 వేల గ్రామాలు... 6 వేల గ్రామాల్లో పూర్తయిన రీ సర్వే
- అన్ని రాష్ట్రాలూ అమలు చేస్తేనే ఇక్కడా చేస్తామంటున్న ఆంధ్రప్రదేశ్
- బీజేపీతో అంటకాగుతూ కూడా... చంద్రబాబు పచ్చి అబద్ధాలు
- లేని చట్టాన్ని రద్దు చేస్తామంటూ మేనిఫెస్టోలో కూడా హామీ
- దీన్ని మోదీ సభల్లో చెప్పగలరా? మోదీతో చెప్పించగలరా?
- చంద్రబాబు దివాలాకోరు తనంపై జనం మండిపాటు

-పూర్తి వివరాలు IIIలో





ల్యాండ్ టైట్లింగ్ మార్గదర్శకాల కోసం జాతీయ స్థాయి కమిటీ వేస్తూ నీతి ఆయోగ్ 2019లో ఇచ్చిన మెమో

అమలులోకే రాని చట్టంపై
ఇంత దుష్ప్రచారమెందుకు? ల్యాండ్ టైట్లింగ్ చట్టం తేవాలని కేంద్రం స్పష్టంగా అన్ని రాష్ట్రాలకూ చెబుతున్న నేపథ్యంలో.. జనానికి నచ్చినా, నచ్చకపోయినా.. బలవంతంగానైనా దాన్ని అమల్లోకి తెచ్చే అవకాశం ఎవరి హయాంలో ఉంటుంది? బీజేపీతో కలిసి పోటీ చేస్తూ.. ఎన్డీఏతో కూటమి గట్టిన చంద్రబాబు నాయుడి హయాంలోనే కదా?

ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా స్వతంత్రంగా
ఎన్నికల బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ చట్టాన్ని ప్రజల ఇష్టాయిష్టాల మేరకు అమల్లోకి తేవటమో, తేకుండా నిలిపేయటమో ఏదైనా చేయగలరు. కానీ చంద్రబాబు పరిస్థితి అలా కాదు కదా! బీజేపీతో కూటమి గట్టి పోటీ చేస్తున్నారు గనక.. ఎన్డీఏ పేరుతో ఓట్లడుగుతున్నారు కనక.. ప్రజలకు ఇష్టం ఉన్నా, లేకున్నా, వచ్చినట్టు ఈ చట్టాన్ని అమలు చేసి తీరాలి. ఇది వాస్తవం. ఇది పచ్చి నిజం. మరి దొంగ మాటలెందుకు చంద్రబాబూ? పైపెచ్చు అమల్లోకి రాని ఈ చట్టాన్ని రద్దు చేస్తాననే ఓ పిచ్చి హామీని మేనిఫెస్టోలో పెట్టారంటే మిమ్మల్ని ఏమనుకోవాలి? మీ మానసిక స్థితి సరిగానే ఉందా?

అసలు అమల్లోకే రాని ఈ చట్టంపై ఉన్నవీ లేనివీ
చెబుతూ... దాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఆపాదిస్తూ.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చేసిందని, అందరి భూములూ లాక్కుంటోందని దిగజారిపోయి దౌర్భాగ్యపు ప్రచారానికి దిగటం ఎంత నీచం? ఈ చంద్రబాబు నాయుడి నైచ్యానికి అంతూ పొంతూ ఉండదా? మనిషిగా పుట్టాక కాస్తయినా సిగ్గూ శరం ఉండాలి కదా? 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెబుతున్న ఈ పెద్ద మనిషి.. ఇంత కుళ్లు కుతంత్రాలతో.. జనం సాక్షిగా కళ్లు మూయకుండా అబద్ధాలు చెప్పేస్తూ విషం కక్కుతుండటం హేయం కాదా?



అదే నా కల

ఎప్పటికీ జనం గుండెల్లో బతికి ఉండాలి

దేవుడు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా
రూ.2.70 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం
అవినీతి, వివక్ష ఎక్కడుంది? ప్రజల్లోకి వెళ్లి నేరుగా మైకు పెట్టి అడగండి
ఇండియాటుడే టీవీ చానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్

'అణగారిన, వెనుకబడిన వర్గాల ప్రజలు, అగ్రవర్ణ పేదల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశాన్ని దేవుడు నాకు ఇచ్చాడని గట్టిగా నమ్ముతున్నా. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. నేను మరణించినా, ప్రజల గుండెల్లో బతికి ఉండాలన్నదే నా కల' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌ను ఇండియా టుడే టీవీ ఇంటర్వ్యూ చేసింది.

-పూర్తి వివరాలు IIIలో


ఉత్తరాంధ్ర అభివృద్ధికి దిక్సూచి

శరవేగంగా భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం



అంతర్జాతీయ విమానాశ్రయం ఏ రాష్ట్రానికైనా అభివృద్ధికి సూచిక. సంబంధిత రాష్ట్రానికి ఐకానిక్ సింబల్ దేశ యవనికపై అదొక ప్రత్యేక ముద్ర. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశలో వేసిన అడుగులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. 2025 నాటికి తొలి దశ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో భూసేకరణకు బీజం పడింది. కానీ అప్పటి ప్రభుత్వం అభూత కల్పనలు, భయాలు కల్పించి ఏకంగా 15 వేల ఎకరాలు అవసరమని ప్రచారం చేయించింది. రైతుల ఆందోళనలతో ఐదు వేల ఎకరాలకు దిగింది. ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున మాత్రమే పరిహారం ప్రకటించింది. దీన్ని వ్యతిరేకిస్తూ 2015 ఆగస్టులో రైతులు రోడ్డెక్కారు. మరోవైపు భూసేకరణ నిబంధనలేవీ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ కొంత మంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. న్యాయస్థానంలో విచారణ పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. దీన్ని తానే నిర్మించానని చెప్పుకోవాలనే తహతహతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు రెండు నెలల ముందు ఫిబ్రవరి 14వ తేదీన హడావుడిగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా టీడీపీ ముఖ్య నాయకుడు, కేంద్ర ప్రభుత్వ పౌరవిమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు డుమ్మా కొట్టడంతో ప్రభుత్వ చిత్తశుద్ధి తేటతెల్లమైంది. మంత్రిగా ఉండి కూడా భోగాపురం విమానాశ్రయానికి కావాల్సిన అనుమతులనూ తీసుకురాలేకపోయారన్నది చర్చనీయాంశమైంది.

-సాక్షి ప్రతినిధి, విజయనగరం



ప్రభుత్వం మారింది దశ తిరిగింది

2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. అవసరమైన అనుమతుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేశారు. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. పరిహారాన్ని భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ ప్రకటించారు. డి.పట్టా భూములకూ జిరాయితీ భూమితో సమానంగా పరిహారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. దీంతో రైతులు చాలామంది పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతావాటినీ సర్వోన్నత న్యాయస్థానం పరిష్కరించింది. విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అం... దులో 422.69 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక 1,413 మంది


-మిగతా VIలో

విమానాశ్రయ స్వరూపం

స్థాయి	:	అంతర్జాతీయ విమానాశ్రయం
మొత్తం స్థలం	:	2,750.78 ఎకరాలు
ప్రభుత్వ భూమి	:	422.69 ఎకరాలు
కొనుగోలు చేసిన భూమి	:	1,383.39 ఎకరాలు
విమానాశ్రయం నిర్మాణానికి కేటాయించింది	:	2,203 ఎకరాలు
రన్‌వే పొడవు	:	3.8 కిలోమీటర్లు
నిర్వాసిత కుటుంబాలు	:	376
నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణ వ్యయం	:	రూ.80 కోట్లు
కేటాయించిన స్థలం	:	25 ఎకరాలు
ప్రత్యేకంగా విద్యుత్తు సబ్‌స్టేషన్ కోసం	:	5.47 ఎకరాలు
మొత్తం ఖర్చు	:	రూ.5వేల కోట్లు (అంచనా)

ఆయనో మాజీ మంత్రి. సొంత పేరు కంటే.. పేకాట పాపారావంటే స్థానిక ప్రజలు సులభంగా చెప్పేస్తారు. సోదరుడిని, ఆయన తయారు చేసుకున్న వర్గాన్ని, అణగదొక్కి మరీ రాజకీయాల్లోకి వచ్చారు. దివంగత మహానేత వైఎస్సార్ భిక్షతో ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆయన మరణం తర్వాత విచ్చలవిడి దోపిడీకి బరితెగించారు. గండికోట ప్రాజెక్టు, గాలేరు-నగరి సొరంగం పనుల కాంట్రాక్టర్ల నుంచి రూ.కోట్లలో దోచుకున్నారు. కాలువ తవ్వకాల్లో వచ్చిన బండరాళ్లను కూడా వదల్లేదు. కంకరగా మార్చి అక్రమార్జన చేశారు. పక్క రాష్ట్రానికి ఇసుక తరలించేందుకు పెన్నానదికి గర్భశోకం కలిగించారు. నీరు-చెట్టు పథకంలో ఆయన దోపిడీకి అడ్డు లేదంటే అతిశయోక్తి కాదు. ఇదంతా ఒక ఎత్తు అయితే, నమ్మినవారిని నట్టేట ముంచడం, పార్టీలు మారడం అంటే ఆయనకు మంచినీళ్లు తాగినంత సులభం.

జంపింగ్ జపాంగ్




అవినీతిలో 'ఆది'పత్యం

-వివరాలు VIలో

సాక్షి జాతీయం ఎలక్షన్ 2024

ఆహ్వాన పత్రికల నుంచి... ప్రత్యేక యాప్‌ల దాకా

పోలింగ్ పెంచేందుకు హరియాణాలో ఈసీ యత్నాలు



చండీగఢ్: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ప్రయోగం చేస్తోంది. హరియాణాలో మ్యూజికల్ బ్యాండ్స్, ఓటర్లకు ఆహ్వాన పత్రాలతో పాటు యాప్‌లు తదితరాలతో ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. యువ ఓటర్లను ఆకర్షించేందుకు మ్యూజికల్ బ్యాండ్స్ ఏర్పాటు చేసింది. ఇవి ఎన్నికల థీమ్ పాటలను ప్రదర్శిస్తాయి. ఓటుపై అవగాహన పెంచి, యువత కచ్చితంగా ఓటేసేలా ప్రోత్సహిస్తాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనురాగ్ అగర్వాల్ తెలిపారు. పంచకులలో తొలి బ్యాండ్ ప్రదర్శన ఉంటుందని, యువ ఓటర్లు అధికంగా ఉన్న అన్ని జిల్లాల్లో ఇవి సంగీత ప్రదర్శనలు ఇస్తాయని తెలిపారు. ఇక పోలింగ్ రోజు కేంద్రాల్లో పొడవాటి క్యూలు ఉంటాయని చాలామంది ఓటేయడానికే వెళ్లరు. అందుకే పోలింగ్ కేంద్రాల్లో క్యూ గురించి తెలియజేయడానికి 'ఓటర్స్ ఇన్ క్యూ' యాప్‌ను లాంచ్ చేస్తోంది. అలాగే పెళ్లిళ్లకు పంపినట్టుగా ఓటర్లకు కూడా ఆహ్వాన పత్రికలు పంపుతోంది. వాళ్ల మండుటెండల్లో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టే అవస్థ లేకుండా ఇంటి దగ్గరే ఓటేసేలా గురుగ్రాంలో పలు బహుళ అంతస్తుల భవనాల్లో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. హరియాణాలో రెండు కోట్ల మంది ఓటర్లున్నారు. వీరిలో 18–19 ఏళ్ల వయసు వారు 3.65 లక్షలు. 20–29 మధ్య వయసు వారు 39 లక్షలు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 70 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి 75 శాతానికి పైగా పెంచడమే లక్ష్యమని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

కురుక్షేత్ర యుద్ధాన్ని తలదన్నే రాజకీయాలకు హరియాణా ఆలవాలం. కుల సమీకరణాలు, పొత్తులు, కూటములు, వేరుకుంపట్లు ఇక్కడ పరిపాటి. జాతీయ పార్టీలతో పాటు ఒకప్పుడు చక్రం తిప్పిన ప్రాంతీయ పార్టీలూ రాజకీయంగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆధిపత్యం లభిస్తూ వస్తోంది. 2005 నుండి 2014 దాకా కాంగ్రెస్ చక్రం తిప్పగా పదేళ్లుగా బీజేపీ పట్టు బిగించింది. గత ఎన్నికల్లో సింగిల్‌గా పోటీ చేసి 10 సీట్లను క్లీన్‌స్వీప్ చేసిన కమలనాథులను రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు కలవరపెడుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా చుట్టిన కాంగ్రెస్ ఈసారి ఇండియా కూటమి రూపంలో కాషాయ పార్టీని ఢీకొడుతోంది...

– సాక్షి, నేషనల్ డెస్క్





పోలింగ్ తేదీ: మే 25

సర్వేలు ఏమంటున్నాయి?!

బీజేపీ 8, ఇండియా కూటమి 2 సీట్లలో గెలుస్తాయని తాజా ఎన్నికల సర్వేలు అంచనా వేశాయి. సీఎం మార్పు, ప్రభుత్వ వ్యతిరేకత, రైతు ఆందోళనలు, తదితర పరిణామాలు కమలనాథుల జోరుకు కళ్లెం వేస్తాయని మరికొందరు రాజకీయ పండితులు అంటున్నారు.

స్టేట్ స్కాన్

కూటముల కురుక్షేత్రం

హరియాణా రాజకీయాలు జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎత్తుజిత్తుల నడుమ సాగుతున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఏడు సీట్లు గెలిచిన బీజేపీ 2019లో ఒంటరిగా పోటీ చేసి మొత్తం 10 సీట్లూ ఒడిసిపట్టింది. కాంగ్రెస్‌కు ఒక్క సీటూ దక్కలేదు. ప్రాంతీయ పార్టీ ఇండియన్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ) 2014లో గెలిచిన 2 సీట్లనూ పోగొట్టుకుంది.

హరియాణాలో హోరాహోరీ | గత ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ | ఈసారి కాంగ్రెస్ గట్టి పోటీ | రాష్ట్రంలో చతుర్ముఖ పోరు

ఇండియా కూటమి, ప్రాంతీయ పార్టీలు సై...

రైతు సమస్యలు తదితరాలతో రాష్ట్రంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీజేపీపై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతోంది. పొత్తులో భాగంగా 9 సీట్లలో కాంగ్రెస్, ఒకచోట ఆప్ పోటీ చేస్తున్నాయి. మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా సారథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 31 సీట్లతో బలమైన ప్రతిపక్షంగా నిలిచిన కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. ధరల పెరుగుదల, కార్పొరేట్లతో మోదీ కుమ్మక్కు, విపక్షాలపై వేధింపులు, నిరుద్యోగం తదితరాలను ఇండియా కూటమి ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. రైతు ఆందోళనలకు మద్దతుతో పాటు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత హామీలను మేనిఫెస్టోలో చేర్చడం కలిసొస్తుందని ఆశపడుతోంది. ఐఎన్ఎల్‌డీ, జేజేపీ కూడా ఒంటరిగా పోటీ చేస్తూ జాతీయ పార్టీలకు సవాలు విసురుతున్నాయి. అయితే జేజేపీ హరియాణా రాష్ట్ర చీఫ్ నిషాన్ సింగ్ ఎన్నికల వేళ పార్టీకి గుడ్‌బై చెప్పి షాకిచ్చారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కార్పొరేట్ దిగ్గజం నవీన్ జిందాల్ కురుక్షేత్రలో ఆప్ నేత సుశీల్ గుప్తాతో తలపడుతున్నారు. అది హాట్ సీట్‌గా అందరినీ ఆకర్షిస్తోంది. 2004, 2009ల్లో కాంగ్రెస్ తరఫున ఇక్కడ గెలిచిన జిందాల్ 2014లో బీజేపీ చేతిలో ఓడారు. 2019లో పోటీకి దూరంగా ఉన్నారు.

బీజేపీకి కొత్త కష్టాలు...



2014 లోక్‌సభ ఎన్నికల్లో 7 సీట్లు గెలిచిన ఊపులో ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించింది. మనోహర్‌లాల్ ఖట్టర్ సీఎం అయ్యారు. 2019లో 10 లోక్‌సభ సీట్లూ నెగ్గినా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పుంజుకోవడంతో హంగ్ వచ్చింది. అయినా జేజేపీ, స్వతంత్రుల మద్దతుతో బీజేపీ మళ్లీ గద్దెనెక్కింది. జేజేపీ చీఫ్ దుష్యంత్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. ప్రభుత్వ వ్యతిరేకతతో బీజేపీకి కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై విభేదాలతో బీజేపీ, జేజేపీ పొత్తుకు తెరపడింది. దాంతో ఖట్టర్, దుష్యంత్ రాజీనామా చేశారు. ఎన్నికల ముందు ఓబీసీ వర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయాబ్ సింగ్ సైనీ సీఎం అయ్యారు. తాజాగా వెల్లువెత్తిన రైతు ఆందోళనలూ బీజేపీకి ప్రతికూలంగా మారొచ్చని భావిస్తున్నారు. మోదీ కరిష్మా, అయోధ్య రామమందిర నిర్మాణం, హిందుత్వ నినాదం తదితరాలనే పార్టీ నమ్ముకుంది.

ప్రాంతీయ పార్టీల్లో చీలిక...

ఐఎన్ఎల్‌డీ వ్యవస్థాపకుడు, హరియాణా సీఎంగా, ఉప ప్రధానిగా చేసిన చౌదరి దేవీలాల్ అనంతరం పార్టీ పగ్గాలు చేపట్టిన కుమారుడు ఓం ప్రకాశ్ చౌతాలా నాలుగుసార్లు సీఎం అయ్యారు. ఉద్యోగ నియామకాల కుంభకోణంలో ఆయన, అవినీతి కేసుల్లో పెద్ద కుమారుడు అజయ్ సింగ్ చౌతాలా జైలు కెళ్లారు. దాంతో రెండో కుమారుడు అభయ్ సింగ్ చౌతాలా పార్టీ పగ్గాలు చేపట్టారు. అన్నదమ్ముల కుమ్ములాటతో పార్టీ చీలిపోయింది. అజయ్ సింగ్ కుమారులైన దుష్యంత్ చౌతాలా, దిగ్విజయ్ చౌతాలాను పార్టీ నుంచి తొలగించారు. దాంతో తండ్రి, సోదరునితో కలిసి దుష్యంత్ జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)ని స్థాపించారు. జేజేపీ గత లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌తో కలిసి పోటీ చేసినా ఒక్క సీటూ దక్కలేదు. అభయ్ సారథ్యంలోని ఐఎన్ఎల్‌డీ కూడా ప్రభావం చూపలేకపోయింది. 2014లో హరియాణా జనహిత్ కాంగ్రెస్ (హెచ్‌జేసీ–బీఎల్)తో పొత్తు పెట్టుకున్న బీజేపీకి పెద్దగా ప్రయోజనం లభించలేదు. బీజేపీ 8 స్థానాల్లో పోటీ చేసి ఏడింటిని దక్కించుకోగా మూడు చోట్ల పోటీ చేసిన హెచ్‌జేసీకి ఒక్క సీటూ దక్కలేదు. హరియాణాలో మూడుసార్లు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పని చేసిన భజన్‌లాల్ 2007లో కుమారుడు కుల్దీప్ బిష్ణోయ్‌తో కలిసి ఈ పార్టీని స్థాపించారు. 2016లో కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

'పోలింగ్'లో 'సమానత్వం'

అక్కడ స్త్రీ పురుషులు సమానం. ఎక్కడ? ఎలా? ఈ సమానత్వం ఎప్పుడు వచ్చింది? ఇలాంటి ప్రశ్నలన్నీ తలెత్తుతున్నాయా? ఏమీ లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఎన్నికల సంఘం ఏదో ఒక కొత్త ప్రయోగం చేస్తూనే ఉంటుంది. అలాగే ఈసారి కూడా ఛత్తీస్‌గఢ్‌లో ఓ ప్రయోగం చేసింది. 300 పోలింగ్ కేంద్రాల్లో స్త్రీ, పురుష సిబ్బందిని సమాన సంఖ్యలో నియమించింది. ఒక బూత్‌లో నలుగురు సిబ్బంది ఉంటే వారిలో విధిగా ఇద్దరు మహిళలుంటారు. ఇందుకు రాయ్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఈసీ ఎంచుకుంది. అక్కడ 300 పోలింగ్ కేంద్రాల్లో ఇలా స్త్రీ, పురుష సిబ్బందిని సమానంగా నియమించింది. వీటిలో లైలుంగా అసెంబ్లీ స్థానం పరిధిలో 75, రాయ్‌గఢ్‌లో 100, ఖర్సియాలో 75, ధరమ్‌జయ్‌గఢ్ పరిధిలో 50 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లోని స్త్రీ, పురుష సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బడ్డీ ఓటర్... ముంజేతికి ఎన్నికల బంధం



గువాహటి: తొలిసారి ఓటేస్తున్న వారిని ఆకర్షించేందుకు అస్సాంలో ఎన్నికల సంఘం 'బడ్డీ ఓటర్' పేరిట వినూత్నంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా కామ్‌రూప్ జిల్లా ఎన్నికల అధికారి జల్లి కీర్తి దీన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గత ఎన్నికల్లో తొలిసారి ఓటేసిన విమలా ప్రసాద్ చలిహా కాలేజీ విద్యార్థులు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటేయబోతున్న విద్యార్థుల చేతికి బ్యాండ్ కట్టి ఆహ్వానించారు. ఇందుకోసం స్వీప్ బృందం రంగురంగుల బ్యాండ్స్ రూపొందించింది. రక్షాబంధన్ రోజు రాఖీ కట్టి అభయమిచ్చినట్టుగా ఇలా బ్యాండ్ కట్టి ఓటేయడానికి రమ్మంటూ ప్రోత్సహించడం బాగుందంటున్నారు విద్యార్థులు. తాను తొలిసారి ఓటేసినప్పుడు కాస్త నెర్వస్‌గా ఫీలయ్యానని, ఇప్పుడు కొత్తగా ఓటేస్తున్న వారికి ఆ ఫీలింగ్ లేకుండా భరోసా ఇవ్వడం బాగుందని మరో విద్యార్థి అన్నారు. ఓటర్లను ప్రోత్సహించడంతో పాటు సీనియర్లు, జూనియర్ల మధ్య ఆరోగ్యకర వాతావరణాన్ని పెంపొందించడానికి కూడా ఈ ప్రయోగం పనికొస్తుందంటున్నారు కాలేజీ ప్రిన్సిపల్ కమలా చంద్ర పథక్

ఫలౌదీ చెప్తే అంతే..!

ఫలితాలపై కచ్చితమైన జోస్యాలు

- ఎన్నికల పందేలకు యమా ఫేమస్
- మోదీ మూడో విడత ఖాయమని జోస్యం



ఈ లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టడమే గాక ఏకంగా 370 సీట్లు దాటేస్తామని ప్రధాని మోదీ. బీజేపీకి 200 కూడా దాటవని కాంగ్రెస్. ఈ విడత ఢిల్లీ పీఠం ఎవరిని వరిస్తుంది? దేశ, విదేశాల్లో అందరిలోనూ ఉత్కంఠ రేపుతున్న అంశమిది. దీనిపై స్పష్టత రావాలంటే రాజస్తాన్ వెళ్లాల్సిందే. స్పష్టంగా చెప్పాలంటే జోధ్‌పూర్‌కు 142 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫలౌదీ అనే చిన్న పట్టణానికి వెళ్లాలి. పందేలకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌ని చెప్పాలి. ఇక్కడి పందెం రాయుళ్లు చెప్పేది దాదాపుగా నిజమవుతుంది! ముఖ్యంగా ఎన్నికల ఫలితాలపై ఇక్కడి బుకీల అంచనాలు తప్పడం చాలా అరుదు...

సట్టా బజార్

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఉప్పు తయారీ పరిశ్రమలకు కేంద్రం ఫలౌదీ. అయితే దీనికి అంతకు మించిన గుర్తింపు ఒకటుంది. అదే... 'సట్టా బజార్'! ఈ పేరుతో ఇది దేశ విదేశాల్లోనూ ప్రసిద్ధికెక్కింది. ప్రత్యేకించి ఎన్నికల బెట్టింగ్‌లకు ఇది పెట్టింది పేరు! అందుకే ప్రతి ఎన్నిక సమయంలోనూ విశ్లేషకులు ఈ సట్టా బజార్ వైపే చూస్తుంటారు. ఇక్కడి సట్టా బజార్ బుకీలు చెప్పిందే నిజమవుతూ వస్తుండటంతో ఎన్నికల జూదానికి ఈ ప్రాంతం హాట్ మార్కెట్‌గా మారిపోయింది. ఎగ్జిట్ పోల్స్‌ను కూడా తోసిరాజని ఇక్కడి సట్టా బజార్ చెప్పిందే నిజమైన సందర్భాలెన్నో! తాజాగా 2023 చివర్లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల విషయంలో కూడా ఫలౌదీ బుకింగ్‌ల అంచనాలే నిజమయ్యాయి. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ ఫలితాల విషయంలో దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తప్పులో కాలేస్తే సట్టా బజార్ అంచనాలు మాత్రం అక్షరాలా నిజమయ్యాయి!

అంచనాల్లో కచ్చితత్వం

2023 రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెసే గెలవచ్చని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ 110 నుంచి 112 సీట్లతో బీజేపీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఫలౌదీలో పందేలు నడిచాయి. అన్నట్టుగానే బీజేపీ 115 సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చింది. ఇక గుజరాత్‌లో బీజేపీ 136–138 స్థానాలు సాధిస్తుందని, కాంగ్రెస్ 30–31కి పరిమితమవుతుందని పందేలు కాశారు. చివరికి బీజేపీకి 156 స్థానాలు లభించాయి. హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చినా కాంగ్రెస్ నెగ్గుతుందని బెట్టింగ్ నడిచింది. కాంగ్రెస్‌కు 40 స్థానాలతో అధికారం చేజిక్కించుకోగా బీజేపీకి 25 వచ్చాయి. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీకి 50 నుంచి 52 స్థానాలు వస్తాయని అంచనా వేయగా 54 సీట్లతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్‌కు 37–39 రావచ్చని పందేలు నడవగా 35 సీట్లు దక్కాయి

ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపెవరిదో?

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 330–333 స్థానాల దాకా దక్కుతాయని ఫలౌదీ మార్కెట్లో బెట్టింగ్ బాబులు పందేలు వేసుకుంటున్నారు. అయితే, కాంగ్రెస్‌కు 100 దాటవచ్చని వారు అంచనా వేస్తుండటం విశేషం. బీజేపీకి 350 వస్తాయంటూ రూ.3 చొప్పున బెట్టింగ్ నడుస్తోంది. ఇది నిజమైతే పందెం కాసిన వారికి ప్రతి రూపాయికి రూ.3 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇక బీజేపీ 400 స్థానాలు గెలుచుకుంటే ప్రతి రూపాయికి ఏకంగా 12 నుంచి 15 రూపాయలిస్తామని బుకీలు ఆఫర్ చేస్తున్నారు. ఎన్డీఏకు 370 వరకు వస్తాయన్నది ఫలౌదీ అంచనా వేస్తున్నారు. 400 స్థానాలు గనుక వస్తే ప్రతి రూపాయిపై రూ.4–5 చెల్లిస్తామని బుకీలు చెబుతున్నారు.

వీరికెలా తెలుస్తుంది?

ఫలౌదీ సట్టా బజార్ అతి పెద్ద బెట్టింగ్ కేంద్రాల్లో ఒకటి. ఎన్నికల ఫలితాల మీదే కాకుండా, క్రికెట్, చివరికి వర్షాలపై కూడా ఇక్కడ పందేలు నడుస్తుంటాయి. కాకపోతే రూ.వందలాది కోట్లతో సాగే ఎన్నికల బెట్టింగ్ వాటాయే ఎక్కువ. నిత్యం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వ్యాపారం ఫోన్ కాల్స్ ద్వారా, ప్రత్యక్షంగా నడుస్తుంటుంది. ముఖ్యమైన రాజకీయ పార్టీలన్నింటితోనూ ఇక్కడి వారికి లోతైన సంబంధాలుంటాయి. పార్టీల వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించి వాటి ఆధారంగా బెట్టింగ్‌లు నడుపుతుంటారు. రాజస్తాన్ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు జూదాన్ని నిషేధించాయి. ఇక్కడ నడిచేదంతా చట్టవిరుద్ధమైన జూదమే

– సాక్షి, నేషనల్ డెస్క్

• ఉజ్వల్ నికమ్

ప్రజా కోర్టు ముందుకు

ఉజ్వల్ నికమ్. 26/11 ముంబై ఉగ్ర దాడి కేసును వాదించి దేశవ్యాప్తంగా ఖ్యాతితో పాటు ఏకంగా జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత పొందిన ప్రముఖ న్యాయవాది. ఆకట్టుకునే హావభావాలు, వన్ లైనర్ పంచ్‌లతో నిండిన వాదనలకు పెట్టింది పేరు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. 71 ఏళ్ల ఉజ్వల్ ముంబై నార్త్ సెంట్రల్ నుంచి బీజేపీ తరఫున బరిలోకి దిగుతున్నారు. ముంబై కాంగ్రెస్ చీఫ్ వర్షా గైక్వాడ్‌తో తలపడుతున్నారు. సిట్టింగ్ ఎంపీ పూనమ్ మహాజన్‌ను కాదని నికమ్‌కు బీజేపీ టికెటిచ్చింది. ఆమె తండ్రి, బీజేపీ దిగ్గజం ప్రమోద్ మహాజన్ హత్య కేసును ఆయనే వాదించడం విశేషం...!

– సాక్షి, నేషనల్ డెస్క్



పరిచయం

30 ఏళ్ల కెరీర్...

ఉజ్వల్ నికమ్ జల్గావ్ జిల్లాలో సివిల్ లాయర్‌గా కెరీర్ ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ కేసులు వాదించి తనదైన ముద్ర వేశారు. 1991లో కల్యాణ్ బాంబు పేలుడు కేసులో ముద్దాయి రవీందర్ సింగ్‌ను దోషిగా రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదించడం ఆయన కెరీర్లో కీలక మలుపు. ఉగ్రవాద (నిరోధక) చట్టం కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టులో 14 ఏళ్లకు పైగా పని చేశారు. ఇక 26/11 ముంబై దాడుల విచారణలో మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. విచారణ విశేషాలను రోజూ మీడియాకు వివరిస్తూ దేశవ్యాప్తంగా ఫేమసయ్యారు. అప్పట్లో ఆయనకు జెడ్ ప్లస్ భద్రత కల్పించడం విశేషం! ముంబై దాడి నిందితుడు అజ్మల్ కసబ్ జైలులో మటన్ బిర్యానీ డిమాండ్ చేశాడని చెప్పిన నికమ్, అది అబద్ధమని తర్వాత అంగీకరించడం విశేషం! టీ సిరీస్ అధినేత గుల్షన్ కుమార్ హత్య, బీజేపీ అగ్రనేత ప్రమోద్ మహాజన్ హత్య, పుణే ఊచకోత, గ్యాంగ్‌స్టర్ అబూ సలేం, కొల్హాపూర్ పిల్లల వరుస హత్యలు, శక్తి మిల్ గ్యాంగ్ రేప్, డేవిడ్ హెడ్లీ కేసు వంటి ఎన్నో హై ప్రొఫైల్ కేసుల్లో ఆయన వాదించారు. 2013 ముంబై గ్యాంగ్ రేప్ కేసు, 2016 కోపర్డి రేప్ అండ్ మర్డర్ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా ఆయనే. ఇప్పటివరకూ నికమ్ వాదించిన కేసుల్లో ఏకంగా 37 మందికి మరణశిక్ష, 628 మందికి జీవిత ఖైదు పడటం విశేషం! అయితే 2011 ముంబై ట్రిపుల్ పేలుళ్ల కేసు, మొహ్సిన్ షేక్ హత్య వంటి పలు కేసుల విచారణ నుంచి ఆయన అర్ధాంతరంగా తప్పుకున్నారు. జైబుద్దీన్ అన్సారీ అలియాస్ అబు జుందాల్‌పై 26/11 విచారణ, నటి లైలా ఖాన్ హత్య కేసుల్లో ప్రాసిక్యూటర్‌గా కొనసాగుతున్నారు. లాయర్‌గా 30 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో కేసుల్లో నెగ్గిన ఆయన ప్రజా కోర్టులో ఏ మేరకు నెగ్గుకొస్తారో చూడాలి.

తల్లి స్వాతంత్య్ర యోధురాలు...

ఉజ్వల్ నికమ్ మహారాష్ట్రలోని జల్గావ్‌లో మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి దేవరావుజీ నికమ్ న్యాయమూర్తి. తల్లి విమలాదేవి స్వాతంత్య్ర యోధురాలు. జల్గావ్‌లోని ఎస్ఎస్ మనియార్ లా కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. న్యాయ రంగంలో కృషికి 2016లో పద్మశ్రీ అందుకున్నారు. ఉజ్వల్ కొడుకు అనికేత్ నికమ్ ముంబై హైకోర్టులో క్రిమినల్ లాయర్. లోక్‌సభకు పోటీ చేయనుండటం చాలా పెద్ద బాధ్యత అని అన్నారాయన. "కొత్త పాత్రకు సిద్ధంగా ఉన్నా. ముంబై నార్త్ సెంట్రల్‌లో ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తా. చాలా ముఖ్యమైన కేసుల్లో మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించాను. ఇప్పుడు దేశ వ్యతిరేకులపై గొంతు వినిపిస్తా. పేదలకు న్యాయం జరిగేలా చేస్తా" అని చెబుతున్నారు.

ఈసారి ఓటు మార్పు కోసమే

డింపుల్ యాదవ్ మనోగతం



ఇంటర్వ్యూ

ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా మార్పు కోసమే ఓటేస్తారని సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు డింపుల్ యాదవ్ ధీమా వెలిబుచ్చారు. మెయిన్‌పురి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆమె ప్రచార పర్వంలో బిజీగా ఉన్నారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని స్వగ్రామం సైఫైలో పీటీఐ ప్రత్యేక ముఖాముఖిలో పలు అంశాలపై డింపుల్ తన మనోగతాన్ని ఇలా పంచుకున్నారు...

బీజేపీపై..

- బీజేపీ పూర్తిగా ఓటు బ్యాంక్ రాజకీయాల్లో మునిగిపోయింది. కులాల లెక్కన జనాన్ని విడగొడుతోంది. జనం మనోభావాలతో ఆడుకుంటోంది. కీలక సమస్యల నుంచి జనం దృష్టి మరల్చుతోంది. బీజేపీ రాజకీయ ఒత్తిళ్లతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. విభజన రాజకీయాలతో వర్గాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటోందని వారికి తెలిసొచ్చింది. అందుకే కేంద్రంలో ఈసారి అధికార మార్పు కోసమే జనం ఓటేస్తారు

దర్యాప్తు సంస్థలు, ధరలపై..

- ఈడీ, సీబీఐ, ఐటీ ఇలా ప్రతి దర్యాప్తు సంస్థనూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ దుర్వినియోగం చేసింది. ఉత్తరప్రదేశ్‌లో జిల్లా స్థాయిలోనూ యోగి ఆదిత్యనాథ్ సర్కార్ జనాన్ని పీడిస్తోంది. ద్రవ్యోల్బణం విజృంభిస్తోంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు జనాలకు చేరట్లేవు. వాగ్దానాలైతే జోరుగా చేస్తున్నారుగానీ క్షేత్రస్థాయిలో వాటి అమలు ఆనవాలు కనిపించట్లేదు. దేశాన్ని బీజేపీ ఎటు వైపు తీసుకెళ్తోందో అందరికీ తెలుసు. పోషకాహార లోపం, ఆకలి చావుల రేటింగ్స్, గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత్ స్థానం ఏటికేడు దిగజారుతోంది. మళ్లీ బీజేపీ గెలిస్తే దేశం 15 ఏళ్లు తిరోగమనంలోకి వెళ్లడం ఖాయం. దేశ భవిష్యత్తును కాపాడుకోవాల్సిన తరుణంలో వచ్చిన ఎన్నికలివి.

మోదీ మంగళసూత్రం వ్యాఖ్యలపై

- ఇదొక్కటే వాళ్లకు ఆయుధంగా దొరికింది. జనం భవితకు సంబంధించిన ఏ అంశమూ బీజేపీకి పట్టదు. యూపీలో మొత్తం 80 సీట్లు గెలిచేస్తామని అబద్ధాలు చెబుతున్నారు. అందులో నిపుణులు వాళ్లు. కానీ వాళ్ల మాటలను ఈసారి జనం నమ్మట్లేరు. గట్టి గుణపాఠమే చెప్తారు. అత్యంత అవినీతి నేతలను బీజేపీ లాగేసి డ్రై క్లీనింగ్ మెషీన్‌లో పడేస్తోంది. అంతా రాజకీయ లబ్ధికోసమే చేస్తుంది.

గెలుపు మెజారిటీ తగ్గడంపై..

- మామ ములాయం సింగ్ యాదవ్ కాలం నుంచి చూస్తే భారీ మెజారిటీ అనేది తగ్గడం వాస్తవమే. 2019లో ఆ మెజారిటీ కేవలం 94000కు తగ్గింది. ఎన్నికలు ఎప్పుడూ ఒకేలా జరగవు. ప్రతిసారీ గెలుపును వేర్వేరు కారణాలు ప్రభావితం చేస్తాయి.


తన ప్రచార సరళిపై..

- రోజుకు ఎనిమిది, తొమ్మిది మీటింగ్‌లలో పాల్గొంటున్నా. విపక్షాల 'ఇండియా' కూటమికి జనం నుంచి వస్తున్న స్పందన అద్భుతం. నా కూతురు అదితి యాదవ్ సైతం తొలిసారిగా ప్రచారంలో పాల్గొంటోంది. గ్రామాలకు వెళ్తూ వారిని కలుస్తోంది. ములాయం మరణంతో వెల్లువెత్తిన సానుభూతి కారణంగానే 2022 మెయిన్‌పురి ఉపఎన్నికల్లో 2.8 లక్షల భారీ మెజారిటీతో ఎస్పీ గెలిచిందన్న బీజేపీ వ్యాఖ్యల్లో నిజంలేదు. జనం మనసుల్లో మేమే ఉన్నాం. ఈసారీ గెలుపు మాదే. ఆర్మీలో పనిచేస్తున్న యువతతోపాటు వృద్ధులు, మహిళలు అంతా బీజేపీ వాగ్దానాలను నెరవేర్చలేదన్న నిస్పృహలో ఉన్నారు.

– మెయిన్‌పురి

అదే నా కల

ఎప్పటికీ జనం గుండెల్లో బతికి ఉండాలి



రాజ్‌దీప్: మీరు 2019 ఎన్నికలకు ముందు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేసి చంద్రబాబును చాలెంజ్ చేశారు. ఇప్పుడు చంద్రబాబు మీకు చాలెంజ్ చేస్తున్నారు. మీరు అధికారంలో ఉండి ఎన్నికలకు వెళ్లడం గతంతో పోలిస్తే ఇది కఠినంగా అనిపిస్తోందా?

సీఎం జగన్: సాధారణ పరిస్థితుల్లో అనిపించొచ్చు. కానీ, ఇక్కడ వాస్తవం ఏమంటే.. మేము ప్రజలకు సుపరిపాలన అందించాం. మా మేనిఫెస్టోలోని 99 శాతం వాగ్దానాలను త్రికరణ శుద్ధిగా అమలు చేసి చూపించాం. అర్హతే ప్రామాణికంగా, ఎలాంటి వివక్ష లేకుండా.. అవినీతికి తావు లేకుండా అత్యంత పారదర్శకంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం.

రాజ్‌దీప్: మీరు చాలా డబ్బు ప్రజలకు చేరిందని చెబుతున్నారు.. ఇలా నగదు బదిలీ ద్వారా ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని కొంత మంది ఆరోపిస్తున్నారు.. ఏపీలో నేరుగా రైతులకు డబ్బులు ఇస్తున్నారు. ఇలా క్యాష్ ట్రాన్స్‌ఫర్ కాకుండా.. ఉత్పాదక ఉపాధి కోరుకుంటున్న వాళ్లకి ఏం చెబుతారు?

సీఎం జగన్: ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే రాజ్‌దీప్.. కొందరిలో ఆ కన్ఫ్యూజన్ ఉంది. మేం చాలా సమగ్రమైన విధానాలను అనుసరించాం. రైతుల గురించే తీసుకుంటే.. ఏ విధంగా వ్యవసాయానికి భరోసా ఇచ్చామో తెలుస్తుంది. రాష్ట్రంలో 50 శాతం మంది అర్థ హెక్టార్, 70 శాతం మంది ఒక హెక్టార్‌లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులున్నారు. ఇలాంటి వారందరి కోసమే రైతు భరోసా ప్రవేశపెట్టాం. ఏటా రూ.13,500 పెట్టుబడి సాయంగా ఇస్తున్నాం. మేము ఐదేళ్లలో రూ.50 వేలు ఇస్తామని చెప్పి.. రూ.67,500 ఇచ్చాం. ఇది రైతులకు 80 శాతం సాగు ఖర్చులుగా ఉపయోగపడుతుంది. దీనికి తోడు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) తీసుకొచ్చాం. గ్రామ సచివాలయాన్ని పెట్టాం. 60–70 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవలు అందిస్తున్నారు. ప్రతి పథకం అవినీతి, వివక్ష లేకుండా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుడి దగ్గరకు నేరుగా చేరుతోంది. సమస్త ప్రభుత్వ సేవలన్నీ పేదల ఇంటి ముంగిటనే నిలిచాయి.



రాజ్‌దీప్: సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాలా తీస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అందుకే కేంద్రం సాయం కోసం ఢిల్లీకి వెళ్తున్నారని ఆరోపించాయి కదా?

సీఎం జగన్: రాజ్‌దీప్.. మనం డబ్బు ఎక్కడ ఖర్చు చేస్తున్నామో చూడాలి. ఎవరైనా మాట్లాడే ముందు ఆలోచించాలి. పథకానికి ఏ పేరు పెట్టినా ఆ డబ్బు ఎవరికి వెళ్లి.. ఎంత మేలు చేసిందో చూసుకోవాలి. దీన్ని సామాజిక పెట్టుబడిగా చూడాలి.

రాజ్‌దీప్: రాష్ట్రంపై రూ.4.42 లక్షల కోట్ల అప్పు ఉంది. ఆ డబ్బుల కోసమే మీరు కేంద్రంపై ఆధారపడ్డారా?

సీఎం జగన్: ఇదంతా ప్రతి రాష్ట్రంలో ఉంటుంది. ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల మేరకే ఏ రాష్ట్రమైనా అప్పులు చేస్తుంది. ఆ పరిమితులను దాటి ఏ రాష్ట్రం కూడా అప్పు చేయలేదు.

రాజ్‌దీప్: నేరుగా డీబీటీతో ఆర్థిక భరోసా కల్పించడం ద్వారానే మీరు తిరిగి మరోసారి అధికారంలోకి వస్తారని నమ్ముతున్నారా? ఇదే మీ విన్నింగ్ కార్డు అనుకోవచ్చా?

సీఎం జగన్: ఇక్కడ సరిగా అర్థం చేసుకోవాలి. డబ్బు ఎక్కడికి.. ఎలా.. వెళ్లిందో చూడాలి. మేము ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఇంగ్లిష్ మీడియంలోకి తీసుకొచ్చాం. ద్విభాషా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించాం. ఆరో తరగతి నుంచి ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను పెట్టి డిజిటల్ బోధన అందిస్తున్నాం. ప్రతి ఎనిమిదో తరగతి విద్యార్థి చేతిలో బైజ్యూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు పెట్టాం. ఇది సిలబస్‌తో కనెక్ట్ అయి ఉంటుంది. ఇలా చూస్తే విద్యా వ్యవస్థలో చాలా మార్పులు కనిపిస్తాయి. టోఫెల్ శిక్షణ కోసం ప్రత్యేక పీరియడ్ తీసుకొచ్చాం. ఇదంతా ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థుల కోసం జరుగుతోంది. 2025 విద్యా సంవత్సరంలో ఫస్ట్ క్లాస్ విద్యార్థి ఐబీ సిలబస్‌లో చదువుకుంటాడు. 2035 నాటికి మా పిల్లలు ఐబీ బోర్డు పరీక్షలు రాస్తారు. ప్రతి ఏటా ఒక్కో తరగతికి ఐబీని అప్‌గ్రేడ్ చేసుకుంటూ వెళ్తాం. సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి పేదవాడి భవితను మారుస్తోందనడానికి ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

> **రాజ్‌దీప్:** కేంద్రంలో అధికారం కోసంమోదీకి సీట్లు తగ్గితే మీరు 20 ఎంపీ సీట్లతో సపోర్ట్ చేస్తారా?
> **సీఎం జగన్:** ఊహాజనిత పరిస్థితి గురించి ఎందుకు మాట్లాడటం.. ఇప్పుడు వారు నేను ఒకరికొకరం వ్యతిరేకంగా పోరాడుతున్నాం.

రాజ్‌దీప్: 81 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలను మీరు మార్చారు. వైఎస్సార్‌సీపీలో వన్ మ్యాన్ షో జరుగుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. వైఎస్ జగన్ అనే పేరు చెప్పి ఈ రోజున ఓట్లు అడుగుతున్నారు. ప్రాంతీయ పార్టీలో ఇది హైరిస్క్ ఫార్ములా కాదంటారా?

సీఎం జగన్: ప్రతి రాజకీయ పార్టీకి ఒక సొంత సర్వే ఉంటుంది. ఆ సర్వేల ప్రకారం ఈ రోజున మా ప్రభుత్వం మీద, సీఎంగా నా మీద ప్రజల్లో ఎటువంటి వ్యతిరేకత లేదు. ఇది రియాలిటీ. అందుకే నేను చాలా నమ్మకంగా ఉన్నాను.

రాజ్‌దీప్: అందుకేనా జగన్ పేరిటే ఓట్లు అడుగుతున్నారు?

సీఎం జగన్: అవును. నేను ఎంతో నమ్మకంగా ఉన్నాను. నేను ఎక్కడికి వెళ్లినా ప్రజలకు ఒకటే చెబుతున్నా. ప్రస్తుతం జరుగుతున్నవి ఎంపీలు, ఎమ్మెల్యేలను ఎన్నుకునే ఎన్నికలు కాదు. మీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలని వివరిస్తున్నా. 'మీ భవిష్యత్ జగన్‌తో ఉంటే భద్రంగా ఉంటుంది. జగన్ ద్వారానే మీ భవిష్యత్ మంచి మలుపు తిరుగుతుంది' అంటూనే వైఎస్సార్‌సీపీకి ఓటేయమని అడుగుతున్నా. అంతేకాదు.. గడిచిన ఐదేళ్లలో మా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందినట్లయితేనే, మంచి పరిపాలన అందించారని భావిస్తేనే ఓటేయాలని అడుగుతున్న ఏకైక పార్టీ కూడా వైఎస్సార్‌సీపీ.

రాజ్‌దీప్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, మీ సొంత చెల్లి షర్మిల ఇలా అందరూ అటు వైపు ఉంటే మీరొక్కరే ఇటువైపు ఉన్నారు. వాళ్లందరూ ఒక్కటిగా వస్తున్నారు. ఇది మీకు ఇబ్బందికరంగా లేదా?

సీఎం జగన్: గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలకు మంచి పరిపాలన నేను అందించాను. మంచి చేశాను కాబట్టే నేను ధైర్యంగా ఒంటరిగా ప్రజల్లోకి వెళుతున్నాను. ప్రజలకు కూడా నాపై నమ్మకం ఉంది. నన్ను ఒంటరిగా ఎదుర్కోడానికి ప్రతిపక్షాలు భయపడుతున్నాయి. అందుకే గుంపులుగా వస్తున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. 50 శాతం పైగా ఓట్లు ఎవరికి వస్తే వాళ్లు విజయం సాధిస్తారు.

> **రాజ్‌దీప్:** మీరు మళ్లీ గెలిస్తే విశాఖపట్నాన్ని రాజధానిని చేసే విషయంలో మీరు కచ్చితమైన స్పష్టతతో ఉన్నారా?
> **సీఎం జగన్:** అమరావతి గురించి మాట్లాడే వారు రూ. లక్ష కోట్లు ఎలా ఖర్చు చేస్తారో చెప్పగలరా.. కనీసం రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేదు. ఒక వేళ అమరావతి కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేయడం మొదలు పెడితే పది పదిహేనేళ్లు పడుతుంది. అప్పటికి ఈ లక్ష కోట్లు పది లక్షల కోట్లు అవుతుంది. రాజధాని అనేది కలగానే మిగులుతుంది. విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో నంబర్ వన్ నగరం. విశాఖలో ఇప్పటికే రహదారులు ఉన్నాయి. ఎయిర్‌పోర్టు ఉంది. మౌలిక సదుపాయాలన్నీ అక్కడ ఉన్నాయి. కేవలం రూ.5 వేల కోట్లు నుంచి రూ.10 వేల కోట్లు వెచ్చిస్తే రాబోయే 5-10 సంవత్సరాలలో హైదరాబాద్, బెంగళూరు లేదా చెన్నైతో వైజాగ్ పోటీ పడడాన్ని మీరు నిజంగా చూస్తారు.

రాజ్‌దీప్: అమరావతి గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా చేసేందుకు చాలా కష్టపడ్డానని, ఎంతో ఖర్చు చేశానని చంద్రబాబు చెబుతున్నారు. కానీ మీరు మూడు రాజధానులు మా విధానం అంటున్నారు. రాజధాని అంశం సుప్రీంకోర్టులో స్టక్ అయ్యింది. శాశ్వత రాజధాని లేకుండా పరిపాలన ఎలా? రైతుల నుంచి భూములు తీసుకుంటే ప్రస్తుత సీఎం వాటిని వెనక్కి ఇచ్చేస్తున్నారని చంద్రబాబు అంటున్నారు.

సీఎం జగన్: అమరావతి ఎక్కడుంది.. అమరావతి అంటే ఏమిటనేది ముందుగా మనం ఆలోచించాలి. అమరావతి.. గుంటూరు, విజయవాడకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. 50 వేల ఎకరాల భూ సమీకరణ జరిగింది. అదంతా మూడు పంటలు పండే భూమి. అమరావతి రాజధాని అనేది ఒక కుంభకోణం. తన సన్నిహితులు ముందే భూములు కొనుగోలు చేసేశాక అప్పుడు చంద్రబాబు అక్కడ రాజధానిని డిక్లేర్ చేశారు. రహదారులు, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికే వారి సొంత నివేదిక ప్రకారమే ఎకరాకు రూ.2 కోట్లు అవుతుంది. అంటే మొత్తంగా రూ. లక్ష కోట్లు కేవలం మౌలిక సదుపాయాల కల్పనకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంత డబ్బును రాష్ట్రం ఎక్కడి నుంచి తెస్తుంది?

> **రాజ్‌దీప్:** మీరేమో అవినీతి లేదంటున్నారు? ప్రతిపక్ష నేత చంద్రబాబు భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు..
> **సీఎం జగన్:** చంద్రబాబు నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయి అలా మాట్లాడుతున్నారు. మీరే నేరుగా ప్రజల దగ్గర మైక్ పెట్టి అడగండి. మేము చెప్పిన హామీలు, పథకాలతో ఎంత ఆర్థిక మేలు జరిగిందో చెబుతారు. పైస్థాయిలో నేను చెప్పిన ప్రతి రూపాయి కింది స్థాయిలోని లబ్ధిదారులకు నేరుగా చేరింది. సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీ ద్వారా కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో పడుతుంటే అవినీతి, వివక్ష ఎక్కడ ఉంటుంది?

రాజ్‌దీప్: జగన్‌పై రాయితో దాడి చేయడం అనేది పూర్తిగా ఓ డ్రామా అని, అదంతా సింపతీ కోసం జగనే క్రియేట్ చేసుకున్నారని చంద్రబాబు అంటున్నారు. తనను అక్రమంగా అరెస్ట్ చేసి, జైలుకు పంపారని, జగన్ ఆంధ్రాలో డిక్టేటర్‌గా వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు..

సీఎం జగన్: ఎవరి ద్వారా ఈ రాయి వచ్చింది? వాళ్ల మనుషుల ద్వారానే వచ్చింది. చంద్రబాబు ఏం మాట్లాడుతున్నారు? అక్కడ చంద్రబాబు నిలబడి, అదే వేగంతో అదే రాయితో కొట్టించుకుని, మూడు కుట్లు వేయించుకోమనండి. ఆయనకూ సింపతీ వస్తుంది.

రాజ్‌దీప్: పాత కేసుల్లో సీఐడీని వాడి చంద్రబాబును జైలుకు పంపారని, జగన్ శత్రువులను, తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వాళ్లను ఈ విధంగా వేధిస్తారనే వాదన ఉంది.

సీఎం జగన్: ఎవరు తప్పు.. ఎవరు ఒప్పు అనేది న్యాయస్థానం పెట్టే పరీక్షలో తేలుతుంది. చంద్రబాబుని 52 రోజులు జైలుకు పంపడం సరైనదేనని కోర్టులు భావించాయి. అంటే అతను ఏదో చేశాడనే కదా అర్థం. బెయిల్ అనేది ప్రతి ఒక్కరి హక్కు. అది ఏదో సమయంలో వస్తుంది. నిజం ఏంటంటే ఆ కుంభకోణం జరిగిందనడానికి సరిపడా ఆధారాలు ఉన్నాయి.

రాజ్‌దీప్: ఎన్నికల అనంతరం కేంద్రంతోనూ, ప్రధానితోనూ మీ సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి? అభివృద్ధి కోసమే తాను బీజేపీతో పొత్తు పెట్టుకున్నానని చంద్రబాబు అంటున్నారు.

సీఎం జగన్: ప్రస్తుతం చంద్రబాబు, మోదీ పొత్తులో ఉన్నారు. వారు పొత్తు పెట్టుకుంటే అభివృద్ధి కోసమా.. అదే ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్రంతో సత్సంబంధాలు కలిగి ఉంటే అది ఇంకోదానికోసమా?

రాజ్‌దీప్: సర్వశక్తులు ఒడ్డుతున్న వారితో పోరాటంలో మిమ్మల్ని ముందుకు నడిపిస్తున్నదేమిటి?

సీఎం జగన్: అణగారిన వర్గాలు, నిరుపేదల జీవితాలను మార్చే అవకాశాన్ని దేవుడు నాకు ఇచ్చాడని నేను గట్టిగా నమ్ముతాను. దాని కోసం దేవుని దయ వల్ల నేను ఏం చేయగలనో అది చేస్తున్నాను. నాకు కావాల్సింది.. నా కల ఒక్కటే. నేను మరణించినా ప్రజల గుండెల్లో బతికుండాలి.

రాజ్‌దీప్: ఇంగ్లిష్ మీడియం విద్య, ఐబీ, ఇలాంటి విప్లవాత్మక మార్పులన్నీ గ్రామ స్థాయిలో సాధ్యం అవుతాయా? క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయని అందరూ అంటున్నారు..

సీఎం జగన్: ఎవరు అంటున్నారు? ఈ రోజు మీరు ఒక గ్రామానికి వెళ్లండి. మార్పు మీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. గ్రామంలోకి ప్రవేశించిన వెంటనే గ్రామ సచివాలయం కనిపిస్తుంది. ఈ సచివాలయం ద్వారా ప్రజలకు గ్రామ స్థాయిలోనే 600 రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 60, 70 ఇళ్లకు ఒక వలంటీర్ ఉంటున్నారు. వీళ్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రతి గ్రామస్తుడి చేయి పట్టి ముందుకు నడిపే కార్యక్రమం చేస్తున్నారు. అదే గ్రామంలో నాలుగు అడుగులు ముందుకు వేస్తే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కనిపిస్తుంది. మరో నాలుగు అడుగులు ముందుకు వెళితే ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ బడి ఉంటుంది. ఇంకొంచెం ముందుకు పోతే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం కనిపిస్తుంది. ఇవన్నీ గ్రామ స్థాయిలో అభివృద్ధికి తార్కాణాలు. గతంలో ఇవన్నీ ఎక్కడా మనకు కనిపించేవి కాదు. ప్రభుత్వం లేదా ఒక పెద్ద పరిశ్రమ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యపడదు. ఎకానమీని డ్రైవ్ చేసే ఎంఎస్ఎంఈలు, సెల్ఫ్ ఎంప్లాయిడ్ సెక్షన్‌లను మేం ప్రోత్సహించాం. ఈ రోజున 62 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. అదే విధంగా స్వయం సహాయక బృందాల్లోని మహిళలు, మత్స్యకారులు, స్ట్రీట్ వెండర్స్, బార్బర్స్, టైలర్లు, ఆటో డ్రైవర్లు వీళ్లంతా రాష్ట్ర అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తారు. ఈ క్రమంలో వీరందరికీ బ్యాంక్‌లు, వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూతగా నిలిచాం.



> **రాజ్‌దీప్:** ఈ ఎన్నికల్లో మీ సోదరి మీకు వ్యతిరేకంగా నిలబడ్డారు. ఇది ప్రతిష్టకు భంగంగా భావిస్తున్నారా?
> **సీఎం జగన్:** ఆమె డిపాజిట్ కోల్పోతుండటం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఏ పార్టీ అయితే నా తండ్రి పేరును సీబీఐ చార్జ్ షీట్‌లో చేర్చిందో.. ఏ పార్టీ అయితే కల్పిత కేసులను నాపై పెట్టిందో అందరికీ తెలుసు. అవి కాంగ్రెస్, టీడీపీలు. ఈ రోజు నా సోదరిని ఎవరు నడిపిస్తున్నారో తెలుసా.. రేవంత్ ద్వారా చంద్రబాబు నడిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రిమోట్ చంద్రబాబు చేతిలో ఉంది. బీజేపీ రిమోట్ చంద్రబాబు చేతిలో ఉంది. ఈ రోజు జగన్ ఫైట్ చేస్తోంది కేవలం ఒక్క బీజేపీతోనే కాదు. కాంగ్రెస్‌తో కూడా.

కేంద్రం టైటిల్‌తో బాబు డ్రామా

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: వాస్తవానికి ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి పునాది పడింది 1989లోనే. భూ వివాదాలకు శాశ్వతంగా ముగింపు పలకటానికి, ఎవరి పేరుతో భూమి ఉందో వారి పేరిట టైటిల్ ఇచ్చి.. ఆ టైటిల్‌కు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చేలా చట్టాన్ని చేయాలని, దీనికోసం ల్యాండ్ రికార్డులన్నిటినీ డిజిటల్ చేయాల్సి ఉంటుందని అప్పట్లోనే తీర్మానించారు. ఆ తీర్మానాలకు కొనసాగింపుగా.. 2004లో జాతీయ ల్యాండ్ రికార్డుల కంప్యూటరీకరణ (ఎన్ఎల్ఆర్‌ఎంపీ) పథకాన్ని రూపొందించారు. దాని ప్రకారం 2009లో తొలి మోడల్ చట్టం తయారైంది. ఈ మోడల్ చట్టాన్ని అనుసరిస్తూ 2011లో నాటి యూపీఏ ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని తెచ్చింది. దానికి కొన్ని సవరణలు చేస్తూ 2015లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో ముసాయిదా చట్టాన్ని తెచ్చింది. అదిగో ఆ తర్వాతే...అంటే 2015లో ముసాయిదా తెచ్చాకే కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ 'నీతీ ఆయోగ్' దీనికో రోడ్ మ్యాప్ ఇచ్చింది. టైటిల్ గ్యారంటీకి ఏమేం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? ఏం చేస్తే మనం ఆ దశకు చేరుకోగలమనే రోడ్డు మ్యాప్ అది. ఆ రోడ్ మ్యాప్‌కు తగ్గట్టుగానే 2019లో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మరో ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. ఈ ముసాయిదాకు అనుగుణంగా.. ఈ చట్టాన్ని తేవాలంటే రాష్ట్ర భూముల సర్వేను పూర్తి చేయటం తప్పనిసరి కనక... ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనను పరిగణనలోకి తీసుకుంటూ... నీతీ ఆయోగ్ జారీ చేసిన మరో సర్క్యులర్

రీ సర్వే పూర్తయితేనే 'ల్యాండ్ టైట్లింగ్'

వాస్తవానికి రాష్ట్రంలో 17,000 గ్రామాలుండగా వాటిలో ఇప్పటికే 6 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఇంకా 11 వేల గ్రామాల్లో రీసర్వే జరగాల్సి ఉంది. రీ సర్వే జరిగి.. ఆ సందర్భంగా తలెత్తే వివాదాలన్నీ పరిష్కారం కావటానికి చాలా సమయం పడుతుంది. అదంతా పూర్తయ్యాక, రీ సర్వేలో పేర్కొన్న వ్యక్తులకు భూ హక్కు పత్రాలిస్తారు. ఆ పత్రాల ఆధారంగానే.. ప్రతి ఒక్కరికీ అయా భూముల టైటిల్‌ను వారి పేరిట మంజూరు చేస్తారు. అంటే.. రీ సర్వే పూర్తి కాకుండా ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తేవటం అసాధ్యం. రీ సర్వే పూర్తయి.. ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వస్తే... భూములపై సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ఆర్థిక నేరాలు, ఇవేవీ లేకుండా చూసుకునే అవకాశం ఉంటుంది. ఇదీ వాస్తవం.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం అవసరమా?

నిజానికిప్పుడు భూమికి సంబంధించి రకరకాల పత్రాలుంటున్నాయి. 10(1), అడంగల్ వంటివి రెవెన్యూ విభాగం ఇచ్చేవి. ఇక రిజిస్ట్రేషన్ శాఖ విషయానికొస్తే ఆ శాఖ రిజిస్టరైన ప్రతిసారీ ఒక డాక్యుమెంట్ నెంబరు కేటాయిస్తుంది. అంతేకాదు.. సర్వే సెటిల్‌మెంట్, ఎండోమెంట్, అటవీ శాఖ, వక్ఫ్, స్థానిక సంస్థలు.. వీటన్నిటి వద్దా ఒకే భూమికి సంబంధించి వేర్వేరు రికార్డులు ఉంటున్నాయి. ఆ భూమిని ఒకరు కొన్నప్పుడో, అమ్మినప్పుడో అన్ని రికార్డుల్లోనూ ఒకేసారి నమోదయ్యే అవకాశం లేదు. దీంతో కొన్ని రికార్డుల్లో ఆ లావాదేవీలు నమోదవుతాయి. కొన్ని రికార్డుల్లో నమోదు కావటం లేదు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక వ్యక్తి ఒక భూమిని కొన్నాక... రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయాక... వేరెవరో వచ్చి అది తాను ముందే కొన్నానని అంటున్నారు. కొన్ని సందర్భాల్లో రిజిస్ట్రేషన్ కూడా అయిపోయాక... అది అసైన్డ్ భూమి అనో, గ్రామ కంఠం భూమి అనో, లేదా చుక్కల భూమి అనో తెలుస్తోంది. ఒక భూమికి సంబంధించిన రికార్డులు పలు చోట్ల పలు రకాలుగా ఉండటం వల్ల వస్తున్న సమస్య ఇది.



ఇక రుణాల సంగతి తీసుకుంటే.. ఒక బ్యాంకు దగ్గరకు వెళ్లి డాక్యుమెంట్లు పెట్టి రుణాలు తీసుకుంటే ఆ సమాచారం రిజిస్ట్రార్ కార్యాలయంలో అప్‌డేట్ కాదు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంట్లు పోయాయని చెప్పి డూప్లికేట్ డాక్యుమెంట్ తీసుకుని దాని ఆధారంగా మరోసారి రుణం తీసుకోవటమో, రుణం తీర్చకుండానే ఆ భూమిని అమ్మేయటమో జరుగుతోంది. నిజంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వస్తే ఇలాంటి అక్రమాలకు ఆస్కారం ఉండదు.

అన్ని రికార్డులూ ఒకే రిజిస్టర్లో...

ల్యాండ్ టైట్లింగ్ చట్టం వస్తే... టైటిల్ రిజిస్టరులో ప్రతి భూమికీ ఒక యునిక్ నంబరును (రీ సర్వేలో పేర్కొన్న మేరకు) కేటాయిస్తారు. ఆ రిజిస్టరు భూములతో సంబంధం ఉండే ప్రతి విభాగానికీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ప్రతి బ్యాంకుకూ, ఆర్థిక సంస్థకూ అందుబాటులో ఉంటుంది. దీంతో ఆయా సంస్థలు తామిచ్చే రుణాలతో సహా ఆ భూమికి సంబంధించిన లావాదేవీలన్నిటినీ ఆ రిజిస్టరులో నమోదు చేస్తాయి. కాబట్టి తదుపరి మోసాలకు, వివాదాలకు తావుండదు.

అందుకే ప్రభుత్వ గ్యారంటీ

మోసాలకు తావుండదు కనక.. ఈ చట్టం ప్రకారం ప్రతి భూమికీ ప్రభుత్వం ఆయా టైటిల్ దారు పేరిట బీమా చేయిస్తుంది. కాబట్టి ఊహించని పరిస్థితుల్లో ఆ భూమి తనదంటూ వేరెవరైనా వివాదం తెచ్చినా... ఒకవేళ అది ఏ అసైన్డ్ భూమో అని తేలినా.. టైటిల్ దారుకు ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుంది. అంటే ఆ టైటిల్‌దారుకు ప్రభుత్వమే గ్యారంటీగా ఉంటుందన్న మాట. ఇదీ చంద్రబాబు సహా ఎల్లో ముఠా ఎక్కడా చెప్పని పచ్చి నిజం.

మోదీతో చెప్పించు బాబూ?

అసలు ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తయారు చేసింది కేంద్రమే కదా? దానిపై వివిధ రాష్ట్రాలతో కమిటీ వేసి మరీ.. తగిన మార్గదర్శకాలు రూపొందించింది కేంద్ర ప్రభుత్వ నోడల్ సంస్థ 'నీతీ ఆయోగ్' కదా? ఆ కమిటీ నివేదిక మేరకు.. దానికి రకరకాల ముసాయిదాలు రూపొందించి.. దాన్ని అన్ని రాష్ట్రాలకూ పంపించింది అబద్ధమా? దానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తన రాష్ట్రానికి సంబంధించిన ముసాయిదా చేయటం అబద్ధమా? ఆ కోవలోనే కదా! ఈ చట్టం తేవాలంటే ముందుగా రాష్ట్రం మొత్తాన్ని రీ సర్వే చేయాల్సి ఉంటుంది కనక ఆ సర్వే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంత మాత్రానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వచ్చేసిందంటూ అన్ని భూములనూ జగన్ ప్రభుత్వం తన పేరిట రాసేసుకుంటోందని చెబుతూ ఎన్నికల ముందర చంద్రబాబు, ఆయన పచ్చ ముఠా వికృత క్రీడ మొదలు పెట్టింది. లేని చట్టాన్ని రద్దు చేస్తామంటూ మేనిఫెస్టోలో కూడా హామీ ఇచ్చింది. ఈ రాష్ట్రంలో టీడీపీ ఒంటరిగా పోటీ చేయటం లేదు. బీజేపీతో, జనసేనతో కలిసి పోటీ చేస్తోంది. పైపెచ్చు రాష్ట్రంలో ప్రచారానికి ప్రధాని నరేంద్ర మోదీనీ పిలిపిస్తోంది. ఇప్పటికే ఒకసారి ప్రచారం చేసి వెళ్లిన నరేంద్ర మోదీ.. త్వరలో మళ్లీ రాష్ట్రానికి రాబోతున్నారు. మరి ఆ రోజున ప్రధాన మంత్రి ముందే ఈ చట్టాన్ని మేం అమలు చేయబోమని చెప్పగలవా చంద్రబాబూ? ఈ చట్టాన్ని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయబోమని మోదీతో చెప్పించగలవా? ల్యాండ్ టైట్లింగ్ అంటూ ఊగిపోతున్న పవన్ కల్యాణ్.. మోదీ ముందు అదే నటనను కొనసాగించగలరా? ఎన్నాళ్లీ పనికిమాలిన డ్రామాలు?

ఇదీ... ఎల్లో ముఠా సాగిస్తున్న విష ప్రచారం

1. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూములన్నీ లాగేసుకుంటారు. రాత్రికి రాత్రి ఆన్‌లైన్‌లో రికార్డులను మార్చేస్తారు.
2. సివిల్ కోర్టులకు ఇక భూములపై అధికారాలు ఉండవు. ల్యాండ్ టైటిల్స్ కోర్టులు ఇవ్వాలి గానీ, రెవెన్యూ శాఖ ఎలా ఇస్తుంది..
3. భూములకు సంబంధించిన అన్ని అధికారాలు తీసుకెళ్లి టైటిల్ రిజిస్టర్ అధికారికి ఇస్తున్నారు.. ఆయన ఎమ్మెల్యే, ఎంపీ, అధికార పార్టీ వాళ్లు చెప్పిన ఎవరికి కావాలంటే వారికి భూములు రాసేస్తారు.
4. ఈ చట్టం వచ్చాక భూములున్న వారంతా మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

అసలు వాస్తవాలు ఇవీ..

1. ప్రభుత్వం భూములెలా లాక్కుంటుంది? 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు, గిరిజనులకు 3.22 లక్షల ఎకరాలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం కలలోనైనా ఇలాంటి ఆలోచన చేస్తుందా? నిజానికి రీసర్వే చేసేటప్పుడే ఆ భూమి ఎవరిదో తేల్చి.. వారి పేరిట హక్కు పత్రాలు ఇస్తోంది. ఆ హక్కుదారు పేరే కదా రికార్డుల్లో ఉంటుంది. మరి ఆ పేరును మార్చేయటం సాధ్యమా? రాత్రికి రాత్రి ఆన్‌లైన్లో ఎలా మార్చేస్తారు? మన పేరిట హక్కు పత్రం ఇచ్చినపుడు...ఆ పత్రం మనదగ్గర ఉన్నపుడు రికార్డుల్లో మన పేరు మార్చేయటం ఎలా సాధ్యం? ఏ కొంచెం ఆలోచన ఉన్నా ఇది తెలిసిపోతుంది కదా!
2. రికార్డుల్లో జరిగే తప్పులపై ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్నది తహసీల్దారు, ఆర్డీఓ, కలెక్టరు ప్రభుత్వ అధికారులకే కదా? వీళ్లతో పాటు ఉండే టైటిల్ రిజిస్ట్రారు కూడా ప్రభుత్వాధికారే ఉంటారు. దీన్లో తప్పేముంది? ఇక భూమి యాజమాన్యంపై వచ్చే సివిల్ వివాదాలు ఇప్పటి మాదిరే కోర్టుల్లోనే పరిష్కారమవుతాయి. దీన్లో ఎలాంటి తేడా ఉండదు. మరి కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదనటం పచ్చి అబద్ధం కాదా?
3. అన్ని అధికారాలూ టైటిల్ రిజిస్ట్రారుకు ఎందుకుంటాయి? ఇప్పుడు భూముల రిజిస్టరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఉంటోంది. ఆయన కూడా ప్రభుత్వాధికారే. మరి ఆయన ఎమ్మెల్యే, ఎంపీలు చెప్పినట్లు రికార్డుల్లో పేర్లు మార్చేయగలుగుతున్నారా? ఎవరికి కావాలంటే వారికి భూములు రాసేయగలుగుతున్నారా? రికార్డుల్లోని వివరాల నిర్వహణకు ప్రభుత్వం నియమించే గుమాస్తాగానే ఆయన్ను చూడాలి తప్ప.. రికార్డులు మార్చే అధికారం తనకు ఎందుకుంటుంది?
4. మళ్లీ ఎందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు? అసలు ఆ అవసరం ఎందుకుంటుంది? వివిధ కార్యాలయాల్లో ఉండే వివరాలను ఆన్‌లైన్లో క్రోడీకరించి.. రీ సర్వేలో ఇచ్చిన హక్కు పత్రాల ఆధారంగా రిజిస్టరులో ప్రభుత్వమే నమోదు చేసుకుంటుంది. మళ్లీ రిజిస్ట్రేషన్ అక్కర్లేదు.

మీకు తెలుసా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డిజిటల్ విద్యకోసం 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు రూ.**1306** కోట్లతో 9,52,925 మందికి బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేసింది.

ఆరోతరగతి నుంచి ఆ పైన రూ.**838** కోట్లతో ప్రతి తరగతిలోనూ 62వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ), ప్రాథమిక పాఠశాలల్లో 45వేల స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసింది.



తగ్గిన 'ప్రతిభ'

ఓడలు బళ్లు అవుతాయి, బళ్లు ఓడలు అవుతాయి అంటే ఇదేనేమో. గతంలో తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగిన కావలి ప్రతిభాభారతి ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. తెలుగుదేశం హయాంలో సుదీర్ఘకాలంపాటు ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా, మొట్ట మొదటి మహిళా స్పీకర్‌గా వ్యవహరించారు. తండ్రి చిన్నన్న రాజకీయ వారసురాలిగా వచ్చి, ఎస్సీ రిజర్వేషన్‌లో కీలక నేతగా ఎదిగారు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత వరుసగా మూడు పర్యాయాలు ఓటమి చవిచూశారు. దాంతో ఆమెకు పార్టీలో ప్రాతినిధ్యం కరువైంది. తాజా ఎన్నికల్లో కుమార్తె గ్రీష్మ కోసం ఎంతగా యత్నించినా టికెట్ దక్కలేదు. ఇప్పుడు ఆమె ఎక్కడున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

IV **సాక్షి**

బుధవారం
మే, 1

జైత్రయాత్ర 2024

సంక్షేమాభివృద్ధికే మన ఓటు



సంక్షేమ పథకాలను అర్హులైనవారందరికీ అందించి, వారి జీవన ప్రమాణాల పెరుగుదలకు కృషి చేసిన వ్యక్తి సీఎం జగన్. సంక్షేమంతోపాటు జగన్ పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన అభివృద్ధి నెలకొంది. పేద, మధ్యతరగతి అక్కచెల్లెమ్మలకు అన్ని విధాలా ఆర్థిక చేయూతనందించిన వ్యక్తి జగన్. సంక్షేమ ఫలాలతో చాలా మంది మహిళలు లక్షాధికారులుగా మారారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల మంచికోసం కృషి చేస్తున్న జగనే మళ్లీ సీఎం కావాలి.

- పాలేటి సుబ్రమణ్యం, విశ్రాంత బ్యాంకు అధికారి, కర్నూలు

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ



సీఎం జగన్ పాలనలో రానున్న ఐదేళ్లలో పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌ను మనం చూడబోతున్నాం. ప్రస్తుతం 4.2 శాతంగా ఉన్న పేదరికం రేటును పూర్తిగా తగ్గించడం కష్టమేమీ కాదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందుతున్న లబ్ధితో బ్యాంకు డిపాజిట్లు పెరుగుతున్నాయి. తద్వారా బ్యాంకుల రుణ సామర్థ్యం గణనీయంగా పెరుగుతోంది. వ్యవసాయం, ఫిషరీస్, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ చర్యలు దోహదపడుతున్నాయి.

- రవి శంకర్ ప్రసాద్ భోజంకి, రీసెర్చ్ అనలిస్ట్, బొమ్మూరు, రాజమండ్రి రూరల్

ఐదేళ్లలో ఇలా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజికవర్గాలకు మాత్రమే కాకుండా ఇతర వర్గాలకు సైతం నవరత్నాల ద్వారా గత ఐదేళ్లలో డీబీటీ(నేరుగా ఖాతాల్లో జమ), నాన్ డీబీటీ ద్వారా మొత్తం 3,67,04,358 మందికి రూ.1,30,102.68 కోట్లు అందించారు.

- ఎస్సీలకు డీబీటీలో రూ.45,412 కోట్లు, నాన్ డీబీటీలో రూ.23,469 కోట్లు
- ఎస్టీలకు డీబీటీలో రూ.13,389 కోట్లు, నాన్ డీబీటీలో రూ.5,963 కోట్లు
- బీసీలకు డీబీటీలో రూ.1,28,079 కోట్లు, నాన్ డీబీటీలో రూ.53 వేల కోట్లు
- మైనార్టీలకు డీబీటీలో రూ.13,612.89 కోట్లు, నాన్ డీబీటీలో రూ.7,545.68 కోట్లు
- కాపు సంక్షేమానికి డీబీటీలో రూ.26,232.94 కోట్లు, నాన్ డీబీటీలో రూ.7,772.19 కోట్లు
- అగ్రవర్ణ పేదలు, ఇతరులకు డీబీటీలో రూ.43,132.75 కోట్లు, నాన్ డీబీటీలో రూ.86,969.93 కోట్లు ఖర్చు చేశారు.



- పేదరికాన్ని జయించి ఆర్థిక స్వావలంబన సాధించేలా పథకాల రూపకల్పన
- జగన్ పథకాలు అద్భుతమంటున్న ఆర్థిక, సామాజిక వేత్తలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి అగ్రప్రాధాన్యం
- అగ్రవర్ణ పేదల సంక్షేమానికి పట్టంగట్టిన సీఎం జగన్
- ప్రతి ఒక్కరికీ అందుబాటులో నాణ్యమైన విద్య, ఖరీదైన వైద్యం
- జగన్ సంక్షేమానికి సలాం కొడుతున్న ప్రతిపక్షాలు, వాటి మేనిఫెస్టోలన్నీ కాపీనే
- సంక్షేమ పాలనతో రాష్ట్రంలో సువర్ణాధ్యాయం

రూ.4.54 లక్షల కోట్ల లబ్ధి

58 నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు నేరుగా ఖాతాల్లోకి(డీబీటీ విధానంలో) రూ.**2,69,859.11** కోట్లు జమ చేసింది.

నాన్ డీబీటీ (పరోక్షంగా) ద్వారా రూ.**1,84,604.32** కోట్లు సాయం చేసింది.

మొత్తం డీబీటీ, నాన్ డీబీటీలో రూ.**4,54,463.43** కోట్ల లబ్ధి చేకూరింది.

అగ్రవర్ణ పేదలకు సైతం సాయం

అగ్రవర్ణ పేదలను సైతం ఆదుకుని జగన్ పెద్ద మనసు చాటుకున్నారు. కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, వెలమలతోపాటు మిగిలిన అగ్రవర్ణాలకు ఈబీసీ నేస్తంలో సాయం అందిస్తున్నారు. 45 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న అక్కచెల్లెమ్మలకు ఈబీసీ నేస్తంలో ఏటా రూ.15 వేలు ఇస్తున్నారు. ఈ పథకంలో 4,95,269 మందికి మొత్తం రూ.1,877 కోట్ల సాయం అందించారు.

ఇది కదా పాలన

నాడు ఉచితంగా పంచేస్తున్నారంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా గగ్గోలు

ఇప్పుడు జగన్ సంక్షేమానికి సలాం కొడుతున్న ప్రతిపక్షాలు

పేద, మధ్య తరగతి కోసం సీఎం జగన్ సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే ఉచితంగా డబ్బులు పంచేస్తున్నారంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా గగ్గోలు పెట్టాయి.

ఇప్పుడు ఓట్ల కోసం.. జగన్ పాలన అద్భుతం.. మేం అధికారంలోకి వస్తే వాటినే కొనసాగిస్తామని ఊసరవెల్లి సిగ్గుపడేలా మాట్లాడుతున్నారు. జగన్ సంక్షేమానికి ప్రతిపక్షాలు సైతం సలాం కొట్టడం కంటే ఆయన పాలనకు గీటురాయి ఏం కావాలి.

ఊరూ వాడా పేద, మధ్య తరగతి ఇంట సంక్షేమ సంబరంతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగన్ సాకారం చేశారు.

ఇతర రాష్ట్రాలు సైతం జగన్ పాలనను తమ రాష్ట్రాల్లో అమలు కోసం పోటీపడుతున్నాయి.

జగన్ సంక్షేమ పాలన చూసి ఆర్థిక వేత్తలు సైతం ఆశ్చర్యపోతున్నారు.

ఆయన సంక్షేమ పథకాలు లక్షలాది పేద కుటుంబాలు పేదరికాన్ని జయించేందుకు సాయపడ్డాయి.

నాణ్యమైన విద్య, ఖరీదైన వైద్యం ప్రతి ఒక్కరికీ చేరువ చేసి వారి జీవితాల్లో చిరునవ్వులు నింపారు.

పథకాలతో ఆయన డబ్బులు పంచలేదు. పేదల జీవన ప్రమాణాల్ని పెంచి జీవనోపాధి అందించి వారి బతుకుల్ని బాగు చేశారు.

మహిళ ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ ఇల్లు స్వర్గమే అని నమ్మి.. వారికి ఆర్థికంగా చేయూత నిచ్చి ఆ కుటుంబాల్ని ఆదుకున్నారు. చేతి వృత్తుల వారికి చేయూతనిచ్చారు.

స్వయం ఉపాధి సంఘాలకు ఊపిరులూదారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేదలు, రైతుల సంక్షేమానికి పట్టం కట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపితే..

ఆయన తనయుడు తన సంక్షేమ పాలనతో రాష్ట్రంలో సువర్ణాధ్యాయం లిఖించారు.

– యర్రంరెడ్డి ఉమామహేశ్వరరావు, సాక్షి, అమరావతి

దివ్య జీవితంలో నవోదయం



ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన దోసపాటి దివ్యకు ముగ్గురు ఆడపిల్లలు. కూలీ పనులతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. సీఎం జగన్ పాలనలో ఆమె జీవితం మారిపోయింది. డ్వాక్రాలో ఆమెకు ప్రభుత్వం రూ.3 లక్షలు వడ్డీలేని రుణం ఇచ్చింది. ఆ డబ్బుతో ఆటో కొనుక్కొని స్వయం ఉపాధి పొందుతోంది. ఆమె భర్త తిరుపతిరావు వలంటీర్‌గా పనిచేస్తున్నారు. వలంటీర్ జీతంతో పాటు.. ఉత్తమ వలంటీర్‌గా మూడేళ్ల నుంచి రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు అందుకున్నారు. ఆసరాలో దివ్యకు రూ.62 వేలు మాఫీ అయ్యింది. అమ్మ ఒడిలో నాలుగేళ్లలో రూ.60 వేలు వచ్చాయి. జగనన్న కాలనీలో స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇచ్చింది.

తలసరి ఆదాయంలో 9వ ర్యాంకుకు..

2019లో స్థిర ధరల సూచీ ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,51,173 కాగా.. దేశంలో 18వ స్థానంలో ఉండేది. ప్రస్తుతం రూ.2,19,518తో 9వ ర్యాంకుకు ఎగబాకింది. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం లబ్ధిదారుల అర్హత వయసును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించారు. 2019 ఎన్నికలకు అర్నెల్ల ముందు కేవలం 39 లక్షలు ఉన్న పింఛన్లు ఇప్పుడు 66 లక్షలకు చేరాయి.

పద్మావతి కుటుంబంలో నవవసంతం



ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గంగినేనికి చెందిన పద్మావతి భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. 2019కి ముందు వరకు కుమారులతో కలిసి కూలీ పనికి వెళ్లేది. కౌలు వ్యవసాయం కలిసిరాక తీవ్రంగా నష్టపోయారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో వారి దశ మారింది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆ ఒక్క కుటుంబానికే రూ.5 లక్షలకుపైగా ఆర్థిక లబ్ధి చేకూరింది. వితంతు పింఛన్ కింద రూ.1,21,500, వైఎస్సార్ ఆసరాలో రూ.72,951, సున్నా వడ్డీగా రూ.5,355, వైఎస్సార్ చేయూతలో రూ.56,250, రైతు భరోసా కింద రూ.21,000, జగనన్న తోడులో రూ.20,000, అమ్మ ఒడిలో రూ.81,000, వైఎస్సార్ వాహనమిత్రలో రూ.20,000లతో పాటు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సాయంతో పాటు రుణం పొందారు.

మహిళలకు రూ.11.41 లక్షల కోట్ల సంపద

- జగన్ 58 నెలల పాలనలో రాష్ట్రంలోని మహిళలకు సుమారు రూ.11.41 లక్షల కోట్ల సంపద సమకూరింది.
- మహిళలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు: 30,65,315
- ఇళ్ల స్థలాల విలువ, మౌలిక సదుపాయాల ఖర్చు: రూ.7.75 లక్షల కోట్లు
- ఇళ్ల నిర్మాణాల కోసం : రూ.లక్ష కోట్ల ఖర్చు
- 31 సంక్షేమ పథకాలతో మహిళా లబ్ధిదారులకు సాయం: రూ.2.66 లక్షల కోట్లు
- 2019-24 మధ్యలో సీఎం జగన్ పాలనలో దాదాపు రూ.11.41 లక్షల కోట్లు ఖర్చు చేశారని 'జర్నల్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అండ్ ఇన్నొవేటివ్ రీసెర్చ్' పుస్తకంలో పేర్కొన్నారు.





జగన్ వల్లే పిల్లలకు ఉద్యోగాలు



వెల్లంకొండ నరసింహారావుది నరసాపురం వద్ద సీతారామపురం. పాలకొల్లులో చిన్న జిరాక్స్ సెంటర్ పెట్టుకుని జీవితం సాగిస్తున్నారు. ఆదాయం అంతంతమాత్రమే. ఇద్దరమ్మాయిలు కాలేజీ చదువులకు రావడంతో ఖర్చులు పెరిగాయి. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో ఏమాత్రం ఆసరా లభించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నరసింహారావు జీవితంలో వెలుగొచ్చింది. పిల్లల చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన ఆసరాగా నిలిచాయి. పెద్ద కుమార్తె వాగ్దేవిశ్రీ బీటెక్ దిగ్విజయంగా పూర్తిచేసింది. చిన్న కుమార్తె సౌజన్యశ్రీ బీఎస్సీ మైక్రో బయోలజీ పూర్తి చేసింది. ఈ రోజు పెద్ద అమ్మాయి హైదరాబాద్‌లో, చిన్నమ్మాయి బెంగళూరులో ఉన్నత ఉద్యోగాలు చేసుకుంటున్నారు. జగనన్న ఇచ్చిన విద్యా, వసతి దీవెనలతో తన పిల్లలు మంచి స్థితిలో ఉన్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'జిరాక్స్ సెంటర్ నడుపుకునే నేను పిల్లలను మంచి చదువులు చదివించానంటే వైఎస్ జగన్ పుణ్యమే.. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా' అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆయన ఊతంతోనే సాగుతున్నాం..



సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన కొర్నె హనుమంతరావు కుటుంబం సెంటు స్థలంలోని ఇరుకు ఇంట్లో ఉండేది. బాబు హయాంలో గిట్టుబాటు ధరలు లేక అందినకాడికి అమ్ముకోవాల్సి దుస్థితి. రెండో కొడుకు బధిరుడు కావడంతో ఆదుకోమంటూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకపోయింది. జగన్ రాకతో ఆ కుటుంబ ముఖచిత్రమే మారిపోయింది. రైతు భరోసా, ఆధునిక యాంత్రీకరణ పథకాలు సాగుకు అండగా నిలిచాయి. హనుమంతరావుకు నాలుగేళ్లలో రూ. 52 వేల రైతు భరోసా అందింది. పింఛనుకు అర్హత లభించింది. ఐదేళ్లలో రూ. 75 వేలు పింఛను కానుక ఊతకర్ర అయింది. భార్యకు ఆసరా కింద రూ. 20 వేలు, చేయూతలో రూ.75 వేల లబ్ధి చేకూరింది. పెద్ద కొడుకు పిల్లలకు నాలుగేళ్లలో రూ. 60 వేలు అమ్మ ఒడి వచ్చింది. బధిరుడైన రెండో కుమారుడికి ఐదేళ్లల్లో రూ.1,65,000 పింఛన్ అందింది. ఇటీవల అతడికి ప్రమాదం జరగడంతో ఆరోగ్యశ్రీలో రూ.48,836 విలువ చేసే వైద్యం ఉచితంగా అందించారు. మూడో కొడుకు కృష్ణారావు ఉన్నత చదువుల కల సాకారమైంది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలతో చదువుల యజ్ఞం నిరాటంకంగా సాగింది.





నవరత్నాలు నూరుశాతం విజయవంతం



సమాజంలో పేద వర్గాలకు ఆర్థికంగా చేయూతను అందించి వారి ఆదాయ వనరులు పెంచడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నవరత్నాలు నూరుశాతం విజయవంతమయ్యాయి. దీన్ని కేవలం సంక్షేమంగా చూడకూడదు. అట్టడుగు వర్గాలకు అందించిన ఆర్థిక లబ్ధి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు దోహదం చేసింది. దీంతో సమాజంలో పేద, ధనిక అంతరాలు తగ్గి సమతుల్యత సాధించేందుకు దోహదం చేస్తోంది. కొనుగోలు శక్తి పెరగడంతో నగదు చలామణితో మార్కెట్‌కు ఊతమొచ్చింది. విద్య, వైద్యాన్ని ప్రభుత్వమే అందించడంతో ప్రజలపై ఆర్థిక భారం తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019కు ముందు, ఆ తర్వాత ప్రజల జీవన ప్రమాణాల్లో స్పష్టమైన వ్యత్యాసం కన్పిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పేదరికం తగ్గి తలసరి ఆదాయం పెరిగింది. ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగయ్యాయనే సానుకూల అంశాలను నీతి ఆయోగ్ నివేదికలో స్పష్టంగా పేర్కొంది.

–ఎండీ అలీ, ఆర్థిక నిపుణుడు, విజయవాడ

సమాజంలో స్పష్టంగా మార్పు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన నవరత్నాలతో సమాజంలో స్పష్టంగా మార్పు కన్పిస్తోంది. నేరుగా వారి ఖాతాలకే నగదు బదిలీ చేయడం మంచి ఫలితాలిచ్చింది. దీని వల్ల పేదలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడటంతోపాటు వారి అవసరాలు తీర్చుకునేందుకు అవకాశం దక్కింది. కొనుగోలు శక్తి పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది. ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. ప్రభుత్వ తోడ్పాటుతో ప్రజలు వారు బతకడంతోపాటు మరికొందరికి ఉపాధి చూపేలా చేసి సాధికారత దిశగా అడుగులు వేయడం గొప్ప పరిణామం.

-సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, విజయవాడ







బీసీలకు వెన్నుదన్ను



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీలకు వెన్నుదన్నుగా నిలిచారు. చేతి వృత్తులపై ఆధారపడే బీసీ కులాలకు ఆర్థికంగా తోడ్పాటు గొప్ప విషయం. నవరత్నాలతో వారిని ఆదుకున్నారు. కుల వృత్తిదార్లకు ఉదారంగా చేయూతనిచ్చారు. నాయీ బ్రాహ్మణ, రజక, దర్జీలు వంటి వారికి ఆర్థిక సాయం అందించి ఉపాధికి భరోసా ఇచ్చారు.

-జంపాన శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, ఉయ్యూరు

అగ్రవర్ణ పేదలను ఆదుకున్నారు



కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అన్ని వర్గాల్లోని పేదలను ఆదుకున్నారు. కాపు, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ సామాజికవర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి సంక్షేమం అందించారు. ఈబీసీ నేస్తం పేరుతో అగ్రవర్ణ పేద అక్కచెల్లెమ్మలకు సాయం మరిచిపోలేం.

-కొమ్ము శ్రీనివాస్, అర్చకుడు, భీమవరం

గిరిజనులకు కొండంత అండ



ఏజెన్సీలో అత్యంత పేదరికంతో మగ్గిపోయే గిరిజనులకు సీఎం వైఎస్ జగన్ కొండంత అండగా నిలిచారు. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ ద్వారా భూమి పట్టాలు ఇచ్చి పోడు వ్యవసాయాన్ని ప్రోత్సహించి స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించారు.

-సిగ్గే కొండలరావు, గిరిజన రైతు, చింతపల్లి

దళితులకు మునుపెన్నడూ లేని సంక్షేమం



దళితుల మేలు కోసం జగన్‌లా ఇంత తపన పడిన సీఎంను గతంలో చూడలేదు. దళితులకు మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని అందించారు. విజయవాడ నడిబొడ్డున రూ.400 కోట్లతో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని నిర్మించడం గొప్ప విషయం. నవరత్నాలతో సంక్షేమాన్ని అందించి చరిత్ర సృష్టించారు.

-తలకటూరి చంటిబాబు, న్యాయవాది, ఉయ్యూరు

జగన్ పాలనలో సంస్కరణలు



ఇసుక మాఫియా, లిక్కర్ సిండికేట్, పరీక్ష పేపర్ల లీకేజీలు, రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలు, రాజధాని పేరిట రియల్ ఎస్టేట్ తదితర అక్రమాలకు తన సంస్కరణలతో సీఎం జగన్ చెక్ పెట్టారు. అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి చేకూరేలా పారదర్శక పాలన అందిస్తున్నారు. జగన్ ఏం చేద్దామన్నా.. కోర్టుల్లో కేసులతో అడ్డుకున్నారు. కరోనాను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. మిగిలిన మూడేళ్లలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు తదితర మౌలిక వసతులతో అభివృద్ధి బాట పట్టించారు.

- ఎం.హరి మెహర్, న్యాయవాది, విశాఖపట్నం

జగన్ పాలన బాగుంది



ముఖ్యమంత్రి జగన్ పాలన చాలా బాగుంది. పింఛన్లు ఇంటికే వచ్చి ఇవ్వడం చాలా గొప్ప కార్యక్రమం. వివిధ కారణాలతో ఉన్న ఊరిలో అందుబాటులో లేని వారికి, వారు ఎక్కడ ఉంటే అక్కడికే వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందిస్తుండటం అభినందనీయం. ఉచిత బస్సులు అవసరం లేదు. కొన్ని వర్గాలకు రాయితీలిస్తే సరిపోతుంది. సచివాలయాల వారీగా నిధుల కేటాయింపుతో స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు అవకాశం ఏర్పడింది. చాలా బాగుంది.

- కసుము ఎల్లారెడ్డి, ఆస్టిన్, అమెరికా

జనం మెచ్చిన నేత జగన్



నవరత్న పథకాలతో అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. చంద్రబాబు గత ఎన్నికల్లో 620 హామీలు గుప్పించారు. ఏ ఒక్క హామీనీ పూర్తి స్థాయిలో నెరవేర్చలేదు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారు. అందుకే ధైర్యంగా తన ఐదేళ్ల పాలనను వివరిస్తూ, మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటేయాలని ధైర్యంగా అడుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మళ్లీ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే రావాలి.

- పెదపర్తి సాంబశివశాస్త్రి, కోట, విజయనగరం

కృష్ణమ్మ తీరం విజయహారం

ఉమ్మడి కృష్ణాలో ప్రగతి పరుగులు

- రూ.1,383 కోట్లతో విజయవాడ నగరాభివృద్ధి
- రికార్డు వేగంతో బెంజిసర్కిల్ జంట ఫ్లైఓవర్లు పూర్తి
- శరవేగంగా వెస్ట్ బైపాస్ నిర్మాణం పనులు
- ఇంద్రకీలాద్రిపై రూ.216.05 కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- నగరానికి ఐకాన్‌గా అంబేడ్కర్ స్మృతి వనం
- పోర్టు నిర్మాణంతో అభివృద్ధి పరుగులు
- మెడికల్ కళాశాల నిర్మాణంతో కార్పొరేట్ తరహా వైద్యం



ఇదిగో.. మార్పు

సాక్షి ప్రతినిధి, విజయవాడ:

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతోంది. విజయవాడను సుందరంగా తీర్చిదిద్దడంతో కృష్ణా నదీ తీరం, దుర్గ గుడి, ప్రకాశం బ్యారేజీలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంబేడ్కర్ స్మృతి వనం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. మరో వైపు మెగా ఇరిగేషన్ ప్రాజెక్టులు, జగనన్న కాలనీలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మూలపాడు వద్ద బటర్‌ఫ్లై పార్కును అందంగా తీర్చిదిద్ది 150 రకాల ఔషధ మొక్కలు పెంచుతున్నారు. కొండపల్లి బొమ్మల పరిశ్రమ అంతరించిపోకుండా వాటి తయారీదారులకు చేయూతనిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బందరులో అత్యధిక జనాభా ఆధారపడి పనిచేసే రోల్డ్‌గోల్డ్ పరిశ్రమకు ప్రోత్సాహం కల్పిస్తున్నారు. అక్కడి ప్రజల చిరకాల కోరిక పోర్టు నిర్మాణం కల నెరవేరనుంది. గిలకల దిండిలో మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు హార్బర్ నిర్మాణం పూర్తి కావస్తోంది. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయి 150 మంది విద్యార్థులతో తరగతులు జరుగుతున్నాయి. రుద్రవరంలో కృష్ణా యూనివర్సిటీ భవనాలు నిర్మాణం పూర్తి చేసుకొని కార్యకలాపాలు జరుగుతున్నాయి. విశాఖ బీచ్ తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు బందరు బీచ్‌లో రిసార్ట్స్, పార్కులు, గేమ్ జోన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

అంబేడ్కర్ స్మృతివనం అద్భుతం

- నగరాభివృద్ధికి చేసిన ఖర్చు - రూ.1,383 కోట్లు
- అంబేడ్కర్ స్మృతివనం కోసం చేసిన ఖర్చు- రూ.400 కోట్లు
- ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు- రూ.239.19 కోట్లు
- జీజీహెచ్‌లో నాడు-నేడు ద్వారా అభివృద్ధి పనులకు- రూ.170 కోట్లు
- సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం కోసం - రూ.150 కోట్లు
- కృష్ణా నది రక్షణ గోడ నిర్మాణం కోసం చేసిన ఖర్చు - రూ.394.27 కోట్లు
- బెంజి సర్కిల్ మొదటి ఫ్లైఓవర్ పొడవు- 2.27 కి.మీ
- దాని నిర్మాణానికి చేసిన ఖర్చు- రూ.80 కోట్లు
- బెంజి సర్కిల్ రెండవ ఫ్లైఓవర్ పొడవు - 1.703 కి.మీ
- దాని నిర్మాణానికి చేసిన ఖర్చు - రూ.96 కోట్లు
- బెంజిసర్కిల్ వెస్ట్, ఈస్ట్ సైడ్ సర్వీస్ రోడ్లకు ఖర్చు చేస్తున్న మొత్తం : రూ.40 కోట్లు
- గన్నవరం విమానాశ్రయం హాఫ్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం చేసిన ఖర్చు -రూ.23.75 కోట్లు

రహదారులు.. అదరహో

- విజయవాడ బెంజిసర్కిల్ జంట ఫ్లై ఓవర్‌లు అందుబాటులోకి
- కృష్ణా నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావడంతో తప్పిన ముంపు సమస్య
- వెస్ట్ బైపాస్ పనులు వేగంగా సాగుతున్నాయి తూర్పు బైపాస్ ప్రతిపాదనలకు తుది రూపు
- జాతీయ రహదారి మొత్తం 17,761 మీటర్ల పొడవున 18 రహదారుల డివైడర్లను హరిత హారాలుగా తీర్చిదిద్దారు.
- నగరంలో 16 పార్కులను అభివృద్ధి చేశారు. ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.17 కోట్లతో తుదిరూపు
- మిషన్ క్లీన్ కృష్ణా కింద నదీ తీరాన్ని శుభ్రం చేశారు. నగరంలోని ప్రధాన కాలువల్లో బోటింగ్‌కు సన్నాహాలు
- కనకదుర్గా నగర్ గోశాల వద్ద రూ.216.05 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన, రూ.23.145 కోట్లతో పూర్తి చేసిన పనులు ప్రారంభం
- ప్రకాశం బ్యారేజీ ఎగువ ప్రాంతంలో రూ.102 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు
- రూ.62 కోట్లతో మున్నేరు కాల్వల ఆధునికీకరణ పనులు
- విజయవాడలో కాలువలపై రూ.31 కోట్లతో ఏడు బ్రిడ్జిల నిర్మాణం
- జిల్లాలో తొలి విడతలో 1.07 లక్షల మందికి ఇళ్ల మంజూరు..
- వాటిలో 14,935 ఇళ్ల నిర్మాణం పూర్తి
- కాల్వ గట్లు, ప్రభుత్వ స్థలాలు, రోడ్ల పక్కన నివాసం ఉండే వారిని తొలగించి వాంబే కాలనీలో ఇళ్ల కేటాయింపు
- పటేల్‌నగర్, ప్రకాష్‌నగర్, వడ్డెరకాలనీ, నందావరి కుంట్రిక ప్రాంతాల్లో గతంలో 13,915 ఇళ్లు నిర్మించి కొన్నింటినే రిజిస్ట్రేషన్ చేశారు
- జలజీవన్ మిషన్ కింద 77,123 గృహాలకు నీరు అందించేందుకు రూ.77.9 కోట్లు ఖర్చు చేశారు





ఇదిగో.. అభివృద్ధి చిరునామా

రోడ్డు పనులకు రూ.300 కోట్లు	డ్రెయినేజీ, యూజీడీ పనులకు రూ.300 కోట్లు
వాటర్ సరఫరా కోసం రూ.375 కోట్లు	పార్కులు, గ్రీనరీ, సుందరీకరణ, కాలువల ప్రక్షాళన కోసం రూ.127 కోట్లు
వీధి లైట్ల కోసం రూ.16 కోట్లు	నగరంలో మురుగునీటి శుద్ధికి రూ.89 కోట్లు
భవనాల నిర్మాణం కోసం రూ.123 కోట్లు	

ఇతర పనులకోసం - రూ.23 కోట్లు



ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యసేవలు

విజయవాడ జీజీహెచ్‌లో కార్డియోథొరాసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మించారు. అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్, ఎంఆర్ఐ స్కాన్, 120 స్లైస్ సీటీ స్కాన్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకోసం వైఎస్ జగన్ సీఎం కాగానే రూ.30 కోట్లు విడుదల చేశారు. రూ.170 కోట్లతో నాడు–నేడు పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలకు రూ.437 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలోని ఏ కొండూరు మండలంలోని గిరిజన తండాల్లో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రోగుల కోసం రూ.40 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు చేపట్టారు. ఏ కొండూరు పీహెచ్‌సీలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. అర్హులైన వారికి రూ.10 వేల పింఛన్ ఇస్తున్నారు.

పురోగతిలో బెజవాడ బైపాస్ పనులు

ప్యాకేజీ-3

- చిన్న అవుటుపల్లి -గొల్లపూడి పొడవు: 30 కి.మీ
- దీనికోసం ఖర్చు చేస్తున్న మొత్తం: రూ.1,148 కోట్లు

ప్యాకేజీ-4

- గొల్లపూడి-చినకాకాని - 17.88 కి.మీ
- కృష్ణా నదిపై ఆరువరుసల బ్రిడ్జి పొడవు- 3.12 కి.మీ
- దీనికోసం ఖర్చు చేస్తున్న మొత్తం రూ.757 కోట్లు
- ఈస్ట్ బైపాస్ ప్రతిపాదనలు
- బైపాస్ పొడవు: 49.3 కి.మీ
- కృష్ణా నదిపై నిర్మించే బ్రిడ్జి పొడవు - 3.750 కి.మీ
- అంచనా వ్యయం మొత్తం -రూ.4,607.80 కోట్లు



ఎలక్షన్ రీల్



జగన్ మాటిస్తే తప్పరు: ధర్మాన

గార: సీఎం వైఎస్ జగన్ మాటిస్తే తప్పరని, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో ప్రజలకు మేలు జరుగుతుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బాబు ష్యూరిటీలకు గ్యారంటీ లేదని, ఆయనేం చెప్పినా నమ్మవద్దని, గతంలో మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఎన్నికల వేళ అబద్ధాలు చెప్పి మరోసారి నమ్మించేందుకు ప్రయత్నాలు జరుగుతాయని, అలా నమ్మి గతంలో రైతులు, మహిళలు మోసపోయారని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం జిల్లాలో ఒక్క పోర్టు కూడా నిర్మించలేదని, వైఎస్సార్‌సీపీ హయాంలోనే మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మితమవుతోందనీ చెప్పారు. కరోనా సమయంలో వీరావల్ నుంచి మత్స్యకారులను జిల్లాకు తీసుకువచ్చామని తెలిపారు. తాజా మేనిఫెస్టో ప్రకారం అమ్మఒడి కింద ఇచ్చే మొత్తాన్ని రూ.17వేలకు పెంచామన్నారు.



పేదరిక నిర్మూలనే లక్ష్యం: తానేటి వనిత

దేవరపల్లి: జగనన్న ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో పేదరిక నిర్మూలన దిశగా రాష్ట్రం అడుగులు వేసిందని వైఎస్సార్‌సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ద్వారకా తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం, లక్ష్మీపురం, గొడుగుపేట, ఐఎస్ రామానుజపురం, జి.కొత్తపల్లి, కొత్తగూడెం, రామసింగవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాలవల్ల ఎన్నో కుటుంబాలు ఇప్పుడు ఆర్థికంగా బలోపేతం అయ్యాయని తెలిపారు. ఐఎస్ జగన్నాథపురంలో దీర్ఘకాలంగా ఉన్న పేదల భూముల సమస్యను నెల రోజుల్లో తాను పరిష్కరించానని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఒకే పార్టీ, ఒకే జెండా అదే నా సిద్ధాంతం: చెవిరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒకే పార్టీ, ఒకే జెండా అన్నది తన సిద్ధాంతమని, ఐదేళ్లకోసారి పార్టీ మారే అలవాటు తనకు లేదని వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరులో మంగళవారం నిర్వహించిన ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ తాను ప్రజలు, సామాన్యుల కష్టాలు తెలిసిన వాడినని తెలిపారు. జగనన్న పాలనలో ప్రతి పేదవానికి మేలు జరిగిందని, అటువంటి నాయకుడిని మనమందరం కాపాడుకోవాలనీ అన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టో భవిష్యత్ తరాలకు బాటలు వేసేదిలా ఉందనీ, విపక్షాలు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేరనీ... అందుకు గతంలో వారిచ్చిన హామీలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

సమస్యలు తీరి సంతోషంగా..

దశ తిరిగింది

సొంత భూమి లేదు... ఉండటానికి సొంత ఇల్లూ లేదు. కాయ కష్టంతో జీవించడమే వారికి తెలుసు. వృద్ధురాలైన తల్లి, భార్య, ఎదుగుతున్న పిల్లలు... ఇంతమందిని పోషించాలంటే ఎంతో కష్టపడాల్సి వచ్చేది. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే చక్కనైన విద్యను అందించాలి. అందుకోసం అప్పు చేయాల్సి వచ్చేది. రోజు గడిస్తే చాలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటున్నారు. రోజువారీ బతుకులకోసం వారు పడే పాట్లు వర్ణనాతీతం. కానీ గత ప్రభుత్వం వారిని ఏనాడూ ఆదుకున్న పాపాన పోలేదు. తమకష్టాలు తీర్చాలని వేడుకోని దేవుడు లేడు. బతుకు తెరువు దుర్భరంగా మారడంతో ఈ వ్యవస్థపైనే వ్యతిరేకత ఏర్పడింది. అలాంటి పరిస్థితిలో ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకుంది. ఒక్కసారిగా కష్టాల నుంచి గట్టెక్కిచ్చింది. సొంత ఇల్లు సమకూర్చింది. పిల్లలకు మంచి చదువుచెప్పించే అవకాశం కల్పించింది. ఇప్పుడు వారు సమాజంలో దర్జాగా జీవించే ధైర్యం వచ్చింది. ఇదీ పట్నాన శంకరరావు కుటుంబం కథ.



శంకరరావు కుటుంబం

జగనన్న పాలనతో మారిన దశ

2019లో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక శంకరరావు కుటుంబ సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కారమయ్యాయి. ఇప్పుడు సమాజంలో గౌరవంగా జీవనం సాగిస్తున్నారు. ఈ నాలుగేళ్ల 8 నెలల పాలనలో ఏకంగా ఈ ఒక్క కుటుంబానికే ప్రభుత్వం వల్ల దాదాపు రూ. 8.65 లక్షలకు పైబడి వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ఈ కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉండగా ప్రతీ ఒక్కరూ ఏదో పథకం ద్వారా ప్రభుత్వ సాయానికి అర్హత సాధించారు. పిల్లలకు విద్యా దీవెన, వసతి దీవెన వర్తించింది. శంకరరావుకు వాహన మిత్ర పథకం మంజూరైంది. తల్లికి వైఎస్సార్ పింఛన్ కానుక వస్తోంది. భార్యకు వైఎస్సార్ ఆసరా.. వైఎస్సార్ చేయూత పథకాలు మంజూరయ్యాయి. గడ్డెయ్యపేటలో ఇంటి స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకోడానికి ఆర్థిక సాయం అందింది. ఇప్పుడు సొంత ఇంట్లో సుఖసంతోషాలతో ఆ కుటుంబం జీవిస్తోంది.

వలస వచ్చినా... కలిసిరాలేదు..

బతుకు తెరువు కోసం ఇచ్ఛాపురం నుంచి శంకరావు తన తల్లి అన్నపూర్ణతో కలసి 23 ఏళ్ల క్రితం నరసన్నపేటకు వలస వచ్చారు. తండ్రి మరణించగా సింగిల్ కిడ్నీతో ఉన్న తల్లిని కాపాడుకుంటూ అద్దె ఇళ్లల్లో జీవనం సాగిస్తూ వచ్చారు. భార్య, పిల్లలతో అనేక ఇబ్బందులు పడ్డారు. పక్కా ఇల్లు కోసం తిరగని రోజు లేదు. అయినా ఫలితం లేకపోయింది. పొదుపున్న డ్వాక్రా రుణం మాఫీ అవుతుందనుకుంటే టీడీపీ ఐదేళ్ల పాలనలో దక్కింది కేవలం రూ. 20 వేలే. పిల్లల చదువులకు సాయం అందలేదు. కరెంటు బిల్లు కట్టేందుకు కూడా నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇక ఎవ్వరిపైనా ఆధార పడకుండా తన కష్టాన్ని నమ్ముకున్న శంకరరావు ఆటో కొనుగోలు చేసి దానిని తిప్పుతూ ఇంత కుటుంబాన్నీ పోషించాడు. కానీ భవిష్యత్తుపై బెంగ మాత్రం తీరలేదు.

- మామిడి రవి, విలేకరి, నరసన్నపేట




జగనన్న కాలనీలో సొంత ఇంటి వద్ద తల్లి, భార్యతో శంకరరావు

నాలుగేళ్ల 8 నెలల్లో ఈ కుటుంబానికి వివిధ పథకాల ద్వారా కలిగిన లబ్ధి రూపాయిల్లో..

జగనన్న వసతి దీవెన(కుమార్తెకు)	30,000
విద్యా దీవెన(కుమార్తెకు)	47500
వైఎస్సార్ ఆసరా(భార్య లక్ష్మికి)	42,500
సున్నా వడ్డీ	1561
వాహనమిత్ర	40,000
వసతి దీవెన (కుమారుడికి)	22,029
విద్యా దీవెన(కుమారుడికి)	83,050
వైఎస్సార్ పెంచన్(తల్లికి)	1,14,000
పక్కా గృహానికి	1,85,000
ఇంటి స్థలం విలువ	3,00,000
మొత్తం	8,65,640

నాలాగ ఎందరో...



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణం చేయక ముందు మా కుటుంబం పరిస్థితి ఒకలా ఉండేది. ఇప్పుడు మరోలా ఉంది. అప్పుడు మాకు గౌరవం తక్కువగా ఉండేది. ఇప్పుడు ఓ ఇంటి వారం అయ్యాం. అమ్మ, భార్య బిడ్డలతో సంతోషంగా జీవించ గలుగుతున్నామంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చలువే. నాలాంటి కుటుంబాలు ఎన్నో ఈ రోజు ఉన్నత స్థాయికి చేరడానికి ఆయనే కారణం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. మేమే స్టార్ కాంపెయినర్‌గా మారుతాం. జగనన్న రుణం తీర్చుకుంటా..

- పట్నాన శంకరరావు

జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి



డీబీటీ పద్ధతిలో ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే వివిధ పథకాల లబ్ధిదారులకు నగదు జమ కావడంతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తుండటంతో ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం పెరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి కుటుంబానికి ఏదో రూపంలో లబ్ధి చేకూరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కొనుగోలు శక్తి పెరిగి వ్యాపారాలు పుంజుకున్నాయి. కరోనా కల్లోలంలోనూ లావాదేవీలు విస్తృతంగా సాగాయంటే దానికి ప్రభుత్వమే కారణం. ఇదే పద్ధతి మరో ఐదేళ్లు కొనసాగితే మరింతగా ప్రజల జీవనం మెరుగుపడుతుందనడంలో సందేహం లేదు.

- ఎం.ఆర్.జ్యోతిప్రైడరిక్, విశ్రాంత కామర్స్ అధ్యాపకురాలు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట

ప్రజల మనసు గెలుచుకున్న సీఎం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఏవైతే హామీలు ఇచ్చారో.. అవే అమలు చేశారు. బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తాన్నారు. చేసి చూపించారు. పేద, మధ్య తరగతి ప్రజల పాలిట దేవుడు జగన్. తను చెప్తే, జరిగి తీరుతుందన్న నమ్మకం ప్రజల్లో పెంచారు. పాత్త పార్టీల బూటకపు హామీలను నమ్మి మోసపోయే రోజులు పోయాయి. ఐదేళ్ల క్రితం వరకు చంద్రబాబు పాలన ఎలా సాగిందో ఇంకా గుర్తుంది. ప్రజల మనసు గెలుచుకున్న ముఖ్యమంత్రి జగనే.

- పాలపర్తి అలీస్ కెనడీ, భీమవరం, పశ్చిమగోదావరి

ప్రజలు మెచ్చే ప్రభుత్వానికే ఓటు



ప్రజాస్వామ్య దేశంలో నాయకులు తమపై నమ్మకం పెంచాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. ప్రజల కోసం అభివృద్ధికి ఊతమిచ్చే చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ విధానాలను చూసి ప్రజలు మెచ్చుకోవాలి. స్వేచ్ఛ, సమానత్వం, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం నడుం బిగించాలి. నిత్యం ప్రజా సంక్షేమానికి పాటుపడే పార్టీనే గెలిపించాలి. ప్రస్తుత సీఎం జగన్ పాలన అన్ని వర్గాలకు చెందిన అత్యధిక ప్రజల ఆమోదం పొందేలా సాగుతోంది.

- డి.చాంద్ బాషా, రచయిత, కర్నూలు

సొంతింటి కల నెరవేర్చిన జగన్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే నేను.. అంటూ ఆయన మళ్లీ ప్రమాణ స్వీకారం చేసే రోజు కోసం నమ్మకంగా ఎదురుచూస్తున్నాం. ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరి ఆకాంక్ష అదే. కాకినాడలాంటి మహా నగరంలో సెంటున్నర భూమి ఇంటి నిర్మాణం కోసం ఇచ్చారు. సొంతింటి కల నెరవేరిన లక్షల మంది లబ్ధిదారులు జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటారు. అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్దతో పిల్లల చదువులు బాగున్నాయి.

- నేల శంకర్ ప్రసాద్, ప్రైవేట్ అధ్యాపకులు, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్

ప్రభుత్వ అండతో.. సంతోషం రెట్టింపు!



పరిశ్రమలో పనిచేస్తున్న సిబ్బంది

డిగ్రీ చదివి సొంతంగా పరిశ్రమ ఏర్పాటు

- తండ్రి ఇచ్చిన రూ.2 లక్షలతో మొదలైన వ్యాపారం
- రూ.1.50 కోట్ల పెట్టుబడితో ఏటా రూ.2 కోట్ల టర్నోవర్
- ఎస్ఎంఎస్ఈ ద్వారా కలను నిజం చేసుకున్న సంతోష్‌కుమార్

నలుగురూ నడిచే దారి కంటే.. తనే ఓ కొత్త దారిని ఏర్పాటు చేసుకోవడం కొందరికి ఇష్టం. అలాంటి వారిలో పలమనేరుకు చెందిన జి.సంతోష్‌కుమార్ ఒకరు. చదువుకున్న డిగ్రీతో ఉద్యోగ ప్రయత్నాలు చేయలేదు. కుటుంబ వారసత్వంగా ఉన్న ఫెర్టిలైజర్స్ వ్యాపారాన్నీ కాదన్నాడు. మేనమామ ఆయిల్ మిల్లులో నాలుగేళ్లు పనిచేసి అనుభవం, కొన్ని నైపుణ్యాలు మెరుగుపరచుకున్నాడు. వాటి ఆధారంతో కొత్త మార్గాన్ని వెతుక్కున్నాడు. దానికి సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వ సాయం తోడయింది. దీంతో కల్తీలేని ఆహార పదార్థాలు అందించడమే లక్ష్యంగా 'సంతోష్ ఫుడ్ ప్రొడక్ట్స్'సంస్థను ఏర్పాటు చేశాడు. ఏటా రూ.2 కోట్ల టర్నోవర్‌తో విజయవంతంగా నడుపుతూ.. యువతకు ఆదర్శమయ్యాడు.

పలమనేరు పట్టణానికి చెందిన జి.సంతోష్‌కుమార్ తిరుపతిలోని ఎస్వీయూలో బీకాం డిగ్రీ పూర్తి చేశారు. అప్పటికే ఆ కుటుంబం ఫెర్టిలైజర్స్ వ్యాపారంలో ఉంది. దాన్ని చూసుకోవాల్సిందిగా సూచించినా పట్టించుకోలేదు. సొంతంగా పరిశ్రమను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో తమిళనాడులోని గుడియాత్తం వెళ్లారు. అక్కడ తన మేనమాన సెల్వవినాయగర్‌కు చెందిన ఆయిల్ మిల్లులో నాలుగేళ్లు పనిచేసి, అనుభవం గడించారు. ఆ తర్వాత పోటీని తట్టుకుని, కల్తీలేని ఆహార పదార్థాలను తయారు చేసి, రాణించాలనుకున్నారు. దీంతో 2017లో తన తండ్రి ఇచ్చిన రూ.2 లక్షలతో గానుగలను ఏర్పాటు చేసి, నూనెల తయారీని ప్రారంభించారు.

(పిచ్చిగుంట్ల సుబ్రమణ్యం, విలేకరి, పలమనేరు)

కుటుంబ పరిస్థితి మారింది



నాకు ఇద్దరు పిల్లలు. ఇక్కడి ఫుడ్ పరిశ్రమలో పనిచేస్తున్నా. నా కుమారుడు గిరి కూడా ఇక్కడే ఫోర్‌మెన్‌గా చేస్తున్నాడు. ఇద్దరికీ పనులు దొరకడంతో నా కుమార్తె శ్రీకన్యను బీఎస్సీ నర్సింగ్ చదివిస్తున్నా. గతంలో ఇక్కడే వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లం. మా గ్రామ సమీపంలో పరిశ్రమలు రావడంతో చాలా మందికి ఉపాధి దొరికింది. మా ఆర్థిక పరిస్థితులు చక్కబడ్డాయి.

– మైనమ్మ, దండుమిట్ట, పలమనేరు

మధ్యప్రదేశ్ నుంచి వచ్చా..



నేను మధ్యప్రదేశ్ నుంచి ఇక్కడి ఫ్యాక్టరీలో ఆయిల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్నా. మా ప్రాంతం వారు చాలా మంది పలమనేరు ఎంఎస్ఎంఈలో పనులు చేస్తున్నారు. ఇక్కడే రూమ్ తీసుకున్నా. నెలకు రూ.15 వేలు వస్తోంది. ఖర్చులు పోనూ ప్రతి నెల ఇంటికి రూ.10 వేలు పంపుతున్నా. మాకు తెలిసినవాళ్లు కూడా ఇక్కడి పరిశ్రమల్లో పనులకు వస్తున్నారు.

– అంకేష్, చింద్‌వాడా, మధ్యప్రదేశ్

ప్రభుత్వ సాయం బాగుంది



ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమ ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నా. ఇందుకు ప్రభుత్వ సాయం తోడవడంతో నా కల సాకారమైంది. 2019, 2020లో ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమ కోసం స్థలాలను కేటాయించి, రుణ సౌకర్యాన్ని కల్పించారు. రాయితీనిచ్చి ప్రోత్సహించారు. నేషనల్ అగ్రికల్చర్ పాలసీ–2022 మేరకు పెట్టుబడి, రుణంపై వడ్డీ రాయితీకి ఎంపికయ్యా. ఉత్పత్తుల్లో నాణ్యతనే నమ్ముకున్నా. ఇక్కడి సెజ్‌లోనూ పరిశ్రమల కోసం ప్రభుత్వ స్థలాలున్నాయి. చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలి.

– సంతోష్ కుమార్, యజమాని, సంతోష్ ఫుడ్ ప్రొడక్ట్స్



పరిశ్రమలో పనిచేస్తున్న సిబ్బంది



ఎంఎస్ఎంఈలోని సంతోష్ ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమ

జగన్ ప్రభుత్వ అండతో రాణింపు

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సంతోష్ కలను నిజం చేసుకునే అవకాశం వచ్చింది. ఎంఎస్ఎంఈ ద్వారా సంతోష్ ఫుడ్ ప్రొడక్ట్స్ పేరిట డీపీఆర్‌తో ప్రభుత్వాన్ని సంప్రదించారు. ఇందుకు 150 చ.మీ. స్థలాన్నివ్వడంతోపాటు, అందుకు అవసరమయ్యే రూ.25 లక్షల పెట్టుబడి కోసం ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పీఎంఈజీపీ) ద్వారా కెనరా బ్యాంక్ నుంచి రూ.10 లక్షలు రుణం పొందారు. ఇందులో ప్రభుత్వం రూ.2.50 లక్షలను రాయితీ ప్రకటించింది. ఇదే వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు మళ్లీ ఎంఎస్ఎంఈకి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 2020లో 440 చ.మీ. స్థలం మంజూరయింది. ఇందుకు రూ.70 లక్షల బ్యాంకు రుణం పొందారు. అలా మొత్తం రూ.1.50 కోట్ల పెట్టుబడితో సంతోష్ ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమను స్థాపించారు. తమిళనాడు నుంచి గానుగ యంత్రాలను, హైదరాబాద్ నుంచి పొడులను తయారుచేసే యంత్రాలను, అజ్మీర్ నుంచి పెద్ద చక్కీల(గ్రైండర్ల)ను తెప్పించి, సొంత బ్రాండింగ్‌తో వ్యాపారాన్ని విస్తరించారు.

సొంత బ్రాండింగ్.. 25 మందికి ఉపాధి

తన ఉత్పత్తులకు ఎలాంటి ప్రచారాలు చేయకుండా, పూర్తిగా వినియోగదారుల మౌత్ పబ్లిసిటీనే నమ్ముకున్నారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాన్ని పరిశ్రమ వద్దే నిర్వహిస్తూ, నమ్మకాన్ని పెంచుకున్నారు. వ్యాపారుల ఆర్డర్లను సకాలంలో అందించడం, ఒకసారి తమ ఉత్పత్తిని కొనుగోలు చేస్తే వారే మరో పది మందికి చెప్పడం ద్వారానే వ్యాపారం ఊపందుకున్నట్లు సంతోష్ చెప్తున్నారు. ఈ పరిశ్రమలో నాణ్యమైన గోధుమ, రాగి, జొన్న, కొర్ర, సజ్జల పిండి, ధనియాలు, మిరప, పసుపు, సాంబార్, రసం పొడులను తయారుచేస్తున్నారు. దీంతోపాటు వేరుశనగ, కొబ్బరి, నువ్వులు, ఆముదం నూనెలను నవీన యంత్రాల ద్వారా పురాతన విధానంలో తయారుచేస్తున్నారు. తన ఉత్పత్తులను డీలర్లకు ఇవ్వకుండా, ప్రత్యక్ష విక్రయాల ద్వారా సొంత బ్రాండింగ్‌తో ముందుకెళ్తున్నారు. ఇతని ఉత్పత్తులకు 10 వేల మంది రిటైల్ కస్టమర్లున్నారంటే నాణ్యతలో నమ్మకమే కారణమని చెప్తారు. ఇక్కడి పరిశ్రమలో 10 మంది, ట్రాన్స్‌పోర్టులో మరో 15 మంది పనిచేస్తున్నారు. దీంతోపాటు చాలా మంది రైతుల ఉత్పత్తులను తనే స్వయంగా కొనుగోలు చేయడం ద్వారా, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ పెంచుతున్నారు.

వైఎస్ జగన్... ఆ పేరే ఓ స్ఫూర్తి...

పేదల ఎదుగుదలకు సంక్షేమ పథకాలు అవసరం

ఏపీలో అటు సంక్షేమం... ఇటు అభివృద్ధి కొనసాగుతోంది

ప్రధానంగా వ్యవసాయం, విద్య, వైద్యంలో ఎన్నో మార్పులు జరిగాయి

వలంటీర్ల వ్యవస్థ సరికొత్త సక్సెస్‌ఫుల్ కాన్సెప్ట్

సాక్షి ఇంటర్వ్యూలో ప్రముఖ సినీ నటుడు రాజా రవీంద్ర





'పేదలు ఎదగాలంటే ప్రభుత్వ సాయం కావాలి. అందుకు సంక్షేమ పథకాలు చాలా వరకూ తోడ్పడతాయి. ఒక వైపు సంక్షేమం... మరోవైపు అభివృద్ధి ఏపీలో సమపాళ్లలో జరుగుతోంది. అందుకు కారకుడైన జగన్ అంటే అందుకే నాకు ప్రత్యేకమైన అభిమానం' అంటున్నారు సినీ నటుడు రాజా రవీంద్ర. వ్యక్తిగతంగా తనకే కాదు చాలా మందికి ఆయన ఇన్స్పిరేషన్ అంటూ కొనియాడారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన పట్ల తన అభిప్రాయాల్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

పేదలు ఎదగాలంటే... ప్రభుత్వ ఆసరా కావాలి..

పేదలు, దిగువ మధ్య తరగతి వర్గాలు ఎదగాలంటే మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతికి చేరాలంటే అది వారి కాయకష్టం మీద అయ్యేపని కాదు.

విద్యతోనే విజయం

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు నాడు నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలల్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. కొన్ని తరగతుల విద్యార్థులకు ట్యాబ్స్ అందిస్తున్నారు. అంతటితో ఊరుకోకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఇంగ్లిష్ మీడియం కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇది ఒక సమగ్ర విద్యావికాస మార్గంగా చెప్పాలి. వీటన్నింటివల్లా పాఠశాలల్లో చదివే వారిలో కనీసం 10శాతం మంది వృద్ధిలోకి వచ్చే అవకాశం కచ్చితంగా ఉంటుంది. అలా వచ్చిన వారు రూ.లక్షల్లో జీతాలు తెచ్చుకోగలుగుతారు. అప్పుడు తప్పకుండా పేదల జీవన ప్రమాణాల స్థాయి మారిపోతుంది. నిజంగా జరగాల్సింది అదే. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అదే జరుగుతోంది.

ఖరీదైన వైద్యానికీ సర్కారు సాయం

ప్రస్తుతం రోగాలు వస్తే దానికి వైద్యం ఎంత ఖరీదైపోయిందో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు ఏ రోగం వచ్చినా లక్షలకు లక్షలు మంచినీళ్లలా ఖర్చుచేయాల్సి వస్తోంది. ఒక కిడ్నీ పాడైనా చికిత్సకు రూ.20 లక్షలపైనే ఖర్చవుతోంది. ఈ పరిస్థితుల్లో అనుకోని వ్యాధి వస్తే ఎగువ మధ్యతరగతి కుటుంబాలు ఎలా తట్టుకోగలవు? ఇక నిరుపేదల సంగతైతే వేరే చెప్పనక్కర లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ పథకం వారిని ఎంతగానో ఆదుకుంటోంది. ఇప్పుడు వైద్య పరిమితిని రూ.25లక్షలకు పెంచారు. ఇది నిజంగా ఎక్స్‌ట్రార్డినరీ స్టెప్.

కాబట్టి తప్పకుండా సంక్షేమ పథకాలు అవసరమవుతాయి. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు రూపాల్లో ఆసరా అందిస్తోంది.అన్నివర్గాల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలంటే వారికి ప్రభుత్వం తప్పనిసరిగా అందివ్వాల్సింది విద్య, వైద్యం. ఈ విషయంలో చాలా మార్పులు జరిగాయి.

దళారీలు లేకుండా చేరుతున్న లబ్ధి

సంక్షేమ పథకాల అమలు విషయంలో గ్రామ వలంటీర్ల విధానం చాలా మంచి కాన్సెప్ట్. వీరి వల్ల మధ్యలో ఎవరికీ ఎటువంటి లంచాలు, పైరవీలతో తావు లేకుండా పేదలకు పథకాలు అందుతున్నాయి. ఈ వ్యవస్థ ఎంత గొప్పదో... ప్రయోజనాలు పొందుతున్నవారికి బాగా అర్థమవుతుంది. ఈ సంక్షేమ పథకాలన్నీ ఎటువంటి ఆటంకం లేకుండా అమలు చేయడం గొప్ప విషయం. అధికారంలోకి రావడం కోసం పొత్తుల కన్నా ఒంటరిపోరుకే జగన్ సై అంటారు. ఆయన చాలా మందికి ఇన్స్పిరేషన్. ఆయన మీద అభిమానం చెక్కు చెదరలేదు. ఈ ఎన్నికల్లో జగన్ విజయం తథ్యం. – సాక్షి, అమరావతి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి దిక్సూచి...



అర్థికాభివృద్ధికి ఊతం



విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతంగా నిలుస్తుంది. ఫుడ్, ఫార్మా, ఫిషరీ రంగాల ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు స్థావరంగా నిలుస్తుంది. ట్రావెల్, హాస్పిటాలిటీ, గోడౌన్, వేర్ హౌసింగ్ రంగాలు అభివృద్ధి చెందుతాయి. 6 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు సేవలు లేకపోవడం వల్లే విశాఖ పరిసర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ రంగం పుంజుకోవడం లేదు.

–కావుగంటి ప్రకాశ్, ప్రెసిడెంట్, చాంబర్ ఆఫ్ కామర్స్, విజయనగరం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించి, నిర్వాసితులకు గూడెపువలస, లింగాలవలస గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఏర్పాటు చేసింది. ఉద్యమ సమయంలో గత ప్రభుత్వం మాపై పెట్టిన కేసులను ఎత్తివేసింది. విమానాశ్రయ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు, గృహాలు కోల్పోయిన నిర్వాసితులందరం సీఎం జగన్‌కి రుణపడి ఉంటాం.

– కొండపు ఎల్లయ్యమ్మ, నిర్వాసితురాలు, కవులవాడ సర్పంచ్

▶ మొదటి పేజీ తరువాయి

రైతులకు చెందిన 1,383.39 ఎకరాల జిరాయితీ భూమి, 572 మంది లబ్ధిదారుల స్వాధీనంలోనున్న డీ పట్టా (అసైన్డ్) భూమి సేకరణ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2,203 ఎకరాలను కేటాయించింది. మిగతా భూమిని ఐటీ సిటీ కోసం కేటాయించే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం అక్కడక్కడా వదిలేసిన దాదాపు 117 ఎకరాల సేకరణ ప్రక్రియనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది. చెన్నై–హౌరా జాతీయ రహదారిపై నుంచి నేరుగా విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా అనుసంధాన రోడ్డు, ట్రంపెట్ ఆకారంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ రెండో దశలో పూర్తి అయ్యింది.

చంద్రబాబు హయాంలో

- 15 వేల ఎకరాలు అవసరమన్న ప్రచారం.
- రైతుల ఆందోళనతో ఐదు వేల ఎకరాలకు ప్రభుత్వం దిగొచ్చింది.
- భూసేకరణ నిబంధనలేవీ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల
- పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షలేనని ప్రకటన.
- అయినా కొలిక్కిరాని భూసేకరణ.
- నిర్వాసితులకు ఏం చేయబోతోందో చెప్పనే లేదు.
- నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో రైతుల పిటిషన్.
- దాని సంగతి ఎటూ తేలలేదు.
- ఎన్నికలు సమీపించడంతో అంతా తానే చేశానని చెప్పుకోడానికి 2019 ఫిబ్రవరి 14న టెంకాయ కొట్టారు.

జగన్ పాలనలో

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి దిక్సూచి కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి 2023 మే 3న జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. అన్ని అనుమతులతో పనుల ప్రారంభానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
- విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ అధిగమించింది
- 2,751 ఎకరాల భూమి సేకరణ పక్కాగా పూర్తి చేసింది.
- కేసులు వేసిన రైతుల డిమాండ్లనుపరిష్కరించింది.
- రెట్టింపు పరిహారం ఇచ్చింది.
- నిర్వాసితులకు దాదాపు రూ.80 కోట్లతో టౌన్‌షిప్‌ను తలదన్నే సౌకర్యాలతో కాలనీలను నిర్మించింది.
- దాదాపు రూ.5 వేల కోట్లతో జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- 2025 నాటికి ఏటా 60 లక్షల మంది ప్రయాణించే సామర్థ్యంతో తొలి దశ పూర్తి చేయాలనేది లక్ష్యం.

శరవేగంగా నిర్మాణ పనులు...

భారీ విమానాలు దిగడానికి వీలుగా 3.8 కిలోమీటర్ల పొడవున రన్‌వే పటిష్టంగా నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం సగటున 10 అడుగుల ఎత్తున మట్టితో భూమి చదును చేస్తున్నారు. విమానాశ్రయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇళ్లు కోల్పోయిన 376 కుటుంబాల కోసం రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను ప్రభుత్వం నిర్మించింది. ఒక్కో కుటుంబానికి పునరావాస పరిహారంగా ఐదు సెంట్ల స్థలం, రూ.8.70 లక్షల చొప్పున మంజూరు చేసింది. నిర్వాసిత గ్రామాల నుంచి గతంలో వలస పోయిన కుటుంబాలకూ మానవతా దృక్పథంతో ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రహదారిని అనుకొని 25 ఎకరాల భూసేకరణను ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. సంబంధిత రైతులకు సుమారు రూ.18 కోట్ల వరకూ పరిహారాన్ని చెల్లించింది. విమానాశ్రయ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా క్వార్టర్లను జీఎంఆర్ సంస్థ నిర్మించనుంది. ఇందుకోసం ప్రభుత్వం 25 ఎకరాల భూమి కేటాయించింది. ప్రత్యేకంగా విద్యుత్తు సబ్‌స్టేషన్ కోసం భోగాపురం మండలంలోని ముక్కాం రెవెన్యూ పంచాయతీ పరిధిలో 5.47 ఎకరాల భూమిని కేటాయించింది.



అవినీతిలో 'ఆది'పత్యం



- నాడు గర్భశోకంతో విలవిలలాడిన పెన్నానది
- గ్రావెల్ కోసం కొండలు, గుట్టలు యంత్రాలతో పెకలింపు
- జీఎన్ఎస్ఎస్ కాలువ పనుల్లో లభించిన బండరాళ్లతో కంకర
- ఎలాంటి సుంకం చెల్లించకుండా కోట్లాది రూపాయల దోపిడీ
- వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు స్వాహా
- నీరు–చెట్టు పథకంలో భారీ అక్రమాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: "జమ్మలమడుగులో వర్గ పోరాటం కొనసాగించాం. మా సర్వస్వం కోల్పోయాం. ఆస్తులు కూడా తాకట్టులో ఉన్నాయి. ఒక్క అవకాశం ఇవ్వండి.." అంటూ రాజకీయాల్లోకి వచ్చారు. గెలిచారు. ఆ తర్వాత ఆయన సాగించిన దోపిడీతో రాష్ట్రంలోనే అత్యధిక సంపాదనాపరుల్లో ఒకరిగా మారారు. ప్రకృతి వనరుల దోపిడీలో ఆయన జోరు చూసి నియోజకవర్గ ప్రజలే నోరెళ్లబెట్టారు. ప్రభుత్వ, కొండ పోరంబోకు భూములను వందల ఎకరాలు స్వాహా చేసి, తన సాగులోకి చేర్చుకున్నారు. సోలార్ ప్రాజెక్టు పనుల్ని శాసించారు. చివరికి గండికోట నిర్వాసితుల చెక్కుల్నీ స్వాహా చేశారు. చెప్పుకుంటూ పోతే.. ఆయన అక్రమాలకు లెక్కే లేదు. ఇప్పుడు కేంద్ర పార్టీలో చేరి, మళ్లీ ఎన్నికల బరిలో నిలిచారు.

దేవగుడి, గొరిగనూరు, పెద్దదండ్లూరు, సున్నపురాళ్లపల్లి, చలివెందుల, సుగమంచుపల్లె, ధర్మాపురం గ్రామాల్లో ఈ నేత కుటుంబ ఆధిపత్యం యథేచ్ఛగా సాగుతోంది. అమాత్య పరిస్థితుల్లో అమాత్యుని హోదా దక్కించుకున్నారు. ఇంకేముంది ఆయా గ్రామాల పరిధిలో పెన్నానది

ప్రతి అవకాశం.. ఆదాయ మార్గం

నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బెంగళూరు తదితర ప్రాంతాలకు భారీ వాహనాలతో ఇసుకను తరలించారు. కేవలం ఇసుక తరలింపుతోనే రూ.వందల కోట్లు ఆర్జించారు.

పేకాట పాపారావు

ఈయనకు స్థానికంగా మరో పేరు కూడా ఉంది. పేకాట పాపారావుగా బాగా ప్రసిద్ధి. 2019 ఎన్నికల తర్వాత ప్రజలకు అందుబాటులో లేకుండా పేకాట కోసం బెంగళూరు క్లబ్బును తన నివాసంగా మార్చుకున్నారు. గత నాలుగున్నరేళ్లూ నమ్ముకున్న కార్యకర్తలకు దూరంగా పత్తాలేకుండా పోయారు. ఆ మధ్య ఓ చానల్ ఇంటర్వ్యూలో కూడా తన జూద ప్రావీణ్యతను మహా సరదాగా చెప్పుకొచ్చారు.

ఆ నేతపై ఉన్న కేసుల్లో కొన్ని

ఈ నేతపై పోలీసు కేసులు కూడా ఉన్నాయి.

- 2020లో క్రైమ్ నెం.130 పేరిట 143, 144, 147, 148, 323, 324, 307 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
- మైదుకూరు పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెం.239/2020 కేసు ఉంది.
- తుళ్లూరులో క్రైమ్ నెం.65/2023 ఐపీసీ 294, 504, 505(2), 506 సెక్షన్ల కింద కేసులు నమోదయినట్లు సదరు నేత తన ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారు.

ప్రభుత్వ భూములు స్వాహా..

ఈ మాజీ అమాత్యుని కుటుంబ సభ్యులు పెన్నానది ఇసుకతో సరిపెట్టుకోలేదు. ఇసుక తరలిపోగా ఏర్పడిన గట్టి ప్రాంతాన్ని వ్యవసాయ భూములుగా మార్చి, సాగులోకి తెచ్చారు. సమీప బంధువుల పేరిట సున్నపురాళ్లపల్లె సమీపంలో 300 ఎకరాలు సాగుచేసి అనుభవిస్తుండగా, అవి స్టీల్ ప్లాంట్ పరిధిలోకి వెళ్లాయి. సర్వే నెం.411లో కొండపోరంబోకు భూమిని ఆక్రమించి బినామీల పేర్లతో సాగు చేసుకునేవారు. సర్వే నెం.64లో గొరిగనూరు గ్రామానికి చెందిన ఈతని బంధువు సబ్ డివిజన్ చేయించి మరీ భూముల్ని ఆక్రమించారు. దేవగుడి ఆధిపత్య గ్రామాల్లో ఈ కుటుంబం వందలాది ఎకరాల కొండ ప్రాంతాన్ని ఆక్రమించి సొమ్ము చేసుకుంది.

'డైమన్షనల్'దందా

టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ ఈయనకు అడ్డూఅదుపూ లేదు. మైలవరం మండలంలోని కొండల్లో విలువైన, అరుదైన ఖనిజాలు లభిస్తాయి. అందులో డైమన్షనల్ స్టోన్ ఒకటి. ఆ రాయిని శిల్పాలు, దేవాలయాల నిర్మాణానికి ఉపయోగిస్తారు. ఒక్కో టన్ను ధర రూ.వేలల్లోనే. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా, రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలించారు. రూ.కోట్లలో ఆర్జించారు.

గ్రావెల్ అక్రమ రవాణా

స్థానికంగా అడ్డుకునే వారు లేకపోవడంతో.. నియోజకవర్గ పరిధిలోని శిరిగేపల్లి, సున్నపురాళ్లపల్లె కొండల్లో రోడ్లకు ఉపయోగపడే గ్రావెల్‌ను ఈ మాజీ అమాత్యుని సమీప బంధువే అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. పొక్లెయినర్ల సాయంతో కొండలు, గుట్టల్ని పెకలించేశారు. క్రషర్ ద్వారా కంకరగా మార్చి సొమ్ము చేసుకున్నారు. పాలూరు ఎత్తిపోతల పథకం చేపట్టిన కోయా కంపెనీ, సుజిలాన్ పవర్ విండ్ ప్రాజెక్టుతోపాటు సోలార్ కంపెనీ యాజమాన్యం నుంచి ఎన్నికల ఖర్చుల పేరిట దండాల ఆరోపణలూ ఉన్నాయి. ఎన్టీపీసీ సోలార్ ప్రాజెక్టు ఎర్త్ పనులు ఈ కుటుంబం కనుసన్నల్లోనే జరిగాయి. నీరు–చెట్టు పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ.100 కోట్లు పనులు జరిగితే, అందులో సగం సొమ్ము ఈయన సన్నిహితుల జేబులోకే వెళ్లినట్లు సమాచారం.